

'ప్రజా ప్రతినిధులు చేయాల్సింది రెండే,
ప్రజా సేవలో సమర్థతను చాటుకోవడమా!
లేక తప్పుకోవడమా!'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 18 | వెల: ₹ 5.50

సంపుటి: 18
సంచిక: 92

సోమవారం 23-6-2025

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



విజయంతో ముగింపు

అంతర్జాతీయ హాకీ సమాఖ్య ప్రొ హాకీ లీగ్ 2024–2025 సీజన్ భారత పురుషుల జట్టు విజయంతో ముగించింది. ఆదివారం ఆంట్‌వర్ప్‌లో జరిగిన యూరోపియన్ అంచె ఆఖరి మ్యాచ్‌లో హర్మన్‌ప్రీత్ సింగ్ నాయకత్వంలోని భారత జట్టు 4–3 గోల్స్ తేడాతో బెల్జియంపై గెలిచింది.

–14లో

సత్యమేవ జయతే
సాక్షి
WWW.SAKSHI.COM
పేజీలు: 18 వెల: ₹ 5.50
సంపుటి: 18
సంచిక: 92
సోమవారం 23-6-2025


'నా అక్కలూ.. చెల్లెళ్లు.. తమ్ముళ్ల కళ్లలో వెలుగులు చూసినపుడే నా నిజమైన పుట్టిన రోజు'


రసకందాయంలో...
ఇంగ్లండ్‌తో తొలి టెస్టు. 96 పరుగుల ఆధిక్యంలో భారత్. -14లో


స్థిరమైన ఆదాయానికి..
రిటైర్మెంట్ తర్వాత 'ఎస్‌డబ్ల్యూపీ'తో వేతనం మాదిరే ఆదాయం -15లో

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL

ఆ ముష్కరులూ పాకిస్తానీలే
పహల్గాంలో దారుణానికి పాల్పడిన ముష్కరులకు ఆశ్రయం కల్పించారన్న ఆరోపణలపై ఎన్‌ఐఏ ఇద్దరిని అదుపులోకి తీసుకుంది.
వివరాలు 2లో ▸


భారత్‌కు వెళ్తున్నారా? జాగ్రత్త!
భారత్‌లో పర్యటించాలనుకునే అమెరికన్లు జాగ్రత్తగా ఉండాలని.. అమెరికా తమ పౌరులకు కొత్త అడ్వైజరీ జారీ చేసింది.
వివరాలు 2లో ▸


పన్నేతర ఆదాయం పెంచాలి
పన్నేతర ఆదాయం పెంచడంపై దృష్టి సారించాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క సంబంధిత అధికారులను ఆదేశించారు.
వివరాలు 3లో ▸


చుక్కలు చూపుతున్న ఐ-టిమ్స్!
ఆర్టీసీలో 'ఐ-టిమ్స్'చుక్కలు చూపుతున్నాయి. యంత్రాల్లో లోపమా, నెట్‌వర్క్ ప్రొవైడర్ లోపమా.. అనేది సిబ్బందికే తెలియని పరిస్థితి.
వివరాలు 12లో ▸


న్యూస్‌రీల్

'బనకచర్ల' ప్రధాన ఎజెండా



రాష్ట్ర మంత్రివర్గ సమావేశం సోమవారం మధ్యాహ్నం 3 గంటలకు సీఎం రేవంత్‌రెడ్డి అధ్యక్షతన సచివాలయంలో జరగనుంది. ఏపీ చేపడుతున్న గోదావరి–బనకచర్ల అనుసంధానం ప్రాజెక్టును ఎజెండాలో ప్రధాన అంశంగా చేర్చింది.
- వివరాలు 3లో▶

20 లక్షల ఇళ్లు కట్టిస్తాం



తల తాకట్టు పెట్టయినా సరే రాష్ట్రవ్యాప్తంగా రాబోయే మూడున్నరేళ్లలో 20 లక్షల ఇందిరమ్మ ఇళ్లు కట్టించి తీరుతామని, అవి ఇచ్చిన తరువాతనే మళ్లీ అసెంబ్లీ ఎన్నికల్లో ఓట్లు అడుగుతామని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ప్రకటించారు.
- వివరాలు 5లో▶

కొండా దంపతులతో ఇమడలేం



వరంగల్ జిల్లా కాంగ్రెస్‌లో భగ్గుమన్న వర్గ రాజకీయాలు హైదరాబాద్‌ను తాకాయి. జిల్లాకు చెందిన మంత్రి కొండా సురేఖపై ఆ జిల్లా కాంగ్రెస్ ఎమ్మెల్యేలు రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్‌కు ఫిర్యాదు చేశారు.
- వివరాలు 3లో▶

ఆ విమానాలు నిలిపివేయడమే మంచిది



ఎయిర్ ఇండియా బోయింగ్ 787–8 రకం విమానాల్లో సమస్యలు పరిష్కారం అయ్యే వరకు వాటి సర్వీసులను నిలిపివేయడమే మంచిదని విమాన ప్రయాణాలు సాగించే వారిలో 56 శాతం మంది అభిప్రాయపడ్డారు.
- వివరాలు 16లో▶

ఇదండీ సంగతి



అలాగే లాడెన్ జిందాబాద్ అని కూడా అనమంటున్నార్సార్!

అమెరికా మెరుపుదాడి

ఇరాన్‌లోని ఫోర్డో, నతాంజ్ అణుకేంద్రాలపై బంకర్ బస్టర్ బాంబులేసిన ట్రంప్ సేన

- ఇస్ఫహాన్ అణుకేంద్రంపై టోమాహాక్ క్రూజ్ క్షిపణులతో దాడి
- చరిత్రచూడని స్థాయిలో ప్రతిదాడిచేస్తామన్న ఇరాన్
- ఇరాన్ యుద్ధం ఆపకుంటే మళ్లీ దాడిచేస్తామన్న ట్రంప్
- అమెరికా జోక్యంతో భగ్గుమన్న ఇజ్రాయెల్–ఇరాన్ యుద్ధాగ్ని
- అగ్రరాజ్య దాడిని ఖండించిన ప్రపంచదేశాలు



- ఇరాన్ అధ్యక్షుడితో ప్రధాని మోదీ ఫోన్ సంభాషణ
- చమురు రవాణాను అడ్డుకుంటూ, హోర్ముజ్ జలసంధిని మూసేసేందుకు సిద్ధమైన ఇరాన్
- ప్రపంచం మీద వేలాడుతున్న పెట్రోధరల కత్తి
- సమరంలో పైచేయి కోసం రష్యా, చైనాల సాయానికి ఇరాన్ ప్రయత్నాలు
- పుతిన్‌తో ఇరాన్ విదేశాంగ మంత్రి భేటీ

2 లో

ఆపరేషన్ మిడ్‌నైట్ హ్యామర్
దాడికి పట్టిన సమయం.. **25** నిమిషాలు

ప్రయోగించిన విమానాలు	బీ-2 స్పిరిట్ స్టెల్త్ బాంబర్స్
ప్రయాణించిన సమయం	ఏకధాటిగా 37 గంటలు
ఇంధనం ఎలా?	పలుమార్లు గాల్లోనే రీఫ్యూయలింగ్
వాడిన బాంబుల రకం	బంకర్ బస్టర్
వేసిన బాంబులు	14
ఎన్ని మీటర్ల లోతుకెళ్లి పేలుతాయి	61 మీటర్లు (200 అడుగులు)
ఒక్కో బాంబు బరువు	13.6 టన్నులు
ఒక్కో బాంబు ఖరీదు	రూ.170 కోట్లు
ఆపరేషన్‌లో పాల్గొన్న మొత్తం విమానాలు (యుద్ధవిమానాలు, ఇంధన విమానాలు కలుపుకొని)	125

బాహుబలి బాంబు

ఆ 3 అణు కేంద్రాలు

ఇరుకున పడ్డ ఇరాన్!

మాట వినకపోతే మళ్లీ దాడులు
..: డొనాల్డ్ ట్రంప్

నిర్ణయం అద్భుతం
..: నెతన్యాహూ

భారత్‌లో సరిపడా చమురు నిల్వలు
..: కేంద్రమంత్రి పూరీ

- వివరాలు 6లో▶

సర్వే నంబర్లు గాయబ్!



1.26 లక్షల.. సర్వే నంబర్ల మాయంపై భూభారతి సదస్సుల్లో రైతుల ఫిర్యాదు

8 లక్షల దరఖాస్తుల్లో ఈ తరహావి **15%**

ధరణి పోర్టల్ అమల్లోకి వచ్చిన తర్వాత ఆన్‌లైన్‌లో నమోదు కాని వైనం

- సాదాబైనామాల కింద రిజిస్ట్రేషన్లు కోరిన వారు **2.42** లక్షలు

సాక్షి, హైదరాబాద్: ఒకటి కాదు...రెండు కాదు.. రాష్ట్రంలోని వ్యవసాయ భూములకు సంబంధించిన లక్షకు పైగా సర్వే నంబర్లు గల్లంతయ్యాయి. పాత రికార్డుల్లో ఉన్నా కొత్త రికార్డుల్లోకి ఇవి ఎక్కలేదు. ధరణికి ముందున్న మాన్యువల్ రికార్డుల్లో నమోదైన ఈ సర్వే నంబర్లన్నీ ధరణి పోర్టల్ అమల్లోకి వచ్చిన తర్వాత ఆన్‌లైన్‌లో నమోదు కాలేదు. దశాబ్దాలుగా సాగు చేసుకుంటున్న తమ భూముల సర్వే నంబర్లు కనిపించకపోవడంతో ఆయా సర్వే నంబర్లలో భూమి ఉన్న రైతాంగం దిక్కుతోచని స్థితిలో పడిపోయింది. ఇప్పటికే పలుమార్లు దరఖాస్తులు చేసుకున్నా ఫలితం లేకపోవడం, సమస్యకు పరిష్కారం లభించకపోవడంతో ఇటీవల రాష్ట్ర వ్యాప్తంగా జరిగిన భూభారతి సదస్సుల్లో ఈ రైతులందరూ మరోమారు దరఖాస్తు చేసుకున్నారు. ఈ నెల 3వ తేదీ నుంచి 20వ తేదీ వరకు రాష్ట్రంలోని 561 మండలాల్లో ఉన్న 10,239 రెవెన్యూ గ్రామాల్లో నిర్వహించిన ఈ సదస్సుల్లో మొత్తం 8,00,999 దరఖాస్తులు రాగా, అందులో తమ భూముల సర్వే నంబర్లు మిస్సయ్యాయంటూ ఏకంగా 1,26,028 దరఖాస్తులు రావడం గమనార్హం. మొత్తం దరఖాస్తుల్లో 15 శాతం సర్వే నంబర్ల మిస్సింగ్ దరఖాస్తులే కావడం గమనార్హం. రెవెన్యూ రికార్డులకు సంబంధించి కీలకమైన, భూమి గుర్తింపు సంఖ్య అయిన సర్వే నంబరే లేకుండా పోవడంపై రైతుల్లో ఆందోళన వ్యక్తం అవుతోంది.

మొత్తం 8 లక్షలకు పైమాటే

రాష్ట్రంలో భూ సమస్యల పరిష్కారం పేరిట ధరణి పోర్టల్ అమల్లోకి వచ్చి నాలుగేళ్లు దాటిపోయింది. ఆ పోర్టల్‌ను రద్దు చేసి భూభారతి అమల్లోకి తెచ్చి కూడా రెండు నెలలయింది. కానీ రాష్ట్ర రైతాంగం చేతిలో ఉన్న వ్యవసాయ భూములకు సంబంధించి ఇంకా లెక్కలేనన్ని సమస్యలు మిగిలి ఉన్నాయని భూభారతి సదస్సుల్లో వచ్చిన దరఖాస్తుల గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. గ్రామస్థాయిలో జరిగిన ఈ సదస్సుల్లో రాష్ట్ర వ్యాప్తంగా 8 లక్షలకు పైగా
మిగతా 2వ పేజీలో ▶

తనిఖీలతో బోధనెలా?

పాఠశాలల పర్యవేక్షణకు సీనియర్ టీచర్లు

2,000 మంది టీచర్లకు కొత్త బాధ్యతలు

- కొత్త విధానంపై ఉపాధ్యాయుల అసంతృప్తి
- పైరవీలకు ద్వారాలు తెరుస్తున్నారనే ఆరోపణలు.. పాఠాలు చెప్పేందుకు టీచర్ల కొరత రాదా?
- విద్యాశాఖపై ఉపాధ్యాయ సంఘాల మండిపాటు



సాక్షి, హైదరాబాద్

ప్రభుత్వ పాఠశాలల్లో తనిఖీలకు టీచర్లనే నియమిస్తూ విద్యాశాఖ ఇచ్చిన ఉత్తర్వులు దుమారం రేపుతున్నాయి. టీచర్ల సంఘాలు దీన్ని అనాలోచిత నిర్ణయమని విమర్శిస్తున్నాయి. ఈ నిర్ణయం పాఠశాలల్లో టీచర్ల కొరతను మరింత పెంచుతుందని, పైరవీలకు ద్వారాలు తెరిచినట్టే అవుతుందని పలువురు టీచర్లు అంటున్నారు. ఈ విధానంపై పాఠశాల విద్య ఉన్నతాధికారులు కూడా పెదవి విరుస్తున్నారు.


ఇప్పటివరకు ఉన్నతాధికారులకే..

రాష్ట్రంలో 24 వేలకుపైగా ప్రభుత్వ పాఠశాలలున్నాయి. వీటి పర్యవేక్షణకు ప్రతి మండలంలో మండల విద్యాధికారులు ఉంటారు. సాధారణంగా ప్రధానోపాధ్యాయుడికే పదోన్నతి కల్పించి ఎంఈఓగా నియమిస్తారు. గత ఏడాది వరకు ఒక్కో హెచ్‌ఎంకు ఐదు మండలాల వరకు పర్యవేక్షణ బాధ్యత ఉండేది. గత సంవత్సరం పదోన్నతుల కారణంగా ఒక్కో మండలానికి ఒక్కో ఎంఈఓ వచ్చారు. వీరితో పాటు మండల రిసోర్స్ పర్సన్స్ కూడా ఉంటారు. వీళ్లంతా పాఠశాలలను తనిఖీ చేసి, జిల్లా విద్యాధికారికి ప్రతి నెల నివేదిక ఇస్తారు. డీఈఓ ద్వారా ఇది రాష్ట్రస్థాయిలో పాఠశాల విద్య డైరెక్టరేట్‌కు చేరుతుంది. స్కూళ్లలో విద్యార్థుల హాజరు పట్టిక నిర్వహణ, సిలబస్ సకాలంలో పూర్తవుతుందా లేదా? మౌలిక సదుపాయాలు ఎలా ఉన్నాయి? ఉపాధ్యాయుల పనితీరు వంటి వివరాలపై నివేదికలు ఇస్తారు. కానీ, ఇప్పుడు కొత్తగా
మిగతా 12వ పేజీలో ▶

సింగయ్య మృతి ప్రమాదం వక్రీకరణ

చంద్రబాబు ప్రభుత్వ కుతంత్రం.. జగన్ పర్యటనల్లో భద్రత ఏర్పాట్లలో కుట్ర పూరిత నిర్లక్ష్యం

- జడ్ ప్లస్ కేటగిరీ భద్రత ఉన్నా ఉద్దేశపూర్వక నిర్లక్ష్యం
- ఆయన వాహనంపైకి దండెత్తుతున్న టీడీపీ అసాంఘిక శక్తులు
- సింగయ్య మృతి ఉదంతాన్ని వక్రీకరిస్తూ కుతంత్రం
- వైఎస్ జగన్ వాహనం ఢీకొని సింగయ్య మృతి చెందినట్టు ప్రకటన
- అదే వాస్తవమైతే జగన్ భద్రతలో ప్రభుత్వం నిర్లక్ష్యం వహించినట్టే
- పైలట్ వాహనాలు, రోప్ పార్టీ పోలీసులు లేరని ప్రభుత్వం ఒప్పుకున్నట్టే
- వైఎస్ జగన్‌ను భూస్థాపితం చేస్తానన్న బాబు కుట్రలో భాగమే ఇదా..!?
- లేదా వైఎస్ జగన్ ప్రజాదారణను ఓర్వలేక ఈర్ష్యతో డైవర్షన్ పాలిటిక్సా!?
- ఏది నిజమో సమాధానం చెప్ప చంద్రబాబూ.. పక్కా కుతంత్రంతో వైఎస్ జగన్‌పై అక్రమ కేసు
- జగన్‌కు విశేష జనాదారణతో చంద్రబాబు బెంబేలు



- ప్రభుత్వ వైఫల్యాలపై నిలదీస్తున్న జగన్‌ను అడ్డుకునే కుతంత్రం
- ప్రభుత్వ ఉద్యోగి అయిన వైఎస్‌జగన్ వాహన డ్రైవర్‌పై అబద్ధపు వాంగ్మూలం కోసం ఒత్తిడి
- ప్రభుత్వ పెద్దల కుతంత్రానికి లొంగిన గుంటూరు ఎస్పీ సతీశ్
- గుర్తు తెలియని ప్రైవేట్ వాహనం ఢీకొనే సింగయ్య మృతి అని మొదటి రోజే చెప్పిన ఎస్పీ
- ప్రభుత్వ ఒత్తిడితో మూడు రోజుల్లోనే మాట మార్చిన ఎస్పీ...
- అదే నిజమైతే చంద్రబాబు ప్రభుత్వమే దోషి అంటున్న నిపుణులు
- వైఎస్ జగన్ పర్యటనల్లో భద్రతా వైఫల్యానికి ప్రభుత్వానిదే బాధ్యత

12 లో

లైవ్ లొకేషన్ తరహాలో తపాలా డిజిపిన్



- ప్రతి 16 చదరపు మీటర్లకు ప్రత్యేక డిజిటల్ పిన్ నంబర్
- అత్యవసర సేవల్లో తక్షణ సాయం అందేందుకు దోహదం
- ప్రభుత్వ విభాగాల పోర్టళ్లతో అనుసంధానించేందుకు రాష్ట్ర ప్రభుత్వానికి తపాలా శాఖ విజ్ఞప్తి
- ఇక ఇంటి చిరునామా స్థానంలో డిజిపిన్.. సులభంగా అడ్రస్ గుర్తించేందుకు వీలు
- ఐఐటీ హైదరాబాద్, నేషనల్ రిమోట్ సెన్సింగ్ ఏజెన్సీల సంయుక్త కృషి
- గూగుల్‌తో అనుసంధానం..

- వివరాలు 16లో

వాట్సాప్.. ఇక యాడ్స్ అడ్డా!

ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్‌తో మెటా సక్సెస్.. ఇప్పుడు 'తెర' మీదకు వాట్సాప్ యాడ్స్

అత్యధిక యూజర్లు ఉన్నది భారత్‌లోనే.. ప్రకటనలతో అంచనాలను మించి ఆదాయం

- వివరాలు 3లో

వేలి ముద్రలాగే.. శ్వాస ముద్ర!

ప్రతి వ్యక్తికీ విలక్షణమైన శ్వాస శైలి

అనారోగ్య సమస్యలున్న వారి తీరే వేరు.. ఈ 'విలక్షణ'తో మానసిక రుగ్మతల గుర్తింపు

పరిష్కార మార్గాలకూ దారి చూపుతుంది

- వివరాలు 5లో

హైదరాబాద్-బెంగళూరు..

డిఫెన్స్ కారిడార్!

పాలమూరులో బ్రహ్మోస్ క్షిపణి తయారీ కేంద్రానికి అడుగులు

- దేవరకద్రలోని చౌదర్‌పల్లి–బస్వాయిపల్లి మధ్య 497 ఎకరాల భూమి లభ్యత
- డీఆర్‌డీఎల్ శాస్త్రవేత్తల స్థల పరిశీలన.. అనుకూలంగా ఉందని వెల్లడి
- యూనిట్ ఏర్పాటైతే క్షిపణి విడిభాగాల తయారీ పరిశ్రమలకూ అవకాశం
- ప్రత్యక్షంగా, పరోక్షంగా సుమారు 10 వేల మంది స్థానికులకు ఉపాధి



దేవరకద్ర సమీపంలోని చౌదర్‌పల్లి వద్ద ఉన్న ప్రభుత్వ స్థలం

సాక్షి ప్రతినిధి, మహబూబ్‌నగర్: తెలంగాణలో డిఫెన్స్ ఇండస్ట్రియల్ కారిడార్ ఏర్పాటుకు రంగం సిద్ధమైంది. దేశంలో ఇప్పటివరకు రెండు డిఫెన్స్ కారిడార్లు (తమిళనాడు, ఉత్తరప్రదేశ్) ఉన్నాయి. రెండో కారిడార్‌కు సంబంధించి గతంలోనే రాష్ట్రానికి అవకాశం వచ్చినా చివరలో యూపీకి తరలిపోయింది. తాజాగా మూడో కారిడార్‌ను తెలంగాణలో ఏర్పాటు చేసే దిశగా కేంద్ర ప్రభుత్వం సన్నాహాలు చేస్తున్నట్లు తెలుస్తోంది. ఈ మేరకు పాలమూరులో బ్రహ్మోస్ క్షిపణి తయారీ యూనిట్ ద్వారా హైదరాబాద్-బెంగళూరు డిఫెన్స్ కారిడార్‌కు మార్గం సుగమమయ్యేలా రాష్ట్ర ప్రభుత్వం అడుగులు వేస్తోంది.

దేవరకద్రలో 'బ్రహ్మోస్'యూనిట్ ఏర్పాటుతో..

బ్రహ్మోస్ క్షిపణి తయారీ కేంద్రం హైదరాబాద్‌లో ఉన్న విషయం తెలిసిందే. ఈ యూనిట్‌ను విస్తరించాలని ఎప్పటి నుంచో ప్రయత్నాలు జరుగుతున్నా అక్కడ భారీగా భూములు అందుబాటులో లేవు. బ్రహ్మోస్ క్షిపణి తయారీ యూనిట్‌కు సుమారు 350 నుంచి 400 ఎకరాల వరకు స్థలం అవసరమవగా అందుకోసం అన్వేషణ కొనసాగుతోంది. సీఎం రేవంత్‌రెడ్డి చొరవతో డిఫెన్స్ రీసెర్చ్, డెవలప్‌మెంట్ లేబొరేటరీ (డీఆర్‌డీఎల్), బ్రహ్మోస్ శాస్త్రవేత్తల బృందం ఇటీవల ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా దేవరకద్ర నియోజకవర్గ పరిధిలోని భూములను పరిశీలించింది. దీంతో బ్రహ్మోస్ క్షిపణి తయారీ యూనిట్‌తోపాటు హైదరాబాద్-బెంగళూరు డిఫెన్స్ కారిడార్ ఏర్పాటు అంశం తెరపైకి వచ్చింది.

అంతా సానుకూలత..

మహబూబ్‌నగర్ జిల్లా దేవరకద్ర నియోజకవర్గంలోని చౌదర్‌పల్లి-బస్వాయిపల్లి మధ్య గతంలో విమానాశ్రయం కోసం ప్రణాళికలు రూపొందించారు. ఆ మ్యాప్ ప్రకారం 150 ఎకరాల మేర ప్రభుత్వ భూమి లభ్యమవగా మరో 150 ఎకరాల మేర అసైన్డ్ భూములు ఉన్నాయి. 197 ఎకరాల వరకు
మిగతా 5వ పేజీలో ▶

అమెరికా మెరుపుదాడి

ఫోర్డో, నతాంజ్ అణుకేంద్రాలపై బంకర్ బస్టర్ బాంబులేసిన ట్రంప్ సేన

ఇస్ఫహాన్ అణుకేంద్రంపై టోమాహాక్ క్రూజ్ క్షిపణులతో దాడి

చరిత్ర చూడని స్థాయిలో ప్రతిదాడిచేస్తామన్న ఇరాన్

ఇరాన్ యుద్ధం ఆపకుంటే మళ్లీ దాడి చేస్తామన్న ట్రంప్

అమెరికా జోక్యంతో భగ్గుమన్న ఇజ్రాయెల్-ఇరాన్ యుద్ధాగ్ని

అగ్రరాజ్య దాడిని ఖండించిన ప్రపంచదేశాలు



ఈ నెల 20న దాడికి ముందు, 22న దాడి తర్వాత ధ్వంసమైన ఫోర్డో అణు కేంద్రం ఉపగ్రహ ఛాయాచిత్రాలు



అమెరికన్లను ఉద్దేశించి వైట్‌హౌస్‌లో ప్రసంగిస్తున్న ట్రంప్. చిత్రంలో జేడీ ఇవాన్స్, రూబియో, హెగ్సెత్

టెహ్రాన్/టెల్ అవీవ్/వాషింగ్టన్/న్యూఢిల్లీ/మాస్కో: పచ్చగడ్డి వేస్తే భగ్గున మండే శత్రుత్వంతో పరస్పర దాడులు చేసుకుంటున్న ఇరాన్, ఇజ్రాయెల్ మధ్యలోకి అగ్రరాజ్యం హఠాత్తుగా వచ్చి భీకర దాడులతో పశ్చిమాసియాలో యుద్ధజ్వాలలను మరింత ఎత్తుకు ఎగదోసింది. పర్వతగర్భంలో పటిష్టంగా, రహస్యంగా ఉన్న ఫోర్డో యురేనియం శుద్ధి కర్మాగారాన్ని బద్దలుకొట్టే లక్ష్యంతో అమెరికా యుద్ధవిమానాలు వేల కేజీల బరువైన అతిభారీ బాంబులతో విరుచుకుపడ్డాయి. ఇరాన్ రాజధాని సమీప ఫోర్డో అణుకేంద్రంపై శనివారం అర్ధరాత్రిదాటాక గంటలకు జీబీయూ-57 ఏ/బీ మ్యాసివ్ ఆర్డినెన్స్ పెనిట్రేటర్(ఎంఓపీ) గైడెడ్ బాంబులను అమెరికా బీ-2ఏ స్పిరిట్ స్టెల్త్ బాంబర్ విమానాలు జారవిడిచాయి. ఈ బాంబులు 200 అడుగుల లోతుకు చొచ్చుకెళ్లి అక్కడి భూగర్భాన్ని బద్దలుకొట్టాయి. నతాంజ్ అణుకేంద్రంపైనా అమెరికా ఇవే బాంబులను వేసింది. మొత్తంగా 14 జీబీయూ బాంబులను ఉపయోగించినట్లు అమెరికా జాయింట్ చీఫ్స్ ఆఫ్ స్టాఫ్ చైర్మన్, జనరల్ డేనియల్ కెయిన్ వెల్లడించారు.

ఆపరేషన్ మిడ్‌నైట్ హ్యామర్..

శనివారం అర్ధరాత్రిదాటగానే 'ఆపరేషన్ మిడ్‌నైట్ హ్యామర్'పేరిట ఈ దాడులను చేసింది. అమెరికాలోని మిస్సోరీలోని వైట్ హ్యాన్ వైమానిక స్థావరం నుంచి ఆరు బీ-2ఏ విమానాల దండు దండయాత్ర మొదలైంది. ఏకధాటిగా 37 గంటలపాటు ప్రయాణించి, మార్గమధ్యంలో గాల్లోనే ఇంధనాన్ని నింపుకుంటూ 11,400 కిలోమీటర్లు ప్రయాణించిమరీ ఫోర్డో, నతాంజ్ అణుకేంద్రాలపై ఒక్కోటి దాదాపు 14,000 కేజీల బరువుండే 14 బంకర్ బస్టర్ బాంబులను పడేశాయి. ఆ తర్వాత ఇస్ఫహాన్ అణుకేంద్రంపై అమెరికా జలాంతర్గామి 30 టోమాహాక్ క్రూజ్ క్షిపణులను ప్రయోగించింది. ఈ మూడు అణుకేంద్రాలపై 75 దాకా గైడెడ్ క్షిపణులను ప్రయోగించి విధ్వంసం సృష్టించింది. మొత్తంగా 125 విమానాలు ఈ ఆపరేషన్‌లో పాల్గొన్నాయి. కొన్ని విమానాలు దాడిచేయగా మిగతావి శత్రుసేనలను తికమక పెట్టేందుకు వేర్వేరు దిశల్లో చక్కర్లు కొట్టాయి. మెరుపువేగంతో దాడులుచేసి తిరిగి తమతమ స్థావరాలకు చేరుకున్నాయి. యుద్ధ, రవాణా, ఇంధన విమానాలు ఈ 'ఆపరేషన్ మిడ్‌నైట్ హ్యామర్'లో పాల్గొన్నాయి. అమెరికా దాడుల్లో అణుకేంద్రాల్లో మౌలికవసతులు ఏ స్థాయిలో నాశనమయ్యాయో ఇంకా అధికారికంగా వెల్లడికాలేదు. అయితే పర్వతం పైభాగంలో ఆరు భారీ రంధ్రాలు పడ్డట్లు తాజాగా తీసిన 'ప్లానెట్ ల్యాబ్స్ పీబీసీ'ఉపగ్రహ ఫొటోల్లో కనిపించింది. అయితే అణుబాంబు తయారీని అడ్డుకునేందుకు బాంబులేశామని, ఇరాన్‌లో యుద్ధాన్ని ఎగదోసి, ప్రస్తుత ప్రభుత్వాన్ని పడగొట్టే ఉద్దేశ్యం తమకు లేదని అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్, రక్షణ మంత్రి పీట్ హెగ్సెత్ స్పష్టంచేశారు. అయితే అణుబాంబు తయారీ సామర్థ్యాన్ని ఇరాన్ సంతరించుకోవద్దనే లక్ష్యంతోనే తాము యుద్ధంలో పాల్గొన్నామని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ తమ సైనికచర్యను సమర్థించుకున్నారు. తమపై ప్రతిదాడి చేస్తే మిగతా లక్ష్యాలపై దాడులు తప్పవని ఇరాన్‌ను హెచ్చరించారు. అయితే దాడుల తర్వాత ఆయా అణుకేంద్రాల నుంచి ఎలాంటి అణుధార్మికత వెల్లడైన ఛాయలు కనిపించలేదని అంతర్జాతీయ అణుఇంధన ఏజెన్సీ స్పష్టంచేసింది. దాడికి ముందే అక్కడి నుంచి యురేనియం నిల్వలను తరలించినట్లు ఇరాన్ అధికారులు వెల్లడించారు.

ఊహించనిస్థాయిలో దెబ్బకొడతాం: అబ్బాస్

ఓవైపు అణు మధ్యవర్తిత్వం కోసం స్వాగతం పలుకుతూ మరోవైపు సమరాగ్నిని రాజేస్తున్న అగ్రరాజ్యాన్ని ఊరికే వదిలిపెట్టబోమని ఇరాన్ ప్రతిజ్ఞచేసింది. చరిత్రలో ఎన్నడూలేని స్థాయిలో దాడులుచేసి బదులు తీర్చుకుంటామని ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాఘ్చీ ప్రకటించారు. ఇస్తాంబుల్‌లో జరుగుతున్న ఆర్గనైజేషన్ ఆఫ్ ఇస్లామిక్ కోపరేషన్ సదస్సులో పాల్గొనేందుకు వెళ్లిన అబ్బాస్ ఆదివారం మీడియాతో మాట్లాడారు. ''దౌత్యనీతిని కాలరాస్తూ అమెరికా మాపై దాడులకు తెగబడింది. మేం దౌత్యాన్ని ప్రస్తుతానికి పక్కనబెట్టి దేశ రక్షణ కోసం భీకరపోరు చేయాల్సిన తక్షణావసరమిది. దుస్సాహసంతో దారుణంగా దాడులు చేసిన యుద్ధోన్మాద అమెరికా తదుపరి తీవ్ర పర్యావసానాలకు బాధ్యత వహించాల్సి ఉంటుంది. అమెరికా చర్యలకు ఇరాన్ తన సైన్యంతో బదులుతీర్చుకుంటుంది. దేశ భద్రత, జాతీయ ప్రయోజనాల పరిరక్షణకు ఇరాన్ పాటుపడుతుంది''అని అబ్బాస్ అన్నారు. మరోవైపు తమపై దాడిచేసిన ఇజ్రాయెల్‌పైనా ఇరాన్ ఆదివారం మిస్సైళ్లను ప్రయోగించింది. తన అమ్ములపొదిలోని మధ్యస్థ శ్రేణి ఖుర్రమ్‌షహర్-4 క్షిపణిను సైతం ఇరాన్ ప్రయోగించింది. ఇది ఒకేసారి 1,500 కేజీల బరువైన వేర్వేరు వార్‌హెడ్లను ఏకంగా 2,000 కిలోమీటర్లదాకా మోసుకెళ్లగలదు. ఈ క్షిపణిని ఈ యుద్ధంలో వాడటం ఇదే తొలిసారి అని తెలుస్తోంది.

జలసంధి దిగ్బంధం!!

ప్రపంచ చమురు జీవనాడికి పేరొందిన హోర్ముజ్ జలసంధిని మూసేస్తామని ఇరాన్ బెదిరించింది. ఈ మేరకు ప్రభుత్వం నిర్ణయానికి ఇరాన్ పార్లమెంట్ ఆమోదం తెలపింది. అయితే జాతీయ ప్రయోజనాలపై కీలక నిర్ణయాలు తీసుకునే 'సుప్రీం నేషనల్ సెక్యూరిటీ కౌన్సిల్'ఇంకా దీనిపై ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. అది కూడా ఆమోదిస్తే జలసంధి ద్వారా ముడి చమురు, సహజవాయువు రవాణా నౌకల రాకపోకలు స్తంభించిపోనున్నాయి. దాంతో ఇంధన కొరత ఎక్కువై, గిరాకీ పెరిగి, పెట్రో ధరలు మరింత అధికం కానున్నాయి. భారత్‌పై దీని ప్రభావం తీవ్రంగా ఉండే ప్రమాదముంది. మరోవైపు, అమెరికా జోక్యం, బాంబు దాడులతో పశ్చిమాసియా ఉద్రిక్తతలు నెలకొనడంతో ఆదివారం ఇరాన్ అధ్యక్షుడు మసూద్‌తో భారత ప్రధాని మోదీ ఫోన్‌లో మాట్లాడారు. ఉద్రిక్తతలపై మోదీ తీవ్ర ఆందోళన వ్యక్తంచేశారు. చర్చలు, దౌత్యం ద్వారానే ఈ సమస్యకు పరిష్కారం లభిస్తుందన్నారు. ఈ వివరాలను మోదీ తన 'ఎక్స్'ఖాతాలో వెల్లడించారు.



ఈ నెల 16న దాడికి ముందు, 22న దాడి తర్వాత ధ్వంసమైన ఇస్ఫహాన్ అణు కేంద్రం ఉపగ్రహ ఛాయాచిత్రాలు

దాడులను పొగిడిన ఇజ్రాయెల్

ఇరాన్‌పై అమెరికా దాడి చేయడాన్ని ఇజ్రాయెల్ స్వాగతించింది. ఇదొక అద్భుత, సాహసోపేత, చరిత్రాత్మక ఘటనగా అభివర్ణించింది. ఈ మేరకు ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహూ, అధ్యక్షుడు ఇసాక్ హెర్జోగ్ మీడియాతో మాట్లాడారు. ''దాడులు చేయాలని కోరాం. కానీ అమెరికా నిర్ణయం ముందస్తుగా మాకు తెలీదు. ఇదొక చారిత్రక నిర్ణయం. అమెరికా నేరుగా దాడులు చేస్తున్నందున ఇక మేం దాడులు చేయబోమని అనుకోవద్దు. ఇరాన్ మా భూభాగాలపై క్షిపణులు వేస్తోంది. మేం వాటికి బదులు చెప్పాలి''అని ఇసాక్ అన్నారు. ఆదివారం సైతం ఇరాన్‌లోని డజనుకుపైగా మిలటరీ స్థావరాలపై దాడులు చేశామని చెప్పారు. అయితే ఆస్పత్రులు, మెడికల్ సెంటర్లపై ఇజ్రాయెల్ దాడులు చేస్తోందని ఇరాన్ ఆరోపించింది. ఆదివారం నాటికి ఇజ్రాయెల్ దాడుల్లో ఇప్పటిదాకా ఇరాన్‌లో 865 మంది దాకా చనిపోయారని, 3,396 మంది గాయపడ్డారని వాషింగ్టన్ కేంద్రంగా పనిచేసే 'హ్యూమన్ రైట్స్ యాక్టివిస్ట్స్'సంస్థ ప్రకటించింది. మరోవైపు ఇరాన్ సుప్రీంనేత అయతొల్లా అలీ ఖమేనీని అత్యంత సురక్షిత బంకర్‌కు తరలించినట్లు తెలుస్తోంది. తమ దేశంలో 24 మంది చనిపోయారని, వేయి మంది గాయపడ్డారని ఇజ్రాయెల్ పాత లెక్కలనే చెబుతోంది

మద్దతు కూడగట్టే పనిలో ఇరాన్

ఇరాన్‌పై దాడులను చైనా, రష్యా తీవ్రంగా ఖండించాయి. దాడుల తర్వాత ఇరాన్‌కు ప్రపంచదేశాల నుంచి సైనిక సాయం పెరుగుతుందని రష్యా వ్యాఖ్యానించింది. ఈ మేరకు రష్యా మాజీ అధ్యక్షుడు, దేశ భద్రతామండలి అధ్యక్షుడు దిమిత్రీ మెద్వదేవ్ 'ఎక్స్'లో ఒక పోస్ట్ పెట్టారు. ''దాడుల కారణంగా ఆ అణుకేంద్రాలు పెద్దగా దెబ్బతినలేదు. పైగా ఇరాన్‌కు బయటి మద్దతు పెరుగుతోంది. అణువార్‌హెడ్‌లు సరఫరా చేసేందుకు సిద్ధంగా ఉన్నాయి''అని అన్నారు. మరోవైపు రష్యా అధ్యక్షుడు పుతిన్‌తో మంతనాలు జరిపేందుకు ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ ఆదివారం మాస్కోకు వెళ్లారు. భేటీ వివరాలు ఇంకా తెలియాల్సి ఉంది.

క్లుప్తంగా...

ఇరాన్‌పై అమెరికా దాడులు అంతర్జాతీయ చట్టాలకు విరుద్ధం

ఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఒవైసీ



సాక్షి, హైదరాబాద్: ఇరాన్ అణు కేంద్రాలపై అమెరికా వైమానిక దాడులు చేయడం అంతర్జాతీయ చట్టాలకు విరుద్ధమని ఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఒవైసీ అన్నారు. ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ అమెరికా వైమానిక దాడులను తీవ్రంగా ఖండించారు. పహల్గాం ఉగ్రదాడి అనంతరం భారత్-పాక్ మధ్య ఘర్షణలు చెలరేగిన సమయంలో ఉద్రిక్తతల ఉపశమనానికి జోక్యం చేసుకున్న డొనాల్డ్ ట్రంప్ పేరును నోబెల్ శాంతి బహుమతికి సిఫారసు చేస్తామని ప్రకటించిన కొద్ది గంటలకే అమెరికా నేరుగా ఇరాన్‌పై దాడులకు దిగిడంపై పాకిస్తాన్ ఇప్పుడేమంటుందని నిలదీశారు. ఇంతటి ఘనకార్యం చేసిన ట్రంప్‌కు నోబెల్ శాంతి బహుమతి ఇవ్వాలని పాక్ కోరుకుంటోందా? ఇందుకోసమే వాళ్ల ఫీల్డ్ మార్షల్ ఆసిమ్ మునిర్ ట్రంప్‌తో డిన్నర్ చేశారా? అని ప్రశ్నించారు. ఇరాన్ వద్ద అణ్వాయుధాలు ఉన్నాయని తప్పుడు ప్రచారం చేశారని, ఇరాక్ విషయంలోనూ ఇదే జరిగిందని, కానీ అది నిరూపణ కాలేదని, లిబియా విషయంలోనూ ఇదే జరిగిందని, అక్కడ కూడా అణ్వాయుధాలున్నట్టు రుజువు కాలేదని ఒవైసీ పేర్కొన్నారు.

పెండింగ్ బిల్లుల వల్లే పనుల్లో జాప్యం

మంత్రి కోమటిరెడ్డితో అధికారులు



సాక్షి, హైదరాబాద్: రోడ్లు భవనాల శాఖ ఆధ్వర్యంలో జరుగుతున్న నిర్మాణ పనుల్లో వేగం పెంచాలని ఆ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. ఆదివారం సచివాలయంలో ఆయన అధికారులతో సమావేశమై పనుల గురించి ఆరా తీశారు. ఆదిలాబాద్, వరంగల్, ములుగు, నారాయణపేట, కరీంనగర్ జిల్లాల సమీకృత కార్యాలయాల పనులో జాప్యం ఎందుకు జరుగుతోందని ప్రశ్నించగా, చెల్లించాల్సిన బిల్లులు పేరుకుపోవటమే కారణమని వారు సమాధానమిచ్చారు. దీంతో బిల్లుల విడుదలకు చర్యలు తీసుకుంటామని మంత్రి చెప్పారు. పనులు ముగింపు దశలో ఉండి ప్రారంభోత్సవానికి సిద్ధమవుతున్న వరంగల్, ములుగు జిల్లా కలెక్టరేట్ భవనాల పనులను వెంటనే పూర్తి చేయాలని ఆదేశించారు. నిజామాబాద్ మాధవనగర్ ఆర్వోబీని కూడా వెంటనే సిద్ధం చేయాలని ఆదేశించారు. ఆర్వోబీలతో పాటు మెడికల్ కళాశాలల భవనాలు, ఆసుపత్రి భవనాల పనుల్లో వేగం పెంచాలని చెప్పారు. రోడ్ల పనులను కూడా వీలైనంత త్వరగా పూర్తి చేయాలని సూచించారు. పెండింగు బిల్లుల విడుదలపై ముఖ్యమంత్రితో మాట్లాడతానని చెప్పారు. సమావేశంలో ఈఎన్సీ తిరుమల, చీఫ్ ఇంజనీర్లు మోహన్ నాయక్, రాజేశ్వర్ రెడ్డి, లక్ష్మణ్ ఇతర అధికారులు పాల్గొన్నారు.

తూర్పు నావికాదళంలో చేరిన ఐఎన్ఎస్ నీలగిరి



విశాఖ వచ్చిన ఐఎన్ఎస్ నీలగిరి నౌక

సింధియా: దేశీయంగా నిర్మించిన ప్రాజెక్ట్ 17వ స్టీల్ ఫ్రిగేట్‌లో మొదటి నౌక అయిన ఐఎన్ఎస్ నీలగిరి ఆదివారం తూర్పు నావికాదళంలో చేరింది. ముంబైలోని నీలగిరిలో నిర్మించిన ఐఎన్ఎస్ నీలగిరి నౌక తన సొంత నౌకాశ్రయంలో చేరేందుకు విశాఖపట్నం వచ్చినట్లు నేవీ వర్గాలు పేర్కొన్నాయి. దీంతో నేవీ సిబ్బంది సంప్రదాయ పద్ధతిలో నౌకకు ఘనంగా స్వాగతం పలికారు.

ఆ ముష్కరులూ పాకిస్తానీలే

ఎన్ఐఏ విచారణలో వెల్లడి
- ఉగ్రవాదులకు ఆశ్రయమిచ్చిన ఇద్దరి అరెస్ట్

శ్రీనగర్: జమ్మూకశ్మీర్‌లోని పహల్గాంలో దారుణానికి పాల్పడిన ముష్కరులు పాకిస్తాన్ నుంచే వచ్చారన్న విషయం మరోసారి రూఢీ అయ్యింది. ఏప్రిల్ 22వ తేదీన పహల్గాంలో ఉగ్రవాదులు 26 మంది పర్యాటకులను మతం అడిగి మరీ దారుణంగా కాల్చి చంపడం తెల్సిందే. ఈ ఘటనకు బాధ్యులైన ఉగ్రవాదులకు ఆశ్రయం కల్పించారన్న ఆరోపణలపై ఈ కేసును దర్యాప్తు చేస్తున్న జాతీయ దర్యాప్తు విభాగం(ఎన్ఐఏ)అధికారులు తాజాగా ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. వీరు పహల్గాంలోని బట్‌కోట్‌కు చెందిన పర్వేజ్ అహ్మద్ జొతార్, హిల్ పార్క్ ప్రాంత వాసి బషీర్ అహ్మద్ జొతార్. విచారణలో వీరు కీలక విషయాలను వెల్లడించారని ఎన్ఐఏ తెలిపింది. దాడిలో పాల్గొన్న ముగ్గురు ఉగ్రవాదుల వివరాలను తెలిపారు. ముగ్గురు కూడా పాకిస్తాన్‌కు చెందిన వారేననీ, ఉగ్ర సంస్థ లష్కరే తోయిబా సభ్యులని వివరించారు. పర్వేజ్, బషీర్‌లు ఉగ్రవాదులకు ఆహారం, ఆశ్రయం కల్పించడంతోపాటు ఘటనాస్థలికి వెళ్లేందుకు సాయపడినట్లు తేలిందని ఆదివారం ఎన్ఐఏ తెలిపింది. పర్వేజ్, బషీర్‌లపై చట్ట వ్యతిరేక కార్యకలాపాల నివారణ చట్టం-1967 కింద కేసు నమోదు చేశామని పేర్కొంది. దర్యాప్తు కొనసాగుతోందని వివరించింది. పహల్గాం దారుణం అనంతరం, పాక్‌తోపాటు పాక్ ఆక్రమిత కశ్మీర్‌లోని ఉగ్రమూకల స్థావరాలపై భారత వైమానిక దళం దాడులు చేపట్టింది. అనంతరం రెండు దేశాలు పరస్పరం దాడులు చేసుకున్నాయి. నాలుగు రోజుల తర్వాత కాల్పుల విరమణకు వచ్చాయి. అయినప్పటికీ రెండు దేశాల మధ్య తీవ్ర స్థాయిలో ఉద్రిక్తతలు కొనసాగుతూనే ఉన్నాయి.

భారత్‌కు వెళ్తున్నారా? జాగ్రత్త!

ఎక్కడ చూసినా అత్యాచారాలు, హింస, ఉగ్రవాదం
- పౌరులకు అమెరికా కొత్త అడ్వైజరీ జారీ
- ఒంటరిగా వెళ్లొద్దంటూ మహిళలకు హెచ్చరిక



వాషింగ్టన్: భారత్‌లో పర్యటించాలనుకునే తమ పౌరులకు అమెరికా కొత్త అడ్వైజరీ జారీ చేసింది. ఇటీవలి కాలంలో అత్యాచారాలు, హింస, ఉగ్రవాదం పెరిగిపోతున్నాయని, భారత్‌కు వెళ్లాలనుకునేవారు జాగ్రత్తగా ఉండాలని ఆ దేశ ప్రభుత్వం సూచించింది. మహిళలు ఒంటరిగా ప్రయాణించొద్దని హెచ్చరిస్తూ అమెరికా విదేశాంగ శాఖ లెవల్ 2 సలహా జారీ చేసింది. జూన్ 16న జారీ చేసిన ఈ అడ్వైజరీలో 'భారత్‌లో మరింత జాగ్రత్తగా ఉండండి. కొన్ని ప్రాంతాల్లో నేరాలు, ఉగ్రవాదం పెరిగాయి. అక్కడ అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న నేరాలలో అత్యాచారం ఒకటి. పర్యాటక ప్రాంతాలు, ఇతర ప్రదేశాల్లో లైంగిక వేధింపులతో సహా హింసాత్మక నేరాలు జరుగుతాయి. పర్యాటక ప్రదేశాలు, రవాణా కేంద్రాలు, మార్కెట్లు/షాపింగ్ మాల్స్‌లో ఎప్పుడైనా ఉగ్రవాద దాడులు జరిగే అవకాశం ఉంది' అని హెచ్చరించింది. పహల్గాంలో ఉగ్రదాడి జరిగిన రెండు నెలల తర్వాత అమెరికా ఈ కొత్త అడ్వైజరీ విడుదల చేసింది. 'ఉగ్రవాదం, అశాంతి నెలకొన్న కారణంగా జమ్మూ కశ్మీర్‌లో ప్రయాణించవద్దు. తూర్పు లద్దాఖ్, రాజధాని లేహ్ తప్ప పర్యాటక ప్రదేశాలైన శ్రీనగర్, గుల్మార్గ్, పహల్గాం వంటి ప్రాంతాలకు వెళ్లొద్దు. భారత్-పాకిస్తాన్ నియంత్రణ రేఖ వెంబడి హింస సర్వసాధారణం. భారత్-పాక్ మధ్య సాయుధ ఘర్షణలు జరిగే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో అంతర్జాతీయ సరిహద్దు సమీపంలోని ప్రాంతాలకు ప్రయాణించవద్దు''అని విదేశాంగ శాఖ పేర్కొంది. ఇక 'తూర్పు మహారాష్ట్ర, ఉత్తర తెలంగాణ నుంచి పశ్చి మ బెంగాల్ వరకు మావోయిస్టు గ్రూపులు చురుకుగా ఉన్నాయి. గ్రామీణ ప్రాంతాలకు వెళ్లే పౌరులకు అత్యవసర సేవలను అందించే సామర్థ్యం అమెరికా ప్రభుత్వానికి లేదు. ఆయా ప్రాంతాలకు వెళ్లకుండా ఉంటే మంచిది'అని సూచించింది. భారత్‌కు వెళ్లాలనుకునేవారు శాటిలైట్ ఫోన్ తీసుకెళ్లొద్దని సలహా ఇచ్చింది.

ఖండించిన కాంగ్రెస్..

భారత్ పట్ల అమెరికా వైఖరిని కాంగ్రెస్ ఖండించింది. ఆ దేశ అడ్వైజరీ షాక్ కలిగించడమే కాదు, ఇబ్బందికి గురి చేసిందని ఎక్స్‌లో పోస్ట్ చేసింది. యూఎస్ ట్రావెల్ అడ్వైజరీ దిగ్భ్రాంతికి గురిచేసిందని పేర్కొంది. భారత్‌లో మహిళలు ఒంటరిగా ప్రయాణించొద్దని సూచించడం.. ప్రధాని నరేంద్రమోదీ 'సురక్షిత భారత్'పతనమైనట్లు కనిపిస్తోందని ఎద్దేవా చేసింది.

సర్వే నంబర్లు గాయబ్!

▶ మొదటి పేజీ తరువాయి

వినతులు రావడం గమనార్హం. ఇందులో ఎక్కువగా సాదా బైనామాల రిజిస్ట్రేషన్ల దరఖాస్తులు వచ్చాయి. మొత్తం దరఖాస్తుల్లో 30 శాతం దరఖాస్తులు ఇవే కావడం గమనార్హం. కాగా సాదా బైనామాల క్రమబద్ధీకరణకు అవసరమైన నిబంధనలను భూభారతి చట్టంలో పెట్టినా..ఈ అంశం కోర్టులో పెండింగ్ ఉండడంతో అవి రెగ్యులరైజ్ చేసేందుకు వీలు కాలేదు. కోర్టులో కేసు ముగిసిన తర్వాత ఆగస్టు నెలలో వీటన్నింటినీ పరిష్కరించాలని రాష్ట్ర ప్రభుత్వం యోచిస్తోంది. ఆ తర్వాత సర్వే నంబర్ల మిస్సింగ్, అసైన్డ్ భూములకు సంబంధించిన రికార్డుల సమస్యలు, ఆ భూములను తమకు క్రమబద్ధీకరించాలంటూ వచ్చిన దరఖాస్తులే ఎక్కువగా ఉన్నాయి. అసైన్డ్ భూముల రెవెన్యూ రికార్డులకు సంబంధించి 90 వేలకు పైగా దరఖాస్తులు రాగా, ఆ భూములను తమకు రిజిస్ట్రేషన్ చేయాలంటూ మరో 50 వేల దరఖాస్తులు వచ్చాయి. ఆ తర్వాత వారసత్వం (విరాసత్) ద్వారా వచ్చిన భూమిని భాగస్వామ్య పంపకం చేయాలంటూ ఎక్కువగా దరఖాస్తులు వచ్చాయి. అయితే భూభారతి పోర్టల్ ద్వారా ఈ భాగస్వామ్య పంపకాలకు అవకాశం కల్పించలేదని రెవెన్యూ వర్గాలు చెబుతున్నాయి. ఇక మ్యుటేషన్ పెండింగ్/కోర్టు కేసులు, డిజిటల్ సంతకం పెండింగ్, విస్తీర్ణంలో తేడాలు.. ఇలా రెవెన్యూ రికార్డులకు సంబంధించి 13 రకాలు, ఇతర సమస్యలకు సంబంధించిన 17 రకాల దరఖాస్తులు ఇటీవల జరిగిన భూభారతి సదస్సుల్లో రావడం గమనార్హం. మొత్తం దరఖాస్తుల్లో 3.2 లక్షలు ఇప్పటికే ఆన్‌లైన్‌లో నమోదు కాగా మిగిలిన దరఖాస్తులను కూడా నమోదు చేసే పనిలో రెవెన్యూ యంత్రాంగం నిమగ్నమైంది.

ఖమ్మంలో ఎక్కువ.. మేడ్చల్‌లో తక్కువ

జిల్లాల వారీగా పరిశీలిస్తే అత్యధికంగా ఖమ్మం జిల్లా రైతాంగం ఎక్కువగా భూమి సమస్యలు ఎదుర్కొంటున్నట్టు భూభారతి సదస్సుల్లో వచ్చిన గణాంకాలు చెబుతున్నాయి. ఈ జిల్లాలో అత్యధికంగా 67,378 దరఖాస్తులు రాగా, ఆ తర్వాత భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో 61,145 దరఖాస్తులు వచ్చాయి. అంటే ఒక్క ఉమ్మడి ఖమ్మం జిల్లాలోనే 1.28 లక్షలకు పైగా దరఖాస్తులు వచ్చాయి. మొత్తం వచ్చిన 8 లక్షల దరఖాస్తుల్లో రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్న ఉమ్మడి ఖమ్మం జిల్లా నుంచే 15 శాతం కంటే ఎక్కువ దరఖాస్తులు రావడం గమనార్హం. ఆ తర్వాత వరంగల్ (54,933), భూపాలపల్లి (48,651), సూర్యాపేట (44,501), సిద్దిపేట (42,639), నల్లగొండ (42,161) జిల్లాల్లో ఎక్కువగా దరఖాస్తులు వచ్చాయి. ఇక అత్యల్పంగా మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో 2,857 దరఖాస్తులు మాత్రమే వచ్చాయి. 10 వేల కంటే తక్కువ దరఖాస్తులు వచ్చిన జిల్లాల్లో ఆసిఫాబాద్ (3,712), మహబూబ్‌నగర్ (9,610), నారాయణపేట (4,052), రాజన్న సిరిసిల్ల (6,965), వనపర్తి (7,615) ఉన్నాయి.

ఆగస్టు 15 నాటికి సమస్యల నుంచి విముక్తి



భూభారతి సదస్సులను చాలా పకడ్బందీగా నిర్వహించాం. అధికారులే గ్రామాలకు వెళ్లి, ప్రజలకు ఒకరోజు ముందే దరఖాస్తులు ఇచ్చి, అన్ని వివరాలను తీసుకున్నారు. రూపాయి ఖర్చు లేకుండా రైతులు తమ భూ సమస్యలను ప్రభుత్వానికి తెలియజేసుకునే అవకాశాన్ని కల్పించడం సంతోషంగా ఉంది. పదేళ్ల కాలంలో బీఆర్ఎస్ చేసిన పాపాలకు, ధరణి తెచ్చిన కష్టాలకు భూభారతి సదస్సుల్లో వచ్చిన దరఖాస్తుల సంఖ్య నిదర్శనం. ధరణిని బంగాళాఖాతంలో కలిపేశాం. ఇప్పుడు రైతుల సమస్యల పరిష్కారమే మా ముందున్న తక్షణ కర్తవ్యం. ఆగస్టు 15 నాటికి తెలంగాణ రైతాంగాన్ని భూ సమస్యల నుంచి విముక్తులను చేస్తాం.

– రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి

ప్రత్యేక కార్యాచరణతోనే పరిష్కారం

భూభారతి సదస్సుల ద్వారా స్వీకరించిన దాదాపు 8 లక్షల దరఖాస్తులను పరిష్కరించడం ఎలా అన్న ప్రశ్న రెవిన్యూ వర్గాల్లో ఉత్పన్నమవుతోంది. రెవెన్యూ మంత్రి చెబుతున్నట్టుగా ఆగస్టు 15 నాటికి ఈ సమస్యలన్నీ పరిష్కారం కావాలంటే ప్రత్యేక కార్యాచరణ అవసరమని అంటున్నాయి. ముఖ్యంగా క్షేత్రస్థాయిలో రెవెన్యూ వ్యవస్థను పునరుద్ధరించడంలో భాగంగా గ్రామ పాలనాధికారుల నియామకాలు త్వరగా పూర్తి చేయాలనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఇప్పటివరకు 3 వేల మంది గ్రామ పాలనాధికారులు విధుల్లో చేరగా, దాదాపు 6 వేలకు పైగా పోస్టుల భర్తీ విషయంలో ప్రభుత్వం ఇంకా నిర్ణయం తీసుకోవాల్సి ఉంది. మరోవైపు గతంలో ఏర్పడిన కొత్త జిల్లాలు, మండలాల్లో క్షేత్రస్థాయి సిబ్బంది సమస్య కూడా ఉంది. గ్రామాల్లో సర్వేయర్ల నియామకాలు జరగాల్సి ఉంది. ఈ నేపథ్యంలో వీలున్నంత త్వరగా అవసరమైన రెవెన్యూ సిబ్బందిని నియమించడంతోపాటు ప్రత్యేక షెడ్యూల్ రూపొందించుకుని ముందుకెళితే గానీ ప్రభుత్వం నిర్దేశించుకున్న సమయం లోపు ఈ దరఖాస్తుల పరిష్కారం సాధ్యం కాదని రెవెన్యూ వర్గాలు చెబుతున్నాయి.

ఏ సమస్య గురించి ఎన్ని దరఖాస్తులు వచ్చాయంటే...!

అంశం	దరఖాస్తుల సంఖ్య
సర్వే నంబర్ల మిస్సింగ్	1,26,028
పెండింగ్ మ్యుటేషన్/కోర్టు కేసులు	20,740
డిజిటల్ సంతకం పెండింగ్	24,630
విస్తీర్ణంలో తేడాలు	40,889
భూమి స్వభావం/ వర్గీకరణ	10,038
పాసు పుస్తకంలో తప్పులు	14,175
నిషేధిత జాబితా నుంచి తొలగింపు	11,265
అసైన్డ్ భూముల సమస్యలు	92,910
ఓఆర్‌సీలు	3,738
38 ఈ సర్టిఫికెట్	318
విరాసత్	69,880
భూసేకరణ	2,241
ఇతరములు	3,84,147
మొత్తం	8,00,999

(నోట్: ఇతరముల కేటగిరీలో ఎక్కువగా సాదా బైనామాలకు సంబంధించిన దరఖాస్తులు వచ్చాయని, 2 లక్షలకు పైగా అవేనని రెవెన్యూ వర్గాలంటున్నాయి. అసైన్డ్ భూములను రిజిస్టర్ చేయాలంటూ 50 వేలకు పైగా, శివాయి జమేదార్ భూముల సమస్యలపై 12 వేలకుపైగా దరఖాస్తులు వచ్చాయని సమాచారం. వీటితో పాటు పోడు భూములు, సరిహద్దు వివాదాలు, ఇండ్ల స్థలాలకు పాస్‌బుక్కులు, కోర్టు కేసులు, అప్పీళ్లు, భూదాన్ భూములు.. ఇలా 17 రకాల సమస్యలపై భూభారతి సదస్సుల్లో రైతులు దరఖాస్తులు సమర్పించారు.)

వాట్సాప్.. ఇక యాడ్స్ అడ్డా!





టెక్నాలజీ దిగ్గజం మెటా.. 'వాట్సాప్ యాడ్స్'పై దృష్టి సారించింది. ప్రపంచంలో అత్యధికంగా ఉపయోగించే కమ్యూనికేషన్ యాప్‌లలో రారాజైన వాట్సాప్‌లో ప్రకటనలను ప్రసారం చేయనున్నట్టు ఈ అమెరికన్ దిగ్గజం ప్రకటించింది. ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్ ప్రకటనల ఆదాయంతో సక్సెస్ చూసిన మెటా.. తాజాగా వాట్సాప్ యాడ్స్‌ను 'తెర'పైకి తెచ్చింది. వాట్సాప్‌ను ప్రపంచవ్యాప్తంగా 200 కోట్ల మంది వినియోగిస్తున్నారు. వీరిలో ఏకంగా 85 కోట్లతో భారత్ అగ్రస్థానంలో ఉంది.

- సాక్షి, స్పెషల్ డెస్క్

ప్రపంచవ్యాప్తంగా సామాజికంగా, ఆర్థికంగా, రాజకీయంగా జనంతో వాట్సాప్ మమేకమైపోయింది. మెసేజ్, ఫొటో, వీడియో.. ఇలా ఏది పంపాలన్నా వాట్సాప్ మాత్రమే వాడేంతగా మనం అలవాటు పడిపోయాం. అందుకేనేమో.. చాలా సంవత్సరాలుగా ప్రకటనలు లేకుండానే కొనసాగించిన మెటా కంపెనీ ఎట్టకేలకు వాట్సాప్ అప్‌డేట్స్ ట్యాబ్‌లో ప్రకటనలు ప్రసారం చేయాలని నిర్ణయించింది. యూజర్లు, వారి కాంటాక్ట్స్ పోస్ట్ చేసిన ఫొటోలు, వీడియోలు, టెక్స్ట్ సందేశాలతోపాటు స్టేటస్ ఫీచర్‌లో వాట్సాప్ స్పాన్సర్ చేసే ప్రకటనలూ ప్రత్యక్షం అవుతాయి. బ్రాండ్స్ తమ చానెళ్లను ప్రచారంలోకి తేవడానికి కావాల్సిన రుసుము చెల్లించే సౌకర్యాన్ని వాట్సాప్ పరిచయం చేయనుంది. తద్వారా ఫాలోవర్లకు టెక్స్ట్, వీడియోల రూపంలో కంటెంట్‌ను పంచుకోవచ్చు. కంటెంట్‌ను ఆస్వాదించేందుకు తమకు నచ్చిన చానెళ్లకు నెలవారీ చందా చెల్లించేందుకు సైతం ఫాలోవర్లకు అవకాశం ఉంటుంది.

కళ్లుచెదిరే వ్యాపారం..: వాట్సాప్ నెలవారీ యాక్టివ్ వినియోగదార్ల సంఖ్య 200 కోట్ల పైచిలుకే. 85.4 కోట్ల యూజర్లతో భారత్ ప్రపంచంలో తొలి స్థానంతో దూసుకుపోతోంది. తరవాతి స్థానాల్లో బ్రెజిల్ (14.8 కోట్లు), ఇండోనేషియా (11.2 కోట్లు), యూఎస్ (9.8 కోట్లు), ఫిలిప్పీన్స్ (8.8 కోట్లు) ఉన్నాయి. ప్రస్తుతం వాట్సాప్ 60 భాషల్లో 180 దేశాల్లో కార్యకలాపాలు సాగిస్తోంది. వాట్సాప్ 'అప్‌డేట్స్' ట్యాబ్‌ను రోజుకు 150 కోట్ల మంది వీక్షిస్తున్నారు. ఈ అంశమే వాట్సాప్ మాతృ సంస్థ మెటాకు కలిసి రానుంది. ఇప్పటికే ఎఫ్‌బీ, ఇన్‌స్టాగ్రామ్ వేదికగా కళ్లు చెదిరే వ్యాపారం చేస్తోంది మెటా. ఈ జాబితాలో ఇప్పుడు వాట్సాప్ చేరుతోంది.

అంచనాలకు అందనంత....: ఈ టెక్ దిగ్గజాల ప్రకటనల ఆదాయం అంచనాలకు అందనంత ఉంది. గూగుల్ 2024లో రూ.22,75,560 కోట్ల ఆదాయం పొందింది. 2025 జనవరి–మార్చిలో మెటా ప్రకటనల ఆదాయం రూ.3,55,180 కోట్లు. అంత క్రితం ఏడాది ఇదే కాలంతో పోలిస్తే ఇది 16.14 శాతం అధికం. ప్రతి రోజు మెటా యాప్స్‌ను ప్రపంచవ్యాప్తంగా 343 కోట్ల మంది వాడుతున్నారు. ఏడాదిలో ఈ సంఖ్య 6 శాతం పెరిగింది. ఇక భారత్‌లో ఈ రెండు దిగ్గజాలు 2023–24లో ప్రకటనల రూపంలో సుమారు రూ.50,000 కోట్లు అందుకున్నాయంటే ఆశ్చర్యం వేయక మానదు.



ఈ రంగాల్లో ప్రయోజనం..: డైరెక్ట్ టు కంజ్యూమర్ (డీ2సీ), ఫాస్ట్ మూవింగ్ కంజ్యూమర్ గూడ్స్ (ఎఫ్ఎంసీజీ), బ్యాంకింగ్, ఫైనాన్షియల్ సర్వీసెస్, బీమా, ఎడ్యుకేషన్ టెక్నాలజీ (ఎడ్‌టెక్), ఆరోగ్య సంరక్షణ, క్విక్ కామర్స్ వంటి రంగాలలోని బ్రాండ్స్ వాట్సాప్ స్టేటస్ ప్రకటనల నుండి ప్రయోజనం పొందుతాయని పరిశ్రమ నిపుణులు భావిస్తున్నారు. ఇన్‌స్టాగ్రామ్ స్టోరీస్, రీల్స్, ఫేస్‌బుక్ షార్ట్ వీడియోలతో పోలిస్తే వాట్సాప్ స్టేటస్‌లోని ప్రకటనలు బ్రాండ్స్ చేసే పెట్టుబడిపై తక్షణ రాబడిని ఇవ్వకపోవచ్చని కూడా చెబుతున్నారు.

సమ్మతితో ప్రకటనలు

ప్రస్తుతానికి ప్రకటనలు కేవలం అప్‌డేట్స్ ట్యాబ్‌లో మాత్రమే కనిపిస్తాయి. వ్యక్తిగత చాట్స్ ఎప్పటిలానే యాడ్స్ ఫ్రీగానే కొనసాగుతాయని వాట్సాప్ వెల్లడించింది. అలాగే ప్రకటనకర్తలకు వ్యక్తుల ఫోన్ నంబర్లు షేర్ చేయడం లేదా అమ్మడం చేయబోమని కూడా పేర్కొంది. వాట్సాప్ అనేది స్నేహితులు, కుటుంబ సభ్యులతో చాట్ చేయడానికి ఉపయోగించే ప్రైవేట్ డిజిటల్ స్థలం. ఇక్కడ ప్రకటనలు ఇచ్చేటప్పుడు బ్రాండ్స్ జాగ్రత్తగా వ్యవహరించాలని నిపుణులు హెచ్చరిస్తున్నారు. వాట్సాప్ పట్ల యూజర్లలో నమ్మకం ఉంది. యూజర్లు కుటుంబంతో, సన్నిహితులతో మాట్లాడతారు. సున్నిత లావాదేవీలను నిర్వహిస్తారు. ప్రకటనలు ఆ పవిత్రతకు భంగం కలిగిస్తే మెటాకు ఎదురుదెబ్బ తగిలే అవకాశం లేకపోలేదు. వినియోగదారుల సమ్మతితో ప్రకటనలు ఇవ్వాలి. యూజర్ల ప్రైవసీకి భంగం కలగకూడదు.

అన్నింటా భారతీయులే

గూగుల్‌లో ఏదైనా వెతుకుతున్నప్పుడో.. ఎఫ్‌బీ, యూట్యూబ్, ఇన్‌స్టాగ్రామ్‌లో విహరిస్తున్నప్పుడో ప్రకటనలు వెల్లువెత్తుతుంటాయి. నిముషాల వ్యవధిలోనే కొత్త కొత్త యాడ్స్ ప్రత్యక్షమవుతుంటాయి. ఇందుకు కారణం.. మనతోపాటు ప్రపంచవ్యాప్తంగా ఈ యాప్స్‌ను కోట్లాది మంది వాడుతుండడమే. ఈ స్థాయిలో యూజర్లు ఉన్నారు కాబట్టే బ్రాండ్ల ప్రచారానికి ఈ యాప్స్ అడ్డాగా మారాయి. వీటికి ఉన్న యూజర్ల సంఖ్య చూస్తే నోరెళ్లబెట్టాల్సిందే. ఎఫ్‌బీ, యూట్యూబ్, ఇన్‌స్టాగ్రామ్ వాడకంలో మన భారతీయులే ముందంజలో ఉన్నారు.

గూగుల్: రోజుకు సగటున 850 కోట్ల వరకు సెర్చెస్ నమోదవుతున్నాయి. 100 కోట్ల మంది రోజువారీ యాక్టివ్ యూజర్లున్నారు. భారత్ నుంచి నెలకు 1,200 కోట్ల విజిట్స్ నమోదవుతున్నట్టు సమాచారం. యూఎస్ తర్వాత రెండో స్థానంలో భారత్ నిలిచింది.

ఫేస్‌బుక్: ప్రపంచవ్యాప్తంగా 300 కోట్లకు పైచిలుకు నెలవారీ యాక్టివ్ వినియోగదారులు ఉన్నారు. ప్రపంచంలో అత్యధికంగా వాడుతున్న సామాజిక మాధ్యమం ఇదే. ప్రపంచ జనాభాలో దాదాపు 37 శాతం మంది ఫేస్‌బుక్ వాడుతున్నారు. రోజు ఎఫ్‌బీ తెరుస్తున్నవారు 211 కోట్ల మంది. యూజర్లలో ఎక్కువ మంది 25-34 ఏళ్ల వయస్కులు. ఇక పురుషుల సంఖ్య 56.7 శాతం, స్త్రీలు 43.3 శాతం. 37 కోట్ల యూజర్లతో భారత్ అగ్రస్థానంలో నిలిచింది. యూఎస్ 19.3 కోట్లు, ఇండోనేషియా 11.7 కోట్లు, బ్రెజిల్ 11 కోట్లు, మెక్సికో 9 కోట్లు, ఫిలిప్పీన్స్ 8.7 కోట్లు, వియత్నాం 7.4 కోట్లు, బంగ్లాదేశ్ 5.5 కోట్లతో తర్వాతి వరుసలో ఉన్నాయి.

యూట్యూబ్: యాక్టివ్ యూజర్లు నెలకు 253 కోట్లకు పైమాటే. 46.7 కోట్ల మంది యూజర్లతో మన దేశం అగ్రస్థానాన్ని ఆక్రమించింది. యూఎస్‌లో 23.8 కోట్లు, బ్రెజిల్‌లో 14.4 కోట్ల మంది వాడుతున్నారు. 80 భాషల్లో 100కుపైగా దేశాల్లో అందుబాటులో ఉంది. వినియోగదార్లలో పురుషులు 54 శాతం, స్త్రీలు 46 శాతం ఉన్నారు.

ఇన్‌స్టాగ్రామ్: 200 కోట్లకుపైగా నెలవారీ యాక్టివ్ యూజర్లు ఉన్నారు. 41.4 కోట్లతో భారత్ మొదటి స్థానంలో ఉంది. యూఎస్ 17 కోట్లు, బ్రెజిల్ 14 కోట్లతో ఆ తర్వాతి స్థానాల్లో పోటీ పడుతున్నాయి. యూజర్లలో అత్యధికులు 25-34 ఏళ్ల వయసు వారే.

ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్‌తో మెటా సక్సెస్
ఇప్పుడు 'తెర' మీదకు వాట్సాప్ యాడ్స్
అత్యధిక యూజర్లు ఉన్నది భారత్‌లోనే
ప్రకటనలతో అంచనాలను మించి ఆదాయం

క్లుప్తంగా...

కేసీఆర్, కేటీఆర్ ప్రమేయంతోనే ఫోన్ ట్యాపింగ్

టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్



నిజామాబాద్ అర్బన్: నాటి ముఖ్యమంత్రి కేసీఆర్, కేటీఆర్ ప్రమేయంతోనే ఫోన్ ట్యాపింగ్ జరిగిందని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ పేర్కొన్నారు. ఈ వ్యవహారంలో ఎంతమంది ఉన్నా జైలుకు పంపడం ఖాయమని చెప్పారు. ఆదివారం నిజామాబాద్ జిల్లా కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. సినీతారలు, బడా నాయకులు, ఇతర ప్రముఖులు సుమారు 650 మంది ఫోన్లు ట్యాపింగ్‌కు గురైనట్టు తెలిసిందని, వారి పేర్లు బహిర్గతం చేయాలన్నారు. ఫోన్ ట్యాపింగ్‌కు గురైన వారు స్వచ్ఛందంగా విచారణకు హాజరు కావాలన్నారు. కేంద్రమంత్రి హోదాలో ఉన్న బండి సంజయ్ చట్టాలపై నమ్మకం లేదని చెప్పడం సరైంది కాదని మహేశ్‌గౌడ్ పేర్కొన్నారు. ఆయనకు సిట్ విచారణపై నమ్మకం లేకుంటే రాజీనామా చేయాలని చెప్పారు. బనకచర్ల విషయంలో రాష్ట్ర ప్రభుత్వం ఏమాత్రం వెనక్కి తగ్గదని స్పష్టం చేశారు. రాష్ట్ర ప్రజల ప్రయోజనాల కోసం పోరాటం చేస్తామన్నారు. సమావేశంలో ప్రభుత్వ సలహాదారు షబ్బీర్‌అలీ పాల్గొన్నారు.

ఆయనేమైనా సిట్ అధికారా?


ఫోన్ ట్యాపింగ్‌పై పీసీసీ చీఫ్ ఎలా మాట్లాడతారు : ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి



నిజామాబాద్ అర్బన్: ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంపై విచారణ కొనసాగుతుండగా, దానిపై టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ ఎలా మాట్లాడుతున్నారని, ఆయనేమైనా సిట్ విచారణ అధికారా అని బాల్కొండ ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి ప్రశ్నించారు. ఆదివారం నిజామాబాద్‌లోని బీఆర్ఎస్ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. ఎలాగైనా కేసీఆర్, కేటీఆర్‌లను జైలుకు పంపే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. సీఎం రేవంత్‌రెడ్డి బీజేపీతో కుమ్మక్కయ్యారని, అందుకే బీజేపీ ఎంపీలున్న చోట రాష్ట్ర మంత్రులు లేకుండా చూసుకున్నారని విమర్శించారు. నిజామాబాద్‌తోపాటు రంగారెడ్డి, హైదరాబాద్, ఆదిలాబాద్ జిల్లాల్లో బీజేపీ ఎంపీలు ఉండటం వల్ల ఆయా చోట్ల మంత్రి పదవులు ఇవ్వలేదన్నారు. సమావేశంలో జెడ్పీ మాజీ చైర్మన్ దాదన్నగారి విఠల్‌రావు, నుడా చైర్మన్ ప్రభాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఉద్యమాలతోనే బీసీ రిజర్వేషన్లు: కవిత

జూలై 17న రైల్‌రోకో



సాక్షి, హైదరాబాద్: బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు దక్కాలంటే ప్రజా ఉద్యమాలవల్లే సాధ్యమవుతుందని ఎమ్మెల్సీ కె.కవిత అభిప్రాయపడ్డారు. రాష్ట్రంలో 42 శాతం రిజర్వేషన్ల అమలుకు కాంగ్రెస్ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేస్తే సరిపోయేదని.. కానీ అసెంబ్లీలో బిల్లు పాస్ చేసాం.. కేంద్రం ఆమోదించాలని చెబుతోందని గుర్తుచేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఒత్తిడి కోసం ప్రజా ఉద్యమాలకు మద్దతు ఇవ్వాలని రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్యను కోరారు. ఈ మేరకు ఆదివారం ఆమె ఎంపీ ఆర్.కృష్ణయ్య ఇంటికి వెళ్లి మద్దతు ఇవ్వాలని కోరారు. అనంతరం ఆమె మాట్లాడుతూ బీసీ రిజర్వేషన్ల పెంపు ఉద్యమంలో భాగంగా.. జూలై 17న రైల్ రోకో నిర్వహించనున్నట్లు చెప్పారు. రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ కవిత చేస్తున్న బీసీ ఉద్యమానికి సంపూర్ణ మద్దతు తెలియజేస్తున్నట్లు ప్రకటించారు. తెలంగాణ జాగృతి, యునైటెడ్ పూలే ఫ్రంట్ జూలై 17న తలపెట్టిన రైల్‌రోకో సహా ప్రతీ కార్యక్రమంలో పాల్గొంటామన్నారు.

బనకచర్ల ప్రాజెక్టే ప్రధాన ఎజెండా

- చర్చలకు ఏపీని ఆహ్వానించడంపై నేడు నిర్ణయం
- సమావేశం కానున్న రాష్ట్ర మంత్రివర్గం
- రైతునేస్తం, భూభారతి దరఖాస్తులపైనా చర్చ



సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర మంత్రివర్గ సమావేశం సోమవారం మధ్యాహ్నం 3 గంటలకు సీఎం రేవంత్‌రెడ్డి అధ్యక్షతన సచివాలయంలో జరగనుంది. విధానపరమైన అంశాలపై ఎప్పటికప్పుడు నిర్ణయాలు తీసుకోవడానికి ప్రతి నెలా రెండు పర్యాయాలు మంత్రివర్గ సమావేశం నిర్వహించాలని ఈ నెల 5న జరిగిన కేబినెట్ భేటీలో రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ నేపథ్యంలో ఈ నెలలో రెండోసారి మంత్రివర్గ సమావేశాన్ని ప్రభుత్వం నిర్వహించనుంది. ఏపీ చేపడుతున్న గోదావరి–బనకచర్ల అనుసంధానం ప్రాజెక్టును ఎజెండాలో ప్రధాన అంశంగా చేర్చింది. గోదావరి ట్రిబ్యునల్ తీర్పుతో పాటు ఏపీ పునర్విభజన చట్టానికి విరుద్ధంగా ఏపీ ప్రతిపాదించిన ఈ ప్రాజెక్టును రాష్ట్ర ప్రభుత్వం తీవ్రంగా వ్యతిరేకిస్తున్న విషయం తెలిసిందే. రాష్ట్రానికి చెందిన అఖిల పక్ష పార్టీల ఎంపీలతో ఇటీవల సమావేశం నిర్వహించిన ప్రభుత్వం.. ఈ ప్రాజెక్టును అడ్డుకునేందుకు అనుసరించాల్సిన వ్యూహంపై అభిప్రాయాలు, సూచనలను స్వీకరించింది. అనంతరం సీఎం రేవంత్, నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి ఢిల్లీ వెళ్లి కేంద్ర జలశక్తి శాఖ మంత్రి సీఆర్ పాటిల్‌ను కలిసి ఈ ప్రాజెక్టుకు ఎలాంటి అనుమతులు జారీ చేయరాదని మరోసారి విజ్ఞప్తి చేశారు. నికర జలాల ఆధారంగా గోదావరిపై తెలంగాణలో చేపట్టిన ప్రాజెక్టులకు అన్ని రకాల అనుమతులు లభించడంతో పాటు వాటి నిర్మాణం పూర్తైన తర్వాతే గోదావరి–బనకచర్ల ప్రాజెక్టు విషయంలో ఏపీ ముందుకు వెళ్లాల్సి ఉంటుందని ఇప్పటికే సీఎం స్పష్టం చేశారు. ఈ నేపథ్యంలో ఈ అంశంపై నేరుగా ఏపీ ప్రభుత్వానికే తమ అభ్యంతరాలను తెలియజేయాలని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోంది. ప్రాజెక్టుపై చర్చకు హైదరాబాద్‌కు రావాలని ఏపీ సీఎం లేదా మంత్రులను ఆహ్వానించే అంశంపై మంత్రివర్గ సమావేశంలో చర్చించి ప్రభుత్వం నిర్ణయం తీసుకోనుంది.

'విభజన'చర్చల పునరుద్ధరణపై..

రెండు రాష్ట్రాల మధ్య అపరిష్కృతంగా ఉండిపోయిన విభజన వివాదాలపై గతంలో ఓసారి ఏపీ, తెలంగాణ సీఎంలు చంద్రబాబు, రేవంత్‌రెడ్డిలు సమావేశమై చర్చించారు. ఆ సమావేశంలో తీసుకున్న నిర్ణయం మేరకు.. విభజన వివాదాల పరిష్కారానికి రెండు రాష్ట్రాల మంత్రులు, అధికారులతో ఏర్పాటు చేసిన కమిటీ ఆధ్వర్యంలో రెండు రాష్ట్రాల మధ్య చర్చలను పునరుద్ధరించే అంశంపై కూడా మంత్రివర్గం నిర్ణయం తీసుకోనుందని సమాచారం. ఇక ఖరీఫ్‌లో రైతు భరోసా పథకం కింద రైతుల ఖాతాల్లో డబ్బులను రికార్డు సమయంలో ప్రభుత్వం జమ చేసింది. ఒకట్రెండు రోజుల్లో మొత్తం చెల్లింపులు పూర్తికానుండగా, ఈ అంశాన్ని ప్రజల్లో తీసుకెళ్లేందుకు 'రైతు నేస్తం'పేరుతో ప్రత్యేక కార్యక్రమాన్ని చేపట్టాలని ప్రభుత్వం భావిస్తోంది. ఈ నేపథ్యంలో దీనిపై కూడా కేబినెట్ చర్చించనుంది.

కాళేశ్వరం బరాజ్‌ల పునరుద్ధరణపై..

భూభారతి అమలులో భాగంగా నిర్వహించిన రెవెన్యూ సదస్సుల్లో.. వివిధ రకాల భూ సమస్యలపై రైతుల నుంచి 8 లక్షలకు పైగా దరఖాస్తులు అందాయి. వీటి పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలపై సైతం మంత్రివర్గం చర్చించనుంది. కాళేశ్వరం బరాజ్‌ల భవితవ్యంపై ప్రభుత్వం ఇప్పటి వరకు ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. ఈ నేపథ్యంలో ప్రాజెక్టులోని మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బరాజ్‌ల పునరుద్ధరణపై నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ (ఎన్డీఎస్ఏ) నిపుణుల కమిటీ సమర్పించిన తుది నివేదికలోని సిఫారసుల అమలుపై కూడా మంత్రివర్గంలో చర్చించి నిర్ణయం తీసుకోవాల్సి ఉంది. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి, ఉద్యోగుల డిమాండ్ల పరిష్కారం, విద్యా సంవత్సరం ప్రారంభమైన నేపథ్యంలో విద్యాభివృద్ధికి తీసుకుంటున్న చర్యలు తదితర అంశాలపై మంత్రివర్గంలో చర్చించే అవకాశం ఉంది.

పన్నేతర ఆదాయం పెంచాలి

- కేంద్రం నుంచి వీలైనన్ని ఎక్కువ నిధులు సాధించాలి
- అధికారులకు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఆదేశం



సాక్షి, హైదరాబాద్: పన్నేతర ఆదాయం పెంచడంపై దృష్టి సారించాలని డిప్యూటీ సీఎం, మౌలిక వసతుల కల్పనపై ఏర్పాటు చేసిన మంత్రివర్గ ఉప సంఘం చైర్మన్ భట్టి విక్రమార్క సంబంధిత అధికారులను ఆదేశించారు. పన్నేతర ఆదాయాన్ని పెంచుకోవటంతో పాటు కేంద్ర ప్రభుత్వం నుంచి రాష్ట్రానికి వీలైనన్ని ఎక్కువగా నిధులను సాధించుకోవటంపై కూడా దృష్టి పెట్టాలని సూచించారు. ఆదివారం సచివాలయంలో ఉప సంఘం సభ్యులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, కోమటిరెడ్డి వెంకటరెడ్డితో కలిసి ఆయన ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. గత ప్రభుత్వం ప్రారంభించిన పథకాలను ఆపకుండా కొత్తగా రూ.33,600 కోట్లతో సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నట్లు భట్టి చెప్పారు. అధికారంలోకి వచ్చిన 2023–24 ఆర్థిక సంవత్సరంలో ప్రభుత్వానికి ఔటర్ రింగ్ రోడ్, ఎక్సైజ్ ఆదాయాలు రాకుండా పోయాయని, అయినా రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ కానుక, మహాలక్ష్మి, ఉచిత కరెంట్, ఇందిరమ్మ ఇళ్లు, రైతు రుణమాఫీ సహా పలు కొత్త పథకాలను అమల్లోకి తీసుకొచ్చామని చెప్పారు.

అవసరాలకు సరిపడా నిధులు అందాలి

బడ్జెట్ నిధులు కొన్ని శాఖలకు అధికంగా, కొన్ని శాఖలకు తక్కువగా అందుతున్నాయని, బడ్జెట్ నిధులు అన్ని శాఖలకు వాటి అవసరాలకు సరిపడా అందాల్సి ఉందని భట్టి చెప్పారు. డిపార్ట్‌మెంట్ల మధ్య ఖర్చు అంతరాలను తగ్గించి అన్నింటినీ ఒకే స్థాయిలోకి తీసుకురావాలని ఆదేశించారు. ఆయా శాఖల అవసరాలను హేతుబద్ధీకరించి, ప్రాధాన్యాన్ని అనుసరించి ఖర్చు పెట్టాలని, ఆయా శాఖల ప్రాధాన్యాన్ని అనుసరించి ప్రణాళికలు రూపొందించుకోవాలని సూచించారు. ఖజానాకు అధిక ఆదాయాన్ని ఆర్జించే శాఖలపై అధికారులు ప్రత్యేకంగా దృష్టి సారించాలని చెప్పారు. ప్రజల అవసరాలతో ముడిపడిన విభాగాలు, వాటి అవసరాలు, ప్రజా ప్రభుత్వం ఆలోచనలు.. వీటన్నింటినీ పరిగణనలోకి తీసుకుని అధికారులు పనిచేయాలని దిశానిర్దేశం చేశారు. అన్ని నియోజకవర్గాల్లో పెండింగ్‌లో ఉన్న ప్రధాన ప్రాజెక్టులను వాటి ప్రాధాన్యాన్ని అనుసరించి వీలైనంత త్వరలో పూర్తి చేయాలని సూచించారు. సమావేశంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా సహా పలు శాఖల విభాగాధిపతులు పాల్గొన్నారు.

కొండా దంపతులతో ఇమడలేం!

- తాడో పేడో వెంటనే తేల్చేయండి..
- మీనాక్షి నటరాజన్‌కు వరంగల్ కాంగ్రెస్ ఎమ్మెల్యేల ఫిర్యాదు
- కమిటీ ఏర్పాటు చేస్తామని రాష్ట్ర ఇన్‌చార్జి హామీ
- క్రమశిక్షణ కమిటీ చైర్మన్ మల్లు రవికి కూడా ఫిర్యాదు
- 24న క్రమశిక్షణ కమిటీ భేటీ కావాలని మీనాక్షి సూచన



సాక్షి, హైదరాబాద్: వరంగల్ జిల్లా కాంగ్రెస్‌లో భగ్గుమన్న వర్గ రాజకీయాలు హైదరాబాద్‌ను తాకాయి. జిల్లాకు చెందిన మంత్రి కొండా సురేఖపై ఆ జిల్లా కాంగ్రెస్ ఎమ్మెల్యేలు రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్‌కు ఫిర్యాదు చేశారు. ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్‌రెడ్డి, కడియం శ్రీహరి, రేవూరి ప్రకాశ్‌రెడ్డి, గండ్ర సత్యనారాయణ, కె.ఆర్.నాగరాజులతో పాటు మాజీ ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, పార్టీ సీనియర్ నేత ఎర్రబెల్లి స్వర్ణ తదితరులు ఆదివారం హైదరాబాద్‌లోని న్యూ ఎమ్మెల్యే క్వార్టర్స్‌లో మీనాక్షిని కలిశారు. మంత్రి సురేఖ, ఆమె భర్త కొండా మురళితో తాము ఇమడలేకపోతున్నామని వాపోయారు. వారి వైఖరితో ఇబ్బందులు పడుతున్నామని, వారితో తమకు తాడోపేడో తేల్చాలని మీనాక్షిని కోరినట్టు తెలిసింది. వారి వాదనలను విన్న మీనాక్షి.. మంత్రి సురేఖ వ్యవహారంపై కమిటీ ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చినట్టు సమాచారం. అసలు జిల్లాలో ఏం జరుగుతుందన్న దానిపై కమిటీ నివేదిక వచ్చిన తర్వాత ఏం చేయాలన్న దానిపై నిర్ణయం తీసుకుంటామని చెప్పినట్టు తెలిసింది. ఉమ్మడి వరంగల్ జిల్లా నేతలు టీపీసీసీ క్రమశిక్షణ కమిటీ చైర్మన్, ఎంపీ మల్లు రవిని కూడా కలిశారు. ఈ భేటీలో కూడా మంత్రి సురేఖ దంపతులపై క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని కోరినట్టు సమాచారం.

24న క్రమశిక్షణ కమిటీ భేటీ

పీసీసీ క్రమశిక్షణ కమిటీ సమావేశం ఈ నెల 24న నిర్వహించాలని మీనాక్షి నటరాజన్ సూచించారు. ఆదివారం ఎమ్మెల్యే క్వార్టర్స్‌లో మల్లురవి ఆమెను కలిసి కమిటీ పరిధిలో ఉన్న అంశాలపై చర్చించారు. 24న క్రమశిక్షణ కమిటీ సమావేశం నిర్వహించి పెండింగ్‌లో ఉన్న ఫిర్యాదులపై పార్టీ నిబంధనావళి ప్రకారం నిర్ణయాలు తీసుకోవాలని ఆమె సూచించారు. నిజామాబాద్ పర్యటనలో ఉన్న పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ కూడా ఆదివారం సాయంత్రం మీనాక్షిని కలిశారు. ఈ భేటీలో కూడా మంత్రి సురేఖ వచ్చిన ఫిర్యాదుపైనే చర్చించినట్లు గాంధీభవన్ వర్గాల ద్వారా తెలిసింది.

నేడు, రేపు కాంగ్రెస్ వరుస భేటీలు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ వరుస సమావేశాలు నిర్వహిస్తోంది. సోమవారం పీసీసీ డీలిమిటేషన్ కమిటీ సమావేశం జరగనుంది. ఆ తర్వాత జైబాపు, జై భీమ్ కార్యక్రమ సమన్వయకర్తల సమావేశం, అనంతరం పీసీసీ సంవిధాన్ బచావో కమిటీ సమావేశం, ఆ తర్వాత అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా పీసీసీ పరిశీలకుల సమావేశాలు జరగనున్నాయి. ఈ సమావేశాలకు రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్‌తో పాటు పీసీసీ అధ్యక్షుడు బి.మహేశ్‌కుమార్‌గౌడ్ హాజరు కానున్నారు. మంగళవారం కూడా కీలకమైన సమావేశాలు జరగనున్నాయి. కొత్తగా పునర్వ్యవస్థీకరించిన పీసీసీ రాజకీయ వ్యవహారాల కమిటీ (పీఏసీ)తోపాటు పీసీసీ సలహా కమిటీ సమావేశాలు జరగనున్నాయి. అనంతరం నూతనంగా నియమితులైన టీపీసీసీ ఉపాధ్యక్షులు, ప్రధాన కార్యదర్శుల భేటీ జరగనుంది. ఈ సమావేశాలకు మీనాక్షి, మహేశ్‌గౌడ్‌లతో పాటు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, ఇతర మంత్రులు హాజరుకానున్నారు.

రాజీవ్‌గాంధీ పంచాయతీ సంఘటన్ భేటీ

స్థానిక ఎన్నికలకు సిద్ధం కావాలని మీనాక్షి పిలుపు

సాక్షి, హైదరాబాద్: రాజీవ్‌గాంధీ పంచాయతీ సంఘటన్ రాష్ట్ర సమావేశం ఆదివారం గాంధీభవన్‌లో జరిగింది. సంఘటన్ చైర్మన్ రాచమళ్ల సిద్దేశ్వర్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి.. రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్, సంఘటన్ జాతీయ అధ్యక్షుడు సునీల్‌పన్వర్, జిల్లా అధ్యక్షులు, రాష్ట్ర నాయకులు హాజరయ్యారు. సమావేశంలో భాగంగా మీనాక్షి మాట్లాడుతూ.. స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధం కావాలని సంఘటన్ నేతలకు పిలుపునిచ్చారు. త్వరలో జరగబోయే స్థానిక ఎన్నికల్లో పంచాయతీ సంఘటన్‌ది కీలకపాత్ర అని, ఈ మేరకు నేతలు బాధ్యత తీసుకుని పనిచేయాలని సూచించారు. సునీల్ పన్వర్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో పంచాయతీ సంఘటన్‌ను త్వరలోనే పునర్వ్యవస్థీకరిస్తామని చెప్పారు.

విధ్వంసం నుంచి వికాసం వైపు..

- ఏడాదిన్నర కాంగ్రెస్ పాలనపై టీపీసీసీ చీఫ్ మహేశ్‌గౌడ్ పుస్తకం
- రేపు సీఎం రేవంత్, మీనాక్షి సమక్షంలో ఆవిష్కరణ

సాక్షి, హైదరాబాద్: గత బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో జరిగిన విధ్వంసాన్ని, కాంగ్రెస్ ఏడాదిన్నర పాలనలో జరిగిన అభివృద్ధిని విశ్లేషిస్తూ టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్ ఓ పుస్తకాన్ని రూపొందించారు. 'విధ్వంసం నుంచి వికాసం వైపు'పేరుతో రూపొందించిన ఈ పుస్తకంలో బీఆర్ఎస్, కాంగ్రెస్ పాలనల మధ్య తేడాను విశ్లేషిస్తూ మహేశ్‌కుమార్‌గౌడ్ పలు పత్రికల్లో రాసిన వ్యాసాలను సంకలనం చేశారు. దాదాపు 260 పేజీలతో కూడిన ఈ పుస్తకంలో 36 వ్యాసాలున్నాయని, ఈ పుస్తకాన్ని రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్, సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి, పార్టీ సీనియర్ నేతలు, మంత్రుల సమక్షంలో మంగళవారం గాంధీభవన్‌లో ఆవిష్కరిస్తారని పీసీసీ వర్గాలు వెల్లడించాయి.

మోదీ నేతృత్వంలో నీతివంతమైన పాలన

- కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి



కార్యక్రమంలో కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి, ఎంపీ ఈటల అభివాదం

రసూల్‌పురా(హైదరాబాద్): ప్రధాని మోదీ నేతృత్వంలో నీతివంతమైన అందుతోందని కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. కంటోన్మెంట్ ఇంపీరియల్ గార్డెన్‌లో మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ ఆధ్వర్యంలో నిర్వహించిన వికసిత భారత్ సంకల్ప సభ కార్యక్రమానికి కిషన్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధాని మోదీ నేతృత్వంలో గ్రామీణ ప్రాంతంలో స్వచ్ఛభారత్ టాయిలెట్ నుంచి చంద్రమండలంలో త్రివర్ణ పతాకం ఎగురవేసే వరకు ప్రతి రంగంలో అద్భుత ప్రగతి సాధించామని చెప్పారు. తెలంగాణలో రూ.1.50 వేల కోట్లతో జాతీయ రహదారుల నిర్మాణం జరుగుతోందని, 40 రైల్వేస్టేషన్లను ఏకకాలంలో ఆధునీకరించబడుతున్నాయన్నారు. ఎన్నో పోరాటాలు చేసి తెలంగాణ రాష్ట్రాన్ని తెచ్చుకుంటే ఒక కుటుంబ పాలనలో పడి బలి అయ్యామని ధనిక రాష్ట్రం కాస్త రూ.లక్షల కోట్ల అప్పుల పాలైందని చెప్పారు.

కాంగ్రెస్ స్కాములమయం : ఈటల

దేశంలో గత కాంగ్రెస్ పాలన స్కాములమయమని, ఆ పార్టీ మంత్రులు జైలు కెళ్లిన చరిత్ర ఉందని మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. తెలంగాణలో రేవంత్‌రెడ్డి రాష్ట్ర ప్రజల ఆత్మగౌరవాన్ని ఖతం పట్టించారని చెప్పారు. మోదీ నేతృత్వంలో భారత్ విశ్వగురు స్థానానికి ఎదిగిందని, డిజిటల్ ట్రాంజక్షన్‌లో అమెరికా కంటే మనమే నంబర్‌వన్ అని అన్నారు. మల్కాజిగిరి ఎంపీ అయినందుకు తాను గర్వపడుతున్నానని తెలిపారు. ఈ కార్యక్రమంలో జాతీయ నాయకులు సునీల్ భన్సల్, చంద్రశేఖర్, ఎంపీ డీకే.అరుణ, ఎంవీఎస్ ప్రభాకర్, భానుక నర్మద, సాద కేశవ రెడ్డి, విక్రమ్‌రెడ్డి పాల్గొన్నారు.

కాళేశ్వరంపై మాది మోదీ 'స్టాండ్'

- బీఆర్ఎస్‌కు రేవంత్ రెడ్డి సర్కారే రక్షణ కవచం: బండి



సాక్షి ప్రతినిధి, కరీంనగర్: 'కాళేశ్వరం ప్రాజెక్టు విషయంలో మా పార్టీది మోదీ స్టాండ్, ఆ ప్రాజెక్టు కేసీఆర్ కుటుంబానికి ఏటీఎంలా మారిందని ప్రధాని మోదీ ఊరికే అనరు కదా..? రేవంత్ సర్కారు, కేసీఆర్ కుటుంబానికి రక్షణ కవచంగా మారింది. గతంలో రాహుల్ గాంధీ కూడా సీబీఐ విచారణ కోరినా, రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి లేఖ రాయడం లేదు. దీంతో విసిగిపోయిన ప్రజలు.. బీజేపీకి కూడా ఒకసారి అధికారం ఇద్దామని భావిస్తున్నారు'అని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ అన్నారు. ఆదివారం ఆయన కరీంనగర్‌లో విలేకరులతో మాట్లాడుతూ, సీడబ్ల్యూసీ అంచనాల ప్రకారం.. తుమ్మిడిహెట్టి వద్ద 167 టీఎంసీల నీటి లభ్యత ఉన్నా కేసీఆర్ ఇష్టానుసారంగా ప్రాజెక్టు స్థలాన్ని మార్చారని, రూ.38 వేల కోట్లతో పూర్తయ్యే ప్రాజెక్టును రూ.1.20 లక్షల కోట్లకు పెంచారని, కాళేశ్వరం ప్రాజెక్టుతో ప్రజలకు ఒరిగిందేమీలేదని పేర్కొన్నారు. ఆ ప్రాజెక్టు నిర్మాణంలో పనిచేసిన ఇంజనీర్లే రూ.వందల కోట్లు సంపాదిస్తే.. ఇక కేసీఆర్ కుటుంబం ఏ స్థాయిలో సంపాదించిందో అర్థం చేసుకోవచ్చన్నారు. రాష్ట్ర ప్రభుత్వంతో పనిలేకుండా.. కేంద్రమే నేరుగా సీబీఐతో విచారణ చేయించే అవకాశముంటే కాళేశ్వరం, ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో ఈపాటికే వాళ్లను జైల్లో వేసేవాళ్లమన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై ఈటల రాజేందర్ చేసిన వ్యాఖ్యలు ఆయన వ్యక్తిగతమని, తమ పార్టీ విధానం మారదని ఆయన స్పష్టం చేశారు.

పాలకుల వైఫల్యంతోనే మననీళ్లు ఇతరులకు..

- కేసీఆర్ మూడున్నరేళ్లలో కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మించారు
- రౌండ్ టేబుల్ సమావేశంలో మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి



సుందరయ్య విజ్ఞాన కేంద్రం: రాష్ట్రంలో ప్రస్తుత పాలకులు ముందుచూపు లేకుండా వ్యవహరించడంతో మనకు దక్కాల్సిన నీటి వాటాలు ఇతర రాష్ట్రాలకు తరలిపోతున్నాయని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి విమర్శించారు. ఆదివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో తెలంగాణ సోషల్ ఫౌండేషన్ (టీఎస్ఎఫ్) ఆధ్వర్యంలో 'తెలంగాణ జలవనరులు–వ్యవసాయం, నాడు, నేడు, రేపు' అనే అంశంపై రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ఈ కార్యక్రమంలో నిరంజన్‌రెడ్డి మాట్లాడుతూ.. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో నాగార్జున సాగర్, శ్రీశైలం, జూరాల వంటి ప్రాజెక్టులు కట్టడానికి 30 ఏండ్లకు పైగా సాగదీశారని, కేసీఆర్ మూడున్నర ఏండ్లలో కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మించి కోటి ఎకరాలకు నీళ్లు అందించారని తెలిపారు. పాలమూరు- రంగారెడ్డి ప్రాజెక్టు నిర్మాణం తాము 90 శాతం పూర్తిచేస్తే.. ప్రస్తుత పాలకులు మిగిలిన 10 శాతం పనులు కూడా చేయలేకపోతున్నారని ఎద్దేవా చేశారు.

బనకచర్లపై విస్తృత చర్చ జరగాలి: జాన్ వెస్లీ



వరద జలాలపై ఆధారపడి బనకచర్ల ప్రాజెక్టు నిర్మిస్తామంటున్న ఏపీ ప్రభుత్వం.. గోదావరిలోని నికర జలాలను కూడా ఎత్తుకుపోయే కుట్రలు చేస్తోందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ ఆరోపించారు. దీనిపై రెండు రాష్ట్రాల సీఎంలు మాట్లాడుకోవటం వల్ల ప్రయోజనం లేదని, అన్ని రంగాల నిపుణులతో విస్తృతంగా చర్చించాలని సూచించారు. కార్యక్రమంలో సాగునీటిరంగ నిపుణుడు శ్రీధర్‌రావు దేశ్‌పాండే. టీఎస్ఎఫ్ చైర్మన్ ఒంటెద్దు నరసింహారెడ్డి ప్రముఖ పాత్రికేయుడు పరాంకుశం వేణుగోపాలస్వామి, గ్రంథాలయ పరిషత్ మాజీ చైర్మన్ ఆయాచితం శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.



"తన మీద తనకు ఎంత రాగం ఎక్కువుంటే, అంత వేదన ఎక్కువుంటుంది.
– సయాజీ ఊ బా ఖీన్

సాక్షి
సోమవారం, 23 జూన్ 2025

పేరుకు చెడ్డపేరు?

వేసుకుంటే పాత ప్రశ్నే. పేరులో ఏమున్నది? గులాబీకి ఆ పేరు లేకపోయినా అది గులాబీ అయ్యేది కాదా? ఆ పువ్వుకు అంత అందం వచ్చేది కాదా? పేరు వల్ల కూడా అందం ఇనుమడిస్తుంది. పేరులో ఏమున్నది అనుకుంటే అందమైన పేర్ల కోసం ఆధునిక తల్లిదండ్రులు అంతగా ప్రయత్నించరు. ఈ అందం అనేది ఒక్కోసారి సాపేక్షం. అన్ని మతాల్లోనూ, సమాజాల్లోనూ పిల్లలకు పేరు పెట్టడం అనేది అనాదిగా పెద్ద పండుగ. నామకరణం తర్వాతే శిశువు నిజంగా ఈ భూమ్మీద 'ఉనికి'లోకి వచ్చినట్టు!

మనిషికి పేరు అనేది దానికదే ఒక చిరునామా. ఎవరికైనా తన పేరును మించిన అందమైన పిలుపు మరొకటి ఉండదు, అంతకంటే మంచి కవితను ఇంకే కవీ రాయలేడు. పేరు అనేది మనిషిని ఎప్పటికీ వదలని హేంగోవర్. ఆ పేరులోని ప్రత్యేకత కంటే, ఆ పేరును మళ్లీ మళ్లీ వినడం వల్ల అది వారికి ప్రత్యేకమైపోతుంది. శిశువు ఈ భూమ్మీదకు రాగానే కూడగట్టుకోగలిగే తొలి సొంత ఆస్తి కూడా ఈ పేరే. ఇంక దాన్ని పెంచుకోవడం, తగ్గించుకోవడం అన్నది ఒక జీవితకాల ప్రయాణం తర్వాతే తెలుతుంది. ప్రాచీన రోమన్ సామ్రాజ్యంలో శుద్ధీకరణ పేరుతో నామకరణోత్సవం జరిగేది. ఆడశిశువులకు ఎనిమిదో రోజున, మగపిల్లలకు తొమ్మిదో రోజున పేర్లు పెట్టేవారు. ఆడపిల్లలు మగ పిల్లల కంటే త్వరగా ఎదిగి పరిపూర్ణత్వాన్ని పొందుతారనేది ఈ తేడాకు కారణం.

పెట్టిన పేర్లు తికమకగా మారిపోవడం ఒక తమాషా. సుగుణ ఎంతటి గుణవంతురాలో మనకు తెలియదు. కోమలిది ఎలాంటి రూపమో ఊహించలేము. బలవంతరావు బలహీనంగా ఉండకూడదనేం లేదు. పేరుకు తగ్గట్టుగా మనిషి ప్రవర్తనను ఆశించడం కొన్నిసార్లు ఆశాభంగం కావొచ్చు. హరిశ్చంద్రుడు అబద్ధాలకోరు అవ్వకూడదనే కోరుకుంటాం. ధర్మరాజు అవినీతికి పాల్పడితే మరీ ఎక్కువ బాగోదు. పెట్టిన పేరుకు తగ్గట్టుగా ఉండలేక పిల్లలు సతమతమవడం మరో కోణం. కొన్ని పేర్లను కొందరు కుట్రపూరితంగా కూడా వాడుకోవచ్చు. ఉదాహరణకు మోసం. కానీ దాన్ని వాళ్లు ప్రేమ అనొచ్చు, స్నేహం అని పిలవొచ్చు. ఒక యుద్ధానికి ఏం పేరు పెడదామని అమెరికా అధ్యక్షుడు రూజ్‌వెల్ట్ సలహా అడిగితే, 'అనవసర యుద్ధం' అందామని సలహా ఇచ్చారట బ్రిటన్ ప్రధాని చర్చిల్. తగిన పేరు!

జనాలు తాము ఉన్నదాన్ని బట్టి తమ పేర్లను అందమైనవిగానో, వికారమైనవిగానో చేస్తారు అంటారు కెనడా రచయిత ఎల్.ఎమ్.మాంటొగోమెరీ. అది చాలావరకు నిజమే అయినా అన్నిసార్లూ నిజం కాదు. సూర్యకాంతం అంటే మనకు ఇప్పుడు ఒక పేరు కాదు. ఒక గయ్యాళి ముసలి. గిరీశం అంటే నక్కజిత్తులవాడే! భగవంతరావు అని వచ్చిందంటే ఒక స్థాయి మనిషి అనే అర్థం. పరమానందయ్య అనగానే వాలుకుర్చీలో విశ్రాంతిగా కూర్చునే సగటు మధ్యతరగతి మానవుడే. సాహిత్యమో, సినిమానో వేసే ముద్రలవల్ల కూడా పేర్ల స్వభావాలు మారిపోతాయి. కన్యాశుల్కం ఎంత గొప్ప నాటకమైనా లుబ్ధావధాన్లు, సౌజన్యారావు అంటూ పాత్రల పేర్లను వారి స్వభావాలకు తగ్గట్టుగా పెట్టడం కొంతమందికి నాటకీయంగా అనిపించింది. పాత్రకు తగ్గ పేరు పెట్టడం సహజం కాకపోయినా, ఔచిత్యం అనుకున్నారు మన రచయితలు. లేదంటే జనాలే పాత్రల పేర్లను మార్చేయొచ్చు. ఉదాహరణకు మహాభారతంలో 'దుర్యోధనుడి' పేరును సుయోధనుడు అనుకోనివాళ్లే ఎక్కువ. పిల్లల పేర్ల కోసం తల్లిదండ్రులు కొన్నిసార్లే తలలు బద్దలు కొట్టుకుంటారు. కానీ రచయితలు తాము సృష్టించే ప్రతి పాత్ర కోసం ఆ 'పురిటి నొప్పులు' పడాల్సిందే!

'డ్రాకులా' అనగానే దవడల పక్కన తెరుచుకున్న కోరలతో, మెడను కొరికి పచ్చినెత్తురు తాగే భయానక ఆకారం గుర్తొస్తుంది. అన్ని సాహిత్య రూపాల్లో అత్యధికసార్లు (700కు పైన) పునరావృతం అయిన పాత్రగా ఇది గిన్నిస్ రికార్డుల్లోకి ఎక్కింది. గాథిక్ శైలిలో నిర్మితమైన మధ్య యుగాల యూరోపియన్ భవనాలను ఒక వాతావరణం కోసం వాడుకుంటూ రాసిన గాథిక్ హారర్ సాహిత్యంలో 'డ్రాకులా' పేరుతోనే వచ్చిన నవల ఒక క్లాసిక్. సుమారు 125 ఏళ్ల క్రితం, 1897 మే 26న డ్రాకులా విడుదలైంది. అలాంటి గాథిక్ హారర్ సాహిత్యాన్ని డ్రాకులాకు ముందూ, తర్వాతా అని విభజిస్తారు వెండీ డోనిగర్. ఈ పాత్ర సృష్టికర్త లండన్‌లో స్థిరపడిన ఐరిష్ రచయిత బ్రామ్ స్టోకర్ (1847–1912) అనబడే అబ్రహామ్ స్టోకర్. ప్రపంచంలో డిటెక్టివ్ పాత్రలకు మోడల్‌గా నిలిచే షెర్లాక్ హోమ్స్‌ను సృష్టించిన ఆర్థర్ కానన్ డాయిల్ ఈయనకు దూరపు బంధువు కూడా! 'ద ఫేట్ ఆఫ్ ఫెనెల్లా'(1891) పేరుతో 24 మంది రచయితలు రాసిన ఒక గొలుసుకట్టు నవలలో వీళ్లిద్దరూ కూడా భాగమయ్యారు. ఒకసారి లైబ్రరీలో బ్రామ్ స్టోకర్ ఏ పుస్తకాలో తిరగేస్తూవుంటే 'డ్రాకులా' అనే పేరు కంటబడింది. ఆ పేరులో ఆయనకు నిలువెల్లా దుష్టత్వం కనబడటమే కాక, దానికి అలాంటి అర్థమే ఉంటుందనుకున్నాడు. అందుకే ఆ పేరునే తన ప్రతినాయకుడికీ, నవలకూ వాడుకున్నాడు. ఇంతా చేస్తే ఈ డ్రాకులా అనేది ఒక వంశనామం. ఆగ్నేయ యూరప్ దేశమైన రొమేనియా పాలకుడు... వ్లాద్ డ్రాకులా. 15వ శతాబ్దిలో రొమేనియాను పాలించాడు. ఆయన్ని ఆ దేశ జాతీయ హీరోగా ఆరాధిస్తారు. ఈయన డ్రాకులా వంశంలో మూడోవాడు. ఈయన తండ్రి రెండో వ్లాద్ డ్రాకులా. అలాంటి పేరుకు ఈ నవల మచ్చ తెచ్చిందో, ఆ పేరును ఎప్పటికీ నిలిచేలా చేసిందో తీర్పునివ్వడం కష్టం. గులాబీకి గులాబీ అనే తగిన పేరు ఉండటం వల్లే అది పూరాణిగా రాణించిందా, 'డ్రాకులా'కు డ్రాకులా అని పెట్టడం వల్లే అది ఒక పాత్రగా ఇంతగా నాటుకుపోయిందా చెప్పడం కష్టం. అది ఒక మనిషిని తన పేరుకు బదులుగా ఇంకొకటి చెప్పుకొమ్మనడం లాంటిది.

ఇది దుస్సాహసాల యుగం

విశ్లేషణ



ప్రశాంత్ ఝా

ఉక్రెయిన్‌పై రష్యా దురాక్రమణకు దిగింది. కానీ అదంత తేలిక కాలేదు. ఇప్పటికీ తన లక్ష్యం సాధించలేక పోయింది. చైనాపై ఆధారపడటం అనివార్యమైంది. ఇటీవలి ఉక్రెయిన్ డ్రోన్ దాడులు దాన్ని మరీ ఉక్కిరిబిక్కిరి చేశాయి. అయితే రష్యా ఏం ఓడలేదు. పైగా, 2022 ఫిబ్రవరి తర్వాత ఎన్నడూ లేనంత బలీయంగా ఇప్పుడు రూపొందింది. అంతర్జాతీయంగా రష్యాను ఏకాకి చేయాలన్న పథకం నీరుగారి పోయింది. ఈ పథక రచనలో ప్రధాన సూత్రధారి అమెరికా భంగపడింది. ఎలాగోలా రష్యాతో ఒప్పందం చేసుకోవాలని ఈ అగ్రరాజ్యం ఇప్పుడు అంగలారుస్తోంది. యూరోపియన్ యూనియన్ భద్రత మీద, ఉక్రెయిన్ సార్వభౌమికత మీద చేస్తున్న వ్యయం తగ్గించుకోవాలని భావిస్తోంది. యుద్ధం ద్వారా కాకుండా దౌత్యంతోనే ఈ ఊబి నుంచి బయట పడాలనుకుంటోంది.

రష్యా అధ్యక్షుడు పుతిన్ ఇందుకు ససేమిరా అన్నా ఆశ్చర్యపోయేదేం లేదు. మనిషిని అతడి అనుభవాలు రూపుదిద్దుతాయి. 'దుస్సాహసం ఫలిస్తుంది' అన్నది పుతిన్ తన అనుభవాల నుంచి నేర్చుకున్నపాఠం. ఒక దేశం మీద దండెత్తాడు. ఇప్పటిదాకా నెగ్గుకొచ్చాడు. మరింత ఉక్రెయిన్ భూభాగంపై పట్టు సాధించగలనన్న, తద్వారా తన విదేశాంగ విధానం ఎలా ఉండాలో నిర్ణయించుకునే శక్తి రష్యాకు సమకూరుతుందన్న, తూర్పు మధ్య యూరప్ ప్రాంతాల భద్రతకు ఢోకా ఉండదన్న ఆలోచన ఇలాగే కొనసాగవల్సిందిగా పుతిన్‌ను పురిగొల్పి ఉంటుంది.

దుస్సాహసం ఫలిస్తుంది!

గాజా మీద ఇజ్రాయెల్ దురాక్రమణకు దిగింది. హమాస్ టెర్రరిజం ప్రస్తుత సంక్షోభానికి పురిగొల్పింది అనడంలో సందేహం లేదు. అయితే, అందుకు వ్యతిరేకంగా ఇజ్రాయెల్ మితిమీరి ప్రతిస్పందించింది. అంతర్జాతీయ విశ్వసనీయతను కోల్పోయింది. ఇజ్రాయెల్ అంటే అదో జాతి నిర్మూలన శక్తి అని ప్రపంచవ్యాప్తంగా ఒక తరం మనస్సులో శాశ్వతంగా ముద్ర పడింది. ఈ దాడి ఆ దేశ వనరులను హరించివేసింది. పొరుగున ఉన్న అరబ్బు దేశాలతో సాధారణ సంబంధాలు తుడిచిపెట్టుకుపోయాయి. ఇజ్రాయెల్ దీర్ఘకాలిక భద్రత కూడా ప్రమాదంలో పడినట్లే!

అయితే ఇజ్రాయెల్ ఏం ఓడలేదు. ఆ దేశపు దూరదృష్టి లేని వ్యూహకర్తలు కోణం నుంచి చూస్తే, హమాస్ నాయకత్వాన్ని తుద ముట్టించడంతో పాటు వారి సైనిక స్థావరాలను ధ్వంసం చేసిన ఇజ్రాయెల్ ఈ పోరులో విజయం సాధించింది. హెజ్బొల్లా నాయకత్వాన్ని, సైనిక సదుపాయాలను నిర్మూలించి, లెబనాన్ పాలనలో మార్పు తెచ్చింది. సిరియా ప్రభుత్వ మార్పుకు పరోక్షంగా దోహదపడింది. నెతన్యాహూ ఇలాగే ముందుకు సాగి ఇరాన్ మీద దాడి చేశాడంటే అందులో ఆశ్చర్యపోయేదేం లేదు. మనిషిని అతడి అనుభవాలు తీర్చిదిద్దుతాయి. పుతిన్ అనుకున్నట్లే, నెతన్యాహూకు కూడా అతడి అనుభవం పాఠం నేర్పింది. ఆ పాఠం: దుస్సాహసం ఫలిస్తుంది. అంతర్జాతీయ న్యాయసూత్రాలను అన్నింటినీ ఉల్లంఘించాడు. యుద్ధఖైదీ అభియోగం మోపి అరెస్టు చేయాలన్న ఇంటర్నేషనల్ వారెంటును పట్టించుకోలేదు. పాలస్తీనా కలలను చిదిమివేసిన అనుభవమే మరో దేశంపై దండెత్తడానికి, ఆ దేశ అణుశక్తి కార్యక్రమాలను వమ్ము చేయడానికి, అక్కడ ప్రభుత్వాన్ని కూలదోయడానికి నెతన్యాహూను పురిగొల్పి ఉంటుంది.



వ్లాదిమీర్ పుతిన్ | బెంజమిన్ నెతన్యాహూ | షీ జిన్‌పింగ్ | అసీమ్ మునీర్

◆ లెక్కలేనితనం, అంతర్జాతీయ చట్టాల ఉల్లంఘన ఆశించిన ఫలితం ఇస్తున్న రోజులివి. ఆధునిక భౌగోళిక రాజకీయాలు నేర్పుతున్న విషాదకర పాఠం ఇది.

ప్రత్యక్ష ఆక్రమణలు కాకపోయినా...

వీగర్ల స్వయంప్రతిపత్తి ప్రాంతమైన షిన్జియాంగ్‌ను చైనా జైలుగా మార్చేసింది. టిబెట్‌లో జనాభా స్వరూప స్వభావాలను మార్చింది. హాంకాంగ్‌ను హస్తగతం చేసుకుని రెండు వ్యవస్థల విధానాన్ని అమలు చేస్తామన్న చట్టబద్ధ హామీని విస్మరించింది. సౌత్ చైనా సముద్రంలోని ద్వీపాలను సైనిక స్థావరాలుగా చేసుకుంది. తన సరిహద్దుల వెలుపల తైవాన్‌తోపాటు, ఇతర తూర్పు ఆసియా దేశాల్లో పరోక్ష అధికారం చలాయిస్తోంది. ఇవేవీ కూడా ప్రత్యక్ష ఆక్రమణలు కాకపోవచ్చు. కానీ ఇవన్నీ కలిపి చూస్తే, తన ఆధిపత్యాన్ని క్రమంగా పెంచుకుంటూ పోయి చివరకు పూర్తిగా కబళించివేస్తున్నట్లు అర్థమవుతుంది. ఈ చర్యలతో చైనా ప్రతిష్ఠ మసకబారింది. చైనా ప్రాబల్యాన్ని అడ్డుకునేందుకు వీలుగా పలు దేశాలు కూటములుగా జట్టు కట్టేందుకు, చైనా వస్తు సరఫరాలకు ప్రత్యామ్నాయాలు వెతుక్కునే పరిస్థితికి దారితీసింది.

అయినా చైనా ఏం ఓడలేదు. వాస్తవానికి, తన ఆక్రమణలు అన్నిటినీ 'న్యూ నార్మల్'గా మార్చేయగలిగింది. సాగర జలాల్లో తన అధికార ప్రదర్శనను కొనసాగించగలనని, లేదా తైవాన్‌ను ఆక్రమించుకోగలనని జిన్‌పింగ్ అనుకుంటే అందులో ఆశ్చర్యపడేదేం లేదు. ఒక మనిషిని అతడి అనుభవాలు రూపుదిద్దుతాయి. పుతిన్, నెతన్యాహూల మాదిరిగానే జిన్‌పింగ్ కూడా అనుభవాల నుంచి పాఠం నేర్చుకున్నాడు. ఆ పాఠం: దుస్సాహసం ఫలిస్తుంది. ఆయన కమ్యూనిస్ట్ పార్టీ ఆఫ్ చైనాను హస్తగతం చేసుకున్నాడు. దేశానికి శాశ్వత అధ్యక్షుడిగా ప్రకటించుకున్నాడు. ప్రత్యర్థులను అణచివేయడానికి అవినీతి వ్యతిరేక ఉద్యమాలను ఉపయోగించుకున్నాడు. హిమాలయాల్లో కానీ, సాగరాల్లో కానీ, పసిఫిక్ లేదా యూరేషియాలో కానీ ఇలాగే ముందుకు సాగాలని ఈ అనుభవమే జిన్‌పింగ్‌ను పురిగొల్పి ఉంటుంది.

ఉగ్రవాద దుస్సాహసం

ఏప్రిల్ 22న పాకిస్తాన్ తైనాతీలు మరోసారి ఇండియాపై పహల్గామ్‌లో ఉగ్రదాడికి తెగబడ్డారు. అలాంటి ఘటన, దాని పర్యవసానాలు... టెర్రరిజం ఎగుమతుల కేంద్రంగా పాకిస్తాన్ పొందిన గుర్తింపును ఇంకా బలపరిచాయి. అంతంత మాత్రంగా ఉన్న ఆర్థిక సామర్థ్యాన్ని మరింత కుంగదీశాయి. సైనిక పరంగా పాకిస్తాన్ బలహీనతలను బహిర్గత పరచాయి. దేశ సౌభాగ్యానికి అవసరమైన ప్రాదేశిక సమగ్రతను మరింత దూరం చేశాయి.

అయితే తాను ఓడిపోయానని పాకిస్తాన్ అనుకోవడం లేదు. పైగా, రావల్పిండిలోని మిలిటరీ జనరళ్ల దృష్టిలో పాకిస్తాన్ గెలిచింది. తామే తప్పూ చేయడం లేదన్న యుద్ధోన్మాద ధోరణి ఇకమీదటా చెల్లిపోతుందని ఫీల్డ్ మార్షల్ ఆసీమ్ మునీర్ అనుకుంటే అందులో ఆశ్చర్యపడేదేం లేదు. మనిషిని అతడి అనుభవాలు రూపుదిద్దుతాయి. జిన్‌పింగ్, పుతిన్, నెతన్యాహూల మాదిరిగానే, తన అనుభవాలు అతడికి పాఠం నేర్పాయి. ఆ పాఠం: దుస్సాహసం ఫలిస్తుంది. మునీర్ ద్వేషం రగిల్చే ప్రసంగాలు చేశాడు. ఉగ్రవాద తైనాతీలను ప్రోత్సహించాడు. ప్రత్యర్థిని సైనిక ఘర్షణలోకి దించాడు. అంతర్జాతీయ పాత్ర కోసం అభ్యర్థన చేశాడు. కాల్పుల విరమణను విజయంగా ప్రకటించుకున్నాడు. కొన్ని తరాల ప్రజలను శోకంతో తపించేలా చేసినా, పాకిస్తాన్‌కు కావల్సిన ప్రచారాన్ని, ప్రజల్లో చీలికను సాధించిపెట్టిన ఇలాంటి ఉగ్రదాడులతోనే ముందుకుసాగేందుకు మునీర్‌ను అతడి అనుభవం పురిగొల్పవచ్చు.

మరో దేశం మీద దండెత్తడం, ప్రజలను ఆకలితో అలమటింపజేయడం దుస్సాహసం (అడ్వెంచరిజమ్) అవుతుంది. టెర్రరిజానికి ఆశ్రయం ఇవ్వడం లేదా మరొకరి భూభాగాన్ని కైవసం చేసుకోవడం దుస్సాహసం అవుతుంది. అన్ని అంతర్జాతీయ నియమాలనూ, చట్టాలనూ ఉల్లంఘించడం, ట్రిబ్యునల్ ఉత్తర్వులను తిరస్కరించడం దుస్సాహసం అవుతుంది. మానవ సమాజాలు ఏర్పడినప్పటి నుంచీ దుస్సాహసం ఉంది. దీన్ని అడ్డుకునేది చట్టం, ఆచారం, స్వీయ నిగ్రహం... ఇవేవీ కావు. విఫలమవుతామన్న భయం, అందుకు చెల్లించాల్సిన మూల్యం మాత్రమే దుస్సాహసాన్ని అడ్డుకోగలవు. విషాదం ఏమిటంటే, ఇప్పుడు ఈ వైఫల్యభీతి అంతరించింది. అడ్వెంచరిజం ఫలించే యుగం ఇది.

వ్యాసకర్త సీనియర్ జర్నలిస్ట్, పొలిటికల్ ఎనలిస్ట్
('ది హిందుస్థాన్ టైమ్స్' సౌజన్యంతో)

సోషల్ మీడియా

ఎందుకు ఆధిపత్యం?



2008లో మా సినిమా 'డబ్ల్యూ'లో అమెరికా నాయకులు (బుష్, చెనీ, రమ్స్‌ఫెల్డ్, పావెల్, రైస్...) ఇరాక్‌పై దాడి చేయాలని నిర్ణయించే సీన్ ఉంది. ఒక దశలో చెనీ ఇరాన్ అంతిమ 'బహుమానం' అంటాడు. నెతన్యాహూ, ట్రంప్ సారథ్యంలో మరో వినాశనానికి మనం సిద్ధమవుతున్న వేళ అది నేటికీ వర్తిస్తుంది. ఎందుకు? మన దేశానికి ఏమైంది? ఈ అధ్యక్షుడా, మరొకరా అని కాదు– ఆధిపత్యం వహించాలన్నది మన రక్తంలోనే ఉంది.

– ఆలివర్ స్టోన్, అమెరికా దర్శకుడు

దుస్తుల కోసమా?



1979కు ముందు ఇరాన్ అమ్మాయిలు స్కర్టులు ధరించే ఫొటోలను పోస్టు చేయడం వల్ల ఉపయోగం లేదు. అది ఇరానియన్ల పోరాటాన్ని కేవలం దుస్తుల ఎంపికగా తగ్గించేస్తుంది. 1979 తర్వాత మహిళల జీవితం ఎంత దారుణంగా మారిందో, లింగ అసమానత్వాన్ని ప్రభుత్వం ఎలా చట్టబద్ధం చేసిందో... అలాంటి వాస్తవాలను పంచుకోండి.

– నజానీన్ నూర్, ఇరానియన్ అమెరికన్ నటి

గుణమే సంపద



మిమ్మల్ని మీరు మీ సంపదతో తూచుకోకండి. డబ్బు వల్లే అధికులమని కొందరు భావిస్తారు. అది లేకపోవడం వల్లే కొందరి ఆత్మవిశ్వాసం దెబ్బతింటుంది. కానీ మనిషిగా మీ విలువకూ, డబ్బు సంపాదించే సామర్థ్యానికీ సంబంధమే లేదు. మీ విలువ సంపదలో కాదు, వ్యక్తిత్వంలో ఉంటుంది.

– రేవంత్ హిమత్‌సింగ్‌కా, ఫుడ్ యాక్టివిస్ట్

విషాద వాస్తవం



మానవ ప్రవర్తనలోని అత్యధిక భాగాన్ని అహం, దురాశ, అసూయ నడుపుతున్నాయి.

– జూబీ, ర్యాపర్

అసలైన శక్తి




ఒకరితో బలంగా విభేదిస్తూ కూడా– వాళ్లతో గౌరవం, మర్యాద, సొగసు, హుందాతనం, నిజాయతీతో మాట్లాడగలగడమే సూపర్ పవర్!

– వాలా అఫ్షార్, డిజిటల్ ఇవాంజెలిస్ట్

దేశ ఐక్యతే ఆయన సంకల్పం

శ్యామాప్రసాద్ ముఖర్జీ మొదటి తరం దేశభక్తుల్లో ఎన్నదగినవారు. 1901 జూలై 6న, కలకత్తాలో జన్మించిన ఆయన కేవలం 23 ఏళ్ల వయసులో లండన్‌లో బారిస్టర్ అయ్యారు. 33 ఏళ్ల వయసులో కలకత్తా విశ్వవిద్యాలయం ఉపకులపతిగా నియమితులయ్యారు (1934–1938). ఆయన పదవీ కాలంలో భారతీయ భాషలకు యూనివర్సిటీలో ప్రోత్సాహం లభించింది. శాస్త్రీయ విద్యాభివృద్ధి, మహిళా విద్య వంటి విషయాలపై ఆయన ఆసక్తి చూపించారు. విద్య ద్వారా జాతీయ చైతన్యాన్ని ప్రేరేపించే ప్రయత్నం జరిగింది. 'విద్య అంటే కేవలం పాఠాలు కాదు – అది దేశానికి ఆత్మను నూరిపోసే సాధనం' అని ఆయన నమ్మకం.



శ్యామాప్రసాద్ ముఖర్జీ

ప్రారంభంలో ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ పట్ల మానసిక అనురక్తితో రాజకీయ జీవితం ప్రారంభించిన ముఖర్జీ, 1929లో బెంగాల్ శాసన మండలికి ఎన్నికయ్యారు. అయితే, ముస్లిం లీగ్‌కు కాంగ్రెస్ అండగా వ్యవహరించడాన్ని చూసి అసహనం వ్యక్తం చేశారు. ఆ తరువాత 1943 నుండి 1946 వరకు హిందూ మహాసభ అధ్యక్షుడిగా ఉన్నారు. 'హిందూ స్వాభిమానం' పేరుతో దేశ విభజనకు వ్యతిరేకంగా జాతీయ ఐక్యతకు తన శక్తినంతా ఒడ్డారు.

భారత స్వాతంత్ర్యం అనంతరం నెహ్రూ తొలి కేబినెట్‌లో పరిశ్రమలు, పౌర సరఫరా శాఖల మంత్రిగా నియమితులయ్యారు. అయితే నెహ్రూ విధానాలను వ్యతిరేకించారు. ఆర్టికల్ 370ను వ్యతిరేకిస్తూ ఇది దేశాన్ని చీల్చుతుందని హెచ్చరించారు. చివరకు 1950 ఏప్రిల్‌లో మంత్రి పదవికి రాజీనామా చేస్తూ... 'దేశాన్ని బలహీనపరిచే విధానాల్లో భాగస్వామిగా ఉండలేను' అని ప్రకటించారు.

దేశ భక్తి, జాతీయవాదం, భారత మూల ధర్మం ఆధారంగా దేశాన్ని నిర్మించేందుకు 'భారతీయ జనసంఘ్' (1951) స్థాపించారు. అదే నేటి 'భారతీయ జనతా పార్టీ'. ఒక దేశం – ఒక రాజ్యాంగం – ఒక జెండా, సాంస్కృతిక జాతీయత, ఆర్థిక స్వేచ్ఛలకు తోడు దేశ భద్రత అనే లక్ష్యాలతో ఆయన కృషి కొనసాగింది. 'ఒకే దేశంలో రెండు రాజ్యాంగాలు, ఇద్దరు ప్రధానులు, రెండు జెండాలు కుదరదు' అనేది ఆయన ప్రధాన నినాదం.


ఆర్టికల్ 370 కారణంగా భారతీయులు కశ్మీర్‌కు వెళ్లాలంటే పర్మిట్ తీసుకోవాల్సి ఉండేది. కానీ దేశభక్తి, దేశ ఐక్యతకు కట్టుబడిన స్వర్గీయ ముఖర్జీ... పర్మిట్ అనే పదాన్ని వ్యతిరేకిస్తూ 'జననీ జన్మభూమిశ్చ స్వర్గాదపి గరీయసీ' (జన్మనిచ్చిన తల్లి, మాతృదేశం స్వర్గానికంటే గొప్పవి) స్ఫూర్తితో 1953లో ఆర్టికల్ 370ను వ్యతిరేకిస్తూ, కశ్మీర్‌లో అనుమతి లేకుండా ప్రవేశించేందుకు కశ్మీర్ సత్యాగ్రహం చేపట్టారు. షేక్ అబ్దుల్లా ప్రభుత్వం మే 11న అరెస్ట్ చేసి, నిశాత్ గార్డెన్ (శ్రీనగర్)లో నిర్బంధంలో ఉంచింది. 1953 జూన్ 23న ఆయన నిర్బంధంలోనే మృతి చెందారు. కేవలం 51 ఏళ్లకే వారు తన ప్రాణాన్ని భారత ఐక్యత కొరకు అర్పించారు.

ఆర్టికల్ 370ను రద్దు చేయాలనే ఆయన కోరికను సరిగ్గా 66 ఏళ్ల తర్వాత, బీజేపీ ప్రభుత్వం 2019లో నెరవేర్చడం ముదావహం.

– డా॥ బూర నర్సయ్య గౌడ్, మాజీ ఎంపీ
(నేడు శ్యామాప్రసాద్ ముఖర్జీ బలిదాన్ దివస్)

చిత్రసీమలో వీరిద్దరూ ఇద్దరే!

అభిప్రాయం



డా॥ పైడిపాల

శ్రీశ్రీ అభ్యుదయ కవిగానూ, ఆత్రేయ ప్రముఖ వచన నాటక కర్తగానూ లబ్ధప్రతిష్ఠులయిన తర్వాతనే సినీ రంగ ప్రవేశం చేశారు. 1950లో 'ఆహుతి' (మూలం: నీరా ఔర్ నందా) అనే డబ్బింగ్ సినిమాతో శ్రీశ్రీ, 1951లో 'దీక్ష' చిత్రంతో ఆత్రేయ 'సింగిల్ కార్డ్స్'తో చిత్రసీమలో ప్రవేశించారు.

శ్రీశ్రీ అభ్యుదయ భావజాలానికి, ఆత్రేయ మనసు పాటలకు ప్రసిద్ధులు కావడం వలన 'తోడికోడళ్లు' చిత్రంలో ఆత్రేయ రాసిన 'కారులో షికారుకెళ్లే పాలబుగ్గల పసిడి చాన...' అనే పాట శ్రీశ్రీ రచనగానూ, 'డాక్టర్ చక్రవర్తి' చిత్రానికి శ్రీశ్రీ రాసిన 'మనసున మనసై బ్రతుకున బ్రతుకై తోడొకరుండిన అదే భాగ్యము అదే స్వర్గము' అనే పాటను ఆత్రేయదిగానూ భ్రమించి చాలామంది పందేల వరకు వెళ్లారు. శ్రీశ్రీ 'పాడవోయి భారతీయుడా' అనే తన సినిమా పాటల సంకలనంలోనూ ఈ భ్రమను ప్రస్తావించారు.

'అల్లూరి సీతారామరాజు' చిత్రంలో శ్రీశ్రీ రాసిన 'తెలుగు వీర లేవరా...' అనే పాట మొదటిసారి తెలుగు సినిమా పాటకు జాతీయ బహుమతి గౌరవాన్ని దక్కించింది. అంతటి ప్రతిష్ఠాత్మకమైన పాటలో 'ప్రతి మనిషి తొడలు గొట్టి... సింహాలై గర్జించాలి' అనేచోట వ్యాకరణ దోషాన్ని తనే గ్రహించి శ్రీశ్రీ బహువచనాన్ని ఏకవచనంగా మార్చి 'సింహంలా గర్జించాలి' అని దిద్దుకున్నారు. ఆత్రేయ కూడా 'శ్రీ వేంకటేశ్వర మాహాత్మ్యం'(1960) చిత్రంలో 'ఎవరో?... అతనెవరో?' అనే పాటలో 'కరుణజూపి కబురు తెలిపి రమ్మనవా' అనే పంక్తిలో 'కబురు' అనే ఉర్దూ పదాన్ని ప్రయోగించినందుకు కలత చెంది, గురుతుల్యులు మల్లాది రామకృష్ణ శాస్త్రి 'ఫరవాలేదు, అప్పుడు బీబీ నాంచారి ఉందిగా!' అని సమర్థించే వరకు ఊరట చెందలేదు. ఈ రెండు సంఘటనలు సినీ గేయ రచనలో కూడా శ్రీశ్రీ– ఆత్రేయల నిర్దుష్టతను, నిబద్ధతను తెలియజేస్తాయి.

పద్మనాభం నిర్మించిన 'దేవత' చిత్రంలో 'బొమ్మను చేసి ప్రాణము పోసి ఆడేవు నీకిది వేడుక' అని పాట పల్లవిని వీటూరి రాశారు. దానిని నిర్మాత కోరిక మీద వీటూరి... శ్రీశ్రీకిస్తే ఆయన ఆ పాటను పూర్తి చేశారు. శ్రీశ్రీ ఈ విషయమై వీటూరికి స్వయంగా కృతజ్ఞతలు చెప్పడమేగాక, 'పాడవోయి భారతీయుడా' పుస్తకంలో కూడా వెల్లడించారు. 'గోరింటాకు' చిత్రంలో 'కొమ్మకొమ్మకో సన్నాయి కోటి రాగాలు ఉన్నాయి...' అనే పాట పల్లవి వరకు మాత్రం వేటూరి రాయగా, చరణాలన్నింటినీ రాసిన ఆత్రేయ 'క్రెడిట్స్'లో వేటూరి పేరును వెయ్యడానికి అంగీకరించడం ఇటువంటి ఉదాహరణమే!



శ్రీశ్రీ | ఆత్రేయ

◆ శ్రీశ్రీని ఆత్రేయ గురుతుల్యునిగానే భావించేవారు. శ్రీశ్రీ– ఆత్రేయల మధ్య భావసారూప్యం వారి జన్మాంతర అనుబంధమేమో అనిపిస్తుంది.

సినీ గేయ కవులు పాటలు రాయడానికే ప్రాధాన్యమిస్తారు. కానీ పద్య ప్రేమికులైన శ్రీశ్రీ, ఆత్రేయ సందర్భం దొరికితే సాంఘిక చిత్రాల్లో కూడా పద్యాలను రచించి ఆ ప్రక్రియ పట్ల తమ మక్కువను చాటుకున్నారు. శ్రీశ్రీ 'కులగోత్రాలు' 'పంతులమ్మ' వంటి చిత్రాల్లో పద్యాలు రాయగా; ఆత్రేయ 'మనసే మందిరం', 'ప్రేమ్‌నగర్', 'అమర దీపం', 'కల్యాణ మంటపం' ఇత్యాది చిత్రాల్లో పద్యాలను రాశారు.


ఆత్రేయ తన సొంత చిత్రం 'వాగ్దానం'లో శ్రీశ్రీ పట్ల గౌరవంతో రెండు పాటలను రాయించారు. వాటిలో 'సీతా స్వయంవరం' హరికథ ఒకటి. ఈ హరికథలో వినాయక స్తోత్రం, పోతన భాగవత పద్యంతో పాటు కరుణశ్రీ 'ఫెళ్లుమనె విల్లు...' అనే పద్యం కూడా తనవి కావనీ, 'కరుణశ్రీ' పద్యాన్ని ఉపయోగించినందుకు ఆయనకు క్షమాపణలు చెప్పుతున్నాననీ శ్రీశ్రీ 'పాడవోయి భారతీయుడా'లో వెల్లడించడం ఆయన చిత్తశుద్ధికి నిదర్శనం. ఆత్రేయ 'వాగ్దానం' చిత్రం తీసి చేతులు కాల్చుకున్నట్టే, శ్రీశ్రీ 'చెవిలో రహస్యం' అనే డబ్బింగ్ చిత్రం తీసి దారుణంగా నష్టపోయారు.

శ్రీశ్రీ, ఆత్రేయ – ఇద్దరూ వామపక్ష భావజాలం గల కవులు. శ్రీశ్రీ భార్య కోరిక మేరకు సత్యనారాయణ వ్రతం చేస్తే విమర్శకులు ఆయనను దుయ్యబట్టారు. 'వ్యక్తుల ప్రైవేటు జీవితాలు వారి వారి సొంతం' అని శ్రీశ్రీ తన చర్యను సమర్థించుకున్నారు. అలాగే మధ్యంతర ఎన్నికలలో తన నాటకాలతో కమ్యూనిస్టు పార్టీ కోసం ప్రచారం చేసిన ఆత్రేయ 'శ్రీ షిర్డీ సాయిబాబా మాహాత్మ్యం' చిత్రానికి ఆణిముత్యాల్లాంటి పాటలను రాసి, అజ్ఞాని అయిన తన చేత ఆ బాబాయే ఆ పాటలను రాయించుకున్నారేమోనని ఆత్మీయుల దగ్గర సందేహాన్ని వ్యక్తం చేసేవారట!

శ్రీశ్రీ – ఆత్రేయల మధ్య భావసారూప్యం వారి జన్మాంతర అనుబంధమేమో అనిపిస్తుంది. శ్రీశ్రీని ఆత్రేయ గురుతుల్యునిగానే భావించేవారు. ఒక పరిశోధకుడు శ్రీశ్రీ గురించి వ్యాఖ్యానిస్తూ, ఆయన 'వయసొచ్చిన పసివాడు' అన్నారు. ఆ వ్యాఖ్య ఆత్రేయకు కూడా అన్వయిస్తుంది. జనసామాన్యానికి తెలియని గొప్ప వ్యక్తిత్వాలు కలిగిన ఈ కవి ద్వయం తెలుగు సినీ రంగంలో రెండు మహోన్నత శిఖరాలు!

వ్యాసకర్త సినీ గేయ సాహిత్య పరిశోధకులు । 99891 06162

కవి పండితులు



ఇప్పుడున్నన్ని జీవనోపాధులు లేని పాతకాలంలో– అంటే, నూరూ నూటయాభై సంవత్సరాల క్రితం వరకూ ఈ దేశంలో దాదాపు అన్ని వర్గాల ప్రజలూ ఆర్థిక దుఃస్థితిలోనే ఉండేవారు. ఎందరో ఇతర సామాజికులతో పాటు, ఉద్దండ పండితులూ, కవులూ కూడా ఉపాధి లేక దారిద్ర్యంలో మగ్గుతుండేవారు. అసాధారణ ప్రజ్ఞకు అదృష్టం కూడా తోడయిన అతి కొద్ది మందికి రాజాశ్రయం లభించేది. అధికాంశం కవి పండితులు మాత్రం, అయ్యవారి నట్టిళ్ళలో, 'పంచమే అహని, షష్ఠేనా, శాకం పచతి స్వేగృహే' (అయిదారు రోజుల కొకసారే ఇంట్లో కూర ఉడుకుతుంది) ఉన్నంత పేదరికంలో ఉండేవారు.

పైగా కవి పండితులకు వల్లమాలిన స్వాభిమానం, ఉదర పోషణకు యాచన తప్ప మరో మార్గం లేకపోయినా, ఆ యాచనంటే వీళ్ళకు చెప్పలేనంత చిన్నతనం. కాసుల కోసం తమ కవిత్వంతో నిరక్షర కుక్షులను మెప్పించవలసి రావటం, కవి అయిన వాడికి కఠిన శిక్ష అని భావించేవారు. 'ఏ కష్టమైనా భరిస్తాను కానీ, అరసికుడికి కవిత్వం వినిపించే ఖర్మ మాత్రం నా నుదుట రాయకు, రాయకు, రాయకు' అని విధాతను పరిపరి వేడుకొంటాడు ఒక ప్రాచీన కవి శేఖరుడు.

'...కోమల కావ్య కన్యకన్ కూళల కిచ్చి అప్పడుపు కూడు భుజించ'ను అన్నాడట పోతన. 'కూళ' అంటే కుత్సితుడు, అవివేకి, మూర్ఖుడు. అలా కవితా సరస్వతిని అమ్మేవారికి కాలాంతరంలో కాలుడి సమ్మెట పోట్లు తప్పవని బమ్మెర వారు హెచ్చరించారు.

'అనకూడదు గానీ ఆ బ్రహ్మ చాలా అనవసరపు పనులు చేస్తుంటాడు. అసలు విద్వాంసుడిని సృష్టించటం ఎందుకు? సృష్టించినా, అతడికి తోడుగా ఆకలి బాధ సృష్టించటం ఎందుకు? ఆ పైన, అది పోగొడతాడనే ఆశ కలిగించే దుర్మార్గుడిని రాజుగా సృష్టించటమెందుకు?' అంటాడు ధూర్జటి. 'రాజుల్ మత్తులు, వారి సేవ నరకప్రాయంబు' అని ఆయన అనుభవం.

మొత్తం మీద కవి పండితుల పరిస్థితి ఆ కాలంలో కంటే ఇప్పుడే నయం. ఈ కాలంలో, ఆ కాలంలో అంత గొప్ప పండితులు అరుదు. అయితే, ఈ కాలపు మధ్య స్థాయి పండితులు కూడా, అప్పటి వారిలా ఆకలి బాధను అనుభవిస్తున్నట్టు కనపడదు. ఇది చాలా స్వాగతించదగిన మార్పు. లోకులు సమస్తులూ సుఖినులు కావటం కంటె, కావలసింది ఏముంది? అయితే కవి పండితుల మీద కలుముల తల్లి కరుణ గాఢమయిన కొద్దీ, పాతకాలపు నానుడులలో లాగా, చదువుల తల్లి చలవ సన్నగిల్లే పరిస్థితి ఏర్పడకూడదు. కడుపు నిండిన కవి పండితులు కాలం పట్ల, లోకం పట్ల కృతజ్ఞులై, తమ ప్రజ్ఞా పాటవాలను మరింత ఉన్నత శిఖరాలకు చేర్చి లోకోపకారం చేసేందుకు లక్షించాలి.

– ఎం. మారుతి శాస్త్రి

గ్రహం అనుగ్రహం

శ్రీ విశ్వావసు నామ సంవత్సరం, ఉత్తరాయణం., గ్రీష్మ ఋతువు, జ్యేష్ఠ మాసం, తిథి: బ.త్రయోదశి రా.8.49 వరకు, తదుపరి చతుర్దశి; నక్షత్రం: కృత్తిక ప.2.21 వరకు, తదుపరి రోహిణి; వర్జ్యం: తె.5.20 నుండి 6.49 వరకు (తెల్లవారితే మంగళవారం); దుర్ముహూర్తం: ప.12.26 నుండి 1.18 వరకు, తదుపరి ప.3.03 నుండి 3.55 వరకు; అమృత ఘడియలు: ప.12.04 నుండి 1.33 వరకు; రాహుకాలం: ఉ.7.30 నుండి 9.00 వరకు; యమగండం ఉ.10.30 నుండి 12.00 వరకు సూర్యోదయం: 5.30; సూర్యాస్తమయం: 6.33; మాస శివరాత్రి

క్లుప్తంగా...

సీలింగ్ ఫ్యాన్ ఊడిపడి పసికందుకు గాయాలు

- ఆదిలాబాద్ జిల్లా గుడిహత్నూర్ పీహెచ్‌సీలో ఘటన



ఆరోగ్య కేంద్రంలో ఊడి పడిన సీలింగ్ ఫ్యాన్

గుడిహత్నూర్: ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (పీహెచ్‌సీ)లో సీలింగ్ ఫ్యాన్ ఊడిపడి రెండు రోజుల పసికందుపై పడటంతో గాయాలైన సంఘటన ఆదిలాబాద్ జిల్లా గుడిహత్నూర్‌లో జరిగింది. మండలంలోని కొద్దుగూడకు చెందిన పాయల్ అనే మహిళ శుక్రవారం గుడిహత్నూర్‌లోని పీహెచ్‌సీలో ఆడపిల్లకు జన్మనిచ్చింది. కాగా, ఆదివారం ఉదయం అకస్మాత్తుగా పైనుంచి సీలింగ్ ఫ్యాన్ ఊడి పాయల్ పడుకున్న మంచంపై పడింది. దీంతో తల్లి పొత్తిళ్లలో ఉన్న పసికందు తలకు గాయాలయ్యాయి. ఈ ఘటనపై స్టాఫ్‌నర్స్ తిరుమల మండల వైద్యాధికారి శ్యాంసుందర్‌కు సమాచారం అందించారు. ఆయన సూచన మేరకు చిన్నారిని 108లో ఆదిలాబాద్‌లోని రిమ్స్‌కు తరలించారు. ఈ ఘటనపై వైద్యాధికారి శ్యాంసుందర్‌ను వివరణ కోరగా.. పసికందు ఆరోగ్యం నిలకడగా ఉందన్నారు. ఘటనపై విచారణ జరుపుతున్నామని తెలిపారు.

ఇన్‌ఫార్మర్ నెపంతో ఇద్దరి హత్య

- ఛత్తీస్‌గఢ్‌లోని బీజాపూర్ జిల్లాలో ఘటనలు

చర్ల: పోలీసు ఇన్‌ఫార్మర్ల నెపంతో ఓ మాజీ మావోయిస్టుతో పాటు మరో గిరిజనుడిని మావోయిస్టులు హతమార్చారు. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని బీజాపూర్ జిల్లా పామేడు పోలీస్ స్టేషన్ పరిధిలోని యాంపురం, సండ్రంబోరు గ్రామాల్లో శనివారం రాత్రి ఈ ఘటనలు జరగ్గా, ఆదివారం సాయంత్రం వివరాలు వెల్లడయ్యాయి. యాంపురం గ్రామానికి చెందిన దేవయ్య అలియాస్ సందీప్ మావోయిస్టు పార్టీలో పనిచేసి ఇటీవల లొంగిపోయి గ్రామంలోనే ఉంటున్నాడు. కాగా, పోలీసులకు తమ సమాచారం చేరవేస్తున్నాడనే అనుమానంతో శనివారం రాత్రి 7 గంటల ప్రాంతంలో యాంపురం వచ్చిన కొందరు మావోయిస్టులు సందీప్‌ను ఇంటి వద్ద తీవ్రంగా కొట్టారు. అతని అరుపులకు చుట్టు పక్కల వారు రావడంతో మావోయిస్టులు పారిపోయారు. మావోయిస్టుల దాడిలో తీవ్రంగా గాయపడిన సందీప్.. కొద్దిపటికే మృతిచెందాడు. ఆ తర్వాత సండ్రంబోరుకు వెళ్లిన మావోయిస్టులు అక్కడ సమ్మయ్య అనే గిరిజనుడిని సైతం తీవ్రంగా కొట్టి చంపారు.

గుండెపోటుతో కానిస్టేబుల్ మృతి

- డ్యూటీలో ఉండగానే ఘటన



ప్రవీణ్

జీడిమెట్ల: విధి నిర్వహణలో ఉన్న ఓ కానిస్టేబుల్ గుండెపోటుతో మృతి చెందాడు. ఏపీలోని మచిలీపట్నానికి చెందిన ప్రవీణ్ (38) చింతల్ బాపునగర్‌లోని ఓ అపార్ట్‌మెంట్‌లో ఉంటూ బాలానగర్ ఎస్‌ఓటీలో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్నాడు. డ్యూటీలో భాగంగా ప్రవీణ్ శనివారం రాత్రి కుత్బుల్లాపూర్‌లో గంజాయి పట్టుకునేందుకు వెళ్లాడు. ఈ క్రమంలో ప్రవీణ్ ఒక్కసారిగా కుప్పకూలాడు. ఆయన వెంట ఉన్న కానిస్టేబుళ్లు సాయిలు, శంకర్ వెంటనే ప్రవీణ్‌ను స్థానికంగా ఉన్న ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అనంతరం ప్రవీణ్ కుటుంబ సభ్యులకు సమాచారం ఇవ్వగా, ఆయన భార్య జానకీదేవి ఆస్పత్రికి చేరుకున్నారు. అప్పటికే ప్రవీణ్ మృతి చెందినట్టు దాక్టర్లు ధ్రువీకరించారు. ఎస్‌ఓటీ డీసీపీ శ్రీనివాస్, అడిషనల్ డీసీపీ విశ్వప్రసాద్ తదితరులు ప్రవీణ్‌కు నివాళులు అర్పించారు.

అడవిలో పసికందు

- మెదక్ జిల్లా నర్సాపూర్‌లో దారుణం
- రక్షించిన ఏడుపాయల దుర్గమ్మ భక్తులు

నర్సాపూర్ రూరల్: ముక్కుపచ్చలారని మగ శిశువును అడవిలో వదిలేశారు. ఏడుపాయల దుర్గమ్మ దర్శనం చేసుకొని తిరిగి వెళ్తున్న భక్తులు పసికందు ఏడుపు విని రక్షించారు. మెదక్ జిల్లా నర్సాపూర్‌లో ఆదివారం వెలుగులోకి వచ్చిన ఈ సంఘటనపై నర్సాపూర్ ఎస్‌ఐ లింగం కథనమిది. హైదరాబాద్ సనత్‌నగర్‌కు చెందిన ఒక కుటుంబం ఏడుపాయల వన దుర్గామాతను దర్శించుకుని.. వాహనంలో నర్సాపూర్ మీదుగా తిరిగి హైదరాబాద్ వెళ్తోంది. నర్సాపూర్– హైదరాబాద్ 765 డి జాతీయ రహదారిలోని కొండాపూర్ రెండో మూల మలుపు వద్ద.. మూత్ర విసర్జన కోసం వాహనాన్ని నిలిపారు. ఆ సమయంలో వారికి శిశువు ఏడుపు వినిపించింది. దీంతో వారు డయల్ 100కు సమాచారం ఇవ్వగా.. పోలీసు సిబ్బంది అక్కడికి చేరుకున్నారు. పసికందును వెంటనే నర్సాపూర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి వైద్యులతో పరీక్షలు చేయించారు. మగ శిశువు ఆరోగ్యంగా ఉన్నాడని, నాలుగు నెలల వయసుంటుందని వారు నిర్ధారించారు. అనంతరం చిన్నారిని ఐసీడీఎస్ సిబ్బంది సహకారంతో చైల్డ్ వెల్ఫేర్ సంరక్షణ కేంద్రానికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని పసికందును వదిలేసిన గుర్తు తెలియని వ్యక్తుల కోసం దర్యాప్తు చేస్తున్నారు.

వేలి ముద్రలాగే.. శ్వాస ముద్ర!



'శ్వాస మీద ధ్యాస'.. శారీరక, మానసిక ఆరోగ్యాన్ని, స్వస్థతను ప్రసాదించే ధ్యానానికి అద్భుత సాధనం అన్న విషయం మనకు తెలుసు. ఇది కేవలం నమ్మకం కాదని, అక్షరాలా సత్యమని చెప్పడానికి శాస్త్రీయ ఆధారం చూపే అధ్యయన ఫలితం వెలువడింది. 'వేలి ముద్ర' మాదిరిగానే ప్రతి మనిషికీ విలక్షణమైన ఉచ్ఛ్వాస నిశ్వాసాలతో కూడిన 'శ్వాస ముద్ర' ఉంటుందట! ఆలోచనలపరంగా, ఆరోగ్యపరంగా మీరేమిటో చెప్పాలంటే మీ విలక్షణమైన 'శ్వాస ముద్ర'ను చూస్తే చాలు అనే పరిస్థితి ముస్ముందు రావచ్చని అంటున్నారు శాస్త్రవేత్తలు!!

\- సాక్షి, సాగుబడి

- ప్రతి వ్యక్తికీ విలక్షణమైన శ్వాస శైలి
- అనారోగ్య సమస్యలున్న వారి తీరే వేరు
- ఈ 'విలక్షణ'తో మానసిక రుగ్మతల గుర్తింపు
- పరిష్కార మార్గాలకూ దారి చూపుతుంది
- తాజా అధ్యయనంలో ఆసక్తికర వివరాలు

ఇజ్రాయెల్‌లోని వీజ్‌మన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్‌లో న్యూరో బయాలజీ ప్రొఫెసర్ నోమ్ సోబెల్, ఆయన బృందం.. శ్వాస తీరుతెన్నులకు, వ్యక్తుల భావోద్వేగాలూ ఆరోగ్య స్థితిగతులకూ ఏమైనా సంబంధం ఉందా అనే అంశంపై అధ్యయనం చేశారు. ఆశ్చర్యకరమైన ఈ అధ్యయన ఫలితాలు ఇటీవల 'కరెంట్ బయాలజీ' జర్నల్‌లో ప్రచురితమయ్యాయి.

96.8% 'ప్రత్యేకం'

ఈ అధ్యయనంలో భాగంగా 100 మందిని ఎంపిక చేసి, 24 గంటల పాటు వారి ఉచ్ఛ్వాస నిశ్వాసాలను నమోదు చేసి, విశ్లేషించారు. నాసికా రంధ్రాల బయట పట్టుకొని ఉండే సెన్సార్లతో కూడిన పరికరాన్ని వారికి అమర్చారు. వారు నిద్రలో ఉన్నా, మేల్కొని ఉన్నా అనుక్షణం వారి శ్వాస తీరుతెన్నులను 24 గంటల పాటు నమోదు చేశారు. దీనితో పాటు వారికి ప్రశ్నావళిని కూడా అందించి, వారి అభిప్రాయాలను సేకరించి, విశ్లేషించారు. ప్రతి వ్యక్తీ 96.8% మేర తనదైన విలక్షణ శైలిలో శ్వాసిస్తున్నారని ఈ అధ్యయనంలో వెల్లడైంది. కొందరు నిశ్వాస తర్వాత తిరిగి శ్వాస తీసుకునే ముందు కొద్ది విరామం తీసుకున్నారు. మరికొందరు వెనువెంటనే లేదా ఇతరులకన్నా ముందే శ్వాస తీసుకున్నారు. ఎవరి తీరు వారిదే అన్నట్లు శ్వాస తీరుతెన్నులు ఉండటం విశేషం.

అనారోగ్యాలు పసిగట్టేందుకూ..

వ్యాకులత తదితర అంశాలపై వారు వ్యక్తపరచిన అభిప్రాయాలకు, వారి శ్వాస తీరుతెన్నులకు మధ్య సారూప్యత కనిపించింది. దీంతో, మనుషుల మానసిక స్థితిగతులను, అనారోగ్య సమస్యలను, రుగ్మతలను పసిగట్టేందుకు వారి శ్వాస తీరుతెన్నులు ఉపయోగపడతాయని పరిశోధకులు అభిప్రాయపడ్డారు. 'ప్రతి ఒక్కరి మెదడు మాత్రమే కాదు, వారి శ్వాస తీరుతెన్నులు కూడా విలక్షణమైనవే' అనిపిస్తోందన్నారు వీజ్‌మన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్‌లో న్యూరో బయాలజీ ప్రొఫెసర్ నోమ్ సోబెల్. ఈ అధ్యయనంలో పాల్గొన్న వంద మందిలో 42 మంది శ్వాస ప్రక్రియను మరో 24 గంటలు అదనంగా అధ్యయనం చేశారు. 'ఒకరు రన్నింగ్ చేస్తారు. మరొకరు చదువుకుంటుంటారు. ఇంకొకరు విశ్రమిస్తుంటారు. వీరి శ్వాస తీరుతెన్నుల్లో వైవిధ్యాన్ని గుర్తించటం చాలా కష్టమేమో అని ముందు అనుకున్నాం. అయితే, ఒకరి శ్వాస తీరుతెన్నులతో మరొకరిది చాలా విభిన్నంగా ఉండటం గమనించాం' అని ఈ అధ్యయనంలో పాల్గొన్న ఒక విద్యార్థి తిమ్న సరోక ఆశ్చర్యాన్ని వ్యక్తం చేశారు.

వ్యాకులత.. తక్కువ గాలి!

వారి శ్వాస తీసుకుంటున్న తీరు, నిద్రకు ఉపక్రమించటం–మేల్కొనటం, మనోవ్యథ, వ్యాకులతకు సంబంధించిన భావోద్వేగాలను బట్టి ఆయా వ్యక్తుల బాడీ మాస్ ఇండెక్స్ (బీఎంఐ)ను సైతం పరిశోధకులు అంచనా వేయగలగటం మరో విశేషం. అధ్యయనంలో భాగంగా ఇచ్చిన ప్రశ్నలకు జవాబులు రాసినప్పుడు వ్యాకులతను కనబరిచిన వ్యక్తులు చాలా తక్కువగా గాలి పీల్చుకున్నారు. అంతేకాదు, నిద్రలో ఉచ్ఛ్వాస నిశ్వాసాల మధ్య వచ్చిన విరామంలో చాలా హెచ్చు తగ్గుల్ని పరిశోధకులు గుర్తించారు. మనోవ్యథతో బాధపడుతున్న వారు మేల్కొని ఉన్నప్పుడు చాలా బలవంతంగా శ్వాసను తీసుకోవటం, గాలి వదిలిన తర్వాత తిరిగి శ్వాస తీసుకోవటానికి ముందు సుదీర్ఘంగా విరామం (పాజ్) ఇస్తుండటాన్ని పరిశోధకులు గుర్తించారు.

ఆయురారోగ్యాలకోసం..

'ఒత్తిడి లేదా ఆందోళనతో బాధపడేవారి శ్వాస తీరుతెన్నులు మారిపోతున్నాయని మేం భావిస్తున్నాం. దీన్ని ఇంకోలా కూడా చెప్పుకోవచ్చు. మీరు శ్వాస తీసుకునే తీరును బట్టి మీకు ఒత్తిడి లేదా ఆందోళన వస్తున్నాయని కూడా అనుకోవచ్చు. అదేగనక నిజమైతే, ఆ రుగ్మతల నుంచి బయటపడేయటానికి శ్వాసించే తీరును మార్చితే సరిపోతుందని అనుకుంటున్నాం' అన్నారు నోమ్ సోబెల్. శ్వాస మీద ధ్యాస పెడితే ఆయురారోగ్యాలు సమకూరుతాయంటే ఇదేనేమో!

తల తాకట్టు పెట్టయినా.. 20 లక్షల ఇళ్లు కట్టిస్తాం

- అవి ఇచ్చాకే వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో ఓట్లడుగుతాం
- రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి
- నకిరేకల్‌లో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు మంజూరు పత్రాల పంపిణీ



లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ల ప్రొసీడింగ్స్ అందజేస్తున్న మంత్రి శ్రీనివాస్‌రెడ్డి. చిత్రంలో శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి తదితరులు

నకిరేకల్: తల తాకట్టు పెట్టయినా సరే రాష్ట్రవ్యాప్తంగా రాబోయే మూడున్నరేళ్లలో 20 లక్షల ఇందిరమ్మ ఇళ్లు కట్టించి తీరుతామని, అవి ఇచ్చిన తరువాతనే మళ్లీ అసెంబ్లీ ఎన్నికల్లో ఓట్లు అడుగుతామని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ప్రకటించారు. నల్లగొండ జిల్లా నకిరేకల్‌లోని మినీ స్టేడియంలో ఆదివారం స్థానిక ఎమ్మెల్యే వేముల వీరేశం అధ్యక్షతన 3,500 మంది లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో మంత్రి మాట్లాడారు. గత ప్రభుత్వం డబుల్ బెడ్‌రూం ఇళ్లు ఇస్తామని టీవీలు, పేపర్లలో పబ్లిసిటీ చేసుకుంది తప్పితే అర్హులకు ఇళ్లు ఇవ్వలేదని పొంగులేటి విమర్శించారు. పదేళ్లలో 93 వేల డబుల్ బెడ్‌రూం ఇళ్లను ప్రారంభించి, 66 వేలు పూర్తిచేసి మిగతావి మొండి గోడలుగానే వదిలేశారని ఆరోపించారు. పార్టీలు, కుల మతాలకు సంబంధం లేకుండా పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు ఇస్తామని చెప్పారు. గతంలో అసంపూర్తిగా వదిలేసిన డబుల్ బెడ్‌రూం ఇళ్లను ఇందిరమ్మ ఇళ్లుగా మార్చి లబ్ధిదారులకు అందించేందుకు కలెక్టర్లు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

ఆగస్టు 15 నాటికి భూభారతి సమస్యల పరిష్కారం

గత ప్రభుత్వ ధృతరాష్ట్ర పాలనలో ధరణి పోర్టల్‌ను తీసుకువచ్చారని, తాము దానిని ప్రక్షాళన చేసి భూభారతి చట్టం తెచ్చామని పొంగులేటి తెలిపారు. ఈ నెల 20వ తేదీ వరకు అన్ని రెవెన్యూ గ్రామాల్లో సదస్సులు నిర్వహించగా, భూ సమస్యల పరిష్కారానికి 8.60 లక్షల మంది దరఖాస్తులు చేసుకున్నారని చెప్పారు. ఆగస్టు 15 నాటికి వీటిలోని న్యాయమైన సమస్యలన్నింటినీ పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఏపీ ప్రభుత్వం నిర్మిస్తున్న బనకచర్ల ప్రాజెక్టుపై నాడు కేసీఆర్ నోరు విప్పకుండా.. నేడు తమ ప్రభుత్వంపై విమర్శలు చేయడం తగదని అన్నారు. కాళేశ్వరం కుంభకోణాన్ని దాచిపెట్టడం కోసమే ప్రభుత్వంపై ఆరోపణలు చేస్తున్నారని ధ్వజమెత్తారు. ఈ కార్యక్రమంలో శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య, భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్సీలు శంకర్‌నాయక్, నెల్లికంటి సత్యం, ఎమ్మెల్యేలు బత్తుల లక్ష్మారెడ్డి, కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి, మందుల సామేల్ తదితరులు పాల్గొన్నారు.

యాదగిరి క్షేత్రంలో భక్తుల రద్దీ



ప్రసాద విక్రయశాలలో బారులుదీరిన భక్తులు

యాదగిరిగుట్ట: యాదగిరి శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి ఆలయంలో భక్తుల రద్దీ నెలకొంది. ఆదివారం సెలవు రోజుతో పాటు ఏకాదశి కావడంతో శ్రీస్వామి వారిని దర్శించుకునేందుకు భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. దీంతో ఆలయ పరిసరాలు, మాడ వీధులు, క్యూకాంప్లెక్స్, ప్రసాద విక్రయశాల, బస్టాండ్ వంటి ప్రాంతాలు భక్తులతో కిటకిటలాడాయి. కొండపైకి వాహనాల రద్దీ సైతం పెరిగింది. బస్టాండ్, వీఐపీ పార్కింగ్ ప్రాంతాలకు భక్తులు తమ వాహనాల్లో రావడంతో పూర్తిగా నిండిపోయాయి. దీంతో రుసుము చెల్లించి పైకి వచ్చే వాహనాలను కొద్ది సేపు నిలిపివేసి, పంపించారు. కాగా శ్రీస్వామివారి ధర్మ దర్శనానికి 3 గంటలకు పైగా సమయం పట్టగా, వీఐపీ దర్శనానికి గంట సమయం పట్టింది. శ్రీస్వామి వారిని 40 వేల మందికి పైగా భక్తులు దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు.

రూ.3 వేలు.. 200 ట్రిప్పులు

- టోల్‌ప్లాజాలకు ఫాస్టాగ్ పాస్‌ల నోటిఫికేషన్లు
- రాజ్‌మార్గ్ యాత్ర యాప్ ద్వారా జారీ
- ఆగస్టు 15 నుంచి అమలు



గూడూరు టోల్‌ప్లాజా

బీబీనగర్: టోల్‌ప్లాజాల గుండా ప్రయాణించే వాహనదారుల రాకపోకలు సులభతరం అయ్యేలా కేంద్ర ప్రభుత్వం నూతన విధానానికి శ్రీకారం చుట్టింది. వాహనదారుల సాఫీగా ప్రయాణించేలా ఏడాది పాటు చెల్లుబాటు అయ్యే ఫాస్టాగ్ పాస్‌ల సౌకర్యం కల్పించనున్నట్లు కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ ఇటీవల ప్రకటించారు. ఈ నేపథ్యంలో టోల్‌ప్లాజాల అధికారులకు సైతం పాస్‌ల జారీకి సంబంధించి వివరాలతో నోటిఫికేషన్లు జారీ చేశారు. జాతీయ రహదారిపై ప్రయాణించే వాహనదారులు ఏడాదికి ఫాస్టాగ్ పాస్‌కు గాను ఒకసారి రూ.3 వేలు చెల్లిస్తే 200 సార్లు ఉచితంగా ప్రయాణించే సౌకర్యం కల్పించనున్నారు. ఒకవేళ ఏడాది వ్యవధి ముగిసేలోపు 200 సార్లు ప్రయాణించకపోయినా పాస్ కాల పరిమితి ముగిసిపోతుంది. ఒకవేళ ఏడాది ముగిసే ముందే 200 ట్రిప్పులు పూర్తి అయిపోతే పాస్ గడువు ఉన్నా ఇక అది పనిచేయదు. అప్పుడు రెన్యువల్ చేసుకోవాల్సి ఉంటుంది. ముఖ్యమైన విషయం ఏమిటంటే వాహనాం ఒక్కో టోల్‌ప్లాజా దాటినప్పుడల్లా ఒక్కో ట్రిప్పుగా పరిగణిస్తారు. ఆగస్టు 15 నుంచి అమలయ్యే ఈ వార్షిక ఫాస్టాగ్ పాస్‌ను.. కార్లు, జీపులు, వ్యాన్లు, నాన్ కమర్షియల్ వాహనాలు కలిగిన వారు రవాణా శాఖ ప్రవేశ పెట్టనున్న రాజ్‌మార్గ్ యాత్ర ఆన్‌లైన్ యాప్‌ను మొబైల్ ద్వారా డౌన్‌లోడ్ చేసుకొని అందులో నేరుగా పాస్‌ను పొంది రీచార్జ్ చేసుకోవచ్చు.

డబ్బులు ఆదా చేసుకోవచ్చు

జాతీయ రహదారులపై నిత్యం రాకపోకలు సాగించే వారు ఈ పాస్ వినియోగం ద్వారా డబ్బులు ఆదా చేసుకోవచ్చు. నెలవారీ ఫాస్టాగ్ పాస్ చార్జీలతో పోలిస్తే వార్షిక పాస్‌లతో రూ.1,000 వరకు ఆదా అవుతుందని, ఒక్కో ట్రిప్‌కు రూ.15 మాత్రమే ఖర్చు అవుతుందని టోల్‌ప్లాజా అధికారులు చెబుతున్నారు. కమర్షియల్ వాహనదారులు వార్షిక పాస్‌లు పొందే అవకాశం లేదని భువనగిరి జిల్లా బీబీనగర్ మండలం గూడూరు టోల్‌ప్లాజా మేనేజర్ సుధీర్ తెలిపారు.

ఆర్‌ఎంపీ వైద్యం వికటించి వ్యక్తి మృతి

- కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాలో ఘటన



శ్రీనివాస్

దహెగాం (సిర్పూర్): ఆర్‌ఎంపీ వైద్యం వికటించి ఓ వ్యక్తి మృతి చెందాడు. కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా దహెగాం మండలం గెర్రె గ్రామంలో ఈ ఘటన జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. మంచిర్యాల జిల్లా నెన్నెల మండలం గొల్లపల్లి గ్రామానికి చెందిన లింగంపల్లి శ్రీనివాస్ (37) కొన్నిరోజులుగా అర్షమొలలతో బాధపడుతున్నాడు. శనివారం రాత్రి శ్రీనివాస్, భార్య కల్యాణి, తల్లితో కలసి దహెగాం మండలం గెర్రెలోని ఆర్‌ఎంపీ వైద్యుడు బినయ్ సర్కార్ వద్దకు చికిత్స కోసం వెళ్లాడు. చికిత్స అందిస్తుండగా అతడు ఒక్కసారిగా స్పృహ కోల్పోయాడు. వెంటనే శ్రీనివాస్‌ను ఆర్‌ఎంపీ వైద్యుడు తన కారులో దహెగాం మండల కేంద్రానికి తరలిస్తుండగా దారి మధ్యలో కారు అదుపు తప్పి పొలాల్లోకి దూసుకెళ్లింది. దీంతో కుటుంబ సభ్యులు 108 అంబులెన్స్‌ను పిలిపించి తొలుత దహెగాం పీహెచ్‌సీకి, అక్కడి నుంచి బెల్లంపల్లికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు.

రోడ్డు ప్రమాదంగా చిత్రీకరించే యత్నం?

ఆర్‌ఎంపీ డాక్టర్ బినయ్ వైద్యంతోనే శ్రీనివాస్ స్పృహ కోల్పోగా.. అది తనపైకి రాకుండా ఉండేందుకు ఆయన కారును పొలాల్లోకి దించి రోడ్డు ప్రమాదంగా చిత్రీకరించే ప్రయత్నం చేశాడని శ్రీనివాస్ కుటుంబ సభ్యులు ఆరోపించారు. ఈ ఘటనతో ఆర్‌ఎంపీ పరారైనట్లు తెలిపారు. ఆదివారం దహెగాం ఎస్సై విక్రమ్ బెల్లంపల్లి ప్రభుత్వాస్పత్రికి చేరుకుని వివరాలు సేకరిస్తుండగా, మృతుడి బంధువులు వాగ్వాదానికి దిగారు. న్యాయం చేయాలంటూ ఆసుపత్రి ఎదుట ప్రధాన రహదారిపై వారు బైఠాయించారు. బెల్లంపల్లి ఏసీపీ రవికుమార్ సంఘటన స్థలానికి చేరుకొని బాధిత కుటుంబ సభ్యులతో మాట్లాడారు. న్యాయం చేస్తామని హామీ ఇవ్వడంతో వారు ఆందోళన విరమించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

కిడ్నాప్ చేసి... దారుణంగా హతమార్చి

- ఏడు రోజుల తర్వాత వెలుగుచూసిన సర్వేయర్ మృతదేహం
- పథకం ప్రకారం కర్నూలుకు చెందిన ఓ ముఠాకు సుపారీ



తేజేశ్వర్

గద్వాల క్రైం: 'తక్కువ ధరకు సాగు భూములు కావాలి.. మీ జిల్లాలో భూములు చూపిస్తే కొనుగోలు చేస్తాం .. మీకు తగిన డబ్బులు ఇస్తామని నమ్మించి ఓ ప్రైవేట్ సర్వేయర్‌ను వ్యూహాత్మకంగా కిడ్నాప్ చేసి ఆపై దారుణంగా హత్య చేశారు. వివరాల్లోకి వెళితే...గద్వాలకు చెందిన తేజేశ్వర్ (32)కు కర్నూలు జిల్లాలోని కల్లూరుకు చెందిన సహస్రతో గత మే 18వ వివాహం జరిగింది. ఈనెల 17వ తేదీన తన స్నేహితులకు వ్యవసాయ భూములు చూపించాలని భర్త తేజేశ్వర్‌కు సహస్ర తెలిపింది. అదేరోజు ఉదయం కర్నూలు జిల్లాకు చెందిన గుర్తు తెలియని వ్యక్తులు తేజేశ్వర్‌ను ఫోన్‌లో సంప్రదించారు. పట్టణంలోని కృష్ణారెడ్డి బంగ్లా సమీపంలో ఉన్నామని చెప్పి తేజేశ్వర్‌లో కారులో తీసుకెళ్లి గద్వాల జిల్లాలోని పలు ప్రాంతాల్లో వ్యవసాయేతర భూములను పరిశీలించారు. అక్కడితో మొదలైన ప్రయాణం 7రోజుల తర్వాత నంద్యాల జిల్లా పాణ్యం సమీపంలోని పిన్నాపురంలో తేజేశ్వర్ దారుణ హత్యకు గురైనట్టు పోలీసులు గుర్తించారు.

కర్నూలు జిల్లా ఆస్పత్రిలో పోస్టుమార్టం

తేజేశ్వర్ మృతదేహాన్ని పోలీసులు పోస్టుమార్టం నిమిత్తం కర్నూలు జిల్లా ఆస్పత్రికి తరలించారు. శరీర భాగాలపై దాదాపు ఎనిమిది కత్తి గాట్లు, మెడ విరిచినట్టు గుర్తులు ఉన్నాయి. ఆరు రోజుల క్రితమే మృతిచెందినట్టు వైద్యులు గుర్తించారు. ఆదివారం సాయంత్రం 4 గంటల సమయంలో పోస్టుమార్టం ప్రక్రియ పూర్తి కావడంతో మృతదేహాన్ని బాధిత కుటుంబ సభ్యులకు అప్పగించారు. అక్కడి నుంచి గద్వాలకు అంబులెన్స్‌లో తరలించారు.

నిందితులను త్వరలో పట్టుకుంటాం: డీఎస్పీ మొగిలయ్య

అదృశ్యమైన తేజేశ్వర్ దారుణ హత్యకు గురైనట్టు పోలీసు ప్రాథమిక విచారణలో తేలిందని డీఎస్పీ మొగిలయ్య చెప్పారు. హత్యకు గల కారణాలు, నిందితులు ఎవరనేది విచారణలో వెలుగులోకి వస్తుందని, త్వరలోనే అన్ని వివరాలను వెల్లడిస్తామన్నారు. మిస్సింగ్ కేసు ఛేదనలో సీఐ శ్రీను, ఎస్సై కల్యాణ్‌కుమార్, సాంకేతిక విభాగ సిబ్బంది శ్రమించారని తెలిపారు.

పక్కా ప్రణాళికతోనే...

పక్కా ప్రణాళికతోనే తేజేశ్వర్‌ను కర్నూలు జిల్లాకు చెందిన ఓ ముఠా సభ్యులు కిడ్నాప్ చేశారని మృతుడి కుటుంబ సభ్యులు చెబుతున్నారు. సహస్రతోపాటు ఆమె తల్లి సుజాతకు కర్నూలు జిల్లాలోని ఓ బ్యాంకు అధికారి సన్నిహితంగా ఉండటంతో ఈ హత్యకు పథకం రచించి ఉంటారని తేజేశ్వర్ కుటుంబసభ్యులు ఆరోపిస్తున్నారు. తేజేశ్వర్‌తో నిశ్చితార్థం అయ్యాక.. సహస్ర పెళ్లికి నిరాకరించి ఇంట్లో నుంచి బయటకు వెళ్లినట్టు వివరించారు. ఇరువురి కుటుంబ సభ్యులు పెద్దల పంచాయితీతో నిశ్చితార్థాన్ని రద్దు చేశారు. ఆ తర్వాత తేజేశ్వర్ సహస్రను ఇష్టపూర్వకంగా పెళ్లి చేసుకుంటానని పెద్దలను ఒప్పించి గత నెల 18వ తేదీన వివాహం చేసుకున్నాడు. అయితే మృతుడి భార్య, అత్త, ఓ బ్యాంకు ఉద్యోగి కలిసి ఈ దారుణానికి కుట్ర పన్ని ఉంటారని తేజేశ్వర్ కుటుంబసభ్యులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

హైదరాబాద్–బెంగళూరు.. డిఫెన్స్ కారిడార్!

▶ మొదటి పేజీ తరువాయి

రైతుల నుంచి సేకరించాలని అధికారులు అప్పట్లో నిర్ణయించారు. డీఆర్‌డీఎల్ డైరెక్టర్ జీఏ శ్రీనివాసమూర్తి, జనరల్ ఆఫ్ బ్రహ్మోస్ డైరెక్టర్ జైతీర్థ్ జోషి, బ్రహ్మోస్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎస్.సాంబశివప్రసాద్ ఇటీవల చౌదర్‌పల్లి–బస్వాయిపల్లి మధ్య స్థలాన్ని పరిశీలించారు. దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి, తహసీల్దార్లు అక్కడ 497 ఎకరాల వరకు భూమి లభ్యత ఉందని మ్యాప్ ఆధారంగా వివరించారు. రాష్ట్ర ప్రభుత్వ వాటాగా 200 ఎకరాల వరకు ప్రభుత్వ భూమిని ఉచితంగా ఇస్తామని రాష్ట్ర పెద్దలు శాస్త్రవేత్తల బృందానికి వెల్లడించారు. మిగతా 200 ఎకరాలను కూడా ప్రభుత్వ ఆధ్వర్యంలో సేకరించి ఇస్తామని.. దీనికి సంబంధించి పరిహారం మాత్రం కేంద్రం భరించేలా ప్రతిపాదనలు చేసినట్లు సమాచారం. జాతీయ రహదారులు 167, 44కు మధ్య ఈ భూములు ఉండటం.. అటు హైదరాబాద్, ఇటు బెంగళూరుకు రైలు, విమాన మార్గాల కనెక్టివిటీ ఉండటంతో శాస్త్రవేత్తల బృందం అందుకు సానుకూలత వ్యక్తం చేసినట్లు తెలిసింది.

'మేక్ ఇన్ ఇండియా'లో భాగంగా..

కేంద్ర ప్రభుత్వం 'మేక్ ఇన్ ఇండియా'లో భాగంగా రక్షణ రంగంలోనూ స్వదేశీ పరిజ్ఞానంతో క్షిపణులు సహా ఇతర ఆయుధాలు, అంతరిక్ష రంగానికి సంబంధించిన ఉత్పత్తుల తయారీకి పెద్దపీట వేస్తోంది. ఈ క్రమంలో వెనుకబడిన పాలమూరులో బ్రహ్మోస్ మిస్సైల్ తయారీ యూనిట్, హైదరాబాద్–బెంగళూరు డిఫెన్స్ కారిడార్ ఏర్పాటుకు అడుగులు పడుతుండటంపై ఉమ్మడి జిల్లాలో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. ప్రధాన యూనిట్‌తోపాటు మిస్సైల్ విడిభాగాలు, ఇతరత్రా పరిశ్రమలు పెద్ద ఎత్తున వెలిసే అవకాశాలు ఉండటంతో దీనివల్ల ప్రత్యక్షంగా, పరోక్షంగా సుమారు 8 వేల నుంచి 10 వేల మందికి స్థానికంగా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయని అంచనా.

ఉమ్మడి జిల్లాకు మేలు..



మహబూబ్‌నగర్ జిల్లాలో బ్రహ్మోస్ తయారీ యూనిట్ ఏర్పాటు చేయాలని సీఎం రేవంత్‌రెడ్డి కృత నిశ్చయంతో ఉన్నారు. దీని ద్వారా హైదరాబాద్–బెంగళూరు డిఫెన్స్ కారిడార్‌కు అడుగులు పడతాయి. తద్వారా వెనుకబడిన ఉమ్మడి పాలమూరు జిల్లాకు మేలు జరుగుతుంది. యువతకు పెద్ద ఎత్తున ఉద్యోగ, ఉపాధి అవకాశాలు దక్కుతాయి. దేవరకద్ర నియోజకవర్గానికి ప్రపంచపటంలో ప్రత్యేక స్థానం లభిస్తుంది.

– జి.మధుసూదన్‌రెడ్డి, దేవరకద్ర ఎమ్మెల్యే



పత్తికి కరువైన వాన

రామన్నపేట: యాదాద్రి భువనగిరి జిల్లా రామన్నపేట మండలంలో మే చివరి వారం, జూన్ మొదటి రెండు వారాల్లో కురిసిన వర్షాలకు రైతులు పత్తి విత్తనాలు నాటారు. ఆ తరువాత వరుణుడు ముఖం చాటేశాడు. పక్షం రోజులుగా వర్షాలు కురవడం లేదు. నాటిన విత్తనాల్లో కొన్ని మొలిచాయి. సగం కంటే ఎక్కువగా భూమిలోని తేమకు పగిలి మోసు వచ్చి పాడైపోయాయి. మొలిచిన మొక్కలు వాడిపోతున్నాయి. వాటిని కాపాడేందుకు రైతులు కూలీలను పెట్టి నీళ్లు పోయించడం, గుంటుకలు తోలడం చేస్తున్నారు. గింజలు మొలవని చోట తిరిగి విత్తవలసి వస్తోంది. తిరిగి గింజలు నాటడం వల్ల ఎకరాకు అదనంగా మరో రూ.ఐదారువేల ఖర్చు వస్తోంది.

జాలి లేని వాన.. కుండ నీటితో పంట పండేనా!



ఆత్మకూరు (ఎస్)(సూర్యాపేట): ముందస్తు వర్షాలతో రైతాంగం వేలాది రూపాయలు ఖర్చు చేసి పత్తి సాగు చేపట్టింది. పదిహేను రోజులుగా చినుకు జాడ లేకపోవడంతో గింజలు మొలకెత్తే పరిస్థితి లేదు. ఈ క్రమంలో సూర్యాపేట జిల్లా ఆత్మకూరు (ఎస్) మండల కేంద్రానికి చెందిన బట్టిపెల్లి వెంకన్న అనే రైతు.. వరి సాగును పక్కన పెట్టేశాడు. తనకున్న రెండు బోర్ల సహాయంతో రెండు ఎకరాల్లో విత్తుకున్న పత్తి గింజలకు నీటి తడులను అందిస్తున్నాడు. ఇప్పటికే రెండు విడతలుగా నీటిని అందించాడు. మూడోసారి నీరందించే సమయంలో పత్తి సాలులో ఉన్న గింజకు తడి అందకపోవడంతో.. కుండలతో నీరందించేందుకు భగీరథ ప్రయత్నం చేస్తున్నాడు.

ఘర్షణలు వెంటనే ఆగాలి

ఇరాన్ ప్రధానితో ఫోన్‌లో మాట్లాడిన మోదీ

న్యూఢిల్లీ: ఇజ్రాయెల్–ఇరాన్ ఘర్షణల పట్ల భారత ప్రధాని నరేంద్ర మోదీ తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ఆయన ఆదివారం ఇరాన్ ప్రధానమంత్రి మసౌద్ పెజెష్కియాన్‌తో ఫోన్‌లో మాట్లాడారు. పశ్చిమాసియాలో తక్షణమే శాంతి నెలకొనాలని తాము కోరుకుంటున్నట్లు చెప్పారు. ఇజ్రాయెల్–ఇరాన్ మధ్య ఘర్షణలు ఆగిపోవాలన్న తమ ఆకాంక్ష అని తెలిపారు. ఉద్రిక్తతలకు తెరదించడమే లక్ష్యంగా ఇరు దేశాలు వెంటనే చర్చలు ప్రారంభించాలని కోరారు. వివాదాలను దౌత్య మార్గాల్లో పరిష్కరించుకోవాలని సూచించారు. తాజా పరిణామాలపై ఇరాన్ అధ్యక్షుడితో చర్చించానని ప్రధాని మోదీ 'ఎక్స్'లో పోస్టు చేశారు.

ఇజ్రాయెల్ గగనతలం మూసివేత

దుబాయ్: ఇరాన్ అణుకేంద్రాలపై అమెరికా దాడుల నేపథ్యంలో ఇజ్రాయెల్ గగన తలాన్ని మూసివేసింది. విమాన రాకపోకలను పూర్తి స్థాయిలో నిలిపేసినట్లు ఇజ్రాయెల్ ఎయిర్ పోర్ట్ అథారిటీ ఆదివారం ప్రకటించింది. ప్రస్తుతం నెలకొన్న పరిస్థితుల దృష్ట్యా గగన తలాన్ని మూసేస్తున్నామని, అది ఎంతకాలం కొనసాగుతుందనేది స్పష్టంగా చెప్పలేమని తెలిపింది.

మరో 311 మంది స్వదేశానికి

న్యూఢిల్లీ: పశ్చిమాసియాలో తీవ్ర ఉద్రిక్తతల నేపథ్యంలో ఇరాన్‌లో చిక్కుకుపోయిన భారతీయులను స్వదేశానికి తీసుకువచ్చే బృహత్ కార్యక్రమం కొనసాగుతోంది. తాజాగా, ఇరాన్‌లోని మషాద్ నుంచి 311 మంది భారతీయులు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన విమానంలో ఆదివారం ఉదయం ఢిల్లీకి చేరుకున్నారు. దీంతో, శుక్రవారం నుంచి ఇప్పటి వరకు ఇరాన్‌లోని 1,428 మందిని క్షేమంగా తీసుకు వచ్చామని విదేశాంగ శాఖ ప్రతినిధి రణధీర్ జైశ్వాల్ వివరించారు.

ఇరాన్‌లో 865 మంది మృతి

3,396 మందికి గాయాలు:హక్కుల సంఘం

దుబాయ్: ఇరాన్‌పై ఇజ్రాయెల్ సాగిస్తున్న వైమానిక దాడుల్లో కనీసం 865 మంది చనిపోగా, 3,396 మంది క్షతగాత్రులయ్యారని అమెరికాకు చెందిన హ్యూమన్ రైట్స్ యాక్టివిస్ట్స్ గ్రూప్ ఆదివారం తెలిపింది. మృతుల్లో 363 మంది పౌరులు కాగా, 215 మంది భద్రతా సిబ్బంది ఉన్నారని వివరించింది. ఇరాన్ మీడియాలో వచ్చే వార్తలను పరిగణనలోకి తీసుకుంటూ తమకున్న దేశవ్యాప్త నెట్‌వర్క్ ద్వారా ఈ అంచనాకు వచ్చినట్లు వివరించింది.

సరిపడా చమురు నిల్వలు: కేంద్ర మంత్రి హర్దీప్

న్యూఢిల్లీ: పశ్చిమాసియాలో తీవ్ర ఉద్రిక్తతల కారణంగా హోర్ముజ్ జలసంధి మీదుగా చమురు రవాణాకు ఏర్పడిన ఆటంకంపై కేంద్ర చమురు శాఖ మంత్రి హర్దీప్ సింగ్ పూరి స్పందించారు. దేశంలో కొన్ని వారాలకు సరిపడా చమురు నిల్వలున్నాయని చెప్పారు. సరఫరాను స్థిరీకరిస్తామని చెప్పారు. మనకు అనేక మార్గాల ద్వారా ఇంధనం సరఫరా అవుతుందని, ఎక్కడా ఆటంకం కలిగే అవకాశం లేదని ఆయన చెప్పారు. మనం అందుకునే చమురు, గ్యాస్‌లో అత్యధిక భాగం హోర్ముజ్ ద్వారా రావడం లేదని ఆయన వివరించారు. భారత్ ప్రపంచంలోనే మూడో అతిపెద్ద చమురు దిగుమతిదారు, నాలుగో అతిపెద్ద గ్యాస్ కొనుగోలుదారు కావడం గమనార్హం. అమెరికా తమపై దాడి చేస్తే హోర్ముజ్‌ను మూసివేస్తామని ఇరాన్ హెచ్చరిస్తుండటం తెల్సిందే. పశ్చిమాసియా నుంచి చమురు సరఫరాకు ప్రధాన మార్గం హోర్ముజ్ జలసంధి. మనకు నిత్యం రవాణా అయ్యే 5.5 మిలియన్ బ్యారెళ్ల చమురులో 2 మిలియన్ల బ్యారెళ్లు మాత్రమే హోర్ముజ్ ద్వారా సరఫరా అవుతుందని మంత్రి పేర్కొన్నారు.

బాహుబలి బాంబు

అత్యంత ఎత్తు నుంచి అమితమైన వేగంతో దూసుకొచ్చే బంకర్ బస్టర్‌బాంబు

ఎప్పుడెప్పుడా అని ఇజ్రాయెల్ ఎంతో ఆశగా ఎదురుచూసినా బంకర్ బస్టర్ బాంబులను అమెరికా మోసుకొచ్చింది. అనుకున్న లక్ష్యాలపై అమాంతం పడేసింది. పర్వతప్రాంతాన్ని పిండిముద్దలా బద్దలుకొట్టింది. అత్యంత పటిష్ఠమైన కఠినశిలలను సైతం తునాతునకలు చేసే వేల కేజీల బరువైన భారీ బాంబులతో ఇరాన్ అణుకేంద్రాలపై భీకర దాడులుచేసిన అమెరికా బీ–2ఏ స్పిరిట్ స్టెల్త్ బాంబర్ విమానాల గురించి, అవి ప్రయోగించిన భారీ బంకర్ బస్టర్ బాంబుల గురించే ఇప్పుడంతా మాట్లాడుకుంటున్నారు. భూతలం మీది లక్ష్యాలను తునాతునకలుచేసే బాంబులను ప్రయోగించడం సర్వసాధారణం. కానీ ఇలా భూగర్భంలోని లక్ష్యాలను సైతం అలవోకగా ఛేదించి ఛిన్నాభిన్నంచేయగల శక్తివంతమైన పేలుడు ఆయుధాన్ని అమెరికా ఇటీవలికాలంలో ఎప్పుడూ ప్రయోగించలేదు. మిత్రదేశానికి సాయంగా ఇరాన్ యుద్ధంలో అడుగుపెట్టిన తొలిరోజే భారీబాంబులతో యుద్ధాన్ని అమెరికా కొత్త మలుపు తిప్పింది.



బాంబు బరువు 13,600 కిలోలు

ఇరాన్‌లోని ఫోర్డో, నతాంజ్, ఇస్ఫహాన్ యురేనియం శుద్ధికర్మాగారాలపై ప్రయోగించిన జీబీయూ–57 ఏ/బీ మ్యాసివ్ ఆర్డినెన్స్ పెనిట్రేటర్(ఎంఓపీ) గైడెడ్ బాంబు బరువు ఏకంగా 13,600 కిలోలు. ఒక్కో బాంబు ఖరీదు రూ.170 కోట్లు. భూమిలోపల మరింత లోతుల్లో నిర్మించిన బంకర్లు, సొరంగాలను భూస్థాపితం చేయడమే లక్ష్యంగా అమెరికా వైమానికదళం కోసం ఈ బాంబులను రూపొందించారు. ఒక గది పరిమాణంలో పిండిముద్దపై ఎంతపెద్ద రాయి పడేస్తే అంతలోతుకు అది వెళ్తుందికదా. అలాగే ఎంత భారీ బరువైన బాంబును పడేస్తే తొలుత అది అంతలోతుకు వెళ్తుంది. తర్వాత అది పేలుతుంది. అత్యంత లోతుల్లోకి చేరేందుకు అనువుగా ఈ బాంబును అత్యంత ఎత్తులోంచి జారవిడుస్తారు. అడ్డంగా పడిపోకుండా నిటారుగా, బాణంలాగా భూమికి గుచ్చుకునేలా బాంబు కొనకు జీపీఎస్ ట్రాకర్ అమర్చుతారు.

మెరుపువేగంతో దూసుకొచ్చి..

ఈ బాంబు పొడవు 20 అడుగులు. మొత్తం బాంబు బరువులో 80 శాతం బాడీ బరువే ఉంటుంది. మొత్తం వార్‌హెడ్‌లో కేవలం 20 శాతం మాత్రమే పేలుడుపదార్థం ఉంటుంది. తొలుత ఎక్కువ లోతుల్లోకి వెళ్లాలనే ఉద్దేశ్యంతో ఇలా దీనిని డిజైన్‌చేశారు. నేలను తాకినప్పుడు బయటిపార ధ్వంసంకాకుండా ఉండేందుకు అత్యంత పటిష్ఠమైన ఫెర్రో–కోబాల్ట్ లోహమిశ్రమ కవచాన్ని అమర్చుతారు. చాలా లోతుకు వెళ్లాలంటే మరింత వేగంగా కిందకు పడాలి. అందుకోసం ఇది సూపర్‌సోనిక్ వేగంతో కిందకు దూసుకొస్తుంది. బరువు, వేగం, దిశ ఇలా అన్ని కలిసి దీనిని అత్యంత శక్తివంతమైన ఆయుధంగా మార్చేశాయి. .

ఆగకుండా 61 మీటర్లు చొచ్చుకెళ్లి..

అత్యంత కఠినమైన శిలాప్రాంతంపై పడినా ఇది ఖచ్చితంగా 61 మీటర్ల లోతు అంటే 200 అడుగుల లోతు వరకు వెళ్లగలదు. అక్కడ ఇది పేలి ఆ ప్రాంతం మొత్తాన్ని నామరూపాల్లేకుండా తునాతునకలు చేస్తుంది. అయితే ఆ లోతులో అణుకేంద్రం లేకుంటే ఎలా అనే సందేహం రావొచ్చు. మొదటి బాంబు పేలిన చోటే అత్యంత ఖచ్చితంగా మరో బాంబును పడేస్తారు. అది పేలి మరింత లోతు వరకు భూమిని పెకలించివేసి పెను విస్ఫోటనం సృష్టిస్తుంది. అలా అవసరమైనన్ని బాంబులను ఒకేచోట ఒకదాని వెంట మరోటి పడేసి లక్ష్యాన్ని ఎలాగైనా బద్దలుకొడతారు. కొత్తింటి కోసం బోరు వేసినప్పుడు ఉక్కు కేసింగ్‌లు ఎలాగైతే ఒకదాని వెంట మరోటి జతచేస్తూ రంధ్రం లోతును పెంచుకుంటూ పోతారో యుద్ధంవేళ ఈ బాంబులతో అలా భూగర్భ నిర్మాణాలను నాశనంచేసే దాకా ఒకేచోట బాంబులను ప్రయోగిస్తారు. ఆదివారం అమెరికా జీబీయూ–57 ఏ/బీ మ్యాసివ్ ఆర్డినెన్స్ పెనిట్రేటర్(ఎంఓపీ) బాంబు ఇదే పనిచేసింది.

బాంబుకు తగ్గ విమానం



ఇంతటి బరువైన బాంబులను అలవోకగా మోస్తూ అత్యంత ఎత్తుల్లో ప్రయాణించగల సామర్థ్యమున్న బాంబర్‌విమానానికి మాత్రమే ఇంతటి సత్తా ఉంటుంది. అమెరికా అమ్ము ల పొది లోని బీ–2 స్పిరిట్ స్టెల్త్ బాంబర్ విమా నం మాత్ర మే ఈ పనిచేయగలదు. అందుకే ట్రంప్‌సేన వీటిని కదనరంగంలో మొహరించి ఇరాన్ అణుక్షేత్రాలపై మెరుపుదాడులు చేయించింది. బాంబులను అమర్చకముందు ఈ స్టెల్త్ విమానం బరువు ఏకంగా 71,000 కేజీలు. ఇది ఒకేసారి రెండు ఎంఓపీ బాంబులను మోసుకెళ్లగలదు. ఒక్కో విమానం ఖరీదు ఏకంగా రూ.18,000 కోట్లు. ఈ విమానాన్ని నార్త్‌రోప్ గ్రుమ్మన్ అనే ఆయుధ తయారీసంస్థ తయారుచేసి అమెరికా ఆర్మీకి విక్రయించింది. ఈ విమానం ఎక్కడా ఆగకుండా ఏకధాటిగా 11,000 కిలోమీటర్లు ప్రయాణించగలదు. మార్గమధ్యంలో ఇంధనాన్ని గాల్లోనే నింపుకుంటే మరో 7,500 కి.మీ.లు ప్రయాణించి బాంబులేస్తుంది.

- సాక్షి, నేషనల్ డెస్క్

25 నిమిషాల్లో 'ఆపరేషన్ మిడ్‌నైట్ హ్యామర్'

వాషింగ్టన్: ఇరాన్ అణు కేంద్రాలే లక్ష్యంగా చేపట్టిన 'ఆపరేషన్ మిడ్‌నైట్ హ్యామర్' విజయవంతమైందని అమెరికా జాయింట్ చీఫ్స్ ఆఫ్ స్టాఫ్ చైర్మన్ జనరల్ డేనియల్ కెయినీ చెప్పారు. ఈ మొత్తం ఆపరేషన్ కేవలం 25 నిమిషాల్లోనే ముగిసిందని తెలిపారు. ఆయన ఆదివారం మీడియా సమావేశంలో మాట్లాడారు. తమ సైన్యానికి ఇరాన్‌లో గగన తల రక్షణ వ్యవస్థ నుంచి ఎలాంటి ప్రతిఘటన ఎదురుకాలేదని, ఆపరేషన్ పూర్తయిన వెంటనే తమ విమానాలు క్షేమంగా తిరిగివచ్చా యని స్పష్టం చేశారు. ఆపరేషన్ మిడ్‌నైట్ హ్యామ ర్‌లో ఏడు స్టెల్త్ బి–2 బాంబర్లు పాల్గొన్నాయని తెలిపా రు. ఈ బాంబర్లు 14 భారీ ఆర్డినెన్స్ పెనెట్రేటర్ బాంబులను(బరువు 13,600 కిలోలు) ఫోర్డో, నతాంజ్ అణు కేంద్రాలపై జారవిడిచాయని పేర్కొన్నారు. అలాగే టోమాహాక్ క్షిపణులు ఇస్ఫహాన్ అణు కేంద్రాన్ని ధ్వంసం చేశాయని వివరించారు.

ఏడు బి-2 స్పిరిట్ బాంబర్లు

''2001 సెప్టెంబర్ 11 దాడుల తర్వాత బి–2 స్టెల్త్ బాంబర్లు ఈ స్థాయిలో భారీ ఆపరేషన్‌లో పాల్గొనడం ఇదే మొదటిసారి. మిస్సోరీ నుచి బాంబర్లు బయలుదేరాయి. అమె రికా కాలమానం ప్రకారం శనివారం సాయంత్రం 6.40 గంటలకు మూడు అణు కేంద్రాలపై దాడులు మొదల య్యాయి. 7.05 గంటలకు మా విమానాలు ఇరాన్ గగనతలం నుంచి బయటకు వచ్చేశాయి. 14 బంకర్- బస్టర్ బాంబులు, 24కుపైగా టోమాహాక్ క్షిపణులు ప్రయో గించాం. పశ్చిమాసి యాలో ఇటీవల ఉద్రిక్తతలు ప్రారంభమైన అనంతరం ఇరాన్‌పై మా అతిపెద్ద దాడి ఇదే. ఏడు బి–2 స్పిరిట్ బాంబర్లతో విరుచుకుపడ్డాం. ఒక్కోదాంట్లో ఇద్దరు సిబ్బంది ఉన్నారు. నిశ్శబ్దంగా వెళ్లి పని పూర్తి చేసుకొని వచ్చారు.

ఇరాన్ అణు కేంద్రాలపై 14 బంకర్-బస్టర్ బాంబులు జారవిడిచాం

అమెరికా జాయింట్ చీఫ్స్ ఆఫ్ స్టాఫ్ చైర్మన్ జనరల్ కెయినీ వెల్లడి



కొద్దిమందికే తెలుసు

ఇరాన్‌పై ఆపరేషన్ గురించి అమెరికా ప్రభుత్వ ముఖ్యుల్లో, సైనిక వ్యూహకర్తల్లో చాలా కొద్దిమందికే తెలుసు. అమెరికా జలాంతర్గామి నుంచి ఇస్ఫహాన్ అణు కేంద్రంపై 24కుపైగా టోమాహాక్ ల్యాండ్ అటాక్ క్రూయిజ్ మిస్సైళ్లు ప్రయోగించాం . ఉపరితలంపైనున్న మౌ లిక సదుపాయాలను నేలమట్టం చేశాం. సాయంత్రం 6.40 గంటలకు బి–2 బాంబర్లు రెండు భారీ బంకర్–బస్టర్ బాంబులను ఫోర్డో న్యూక్లియర్ సైట్‌పై జారవిడిచాయి. మిగిలిన బాంబర్లు వాటి లక్ష్యాలను విజయవంతంగా ఛేదించాయి. చివరి దాడి ఇస్ఫహాన్‌పై టోమాహాక్ క్షిపణితో జరిగింది. రాత్రి 7.05 గంటల కల్లా ఆపరేషన్ ముగిసింది. ఇరాన్‌కు చెందిన సర్ఫేస్–టు–ఎయిర్ క్షిపణి వ్యవస్థ మా యుద్ధ విమానాల రాకను గుర్తించలేదు'' అని డాన్ కెయినీ వివరించారు.

ఆపరేషన్ విజయవంతం: పీట్ హెగ్సెత్



ఇరాన్‌పై 'ఆపరేషన్ మిడ్‌నైట్ హామర్' పూర్తిస్థాయిలో విజయవంతమైందని అమెరికా రక్షణ శాఖ మంత్రి పీట్ హెగ్సెత్ స్పష్టంచేశారు. మూడు ఇరాన్ అణు కేంద్రాలు నాశనమయ్యాయని అన్నారు. ఇరాన్ అణ్వాయుధాలు దక్కించుకోవడానికి వీల్లేదని డొనాల్డ్ ట్రంప్ మొదటనుంచీ చెబుతూనే ఉన్నారని గుర్తుచేశారు. ఇరాన్‌తో యుద్ధాన్ని తాము కోరుకోవడం లేదన్నారు. ఇరాన్ ప్రభుత్వం చర్చలకు ముందుకు వస్తుందని భావిస్తున్నట్లు అమెరికా ఉపాధ్యక్షుడు జె.డి.వాన్స్ చెప్పారు. చర్చలకు ఇరాన్‌ను ఒప్పించాలంటూ డొనాల్డ్ ట్రంప్ తన ప్రభుత్వ యంత్రాంగాన్ని ఆదేశించినట్లు సమాచారం. ఇదిలా ఉండగా, ఇజ్రాయెల్ దాడుల్లో ఇరాన్‌లో ఇప్పటివరకు 430 మంది మరణించారని, 3,500 మంది గాయపడ్డారని ఇరాన్ ప్రభుత్వ ఆధ్వర్యంలోని నౌర్‌న్యూస్ వెల్లడించింది. ఇరాన్ దాడుల్లో ఇజ్రాయెల్‌లో 24 మంది మృతిచెందారని, 1,272 మంది గాయపడ్డారని స్థానిక అధికారులు తెలిపారు.

ఏమిటీ టోమాహాక్ క్షిపణులు?

అమెరికా నావికా దళంలో కీలకమైనవి బీజీఎం-109 టోమాహాక్ ల్యాండ్ అటాక్ లాంగ్‌రేంజ్ మిస్సైళ్లు. యుద్ధనౌకలు, జలాంతర్గాముల నుంచి వీటిని అన్ని రకాల వాతావరణ పరిస్థితుల్లో భూఉపరితలంపైనున్న లక్ష్యాలపై ప్రయోగించవచ్చు. 1970వ దశకంలో తొలిసారిగా జనరల్ డైనమిక్స్ కంపెనీ తయారుచేసింది. 12కుపై వేరియంట్లు ఉన్నాయి. టోమాహాక్ క్షిపణి బరువు 1,300 కిలోలు. బూస్టర్‌తో కలిపి రూ.1,600 కిలోలు. పొడవు 5.56 మీటర్లు గంటకు 920 కిలోమీటర్లకుపైగా వేగంతో ప్రయాణించి 2,500 కిలోమీటర్ల దూరంలోని లక్ష్యాన్ని ఛేదించగలదు.

మాట వినకపోతే మళ్లీ దాడులు: ట్రంప్



వాషింగ్టన్: ఇరాన్‌లో కీలకమైన అణు కేంద్రాలను పూర్తిగా ధ్వంసం చేశామని, శిథిలాలుగా మార్చేశామని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించారు. మూడు అణు కేంద్రాలపై అమెరికా సైన్యం దాడులు చేసిన అనంతరం శనివారం రాత్రి ట్రంప్ వైట్‌హౌస్‌లో మాట్లాడారు. అమెరికాపై ప్రతీకార దాడులకు దిగితే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి ఉంటుందని ఇరాన్‌ను హెచ్చరించారు. శాంతి కావాలో, యుద్ధం కావాలో తేల్చుకోవాలని ఆ దేశానికి సూచించారు. భీకర స్థాయి దాడులతో ఇరాన్‌కు గట్టిగా బుద్ధి చెప్పే శక్తి అమెరికాకు మాత్రమే ఉందన్నారు. పశ్చిమాసియాలో ఇరాన్ ఒక దుష్టశక్తిగా మారిందని, ఇతర దేశాలకు ప్రమాదకరంగా పరిణమించిందని మండిపడ్డారు. మాట వినకపోతే ఇకపై జరగబోయే దాడులు మరింత భయానకంగా ఉంటాయని ఇరాన్‌కు తేల్చిచెప్పారు.

ట్రంప్ నిర్ణయం అద్భుతం: నెతన్యాహూ



జెరూసలేం: ఇరాన్ అణు కేంద్రాలపై అమెరికా దాడి చేయడం పట్ల ఇజ్రాయెల్ ప్రధానమంత్రి బెంజమిన్ నెతన్యాహు హర్షం వ్యక్తం చేశారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అద్భుతమైన నిర్ణయం తీసుకున్నారని ప్రశంసించారు. శాంతి కోసమే ఇరాన్‌పై బలప్రయోగం చేపట్టాల్సి వచ్చిందన్నారు. ఈ దాడులతో పశ్చిమాసియాలో రాబోయే రోజుల్లో శాంతి, సౌభాగ్యం, స్థిరత్వం, భద్రత చేకూరుతాయని స్పష్టంచేశారు. నెతన్యాహు ఆదివారం మీడియాతో మాట్లాడారు. చరిత్రను మలుపు తిప్పే నిర్ణయం తీసుకుందని అమెరికాను కొనియాడారు. ప్రపంచంలో ఏ దేశం కూడా చేయలేని సాహసోపేత కార్యాన్ని అమెరికా చేసి చూపించిందని పేర్కొన్నారు. ప్రపంచంలో అత్యంత ప్రమాదకరమైన ఆయుధాలతో ప్రాణాంతక శక్తిగా మారిన ఇరాన్‌కు బుద్ధి చెప్పిన గొప్ప నాయకుడిగా డొనాల్డ్ ట్రంప్‌ను చరిత్ర ఎప్పటికీ గుర్తుంచుకుంటుందని ఉద్ఘాటించారు.

బాధ్యతారాహిత్యం

అమెరికాపై రష్యా ధ్వజం

మాస్కో/బీజింగ్: ఇరాన్‌లోని మూడు అణు స్థావరాలపై భారీ బాంబులతో అమెరికా జరిపిన దాడిని రష్యా తీవ్రంగా ఖండించింది. ఇప్పటికే అనేక సంక్షోభాలతో అట్టుడుకుతున్న పశ్చిమాసియాను మరింత ప్రమాదంలోకి నెట్టడమేనని పేర్కొంది. అమెరికా తన బాధ్యతారాహిత్యంతో అంతర్జాతీయ చట్టాలు, ఐరాస పీఠికను, తీర్మానాలను ఉల్లంఘించిందని మండిపడింది. 'ఒక సార్వభౌమ దేశంపై క్షిపణులు, బాంబులతో దాడులు చేయడం బాధ్యతారహిత చర్య. దీనిని సమర్థించుకునేందుకు ఎన్ని వాదనలు వినిపించినా సరే, ఇది అంతర్జాతీయ చట్టాలకు ఐరాస చార్టర్, భద్రతా మండలి తీర్మానాలను తీవ్రంగా ఉల్లంఘించడమే. భద్రతా మండలిలో శాశ్వత సభ్యత్వం కలిగిన దేశం ఈ దాడులు చేయడం ఆందోళనకరం'అని అమెరికా పేరును ప్రస్తావించకుండా పేర్కొంది. ఇరాన్ అణు కేంద్రాలపై అమెరికా బాంబు దాడులను చైనా సైతం తీవ్రంగా ఖండించింది. ఐరాస చార్టర్‌ను ఉల్లంఘించిన అమెరికా పశ్చిమాసియాలో ఉద్రిక్తతలను మరింత రాజేసిందని పేర్కొంది.

ఆ 3 అణు కేంద్రాలు

ఇరాన్‌లోని కీలకమైన మూడు అణు కేంద్రాలపై అమెరికా సైన్యం అనూహ్యంగా దాడులకు దిగిన నేపథ్యంలో వాటి గురించి క్లుప్తంగా...

1. ఫోర్డో యురేనియం ఎన్‌రిచ్‌మెంట్ ప్లాంట్

టెహ్రాన్‌కు నైరుతి దిశలో 60 మైళ్ల దూరంలో పర్వతం అంతర్భాగంలో 90 మీటర్ల లోతున ఫోర్డో అణుశుద్ధి కేంద్రం ఏర్పాటు చేశారు. నతాంజ్ కంటే ఇది పరిమాణంలో చిన్నదే. వైమానిక దాడుల నుంచి రక్షణతోపాటు అణుపరీక్షల గురించి బాహ్య ప్రపంచానికి తెలియకూడదన్న ఉద్దేశంతో కొండ దిగువన దుర్భేద్యంగా నిర్మించారు. ఫోర్డోను ఇజ్రాయెల్‌తోపాటు పశ్చిమ దేశాలు లక్ష్యంగా చేసుకోవడానికి కారణం ఇది పటిష్ఠ స్థితిలో ఉండడంతోపాటు ఇక్కడ పెద్ద సంఖ్యలో అత్యాధునిక సెంట్రీఫ్యూజ్‌లను బిగించే సామర్థ్యం కలిగి ఉండడం. ఫోర్డోలో సైతం 60 శాతం శుద్ధి చేసిన యురేనిజం నిల్వలున్నాయి. ఈ అణుకేంద్రంపై అమెరికా సైన్యం బి–2 స్పిరిట్ స్టెల్త్ బాంబర్ ద్వారా 30,000 పౌండ్ల బరువైన బంకర్ బస్టర్ (జీబీయూ–57) బాంబును ప్రయోగించినట్లు సమాచారం. ఈ దాడి వల్ల ఫోర్డోకు ఏ మేరకు నష్టం వాటిల్లిందన్నది ఇంకా తెలియరాలేదు. పర్వత ప్రాంతం భారీగా దెబ్బతినడంతోపాటు రంగు మారినట్లు ఉపగ్రహ చిత్రాలను బట్టి తెలుస్తోంది. అమెరికా దాడి చేయడం తథ్యమన్న ముందస్తు అంచనాతో ఫోర్డో నుంచి యురేనియం, సెంట్రీఫ్యూజ్‌లు, కీలక పరికరాలను ఇరాన్ అధికారులు ఇప్పటికే సురక్షిత ప్రాంతాలకు తరలించినట్లు ప్రచారం సాగుతోంది. దీనిపై ఇరాన్ ఎలాంటి ప్రకటన చేయలేదు.

2. నతాంజ్ న్యూక్లియర్ ఫెసిలిటీ

ఇరాన్ రాజధాని టెహ్రాన్‌కు ఆగ్నేయ దిశలో 135 మైళ్ల దూరంలో నతాంజ్ అణుకేంద్రం ఉంది. ఇరాన్‌కు ఇదే అత్యంత ముఖ్యమైన యురేనియం శుద్ధి, నిల్వ కేంద్రం. అణు కార్యక్రమంలో నతాంజ్‌దే కీలక పాత్ర. అమెరికా దాడుల కంటే ముందు ఇక్కడ 60 శాతం శుద్ధి చేసిన యురేనియం నిల్వచేశారు. అణు బాంబు తయారు చేయాలంటే 90 శాతం శుద్ధి చేసిన యురేనియం అవసరం. అంటే అణు బాంబు తయారీకి ఇరాన్ చాలా సమీపంలోకి వచ్చిందనే చెప్పొచ్చు. అమెరికా దాడుల కంటే ముందే ఇజ్రాయెల్ సైన్యం నతాంజ్‌పై దాడులకు పాల్పడింది. ఈ దాడుల్లో భూఉపరితలంపై ఉన్న మౌలిక సదుపాయాలు చాలావరకు ధ్వంసమయ్యాయి. భూఅంతర్భాగంలో ఉన్న పటిష్ఠ స్థితిలో సదుపాయాలకు పెద్దగా నష్టం వాటిల్లలేదు. కానీ, అమెరికా దాడుల్లో నతాంజ్‌లోని సెంట్రీఫ్యూజ్‌లు, ఇతర పరికరాలు చాలావరకు నామారూపాల్లేకుండా పోయినట్లు తెలుస్తోంది. నతాంజ్‌పై గతంలోనూ పలుమార్లు దాడులు జరిగాయి. అవి సఫలం కాలేదు. నతాంజ్‌కు సమీపంలోని పికాక్స్ అనే పర్వతం కింద మరో భారీ అణుకేంద్రాన్ని నిర్మించడానికి ఇరాన్ ప్రభుత్వం చర్యలు ప్రారంభించినట్లు గతంలో వార్తలొచ్చాయి.

3. ఇస్ఫహాన్ న్యూక్లియర్ టెక్నాలజీ సెంటర్

టెహ్రాన్‌కు ఆగ్నేయ దిశలో 215 మైళ్ల దూరంలోని ఇస్ఫహాన్ న్యూక్లియర్ టెక్నాలజీ సెంటర్‌లో యురేనియం కన్వర్షన్ సదుపాయాలు, ల్యాబ్‌లు, చైనా తయారీ రియాక్టర్లు ఉన్నాయి. ఇక్కడ వేలాది మంది అణు శాస్త్రవేత్తలు పని చేస్తుంటారు. ఇటీవల ఇజ్రాయెల్ సైన్యం ఇస్ఫహాన్ అణుకేంద్రంపై దాడికి దిగడంతో కొన్ని భవనాలు దెబ్బతిన్నాయి. కానీ, అమెరికా దాడిలో భారీ నష్టమే వాటిల్లినట్లు తెలుస్తోంది. అమెరికా దాడుల్లో ఇస్ఫహాన్‌లో రేడియేషన్ లీకేజీ అయినట్లు ఎలాంటి సమాచారం రాలేదని అంతర్జాతీయ అణు ఇంధన సంస్థ(ఐఏఈఏ) ప్రకటించింది.

ఇరాన్‌లోని మరికొన్ని అణు కేంద్రాలు (ఇక్కడ దాడులు జరగలేదు)

బుషెహర్ న్యూక్లియర్ పవర్ ప్లాంట్

ఇరాన్‌లో ఇదొక్కటే కమర్షియల్ అటామిక్ రియాక్టర్. పర్షియన్ గల్ఫ్‌లో ఏర్పాటు చేశారు. రష్యా సరఫరా చేస్తున్న యురేనియంతో ఇక్కడ అణ్వస్త్ర తయారీ పరిశోధనలు జరుగుతుంటాయి.

అరాక్ హెవీ వాటర్ రియాక్టర్

వెపన్స్–గ్రేడ్ ప్లుటోనియం ఉత్పత్తి చేయడానికి అరాక్ హెవీ వాటర్ రియాక్టర్ నెలకొల్పారు. 2015లో ఈ కేంద్రాన్ని పాక్షికంగా ఆధునీకరించారు.

టెహ్రాన్ రీసెర్చ్ రియాక్టర్

'శాంతి కోసం అణుశక్తి' అనే కార్యక్రమంలో భాగంగా 1967లో అమెరికా సరఫరా చేసిన టెక్నాలజీ, పరికరాలతో టెహ్రాన్ రీసెర్చ్ రియాక్టర్ ఏర్పాటు చేశారు. ఇక్కడ తక్కువ శుద్ధి చేసిన యురేనియంతో అణు పరిశోధనలు జరుగుతున్నాయి.

ఇవి కూడా...

- కరాజ్ (అణు పరిశోధన కేంద్రం)
- దార్కోవిన్(నిర్మాణంలో ఉన్న అణుకేంద్రం)
- అనారక్(అణు పరిశోధన కేంద్రం)
- అర్దాకన్(అణు పరిశోధన కేంద్రం)
- సఘాంద్(యురేనియం మైన్)

- సాక్షి, నేషనల్ డెస్క్

ఇరుకున పడ్డ ఇరాన్!

- పరిమిత ఆప్షన్లతో పట్టుసాధిస్తుందా?
- చైనా, రష్యా ప్రత్యక్షంగా సాయం చేస్తాయా?
- హెజ్‌బొల్లా, హమాస్, హౌతీ, మిలీషియాలు మద్దతిస్తాయా?
- అమెరికా జోక్యంతో ఇరాన్ ముందున్న మెరుగైన మార్గాలెన్ని?

అగ్రరాజ్యం అమెరికా సైతం తమపై కత్తికట్టడంతో ఇప్పుడు ఇరాన్ తాడోపేడో తేల్చుకోవాల్సిన తరుణమొచ్చింది. అయితే ఈ కష్టకాలంలో కాడెత్తేయకుండా కడదాకా తమకు తోడుగా నిలిచే నిజమైన నేస్తలెందరో ఇప్పుడు ఇరాన్ లెక్కబెట్టుకుంటోంది. యుద్ధంలో పైచేయి సాధించేందుకు పనికొచ్చే ప్రత్యామ్నాయాలు ఎన్ని ఉన్నాయో బేరీజువేసుకుంటోంది. ఇజ్రాయెల్, అమెరికాలకు దీటుగా చైనా, రష్యా ఏమేరకు తనకు సైనిక సాయం ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా ఇస్తాయోనని ఇరాన్ సమీక్ష జరుపుతోంది. హోర్ముజ్ జలసంధి మీదుగా చమురు నౌకల రాకపోకలను అడ్డుకుంటే తనకు ఒనగూరే లాభమెంతో లెక్కేసుకుంటోంది. ఈ నేపథ్యంలో ప్రస్తుతం ఇరాన్ ముందు ఆప్షన్లు ఎన్ని అనే అంశం ప్రధానంగా అంతర్జాతీయంగా చర్చనీయాంశమైంది.

హోర్ముజ్ జలసంధిని ఆపేస్తే?

సముద్రం ద్వారా రవాణా అయ్యే చమురులో దాదాపు 25 శాతం ఈ హోర్ముజ్ జలసంధి ద్వారానే సరఫరా అవుతోంది. కేవలం 33 కిలోమీటర్ల వెడల్పుండే ఈ జలమార్గం గుండా చమురు, సహజవాయువు రవాణా నౌకలను అడ్డుకుంటే ప్రపంచవ్యాప్తంగా ధరలు పెరిగే ప్రమాదం పొంచి ఉంది. పెట్రోల్, డీజిల్ ధరల మంటలు పైకి ఎగిస్తే ప్రపంచార్థికం దెబ్బతినడం ఖాయం. ఈ భయాలను బూచిగా చూపి తమపై దాడులను ఆపాలని అమెరికా, ఇజ్రాయెల్ కూటమి దేశాలను ఇరాన్ హెచ్చరించే వీలుంది. వేగంగా దూసుకెళ్లే బోట్ల ద్వారా వేలాదిగా మెరైన్ మైన్(సముద్ర మందుపాతర)లను జలసంధి మార్గంలో ఇరాన్ మొహరించిందనే వార్తలు వెలువడ్డాయి. వీటిలో నిజమెంతో ఎవరికీ తెలీదు. అదే నిజమైతే నౌకలు అటు వెళ్లేందుకు వణుకుతాయి.

పశ్చిమాసియాలోని అమెరికా స్థావరాలపై ముప్పేట దాడి?

అమెరికా భూభాగం నుంచి నేరుగా దాడులు చేయడం కష్టం. పశ్చిమాసియాలో దశాబ్దాలుగా తిష్టవేసి ఏర్పాటుచేసుకున్న సమీప స్థావరాల నుంచే అమెరికా దాడిచేయగలదు. కువైట్, బహ్రెయిన్, ఖతార్, యుఏఈలోని అమెరికా వైమానిక స్థావరాలపై ఇరాన్ మెరుపుదాడులు చేసి ప్రతిదాడులను నిలువరించవచ్చు. ఈ భయంతోనే అమెరికా ఇప్పటికే ఒకటి, రెండు స్థావరాల నుంచి యుద్ధవిమానాలను వేరేచోటుకు తరలించినట్లు ప్రైవేట్ శాటిలైట్ తాజా చిత్రాలతో స్పష్టమైంది. అమెరికా గడ్డపై తమ మద్దతుదారుల ద్వారా పేలుళ్లు జరిపి మారణహోమం సృష్టించే ఛాన్సుంది. అందుకే ఈ విషయంలో అమెరికా ఇప్పటికే అప్రమత్తమై పలు ప్రధాన ప్రాంతాల్లో నిఘాను కట్టుదిట్టంచేసిందని వార్తలొచ్చాయి.

పెంచిపోషించిన సాయుధ సంస్థల సాయంతో..

గాజాలో హమాస్, లెబనాన్‌లో హెజ్‌బొల్లా, యెమెన్‌లో హౌతీ రెబల్స్, ఇరాక్‌లో మిలీషియా సంస్థలకు ఆర్థిక, ఆయుధసాయం చేసి ఇరాన్ తన పరోక్ష సైన్యంగా తీర్చిదిద్దుకుంది. వీటిని ఒకరంగా ప్రతిఘటన దళంగా పేర్కొంటారు. అయితే 20 నెలలుగా ఇజ్రాయెల్‌తో పోరాడి హమాస్ తన అగ్రనాయకత్వాన్ని కోల్పోయి ఒకరకంగా అలసిపోయింది. హెజ్‌బొల్లా ఉగ్రసంస్థ పోరాడే వీలుంది. ఇరాన్‌తో కలిసి నడుస్తామని మూడ్రోజుల క్రితమే హౌతీ తిరుగుబాటుదారులు ప్రకటించారు. ఎర్రసముద్రంలో విదేశీ చమురు నౌకలు అడ్డుకుంటామని చెప్పారు. ఇరాక్‌లోని మిలీషియా సంస్థలు ఇంతవరకు ఎలాంటి ప్రకటన చేయలేదు. అయితే మిలీషియాలు, హౌతీలకు డ్రోన్లు, చిన్నపాటి క్షిపణులను ప్రయోగించడంలో నైపుణ్యముంది. వీళ్లు ఇరాన్‌కు తోడు నిలిచే అవకాశముంది.

- సాక్షి, నేషనల్ డెస్క్

చైనా, రష్యాల పరోక్ష సాయం

చైనా ఇప్పటికే కొన్ని చమురునౌకల ముసుగులో కొన్ని ఆయుధాలను ఇరాన్‌కు తరలించి సాయపడినట్లు తెలుస్తోంది. యుద్ధం తీవ్రతరమైతే తమ చిరకాల మిత్రుడు ఇరాన్‌కు సాయంగా రష్యా, చైనాలు ముందడుగు వేసే వీలుంది. ఇరాన్‌పై ఇజ్రాయెల్ దాడులను ఇప్పటికే రష్యా అధ్యక్షుడు పుతిన్ తప్పుబట్టారు. ఈ విషయమై ఇటీవలే చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్‌తో పుతిన్ ఫోన్‌లో మాట్లాడారు.

అణుకార్యక్రమం ఆగకపోవచ్చా?

యురేనియం శుద్ధి కర్మాగారాలపై ఇజ్రాయెల్, అమెరికా క్షిపణి, బాంబు దాడులు ఇరాన్‌ను అణ్వాయుధం తయారుచేయకుండా మరికొన్ని వారాలు, నెలలు అడ్డుకోగలవుగానీ శాశ్వతంగా ఆపలేవని అంతర్జాతీయ నిపుణులు చెబుతున్నారు. న్యూక్లియర్ సెంటర్లలోకాకుండా వేరేచోట్ల యురేనియంను నిల్వచేస్తే అమెరికా, ఇజ్రాయెల్‌ల పరిస్థితి ఏంటనే అంశం తెరమీదకొచ్చింది. తన దేశ ఉనికి, అస్థిత్వం ప్రశ్నార్థకంగా మారే పరిస్థితే వస్తే ఇరాన్ ఎంతకైనా తెగిస్తుందనే విశ్లేషణల నడుమ ఈ సమరం ఏ దిశలో పయనిస్తుందో ఇప్పుడే ఎవరూ చెప్పలేని పరిస్థితి నెలకొంది.

సాక్షి హైదరాబాద్

సోమవారం । 23 । జూన్ । 2025



చూసినా కటకటాలే!
ప్రస్తుతం అమలులో ఉన్న కఠిన చట్టాల ప్రకారం ఇంటర్‌నెట్‌తో పాటు సోషల్ మీడియాలో చైల్డ్ పోర్నోగ్రఫీని సెర్చ్ చేసినా, చూసినా, డౌన్‌లోడ్, అప్‌లోడ్ చేసినా నేరమే. -8లో



సరికొత్త 'సవారీ'..
మహిళల్లో ఆత్మవిశ్వాసాన్ని మహిళల్లో నింపేందుకు నగరం వేదికగా 'ఆర్ జీ ఫర్ ఉమెన్' అనే మోటార్ సైకిల్ ప్రత్యేక శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. -సిటీప్లస్‌లో

గరిష్టం/కనిష్టం
35.0/24.0

వాతావరణం
నగరంలో సోమవారం ఉదయం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. గరిష్టంగా 35, కనిష్టంగా 24 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదవుతాయని అంచనా.

అసెంబ్లీ ఎదుట భారీ వాహనంలో మంటలు

ప్రమాదం నుంచి బయటపడిన డ్రైవర్, మరో వ్యక్తి



నాంపల్లి: అసెంబ్లీ సమీపంలో ఓ భారీ వాహనంలో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. ఊహించని విధంగా వాహనంలో మంటలు ఎగిసిపడటంతో అందరూ భయభ్రాంతులకు గురయ్యారు. మంటలు అంటుకున్న సమయంలో వాహనంలోని డ్రైవరుతో పాటు మరొకరు క్షేమంగా బయటపడటంతో అందరూ ఊపిరిపీల్చుకున్నారు. ఆదివారం మధ్యాహ్నం అసెంబ్లీ ఉస్మానియా గేటు వద్ద ఈ ఘటన చోటుచేసుకుంది. వాహనం రోడ్డుపైనే పూర్తిగా కాలిపోయింది. అగ్నిమాపక సిబ్బంది చేరుకుని మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. ఫలితంగా కొంతసేపు నాంపల్లి నుంచి లక్డీకాపూల్ వెళ్లే దారిలో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలిగింది.

త్యాగరాయ గానసభలో అగ్ని ప్రమాదం



చిక్కడపల్లి: గాంధీనగర్ డివిజన్ చిక్కడపల్లి వివేక్ నగర్‌లోని సంగీత, సాంస్కృతిక కళలకు వేదికైన త్యాగరాయ గానసభలో ఆదివారం సాయంత్రం విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. దాదాపు రెండు గంటలపాటు ఉత్కంఠ వాతావరణం నెలకొంది. గానసభలో మెయిన్ హాల్‌తో పాటు మొత్తం ఏడు హాళ్లు ఉన్నాయి. ఏడాది క్రితం ప్రారంభమైన మొదటి అంతస్తులోని కళా మారుతి వేదికలో అమృత వర్షిణి సంస్థ ఆధ్వర్యంలో పాటల ఆలాపన కార్యక్రమం ప్రారంభమైంది. ఒక పాట పాడిన అనంతరం గ్రీన్‌రూం (మేకప్ గది)లోంచి పొగలు వస్తుండటంతో కార్యక్రమ నిర్వాహకులు వెంటనే అప్రమత్తమయ్యారు. గాయకులతో పాటు శ్రోతలు బయటికి పరిగెత్తారు. గానసభ సిబ్బంది, కార్యక్రమ నిర్వాహకులు అగ్ని ప్రమాద నివారణ పరికరాలతో మంటలను అదుపులోకి తేవడంతో ప్రమాదం తప్పింది. గానసభ అధ్యక్షుడు కళా జనార్దనమూర్తి మాట్లాడుతూ.. ప్రమాద ఘటనపై వదంతులను నమ్మవద్దని, మెయిన్ హాల్‌లో కళాసుబ్బారావు కళావేదికలో కార్యక్రమాలు జరుగుతూనే ఉన్నాయని వెల్లడించారు. ఆయన వెంట గానసభ సభ్యులు బండి శ్రీనివాస్, గాయకుడు కొండల్ తదితరులున్నారు.





వెయ్.. దరువెయ్!

ఆదివాసీ కళాకారుల సంప్రదాయ నృత్యాలు ఆకట్టుకున్నాయి. డోలు వాద్యాల దరువులతో బీజేపీ నేతలకు ఘన స్వాగతం పలికారు. ఆదివారం కంటోన్మెంట్‌లోని ఓ గార్డెన్‌లో మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ ఆధ్వర్యంలో వికసిత భారత్ సంకల్ప్ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆదివాసీ కళాకారుల నాట్యాలు అలరించాయి.

రేషన్ బియ్యం ప్లీజ్

30తో ముగియనున్న పంపిణీ గడువు

- లబ్ధిదారుల్లో కొనసాగుతున్న ఆందోళన.. స్టాక్ లేదని తిప్పి పంపిస్తున్న రేషన్ డీలర్లు
- మేడ్చల్ జిల్లాలో వలస కుటుంబాల పరిస్థితి దయనీయం



సాక్షి,సిటీబ్యూరో: సన్నబియ్యం కోసం రేషన్ దుకాణాల చుట్టూ లబ్ధిదారులు ప్రదక్షిణలు చేస్తున్నారు. డీలర్ల నుంచి స్టాక్ లేదనే సమాధానమే వస్తోంది. తుది గడువు సమీపిస్తుండటంతో లబ్ధిదారులు ఆందోళన చెందుతున్నారు. వర్షాకాలం నేపథ్యంలో ప్రకృతి వైపరీత్యాల కారణంగా కేంద్ర ప్రభుత్వం ఆదేశాలతో తెలంగాణ సర్కారు 3 నెలలకు సంబంధించిన సన్నబియ్యం పంపిణీకి శ్రీకారం చుట్టింది. ఈ నెల 1 నుంచి ఆహార భద్రత కార్డుల లబ్ధిదారులకు సన్నబియ్యం పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించినప్పటికీ.. నగర శివారు మేడ్చల్ -మల్కాజిగిరి జిల్లాలో ఇప్పటికీ సన్నబియ్యం పొందని లబ్ధిదారులు 20 శాతం ఉన్నారు. ప్రభుత్వం మూడు నెలలకు సంబంధించి సన్న బియ్యం ఒకేసారి పంపిణీ చేస్తుండటంతో.. పోర్టబిలిటీని దృష్టిలో పెట్టుకుని జిల్లాకు జీవనోపాధి కోసం వలస వచ్చిన కుటుంబాలు ఆహార భద్రత కార్డుల సంఖ్యకు అనుగుణంగా సన్నబియ్యం సేకరణ చేపట్టాల్సిన సంబంధిత అధికారులు సకాలంలో స్పందించక పోవడంతో .. సన్న బియ్యం కోసం లబ్ధిదారులు రేషన్ దుకాణాల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి నెలకొంది.

మరో 11 వేల మెట్రిక్ టన్నులు వస్తేనే..

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో మొత్తం 5,37,805 ఆహార భద్రత కార్డులు ఉన్నాయి. 3 నెలల బియ్యం కోటాకు సంబంధించి 34,535 మెట్రిక్ టన్నుల సన్నబియ్యం అవసరమని జిల్లా పౌరసరఫరాల శాఖ లెక్కలేసింది. జిల్లాలో జీవనోపాధి కోసం వచ్చిన వలస కుటుంబాలకు సంబంధించి లక్షకు పైగా ఆహార భద్రత కార్డులు ఉన్నాయి. వీరంతా ఇక్కడే రేషన్ బియ్యం తీసుకుంటున్నారు. పోర్టబిలిటీతో కలిపి జిల్లాకు 45,535 మెట్రిక్ టన్నుల సన్నబియ్యం అవసరం కాగా, 34,535 మెట్రిక్ టన్నులు మాత్రమే దిగుమతయ్యాయి. సన్న బియ్యాన్ని సంబంధిత లబ్ధిదారులకు రేషన్ దుకాణాల ద్వారా డీలర్లు పంపిణీ చేసి చేతులు దులుపుకొన్నారు. లబ్ధిదారులు బియ్యం దుకాణం వద్దకు వస్తే స్టాక్ లేదన్న సమాధానంతో డీలర్లు దాటవేస్తుండటంతో.. నిత్యం షాపుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. మరో 11 వేల మెట్రిక్ టన్నుల సన్నబియ్యం వస్తే తప్ప.. లబ్ధిదారులకు పూర్తి స్థాయిలో అందనున్నాయి.

ఈ నెలాఖరు కల్లా లబ్ధిదారులందరికీ అందజేస్తాం

ఆహార భద్రత కార్డుదారులందరికీ సన్న బియ్యం పంపిణీ చేస్తాం. పోర్టబిలిటీతో పాటు 3 నెలలకు సన్నబియ్యం ఒకేసారి ఇస్తుండటంతో జాప్యం ఏర్పడుతోంది. మేడ్చల్ జిల్లాకు రావాల్సిన 11 వేల మెట్రిక్ టన్నుల సన్నబియ్యం వచ్చాయి. దుకాణాలకు పంపిణీ చేయడంతో పాటు ఈ నెలాఖరు కల్లా లబ్ధిదారులందరికీ సన్నబియ్యం అందేలా చూస్తాం.

– శ్రీనివాస్‌రెడ్డి, డీఎస్‌ఓ, మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా

గ్రేటర్, రంగారెడ్డి జిల్లాలోనూ ఇదే పరిస్థితి..

గ్రేటర్‌లోని మరో శివారు జిల్లా రంగారెడ్డిలోనూ ఇదే పరిస్థితి నెలకొంది. మూడు జిల్లాల పరిధిలో జీవనోపాధి కోసం వచ్చిన వలస కుటుంబాలు అత్యధికంగా ఉండటంతో పాటు.. సన్నబియ్యం కూడా ఇతర జిల్లాల నుంచి ఇక్కడికి తరలించాల్సి రావటంతో జాప్యం ఏర్పడింది. దీంతో లబ్ధిదారులు రేషన్ దుకాణాల చుట్టూ తిరగాల్సి వస్తోందని సంబంధిత అధికార వర్గాలు పేర్కొంటున్నాయి. దీనికి తోడు కార్డుల సంఖ్యకు అనుగుణంగా రేషన్ దుకాణాలు లేకపోవటం కూడా మరో కారణం.

మెటీరియల్ బాదుడు

ఆన్‌లైన్‌లో పేమెంట్ చేస్తే ఇంటికే బుక్స్ పార్శిల్

- స్టేట్ సిలబస్ పాఠ్యపుస్తకాలు బయటే కొనాలని సలహా
- నగర కార్పొరేట్ పాఠశాలల్లో వింత ధోరణి
- పేద, మధ్య తరగతి వర్గాలకు భారంగా పిల్లల చదువులు

నగరంలోని దిల్‌సుఖ్ నగర్‌లో నివసించే ఓ కారు డ్రైవర్ ప్రసాద్ తన ఇద్దరు పిల్లలకు మంచి భవిష్యత్ ఇవ్వాలనే ఉద్దేశంతో సమీపంలోని కార్పొరేట్ పాఠశాలలో చేర్పించారు. ఏడో తరగతిలోనే ఐఐటీ, సీబ్యాచ్ అంటూ రూ.82,400, ఒకటో తరగతికి రూ.39,500 ఫీజు బాదేశారు. అప్పటికే ఫీజులు భారం కాగా, క్లాసులు ప్రారంభం కావడంతో పుస్తకాలు ఆన్‌లైన్‌లో బుక్ చేసుకోవాలని ఒత్తిడి తెచ్చారు. స్కూల్‌లోనే బుక్స్ సెక్షన్‌లో ఆన్‌లైన్ పేమెంట్ ద్వారా 7 వ తరగతికి రూ.12,385, ఒకటో తరగతికి రూ.6,744 చెల్లించి బుక్ చేస్తే నాలుగు రోజుల తర్వాత ఇంటి చిరునామాకు పార్శిల్ వచ్చింది. అందులో కేవలం మెటీరియల్స్, నోట్ బుక్స్ మాత్రమే ఉన్నాయి. క్లాస్ టీచర్స్‌ను సంప్రదిస్తే స్టేట్ సిలబస్ పాఠ్యపుస్తకాలు బయట కొనుగోలు చేయాల్సి ఉంటుందని సలహా ఇచ్చారు. యూనిఫాంలు కూడా స్కూల్‌లోనే కొనుగోలు చేయక తప్పని పరిస్థితి. ఇది ఒక ప్రసాద్ పరిస్థితి మాత్రమే కాదు.. పిల్లలను మంచి చదువులు చదివించాలనుకునే పేద, మధ్య తరగతి కుటుంబాలన్నింటిదీనూ.



సాక్షి, సిటీబ్యూరో: కార్పొరేట్ స్కూళ్లలో చదువులు మధ్య తరగతి కుటుంబాలకు చుక్కలు చూపిస్తున్నాయి. క్లాసులు ప్రారంభం కాగానే మెటీరియల్, స్కూల్ డ్రెస్సులు, ల్యాబ్‌ల పేరిట బాదుడు ప్రారంభమైంది. తమ విద్యాసంస్థ బుక్స్ మాత్రమే కొనుగోలు చేయాలంటూ ఆన్‌లైన్ ద్వారా పేమెంట్ చేయించి కేవలం మెటీరియల్, నోట్స్ బుక్‌లను ఇంటికి పార్శిల్ ద్వారా అంటగట్టేస్తున్నారు. ఇక తరగతి పాఠ్యపుస్తకాలు బయట కొనుగోలు చేయక తప్పని పరిస్థితి నెలకొంది.

నాలుగు వేలకుపైగా స్కూళ్లు..

నగరంలో సుమారు ఆరు వేలకుపైగా ప్రైవేటు పాఠశాలలు ఉండగా, వీటిలో కార్పొరేట్ విద్యా సంస్థలకు చెందిన దాదాపు నాలుగు వేలకుపైగా క్యాంపస్ (పాఠశాలలు) ఉన్నాయి. ఆయా స్కూళ్లలో సుమారు 11 లక్షల మంది విద్యార్థులు చదువుకుంటున్నట్లు అంచనా. ప్రైవేట్ విద్యాసంస్థలపై విద్యాశాఖ పర్యవేక్షణ కొరవడింది. బడ్జెట్ స్కూళ్లు మినహా కార్పొరేట్, సీబీఎస్ఈ, ఐసీఎస్ఈ పాఠశాలలపై పర్యవేక్షణ లేకుండాపోయింది. దీంతో ఫీజులు, మెటీరియల్, పుస్తకాల బాదుడుకు అడ్డూ అదుపూ లేకుండాపోయింది.కనీసం స్టేట్ సిలబస్ బోధిస్తున్న కార్పొరేట్ విద్యాసంస్థలపై కూడా గట్టి నిఘా లేకపోవడం విస్మయానికి గురిచేస్తోంది. దీంతో కార్పొరేట్ విద్యా సంస్థల తీరు ఇష్టానుసారంగా మారింది. ఇక విద్యాశాఖ పర్యవేక్షణ అంతగా లేని సీబీఎస్ఈ, ఐసీఎస్ఈ స్కూళ్లలో ఫీజులు, మెటీరియల్, డ్రెస్సులపై దండుకోవడం షరామామూలుగా మారింది. విద్యాశాఖ యంత్రాంగం ఇకనైనా దృష్టి సారించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

బడిబస్సుల్లో
భద్రత డొల్ల!

మద్యం తాగి నడుపుతున్న కొందరు డ్రైవర్లు

- పది రోజుల్లోనే ట్రాఫిక్ పోలీసులకు పట్టుబడిన 15 మంది
- మొక్కుబడిగా ఆర్టీఏ తనిఖీలు

సాక్షి, సిటీబ్యూరో: పాఠశాలలు తిరిగి తెరుచుకున్న పది రోజుల్లోనే కనీసం 15 మంది డ్రైవర్లు మద్యం తాగి స్కూల్ బస్సులు నడుపుతూ ట్రాఫిక్ పోలీసులకు చిక్కారు. నగరంలోని వివిధ ప్రాంతాల్లో పోలీసులు నిర్వహించిన తనిఖీల్లో కొందరు స్కూల్ బస్సు డ్రైవర్లు మద్యం తాగి పట్టుబడటం ఇదే తొలిసారి. ఇతర రవాణా వాహనాలు నడిపే డ్రైవర్ల కంటే స్కూల్ బస్సు డ్రైవర్లు తమ విధి నిర్వహణలో ఎంతో బాధ్యతగా ఉంటారనే అభిప్రాయం ఉంది. కానీ కొంతకాలంగా డ్రైవర్లపై ఎలాంటి నిఘా, నియంత్రణ లేకపోవడంతో అనుభవం లేని డ్రైవర్లు బడి బస్సులతో రోడ్డెక్కుతున్నారు. పరిమితికి మించిన వేగంతో బస్సులు నడపటం ఆందోళనకు గురిచేస్తోంది.

తూతూమంత్రంగా తనిఖీలు..

సాధారణంగా విద్యాసంవత్సరం ప్రారంభానికి నెల రోజుల ముందే అంటే మే నెలలోనే ఆర్టీఏ అధికారులు ప్రతి బస్సును క్షుణ్ణంగా తనిఖీ చేసి వాటి సామర్థ్యాన్ని నిర్ధారించాలి. చాలా చోట్ల ఈ తనిఖీలు నిబంధనల మేరకు కొనసాగడం లేదు. డ్రైవర్ల పనితీరును సైతం పరిశీలించడం లేదు. సామర్థ్యం ఉన్నా , లేకున్నా ఫిట్‌నెస్ సర్టిఫికెట్‌లు ఇస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. నగరంలోని కొన్ని ఆర్టీఏ కార్యాలయాల్లో ఇది దందాగా మారింది. ఇటీవల బండ్లగూడ ఆర్టీఏ కార్యాలయంలో ఓ ఎంవీఐ తమ పరిధిలో లేని వాహనాలకు సైతం ఫిట్‌నెస్ సర్టిఫికెట్‌లను ఇవ్వడం వివాదాస్పదంగా మారింది. ఉన్నతాధికారులు నిఘా, నియంత్రణ,



పర్యవేక్షణ లేకపోవడంతో కిందిస్థాయిలో ఫిట్‌నెస్ తనిఖీలు, సర్టిఫికెట్‌ల జారీ ఇష్టారాజ్యంగా మారింది. గ్రేటర్‌లోని మూడు జిల్లాల పరిధిలో 13421 స్కూల్ బస్సులు ఉన్నాయి. ఇప్పటికీ ఇంకా కొన్ని బస్సులు ఫిట్‌నెస్ లేకుండానే తిరుగుతున్నాయి. పాఠశాలలు ప్రారంభమైన తర్వాత కొద్ది రోజులు తనిఖీలు నిర్వహించి వదిలేశారు.

అర్హత లేని డ్రైవర్లే ఎక్కువ..

సాధారణంగా ఆర్టీసీ బస్సులు నడిపేందుకు డ్రైవర్ల అర్హత, అనుభవం వంటి అంశాలను కచ్చితంగా ధ్రువీకరించుకున్న తర్వాతే నిబంధనల మేరకు ఉద్యోగావకాశాలను కల్పిస్తారు. ఎంపికైన అనంతరం హకీంపేట్‌లోని శిక్షణా కేంద్రంలో మరోసారి ప్రత్యేక శిక్షణనిస్తారు. ప్రయాణికుల భద్రతపై అవగాహన కల్పిస్తారు. విద్యార్థులను స్కూళ్లకు తరలించే స్కూల్ బస్సు డ్రైవర్లకు మాత్రం ఎలాంటి శిక్షణ లేదు. హెవీమోటార్ డ్రైవింగ్ లైసెన్స్ ఉంటే చాలు. చాలావరకు స్కూళ్లలో ఈ లైసెన్స్‌ను కూడా పరిగణనలోకి తీసుకోవడం లేదు. అర్హత, అనుభవం లేని డ్రైవర్లను గుర్తించడంలో ఆర్టీఏ సైతం విఫలమవుతోంది.

డ్రంక్ అండ్ డ్రైవ్‌పై నియంత్రణ ఎలా..

బడిబస్సుల నిర్వహణ ప్రధానంగా పాఠశాల యాజమాన్యాలదే అయినా రవాణా అధికారులు, పిల్లల తల్లిదండ్రులు సైతం బాధ్యతగా వ్యవహరించాలి. డ్రైవర్ల పనితీరు, అనుభవం, అర్హత వంటి అంశాలను నిర్ధారించడంలో ఆర్టీఏ అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారు. పిల్లల తల్లిదండ్రులు పట్టించుకోవడం లేదు. తమ బాధ్యత కాదన్నట్లుగా వ్యవహరిస్తున్నారు. దీంతో పట్టపగలే మద్యం తాగి వాహనాలు నడిపే డ్రైవర్లు స్కూల్ బస్సు స్టీరింగ్‌పై కనిపిస్తుండటం గమనార్హం.

బరిపై మజ్లిస్ గురి!

జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో నిలిచేందుకు పతంగి పథకం

- ఇప్పటికే కొన్ని డివిజన్లలో ఆ పార్టీ ప్రాతినిధ్యం
- పాగా వేసేందుకు మూడు పర్యాయాలుగా యత్నం
- ఈసారి పకడ్బందీ వ్యూహంతో అడుగులు

సాక్షి, సిటీబ్యూరో: మజ్లిస్ పార్టీ 'జూబ్లీహిల్స్' అసెంబ్లీ ఉప ఎన్నికలపై దృష్టి సారిస్తోంది. ఇప్పటికే పాతబస్తీలో ఎదురులేని రాజకీయ శక్తిగా అవతరించిన ఆ పార్టీ.. జూబ్లీహిల్స్‌లో పాగా వేసేందుకు తీవ్ర ప్రయత్నాలు చేస్తోంది. సెగ్మెంట్లలోని డివిజన్లలో ప్రాతినిధ్యం వహిస్తుండటంతో ఉప ఎన్నికల్లోనైనా జూబ్లీహిల్స్ అసెంబ్లీ స్థానాన్ని దక్కించుకోవాలని వ్యూహాత్మకంగా అడుగులు వేస్తోంది. వాస్తవంగా తెలంగాణ ఆవిర్భావ సమయంలో ఇక్కడి బరిలో దిగి ఢీ.. అంటే ఢీ అనే విధంగా పోటీ పడి స్వల్ప ఓట్ల తేడాతో రెండో స్థానంతో నిలిచింది. ఆ తర్వాత జరిగిన ఎన్నికల్లో అప్పటి అధికార పక్షం బీఆర్ఎస్ దోస్తీ కోసం బరిలో దిగలేదు. ఏడాదిన్నర క్రితం జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో మాత్రం పోటీ చేసినప్పటికీ పరాజయం తప్పలేదు. తాజాగా బీఆర్ఎస్ సిట్టింగ్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ మృతి చెందడటంతో ఉప ఎన్నిక అనివార్యమైంది. ప్రస్తుతం అధికార కాంగ్రెస్‌తో సత్సంబంధాలు కలిగి ఉన్నా.. సిట్టింగ్ సీటు బీఆర్ఎస్‌ది కావడంతో పోటీలో ఉండాలని భావిస్తోంది. అధికార కాంగ్రెస్ పార్టీ బరిలో దిగే అవకాశం ఉన్నా.. స్నేహపూర్వకంగానే పోటీ ఇచ్చి అసెంబ్లీ స్థానాన్ని తన ఖాతాలో వేసుకునేందుకు ఇది చక్కని అవకాశంగా భావిస్తోంది.

ఇదీ పరిస్థితి..

2014లో జూబ్లీహిల్స్ అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసిన మజ్లిస్ గట్టి పోటీ ఇచ్చింది. అప్పటో ఆ పార్టీ తరఫున రంగంలో దిగిన బీసీ సామాజిక వర్గానికి చెందిన నవీన్ యాదవ్ తొమ్మిదివేల పైచిలుకు ఓట్లతో తేడాతో రెండో స్థానంలో నిలిచారు. 2018లో జరిగిన ఎన్నికల్లో పోటీ చేయకుండా అప్పటి మిత్రపక్షమైన అధికార బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి సిట్టింగ్ ఎమ్మెల్యేకు మద్దతు ప్రకటించింది. నవీన్ యాదవ్ మజ్లిస్‌కు రాజీనామా చేసి స్వతంత్ర అభ్యర్థి పోటీ చేసి సుమారు 18 వేల పైచిలుకు ఓట్లు సాధించారు. 2023లో జరిగిన ఎన్నికల్లో రాష్ట్ర వ్యాప్తంగా బీఆర్ఎస్‌కు మద్దతు ఇచ్చిన మజ్లిస్.. జూబ్లీహిల్స్ సిట్టింగ్ ఎమ్మెల్యేపై స్నేహపూర్వక పోటీకి దిగింది. వాస్తవంగా అధికార పక్షం దోస్తీ కోసం పార్టీ విస్తరణను సైతం స్వయంగా అడ్డుకట్ట వేసుకునే మజ్లిస్.. గత ఎన్నికల్లో జూబ్లీహిల్స్ నుంచి షేక్‌పేట కార్పొరేటర్ మహ్మద్ రషీద్‌ను బరిలో దింపడం వెనుక అనుమానాలు వ్యక్తమయ్యాయి. ముస్లిం మైనారిటీ ఓట్లు కాంగ్రెస్ పార్టీకి మళ్లకుండా చేసి అధికార బీఆర్ఎస్‌కు సహకరించేందుకు మజ్లిస్ పార్టీ బరిలో దిగినట్లు ప్రచారం సాగింది. అందరూ ఊహించినట్లే బీఆర్ఎస్‌కు లాభం చేకూరింది. కానీ.. రాష్ట్రంలో బీఆర్ఎస్ అధికారం చేజారగా.. కాంగ్రెస్ గద్దెనెక్కింది. ఆ తర్వాత కాంగ్రెస్‌తో మజ్లిస్ స్నేహం కుదరింది. తాజాగా సిట్టింగ్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే మృతి చెందడంతో ఉప ఎన్నిక అనివార్యమైంది.

ముస్లిం ఓటర్లు మూడో వంతు

జూబ్లీహిల్స్ అసెంబ్లీ నియోజకవర్గంలో మూడోవంతు ముస్లిం ఓటర్లు ఉన్నారు. అసెంబ్లీ పరిధిలోని పలు డివిజన్లలో మజ్లిస్ ప్రాతినిధ్యం కలిగి ఉంది. ప్రతినిత్యం స్థానిక సమస్యలపై పైదల్ దౌరా (పాదయాత్ర) నిర్వహిస్తుండటంతో ప్రజల్లో కూడా గట్టి పట్టు ఉంది. దీంతో రాజకీయాలకు అతీతంగా ముస్లిం మైనారిటీలు మజ్లిస్ వైపు మొగ్గు చూపే అవకాశాలు లేకపోలేదన్న వాదన వినిపిస్తోంది. ఈసారి ఉప ఎన్నికల బరిలో గెలుపు గుర్రాన్ని నిలిపేందుకు కసరత్తు చేస్తోంది. ఇటీవల పోటీ చేసిన షేక్‌పేట కార్పొరేటర్ మహ్మద్ రషీద్ పెద్దగా ఓట్లు రాబట్టుకోక పోవడంతో ఈసారి మరొకరిని పోటీకి దింపాలని యోచిస్తోంది. మజ్లిస్ పార్టీ పక్షాన మహిళా సాధికారత కోసం గళం విప్పుతున్న విద్యావంతురాలు, జాతీయ కరాటే చాంపియన్ సయ్యదా ఫలక్ అభ్యర్థిత్వాన్ని పరిశీలిస్తోంది. గతంలో ఉమ్మడి పౌరసత్వానికి వ్యతిరేకంగా హైదరాబాద్‌తో పాటు దేవబంద్, ఢిల్లీ, షాహీన్‌బాగ్‌లలో జరిగిన నిరసన కార్యక్రమాలకు నాయకత్వం వహించి పార్టీ దృష్టిని ఆకర్షించారు. ఈ క్రమంలోనే మరో ఇద్దరు కార్పొరేటర్ల అభ్యర్థిత్వాలను సైతం పార్టీ పరిశీలిస్తున్నట్లు సమాచారం.

ట్రాఫిక్‌జామ్‌కు కారకులైన వారిపై కేసు నమోదు


బంజారాహిల్స్ రోడ్ నెం.1లో పర్‌ఫ్యూమ్ షాప్ ముందు వందలాదిగా వచ్చిన అభిమానులు

బంజారాహిల్స్: బంజారాహిల్స్ రోడ్ నెం.1లో ఆదివారం సాయంత్రం ప్రారంభమైన ఓ పర్‌ఫ్యూమ్ షాప్‌కు వందలాదిగా జనం రావడ ంతో ఒక్కసారిగా రోడ్డంతా ట్రాఫిక్ జామ్ అ యింది. ప్రపంచ ప్రసిద్ధిగాంచిన పర్‌ఫ్యూమర్ యూసుఫ్‌భాయ్ ఈ ప్రారంభోత్సవానికి రావడంతో ఆయన అభిమానులు ఒక్కసారిగా వందలాదిగా విచ్చేశారు. దీంతో బంజారాహిల్స్ రోడ్ నెం.1లో భారీ ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. పోలీసులకు ముందస్తు సమాచారం ఇవ్వకుండా ఈవెంట్ నిర్వహించినందుకు నిర్వాహకులపై మాసబ్ ట్యాంక్ పోలీసులు కేసు నమో దు చేశారు. సుమారు రెండు గంటలకుపైగా ఈ రోడ్డంతా వాహనాలతో నిండిపోయింది.

అత్తింటి వేధింపులకు నవ వధువు బలి


పూజిత మృతదేహం

కేపీహెచ్‌బీకాలనీ: అత్తింటి వేధింపులు భరించలేక ఓ నవ వధువు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్న ఘటన కేపీహెచ్‌బీ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఖమ్మం జిల్లాకు చెందిన మాలోతు పూజిత (19)కు, జాటోతు శ్రీనుతో ఈ ఏడాది ఏప్రిల్ 16న వివాహమైంది. జాటోతు శ్రీను ఓ జ్యువెలరీ షాపులో సేల్స్ మేనేజర్. కేపీహెచ్‌బీ కాలనీలోని రోడ్డు నెంబర్ 3, టెంపుల్ బస్టాప్ సమీపంలోని ఈఎస్‌డబ్ల్యూ 1140లో నివసిస్తున్నారు. పూజిత పెళ్లి సమయంలో 8 తులాల బంగారంతో పాటు సుమారు రూ.11 లక్షలు ఇచ్చారు. కొద్ది రోజుల తర్వాత అదనపు కట్నం కోసం అత్త, మామ, భర్త, ఇతర కుటుంబ సభ్యులు ఆమెను వేధింపులకు గురి చేయసాగారు. అదనంగా రూ.10 లక్షల అదనపు కట్నం కావాలంటూ డిమాండ్ చేస్తున్నారు. దీంతో పూజిత నానమ్మ మాలోతు భద్రమ్మ వచ్చే పంట విక్రయాల అనంతరం అదనపు కట్నం ఇచ్చేందుకు అంగీకరించింది. ఈ నెల 21న రాత్రి 12 గంటలకు పూజిత నానమ్మకు శ్రీను ఫోన్ చేసి ఉదయం 9 గంటలకు తాను పనికి వెళ్లి రాత్రి 11.30 గంటలకు ఇంటికి తిరిగి వచ్చానని, ఇంతలో పూజిత చీరతో సీలింగ్ ఫ్యాన్‌కు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకుందన్నాడు. పూజిత తన సోదరులతో కలిసి కూల్‌డ్రింక్ తాగుతున్న ఫొటోలను హరి అనే వ్యక్తి శ్రీనుకి పంపించాడని, వాటిని చూపించి శ్రీను ఆమెను వేధిస్తున్నాడని, తన మనవరాలు మృతికి శ్రీను, అతని కుటుంబ సభ్యులే కారణమని పూజిత నానమ్మ కేపీహెచ్‌బీ పోలీస్‌లకు ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

చూసినా కటకటాలే!

- చైల్డ్ పోర్నోగ్రఫీపై ప్రపంచ వ్యాప్తంగా నిషేధం
- పోస్టింగ్, షేరింగ్‌తో పాటు చూడటమూ నేరమే
- ఎన్సీఆర్బీ, ఐ4సీ సమన్వయంతో కేసులకు సిఫార్సు
- చర్యలు తీసుకుంటున్న స్థానిక సైబర్ క్రైమ్ కాప్స్



సాక్షి, సిటీబ్యూరో: చిన్నారులపై లైంగిక దాడులు జరగడానికి, పెరగడానికి కారణమైన చైల్డ్ పోర్నోగ్రఫీపై ప్రపంచ వ్యాప్తంగా నిషేధం ఉంది. దీనిపై కన్నేసి ఉంచడానికి నేషనల్ సెంటర్ ఫర్ మిస్సింగ్ అండ్ ఎక్స్‌ప్లాయిటెడ్ చిల్డ్రన్ (ఎన్సీఎంఈసీ) పని చేస్తోంది. చైల్డ్ సెక్సువల్ అబ్యూజ్ మెటీరియల్‌ను (సీఎస్ఏఎం) కనిపెట్టడానికి అత్యాధునిక సాఫ్ట్‌వేర్స్ వినియోగిస్తోంది. వీరు గుర్తించిన వివరాల ఆధారంగానే గత వారం సైబర్ సెక్యూరిటీ బ్యూరో అధికారులు ఐఐటీ ఖరగ్‌పూర్ గ్రాడ్యుయేట్ సహా 15 మందిని అరెస్టు చేశారు. ప్రస్తుతం అమలులో ఉన్న కఠిన చట్టాల ప్రకారం ఇంటర్‌నెట్‌తో పాటు సోషల్ మీడియాలో చైల్డ్ పోర్నోగ్రఫీని సెర్చ్ చేసినా, చూసినా, డౌన్‌లోడ్, అప్‌లోడ్ చేసినా నేరమే.

నిఘా వేసి ఉంచే రెండు సంస్థలు..

చైల్డ్ పోర్నోగ్రఫీని ప్రపంచ వ్యాప్తంగా నిషేధించిన తర్వాత ఎన్సీఎంఈసీ చర్యలు ముమ్మరం అయ్యాయి. దీంతో పాటు ఇంటర్నేషనల్ చైల్డ్ ఎక్స్‌ప్లాయిటేషన్ (ఐసీఎస్ఈ), గూగుల్‌కు సంబంధించిన సైబర్ టిప్‌లైన్ రిపోర్ట్స్ సీఎస్ఏఎంని గుర్తించడానికి ప్రత్యేక సాఫ్ట్‌వేర్‌లు వాడుతున్నాయి. ప్రపంచంలో ఎవరైనా ఆయా వేదికలపై సీఎస్ఏఎంకు సంబంధించి ఎవరైనా సెర్చ్ చేసినా, వీక్షించినా, డౌన్‌లోడ్ చేసినా, అప్‌లోడ్ చేసినా.. తక్షణం గుర్తించే ఈ సాంకేతిక పరిజ్ఞానం వారు వినియోగించిన ఐపీ అడ్రస్‌లను రీడ్ చేస్తుంది. ఈ వివరాలను ఎన్సీఎంఈ, ఐసీఎస్ఈలకు చెందిన సర్వర్ అందిస్తుంది. వీటిని క్రోడీకరించి జాబితాలు రూపొందించి వీటిని ఆయా దేశాలకు చెందిన నోడల్ ఏజెన్సీలకు అందిస్తారు. జాతీయ స్థాయిలో హోమ్ మంత్రిత్వ శాఖ ఆధీనంలోని ఐ4సీ నోడల్ ఏజెన్సీగా ఉంది. ఇది తమకు అందిన వివరాలను ఆయా రాష్ట్ర స్థాయి దర్యాప్తు సంస్థలకు పంపిస్తారు. ఇలా గత వారం సైబర్ సెక్యూరిటీ బ్యూరోకు సమాచారం అందింది.

నిందితుల్లో అన్ని రకాల వాళ్లూ...

వీటిపై కేసులు నమోదు చేసి, ఐపీ అడ్రస్‌ల ఆధారంగా నిందితులను గుర్తించి అరెస్టు చేయడం సైబర్ బ్యూరో నిర్వర్తిస్తుంది. ఈ నిందితుల్లో విద్యార్థులు, సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలు చేస్తున్న వాళ్లు కూడా ఉంటున్నారు. ఇటీవల అరెస్టు అయిన వారిలో వ్యాపారులు, చిరుద్యోగి కూడా ఉన్నారు. ఇంటర్‌నెట్‌లో ఉండే పోర్న్ మెటీరియల్‌తో పాటే కొన్ని రకాలైన వైరస్‌లు కూడా ఉండే ప్రమాదం ఉంటుందని సైబర్ క్రైమ్ పోలీసులు చెప్తున్నారు. ఈ వెబ్‌సైట్ల ద్వారా ఆయా వైరస్‌లు పంపే హ్యాకర్లు ఫోన్లు, ల్యాప్‌టాప్‌లు హ్యాక్ చేసి తమ ఆధీనంలోకి తీసుకుంటారు. ఇలా వ్యక్తిగత సమాచారం, నెట్ బ్యాంకింగ్ ఖాతా వివరాలు వారికి చేరి పోర్నోగ్రఫీ బానిసలు అన్ని రకాలుగానూ నష్టపోవాల్సి వస్తుందని సైబర్ క్రైమ్ పోలీసులు హెచ్చరిస్తున్నారు. కేవలం చైల్డ్ పోర్నోగ్రఫీనే కాదు..అన్ని రకాలైన అసభ్య, అశ్లీల వెబ్‌సైట్లపై ఫిర్యాదులు వచ్చినప్పుడు కేంద్ర ప్రభుత్వం వాటిని నిషేధించి బ్లాక్ చేయిస్తోంటే నిర్వాహకులు మరోటి తయారు చేస్తున్నారు. వీటిని హోస్ట్ చేస్తున్న సర్వర్లన్నీ విదేశాల్లో ఉంటుండటంతో కఠిన చర్యలు సాధ్యం కావట్లేదని పోలీసులు చెబుతున్నారు.

లాడ్జిలో యువకుడి ఆత్మహత్య


షణ్ముక్ (ఫైల్)

అల్వాల్: లాడ్జిలో ఉరి వేసుకొని యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన అల్వాల్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మచ్చబొల్లారంలో నివసించే బండి మురళి కుమారుడు షణ్ముక్ (27) ఈ నెల 19వ తేదీన సాయంత్రం బయటకు వెళ్తున్నానని చెప్పి తిరిగిరాలేదు. పలుచోట్ల వెతికినా ఆచూకీ లభించలేదు. ఇదిలా ఉండగా అల్వాల్‌లోని ఓయో హోటల్‌లో యువకుడు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడని తెలుసుకున్న పోలీసులు కేసు నమోదు చేసుకొని మృతుడు షణ్ముక్‌గా గుర్తించారు. ఆర్థిక సమస్యలతో ఆత్మహత్యకు పాల్పడి ఉండవచ్చని భావిస్తున్నారు. గతంలో సైతం షణ్ముక్ ఇలాంటి ప్రయత్నం చేశాడని కుటుంబసభ్యులు పోలీసులకు తెలిపారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

వారి రూటే సెపరేటు!

ఎస్ఆర్ఓల్లో అక్రమార్కుల తిష్ట

- పాత స్టాంప్ పేపర్లు.. గుట్టుగా రిజిస్ట్రేషన్లు
- భూమి విలువ, విస్తీర్ణాన్ని బట్టి వసూళ్లు
- వివాదాస్పదమవుతున్న ఘటనలు
- ఫిర్యాదులు అందినా చర్యలు శూన్యం



సాక్షి, రంగారెడ్డిజిల్లా: అనధికార లే అవుట్లలో ఖాళీ ప్లాట్ల రిజిస్ట్రేషన్లు.. వివాదాస్పద స్థలాలు.. నిషేధిత యూఎల్సీ.. అసైన్డ్ భూముల్లోని ఖాళీ స్థలాల రిజిస్ట్రేషన్లు.. నాలా కన్వర్షన్ చేయని భూముల రిజిస్ట్రేషన్లు కొంత మంది సబ్ రిజిస్ట్రార్లకు కాసుల వర్షం కురిపిస్తున్నాయి. ఎలాంటి లింకు డాక్యుమెంట్లు లేని ఖాళీ స్థలాలకు/ లే అవుట్లలో ప్రజా ప్రయోజనాల కోసం వదిలిన పార్కులకు పాతస్టాంప్ పేపర్లపై గుట్టుగా రిజిస్ట్రేషన్లు చేస్తున్నారు. కొంత మంది డాక్యుమెంట్ రైటర్లను ఏజెంట్లుగా నియమించుకుని ఒక్కో డాక్యుమెంట్‌పై భూమి విలువ, విస్తీర్ణాన్ని బట్టి వసూళ్లకు పాల్పడుతున్నారు. ఏళ్ల తరబడి ఒకేచోట పని చేస్తుండటం, ఎప్పటికప్పుడు బదిలీలు చేయకపోవడం వీరికి కలిసి వస్తోంది. జిల్లాలో రోజుకు సగటున 650 నుంచి 700 డాక్యుమెంట్లు రిజిస్ట్రేషన్ జరుగుతుంటాయి. వీటిలో అత్యధికంగా శేరిలింగంపల్లి, గండిపేట, ఎల్బీనగర్, చంపాపేట్, వనస్థలిపురం, హయత్‌నగర్, రాజేంద్రనగర్, శంషాబాద్, మహేశ్వరం, రాజేంద్రనగర్, చేవెళ్ల, శంకర్‌పల్లి, అబ్దుల్లాపూర్‌మెట్ ఎస్ఆర్ఓ (సబ్ రిజిస్ట్రేషన్ ఆఫీస్) సెంటర్లలో రిజిస్ట్రేషన్లు అవుతుంటాయి. ఆయా రిజిస్ట్రేషన్ ఆఫీసుల్లో ఏళ్లగా అక్రమార్కులు తిష్టవేశారు. ఒక్కో డాక్యుమెంట్‌కు ఒక్కో రేటు నిర్ణయించి వసూళ్లకు పాల్పడుతున్నారు.

ప్రైవేటు వ్యక్తులదే హవా

ఎస్ఆర్ఓల్లో ప్రభుత్వ ఉద్యోగుల కంటే ప్రైవేటు వ్యక్తుల హవానే ఎక్కువగా కొనసాగుతోంది. డాక్యుమెంటేషన్ మొదలు.. స్కానింగ్ వరకు ప్రతి పనిలో వారే కీలకంగా వ్యవహరిస్తున్నారు. కంప్యూటర్ ఎయిడెడ్ అడ్మినిస్ట్రేషన్ ఆఫ్ రిజిస్ట్రేషన్ డిపార్ట్‌మెంట్ (కార్డ్) అమల్లోకి వచ్చిన 1998 నుంచి అన్ని సబ్ రిజిస్ట్రేషన్ ఆఫీసుల్లో రిజిస్టర్డ్ డాక్యుమెంట్లు స్కానింగ్ చేస్తున్నారు. స్కానింగ్ కోసం యంత్రాలు కొనుగోలు చేసిన అధికారులు సిబ్బందిని నియమించలేదు. దీంతో ఈ ప్రక్రియను పూర్తి చేసేందుకు బయటి (జిరాక్స్ సెంటర్లు) వ్యక్తులపై ఆధారపడాల్సి వస్తోంది. రిజిస్ట్రేషన్ పూర్తయిన రెండు మూడు రోజుల్లోనే పత్రాలు సంబంధిత యజమానికి అందజేయాల్సి ఉంది. కానీ స్కానింగ్‌లో జాప్యంతో వారం పది రోజులు పడుతోంది. అంతేకాదు విలువైన ఆస్తి పత్రాలు ప్రైవేటు వ్యక్తుల చేతుల్లోకి వెళ్తుండడంతో ఒకే ప్లాటుకు రెండు మూడు డాక్యుమెంట్లు అవుతున్నట్లు తెలుస్తోంది. డాక్యుమెంట్లలో దొర్లిన తప్పులను సరి చేసే (ఎడిట్ ఇండెక్స్) అధికారం స్థానిక ఎస్ఆర్ఓలకు ఉండేది. ఇటీవల ఈ బాధ్యతను జిల్లా ఎస్ఆర్ఓకు అప్పగించారు. చేయి తడపనిదే ఎడిట్ ఇండెక్స్ ఫైళ్లు కదలడం లేదన్న ఆరోపణలు ఉన్నాయి.

మచ్చుకు కొన్ని కేసులు

◆ జెడ్పీ రోడ్డు సర్వే నంబర్ 58, సర్వే నంబర్ 60లో వెలసిన లే అవుట్లలో ప్రజావసరాల కోసం వదిలిన ఖాళీ స్థలాలకు ఎల్బీనగర్ ఎస్ఆర్ఓ రిజిస్ట్రేషన్లు చేయడం వివాదాస్పదంగా మారింది. నిజానికి ఏదైనా ప్లాటు రిజిస్ట్రేషన్ చేయాలంటే ఆ భూమికి సంబంధించిన పూర్వాపరాలు పరిశీలించాలి. లింక్ డాక్యుమెంట్లు సరి చూడాలి. ఇక్కడి ఎస్ఆర్ఓ ఇవేవీ పట్టించుకోకుండా రిజిస్ట్రేషన్ చేశారు. ప్రజా వసరాల కోసం వదిలిన ఖాళీ స్థలాన్ని పక్కప్లాటు వ్యక్తి ఆక్రమించుకుని గుట్టుగా రిజిస్ట్రేషన్ చేసుకున్న అంశంపై ఇటీవల ఓ వ్యక్తి కోర్టును ఆశ్రయించడం, సబంధిత అధికారులపై న్యాయమూర్తి సీరియస్ కావడం చర్చనీయాంశంగా మారింది.

◆ వ్యవసాయ భూమిని వ్యవసాయేతర (నాలా కన్వర్షన్) భూమిగా మార్చేందుకు మార్కెట్ విలువ ప్రకారం 3 శాతం, ఏదైనా నిర్మాణాలు ఉంటే 4.5 శాతం చొప్పున రుసుం చెల్లించాలి. శేరిలింగంపల్లి మండలం నానక్‌రాంగూడ సర్వే నంబర్ 48లోని ఏడున్నర ఎకరాల భూమి రిజిస్ట్రేషన్ విషయంలో అక్రమాలకు పాల్పడ్డారు. ఈ భూమి విలువ రూ.166.40 కోట్లు ఉన్నట్లు అంచనా. ఈ లెక్కన ఏడున్నర ఎకరాలకు రూ.4.99 కోట్ల వరకు నాలా రుసుం చెల్లించాల్సి ఉంది. నాలా కన్వర్షన్ కాని ఈ భూమిని 37,061 గజాల చొప్పున మార్చి గుట్టుగా రిజిస్ట్రేషన్లు చేశారు. జిల్లా రిజిస్ట్రార్ దీన్ని గుర్తించి అబెయన్స్‌లో పెట్టడంతో విషయం వెలుగులోకి వచ్చింది. రిజిస్ట్రేషన్ చేసేప్పుడు లింకు డాక్యుమెంట్లతో పాటు నాలా, ప్రభుత్వ, ప్రైవేటు, వివాదాస్పద భూములు ఏమైనా ఉన్నాయా అనే అంశాన్ని ధ్రువీకరించుకున్న తర్వాతే రిజిస్ట్రేషన్లు చేయాలి. సబ్ రిజిస్ట్రార్ ఆఫీసు సిబ్బంది ఇవేవీ పట్టించుకోలేదు.

◆ ఎల్ఆర్ఎస్‌కు సంబంధించి ఒక లే అవుట్‌లో కనీసం పది ప్లాట్లు రిజిస్టర్ అయితే అందులోని మిగిలిన ప్లాట్లను సైతం రిజిస్ట్రేషన్ చేసుకునేందుకు వెసులుబాటు కల్పించడాన్ని అవకాశంగా తీసుకుని అక్రమాలకు తెరలేపారు. రోజుకు 12 ప్లాట్లు కూడా రిజిస్ట్రేషన్ కాని, వికారాబాద్ జిల్లా తాండూరు సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయంలో కేవలం ఆరు రోజుల్లోనే 220 ప్లాట్లు రిజిస్ట్రేషన్ చేశారు. ఎల్ఆర్ఎస్ కటాఫ్ తేదీ (2020 ఆగస్టు 26) తర్వాత వెలసిన లే అవుట్లలోని ప్లాట్లు కూడా అంతకు ముందు తేదీలు వేసి, 25 శాతం రాయితీతో రిజిస్ట్రేషన్లు చేసి ప్రభుత్వానికి పెద్ద మొత్తంలో గండి కొట్టారు. డాక్యుమెంట్లు స్కానింగ్ చేయకపోవడంతో అనుమానం వచ్చి ఆరా తీయగా అసలు విషయం బయటికి పొక్కింది.

◆ బాలాపూర్ మండలం అల్మాస్‌గూడ రెవెన్యూ సర్వే నంబర్ 129,130, 131,132లో ప్రజావసరాల కోసం వదిలిన ఖాళీ ప్లాట్లకు చంపాపేట ఎస్ఆర్ఓ గుట్టుగా రిజిస్ట్రేషన్లు చేశారు. మున్సిపల్ టౌన్‌ప్లానింగ్ అధికారులు నిర్మాణాలకు అనుమతులు జారీ చేశారు. ఎలాంటి లింకు డాక్యుమెంట్లు లేని, కోర్టు వివాదంలో ఉన్న ఈ లే అవుట్‌లోని ఖాళీ స్థలాలను రిజిస్ట్రేషన్ చేయడం వివాదాస్పదంగా మారింది. ఎస్ఆర్ఓ, టౌన్‌ప్లానింగ్ అధికారులపై ఉన్నతాధికారులకు ఫిర్యాదులు అందినా ఇప్పటి వరకు ఏ ఒక్కరిపై చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు.

పని చేస్తున్న సంస్థకే టోకరా

రూ.13 లక్షలు మోసం చేసిన డెలివరీ ఏజెంట్

సైదాబాద్: ఆన్‌లైన్ ద్వారా క్రయవిక్రయాలు చేసే సంస్థలో డెలివరీ ఏజెంట్‌గా పని చేస్తున్న వ్యక్తి సంస్థకే టోకరా ఇచ్చాడు. వినియోగదారులతో కుమ్మక్కై రూ.13 లక్షల మేర సంస్థను మోసం చేశాడు. సైదాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకున్న ఈ ఘటన గురించి ఎస్ఐ పసునూరి వెంకటేశ్వర్లు తెలిపిన వివరాల ప్రకారం..న్యూ సైదాబాద్ కాలనీలో ఇన్‌స్టాకార్ట్ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ పలు ఈకామర్స్ సంస్థలకు సేవలను నిర్వహిస్తుంది. అందులో ఓల్డ్‌మలక్‌పేటకు చెందిన మహమద్ ఇజాజ్ షరీఫ్ డెలివరీ ఏజెంట్‌గా పనిచేస్తున్నాడు. సంస్థ వినియోగదారులకు అందిస్తున్న ఆఫర్ ప్రకారం అతను వినియోగదారుల నుంచి పాత సెల్‌ఫోన్‌లు సేకరించి ఎక్స్‌ఛేంజ్ ఆఫర్ ప్రకారం ఫోన్‌ల ధరను నిర్ణయించి కొత్త ఫోన్‌ల బిల్లులు సేకరించాలి. అయితే వినియోగదారులు తప్పుగా చూపిన తమ పాత ఫోన్‌ల వివరాలను ఇజాజ్ షరీఫ్ గుర్తించి కూడా వారితో కుమ్మక్కై వారి నుండి ఎంతో కొంత నగదు తీసుకొని పాత సెల్‌ఫోన్లకు ఎక్కువ ధరను నిర్ణయిస్తున్నాడు. ఇలా అతను 153 ఫోన్ల విషయంలో తప్పుడు వివరాలను సరైనవిగా రూఢీ చేసి వినియోగదారుల నుంచి సొమ్ము దండుకున్నాడు. ఇజాజ్ చేసిన మోసం వలన సంస్థ రూ.13 లక్షల 3 వేల 349 నష్ట పోయింది. ఒకే ఏజెంట్ ద్వారానే ఇలా తప్పులు జరగటం గుర్తించిన సంస్థ ప్రతినిధి ఎం.ఎ.రహ్మాన్ శనివారం సైదాబాద్‌పోలీసులకు ఫిర్యాదు చేశారు. నిందితుడ్ని పోలీసులు అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వస్త్ర దుకాణంలో అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి


షాపులో మృతి చెందిన విష్ణువర్ధన్‌రెడ్డి

అమీర్‌పేట: ఓ సాఫ్ట్‌వేర్ ఉద్యోగి అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. ఎస్ఆర్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆదివారం జరిగిన సంఘటన వివరాలు ఇన్స్‌పెక్టర్ శ్రీనాథ్‌రెడ్డి తెలిపిన ప్రకారం..నెల్లూరు జిల్లాకు చెందిన పాలిమేర విష్ణువర్ధన్‌రెడ్డి (26) ఓ ప్రముఖ కంపెనీలో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పనిచేస్తూ ఎస్ఆర్‌నగర్‌లోని తన సోదరి నివాసంలో ఉంటున్నాడు. ఇతను తన సోదరి భర్త మనోజ్‌తో కలిసి ఇక్కడే ఓ వస్త్ర దుకాణం కూడా నిర్వహిస్తున్నారు.

సోదరి ఇటీవల సొంత ఊరికి వెళ్లి పోవడంతో బామ్మర్ది మనోజ్‌తో కలిసి అక్కడే నివాసముంటున్నారు. మనోజ్ పనిమీద కర్నూలు వెళ్లడంతో విష్ణు షాపు చూసుకుంటున్నాడు. ఆదివారం షాపులో నిద్రించిన విష్ణువర్ధన్‌రెడ్డి ఎంతసేపైనా లేవక పోవడంతో రాత్రి 8 గంటల సమయంలో అందులో పని చేసే యువతి అతన్ని లేపేందుకు ప్రయత్నించింది. స్పందన లేక పోవడంతో పోలీసులకు సమాచారం ఇచ్చింది. అక్కడి చేరుకున్న పోలీసులు 108 సిబ్బందికి సమాచారం ఇవ్వగా సిబ్బంది వచ్చి పరీక్షించి అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతికి గల కారణాలపై విచారణ ప్రారంభించి సీసీకెమెరాల ఫుటేజీలను పరిశీలించారు. షాపులో మద్యం తాగినట్లు గుర్తించారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నారు. అతిగా మద్యం సేవించడం వల్ల మృతి చెందాడా లేక ఇతర కారణాలు ఏమైనా ఉన్నాయా అనే కోణంలో విచారణ చేస్తున్నట్లు ఇన్స్‌పెక్టర్ తెలిపారు.

ఉత్సాహంగా 'ఎథ్నిక్ రన్'


కార్యక్రమంలో పాల్గొన్న గుమ్మడి వెన్నెల తదితరులు

శంకర్‌పల్లి: మండలంలోని పిల్లిగుండ్ల గ్రామంలో ఆదివారం గండిపేట వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో 'ఎథ్నిక్ రన్ –2025' కార్యక్రమాన్ని నిర్వహించారు. రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ శారద నేరెళ్ల, తెలంగాణ సాంస్కృతిక సారథి చైర్‌పర్సన్ గుమ్మడి వెన్నెల ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. వందలాది మంది మహిళలు సంప్రదాయ దుస్తులు ధరించి ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా శారద నేరెళ్ల మాట్లాడుతూ.. మహిళల ఆరోగ్యం, ప్లాస్టిక్ నిర్మూలన కోసం ప్రతి ఒక్కరూ ముందుకు రావడం గొప్ప విషయమన్నారు. ఇలాంటి కార్యక్రమాలు భవిష్యత్తులో మరిన్ని చేపట్టాలని ఆకాంక్షించారు. గుమ్మడి వెన్నెల మాట్లాడుతూ.. సంస్కృతి, సంప్రదాయాలను గుర్తు చేస్తూ యువతలో ఆసక్తి పెంపొందించడంలో గండిపేట వెల్ఫేర్ సొసైటీ విజయవంతమైందని అభినందించారు. సొసైటీ జాయింట్ సెక్రెటరీ వాణి మాట్లాడుతూ.. పదేళ్ల క్రితం తమ సొసైటీ ఏర్పడిందని, అప్పటి నుంచి మహిళల ఆరోగ్యం, పర్యావరణ పరిరక్షణ, ప్లాస్టిక్ నిర్మూలన అంశాలపై విస్తృతంగా అవగాహన కల్పిస్తున్నట్టు చెప్పారు. ఏడు ప్రాంతాల్లో ఘన వ్యర్థాల నిర్వహణ కేంద్రాలు నడుపుతున్నట్లు వివరించారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

చెరువులో మునిగి ఇద్దరు మృతి



ప్రణీత, ఇంద్రసేనారెడ్డి మృతదేహాలు

అబ్దుల్లాపూర్ మెట్: చెరువు పక్కన ఉన్న బండరాయిపై ఆడుకుంటున్న ఓ చిన్నారి ప్రమాదవశాత్తు చెరువులో పడింది. ఆమెను రక్షించడానికి ప్రయత్నించిన మరో యువకుడు కూడా చెరువులో మునిగి మృతి చెందాడు. ఈ సంఘటన అబ్దుల్లాపూర్ మెట్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్ గుంటూరు జిల్లాకు చెందిన చిన్నపురెడ్డి ప్రతాప్ రెడ్డి, భార్య ఇద్దరు పిల్లలతో కలిసి అబ్దుల్లాపూర్ మెట్‌లోని లక్ష్మీ ప్రియానగర్ కాలనీలో నివాసం ఉంటున్నారు. అనాజ్‌పూర్ సమీపంలోని ఇందిరమ్మ చెరువు దగ్గర వెంచర్లో ప్రతాప్‌రెడ్డి పనిచేస్తున్నాడు. ఈ క్రమంలో ఆదివారం సాయంత్రం కూతురు ప్రణీత(10)తో పాటు బంధువులతో కలిసి వెంచర్ దగ్గరికి వెళ్లాడు. వెంచర్ సమీపంలో ఉన్న చెరువు వద్ద బండరాయిపై ఆడుకుంటున్న ప్రణీత ప్రమాదవశాత్తు చెరువులో పడి మునిగిపోయింది. గమనించిన ప్రతాప్‌రెడ్డి బంధువు చింతంరెడ్డి ఇంద్రసేనారెడ్డి(20) ఆమెను కాపాడే ప్రయత్నంలో అతను కూడా మునిగి ఇద్దరూ చనిపోయారు. చిన్నారి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాలను నిమ్స్‌కు తరలించారు.

కరెంటు ఉండని ప్రాంతాలు

బంజారాహిల్స్: కరెంటు వైర్లకు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మలను నరికివేస్తున్న కారణంగా సోమవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు జూబ్లీహిల్స్ రోడ్డు నంబర్-78, సినీనటుడు మహేష్‌బాబు నివాసం, రోడ్డు నంబర్-80, ఉదయం 10 నుంచి 11 గంటల వరకు జూబ్లీహిల్స్ రోడ్డు నంబర్-71 నుంచి 76 వరకు, భారతీయ విద్యాభవన్ స్కూల్, జూబ్లీహిల్స్ స్కూల్, షబ్బీర్ అలీ నివాసం, గుత్తా సుఖేందర్‌రెడ్డి నివాసం, మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు జూబ్లీహిల్స్ రోడ్డు నంబర్ 78, 79, పద్మాలయా స్టూడియో, రామానాయుడు స్టూడియో, పద్మాలయా అంబేడ్కర్‌నగర్ బస్తీ ప్రాంతాల్లో కరెంటు సరఫరా నిలిచిపోతుందని ఏడీఈ ఒక ప్రకటనలో తెలిపారు.

లక్డీకాపూల్: ఖైరతాబాద్ నియోజకవర్గ పరిధిలోని పలు ప్రాంతాల్లో సోమవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు అధికారులు తెలిపారు. లుంబినీపార్క్ ప్రాంతంలోని అవంతినగర్ 11 కేవీ ఫీడర్ పరిధిలోని స్కైలేన్ అపార్టుమెంట్స్, తిరుమల అపార్టుమెంట్, అవంతినగర్ ప్రాంతాల్లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు కరెంట్ సరఫరాకు అంతరాయం ఉంటుంది. టీటీడీ 11కేవీ ఫీడర్ పరిధిలోని హిమాయత్‌నగర్‌లోని టీటీడీ మెయిన్ రోడ్ ఏరియా, లిబర్టీ రోడ్, హిమాయత్‌నగర్ మెయిన్ రోడ్, సత్య కిడ్నీ సెంటర్, జమునా ప్లాజా, వెలమ అసోసియేషన్ ప్రాంతాల్లో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు కరెంట్ సరఫరా ఉండదని అధికారులు తెలిపారు.

మున్నూరు కాపులు సంఘటితంగా ముందుకు సాగాలి



మాట్లాడుతున్న కొండ దేవయ్య పటేల్

పంజగుట్ట: మున్నూరు కాపులు అందరూ ఒకే కులం, ఒకే సంఘంగా ముందుకు పోవాలని తెలంగాణ మున్నూరు కాపు సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా రెండవసారి ఏకగ్రీవంగా ఎన్నికైన డాక్టర్ కొండ దేవయ్య పటేల్ అన్నారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో తెలంగాణ మున్నూరు కాపు సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యుల ఎన్నిక నియామక పత్రాల పంపిణీ కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. 33 జిల్లాల కార్యవర్గం సంఘం అధ్యక్షుడిగా కొండ దేవయ్య పటేల్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా మున్నూరు కాపు సంఘం అపెక్స్ కౌన్సిల్ రద్దు చేసి, మంత్రివర్గంలో ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్‌కు అవకాశం కల్పించాలని తీర్మానం చేశారు. సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా సూర్యాపేట జిల్లాకు చెందిన జల్లేపల్లి వెంకటేశ్వర్లు, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా రాజేందర్, షేర్ నర్సారెడ్డి, ఉపాధ్యక్షుడిగా కోలా నాగేశ్వర్‌రావును ఎన్నుకున్నారు.

మహిళా గ్రూపుల్లో చేరితే.. స్వయం ఉపాధి

- అర్హత ఉన్నవారంతా చేరవచ్చు
- గ్రూపుల్లో చేరితే బ్యాంక్ రుణాలు
- స్వయం ఉపాధికి చక్కటి అవకాశం
- ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాల్లోనూ కీలకపాత్ర



స్వయం సహాయక బృందాల వల్ల ప్రయోజనాలపై అవగాహన కలిగిస్తున్న జూబ్లీహిల్స్ సర్కిల్ డీసీ సమ్మయ్య

బంజారాహిల్స్: ప్రభుత్వం ప్రవేశపెట్టే పథకాలు, కార్యక్రమాలు, ఇతర కమ్యూనిటీ కార్యక్రమాల్లో స్వయం సహాయక బృందాలదే కీలకపాత్ర. తమ తమ ప్రాంతాల్లో ఏ ప్రభుత్వ పథకం అర్హులకు చేరాలన్నా మహిళా గ్రూపుల పాత్ర ఎంతో కీలకంగా మారుతోంది. ఇటీవల కాలంలో కాంగ్రెస్ ప్రభుత్వం మహిళా గ్రూపులకు ఎనలేని ప్రాధాన్యం కల్పించింది. ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి కూడా మహిళా గ్రూపు సభ్యులనే నియమిస్తోంది. అయితే అర్హత ఉన్న ప్రతి మహిళ స్వయం సహాయక బృందంలో చేరేవిధంగా కొంతకాలంగా జీహెచ్ఎంసీ అధికారులు కృషి చేస్తున్నా చాలామంది వీటి ప్రయోజనాలు తెలియక ఆసక్తి చూపడం లేదు. ఫలితంగా చాలామంది మహిళలు అర్హత ఉండి కూడా మహిళా గ్రూపుల్లో చేరకపోవడం, స్వయం ఉపాధి పథకాలను అందిపుచ్చుకోకపోవడం జరుగుతోంది. దీనిని గుర్తించి ప్రభుత్వం అర్హత ఉన్న మహిళలంతా మహిళా గ్రూపుల్లో చేరేవిధంగా కార్యాచరణ ప్రణాళికను రూపొందించింది. రెండు నెలలు క్రితం ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో ప్రణాళికాబద్ధంగా జీహెచ్ఎంసీ యూసీడీ విభాగం అధికారులు ఇంటింటి సర్వే చేపట్టారు. జీహెచ్ఎంసీ జూబ్లీహిల్స్ సర్కిల్-18 పరిధిలో వెంకటేశ్వరకాలనీ, జూబ్లీహిల్స్, బంజారాహిల్స్, షేక్‌పేట డివిజన్ల పరిధిలో జీహెచ్ఎంసీ యూసీడీ విభాగం రీసోర్స్ పర్సన్లు, కమ్యూనిటీ ఆర్గనైజర్లు డోర్ టు డోర్ చేస్తున్నారు. 18 నుంచి 50 సంవత్సరాలలోపు వయస్సు ఉన్న ప్రతి మహిళను గ్రూపుల్లో చేర్పేవిధంగా ఇంటింటికీ వెళ్లి అవగాహన కలిగిస్తున్నారు. స్వయం స్వహాయక బృందాల్లో చేరితే రూ.లక్ష నుంచి రూ.20 లక్షల వరకు రుణాలు తీసుకోవడం ద్వారా స్వయం ఉపాధి పొందవచ్చని అవగాహన కలిగిస్తున్నారు.



ఇంటింటి సర్వేలో భాగంగా అర్హులైన మహిళలను గ్రూపుల్లో చేరుస్తున్న రీసోర్స్ పర్సన్స్

- 18-50 సంవత్సరాల వయస్సు కలిగిన మహిళలంతా మహిళా గ్రూపుల్లో చేరడానికి అర్హత ఉంటుందని పేర్కొన్నారు.
- జీహెచ్ఎంసీ అధికారులు ప్రతి బస్తీకి వెళ్లి అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.
- స్వయం ఉపాధి పొందుతున్న మహిళా గ్రూపుల విజయగాథలను వీరికి తెలియజేస్తున్నారు.
- జూబ్లీహిల్స్ సర్కిల్-18 పరిధిలో ప్రస్తుతం 895 మహిళా గ్రూపులు ఉండగా గత రెండు నెలల నుంచి కొత్తగా 40 గ్రూపులను చేర్చారు.
- మహిళా గ్రూపుల్లో చేరడం ద్వారా ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందడమే కాకుండా అమ్మ ఆదర్శ కమిటీలు, బస్తీల్లో సామాజిక కార్యక్రమాలు, ప్రభుత్వం ప్రవేశపెట్టే సంక్షేమ కార్యక్రమాల్లో విస్తృతంగా పాల్గొనేందుకు అవకాశం ఉంటుంది.
- జూబ్లీహిల్స్ సర్కిల్ పరిధిలో 33 మంది రీసోర్స్ పర్సన్లు పనిచేస్తుండగా, వీరంతా ప్రతిరోజూ తమ ప్రాంతంలోని బస్తీలో పర్యటిస్తూ మహిళా గ్రూపులను ఏర్పాటు చేస్తున్నారు.

ఆసక్తి ఉన్నవారు సంప్రదించవచ్చు



ఆసక్తి ఉన్న మహిళలంతా తమ సమీపంలోని జీహెచ్ఎంసీ రీసోర్స్ పర్సన్‌లను సంప్రదించి మహిళా గ్రూపుల్లో చేరవచ్చు. స్వయం సహాయక బృందాల్లో చేరడం వల్ల ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయి. ఫలితంగా బ్యాంక్ లింకేజీ ద్వారా రుణాలు పొంది స్వయం ఉపాధి పొందవచ్చు.

– ఆశావిరోనిక, యూసీడీ డీపీఓ, జూబ్లీహిల్స్ సర్కిల్

కొత్తగా గ్రూపులో చేరాను



నేను ఇటీవలే కొత్తగా స్వయం సహాయక బృందంలో చేరాను. మహిళా గ్రూపుల్లో చేరడం వల్ల స్వయం ఉపాధిని పొందవచ్చని తెలుసుకుని చేరడం జరిగింది. జీహెచ్ఎంసీ అధికారులు తమ బస్తీలో సమావేశం నిర్వహించి ఈ గ్రూపుల వల్ల ప్రయోజనాలు తెలియజేశారు.

– అర్షియాబేగం, శ్రీరామ్‌నగర్, బంజారాహిల్స్

స్వయం ఉపాధితో ఆర్థికంగా నిలదొక్కుకుంటా



మా బస్తీలో కొంత కాలం క్రితం జీహెచ్ఎంసీ అధికారులు మహిళా గ్రూపుల గురించి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఇందులో చేరడం వల్ల ఎన్ని ప్రయోజనాలు ఉన్నాయో తెలియజేశారు. అందుకే నేను కూడా కొత్తగా చేరాను. రుణాలు తీసుకుని వ్యాపారాలు ఏర్పాటు చేసుకుని స్వయం ఉపాధి పొందాలని నిర్ణయించుకున్నాను.

– గౌసియాబేగం, శ్రీరామ్‌నగర్

అర్హులైన వారంతా చేరాలి



స్వయం సహాయక బృందాల్లో అర్హత ఉన్న ప్రతి మహిళా చేరేవిధంగా ఇంటింటి సర్వే చేపడుతున్నారు. మహిళల నుంచి మంచి స్పందన లభిస్తోంది. ఎవరైనా గ్రూపుల్లో చేరాలనుకుంటే మమ్మల్ని సంప్రదించవచ్చు. గ్రూపుల్లో చేరడం వల్ల స్వయం ఉపాధితో వ్యాపారాలు ఏర్పాటు చేసుకుని ఆర్థికంగా నిలదొక్కుకోవచ్చు.

– భాషింగ్ కమ్యూనిటీ ఆర్గనైజర్, జూబ్లీహిల్స్ సర్కిల్.

బసవతారకం ఆస్పత్రిలో లీనియర్ యాక్సిలేటర్ యంత్రం ప్రారంభం



లీనియర్ యాక్సిలేటర్ రేడియో థెరపీ యంత్రాన్ని ప్రారంభిస్తున్న గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ

బంజారాహిల్స్: బసవతారకం ఇండో అమెరికన్ క్యాన్సర్ హాస్పటల్ అండ్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ రజతోత్సవం వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ, విశిష్ట అతిథిగా ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహలు హాజరై ఆస్పత్రిలో ఏర్పాటుచేసిన అత్యాధునిక లీనియర్ యాక్సిలేటర్ అనే రేడియోథెరపీ యంత్రాన్ని, గుండె సంబంధిత పరీక్షలు, చికిత్స అందించడానికి ఏర్పాటుచేసిన ఆధునిక క్యాథ్‌ల్యాబ్‌ను వారు ప్రారంభించారు. అనంతరం గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ మాట్లాడుతూ జీవించే హక్కును పొందడంలో బసవతారకం హాస్పటల్ ముందంజలో ఉన్నట్లు తనకు అర్థమైందన్నారు. మంత్రి దామోదర రాజనర్సింహ మాట్లాడుతూ క్యాన్సర్ రోగులకు ఎంతో సేవాతత్పరతతో సేవలు అందిస్తూ దేశంలోనే పేరు ప్రతిష్టలు గడిస్తున్న బసవతారకం హాస్పటల్ 25 సంవత్సరాలు పూర్తి చేసుకోనుండడం పట్ల యాజమాన్యానికి, సిబ్బందికి శుభాకాంక్షలు తెలియజేశారు.

ప్రతి ఒక్కరూ ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలి

హిమాయత్‌నగర్ కార్పొరేటర్ మహాలక్ష్మి రామన్ గౌడ్



మాట్లాడుతున్న కార్పొరేటర్ మహాలక్ష్మి

హిమాయత్‌నగర్: ఆరోగ్యం పట్ల ప్రతి ఒక్కరూ శ్రద్ధ వహించాలని హిమాయత్‌నగర్ కార్పొరేటర్ మహాలక్ష్మి రామన్‌గౌడ్ అన్నారు. దిగంబర్ జైన్ సోషల్ గ్రూప్ హైదరాబాద్ అధ్యక్షుడు వినయ్ గంగవాల్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన సీపీఆర్ ట్రైనింగ్ అండ్ బేసిక్ లైఫ్ సపోర్ట్, దిల్ కీ బాత్ కార్యక్రమానికి కార్పొరేటర్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. యశోద హాస్పిటల్స్ డాక్టర్ కల జితేందర్ మాట్లాడుతూ గుండెను ఆరోగ్యంగా ఎలా ఉంచుకోవాలో తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ లీడర్ జి.రామన్‌గౌడ్, పడాల శ్రీనివాస్‌గౌడ్, జై.కృష్ణగౌడ్, కే.శేఖర్, సుజాత, హితేష్, దిగంబర్ జైన్, సోషల్ గ్రూప్ హైదరాబాద్ సభ్యులు దినేష్ జైన్, సంగీత జైన్, ప్రవీణ్ పాండ్యా పాల్గొన్నారు.

ఎంఎస్‌పీ డివిజన్ అధ్యక్షుడిగా వేణుకుమార్ మాదిగ



వేణుకుమార్‌కు నియామక పత్రం అందజేస్తున్న ఎంఎస్‌పీ సభ్యులు

ఫిలింనగర్: జూబ్లీహిల్స్ డివిజన్ మహాజన సోషలిస్ట్ పార్టీ(ఎంఎస్‌పీ) అధ్యక్షుడిగా ఫిలింనగర్ గౌతంనగర్ బస్తీకి చెందిన బొప్పారం వేణుకుమార్ మాదిగ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఫిలింనగర్‌లో ఆదివారం జరిగిన సమావేశంలో ఎంఎస్‌పీ హైదరాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి కొడ్రుపల్లి శివకుమార్ మాదిగ, ఖైరతాబాద్ కో ఇన్‌చార్జి కండె రామ్‌కుమార్ మాదిగ చేతులమీదుగా ఆయన నియామక పత్రం అందుకున్నారు. అదేవిధంగా ప్రధాన కార్యదర్శిగా ఇనపనూరి వెంకటేష్ మాదిగను నియమించారు. కార్యక్రమంలో ఫిలింనగర్ 18 బస్తీల ఎమ్మార్పీఎస్ నేతలు, ఎంఎస్‌పీ కార్యకర్తలు పాల్గొన్నారు.

దేశ ప్రజల సంక్షేమం కోసం ఎన్నో పథకాలు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే అభయ్ పాటిల్

శ్రీనగర్‌కాలనీ: దేశాన్ని ప్రగతిపథంలో నడిపిస్తూ దేశ ప్రజల సంక్షేమం కోసం ఎన్నో పథకాలను ప్రవేశపెట్టి దేశాన్ని ప్రపంచపటంలో టాప్‌లో నిలిపిన మహోన్నత వ్యక్తి ప్రధాని మోదీ అని కర్ణాటక ఎమ్మెల్యే, రాష్ట్ర బీజేపీ ఇన్‌చార్జి అభయ్ పాటిల్ అన్నారు. ఎర్రగడ్డ డివిజన్ ప్రేమ్‌నగర్‌లో శనివారం రాత్రి ప్రధాని మోదీ 11ఏళ్ల పాలనపై సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశాన్ని అన్నిరంగాల్లో అభివృద్ధి పథంలో ముందుకు తీసుకువెళ్తూ ప్రపంచంలో నాలుగో స్థానంలో నిలిపారన్నారు. బీజేపీ రాష్ట్ర జనరల్ సెక్రటరీ చంద్రశేఖర్ మాట్లాడుతూ రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్, బీఆర్ఎస్‌లు అవినీతి పార్టీలని, రాష్ట్రంలో బీజేపీ పాలన తీసుకురావడానికి మోదీ చేసిన అభివృద్ధి పనులను ప్రజలకు తెలియజేయాలని కోరారు. బీజేపీ జనరల్ సెక్రటరీ బంగారు శృతి, సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు లంకల దీపక్‌రెడ్డి, నాయకులు ప్రేమ్‌కుమార్, గంగరాజు, బంగారు ప్రశాంత్, అట్లూరి రామకృష్ణ, హనుమంతనాయుడు, రాజేష్, శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గంజాయి సేవిస్తున్న ఇద్దరు యువకుల అరెస్టు

ఫిలింనగర్: గంజాయి సేవిస్తున్న ఇద్దరు యువకులను ఫిలింనగర్ పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. వివరాలు.. మెహిదీపట్నం ప్రాంతానికి చెందిన ఎండీ అబ్దుల్ బాసిత్(25) బీబీఏ చదువుతున్నాడు. ఆయన స్నేహితుడు ఎండీ అబ్దుల్‌రహీం(26) డెంటల్ అసిస్టెంట్. వీరిద్దరూ కలిసి కొంతకాలంగా గంజాయికి అలవాటుపడి నిర్మానుష్య ప్రాంతంలో తాగుతున్నారు. ఫిలింనగర్‌లోని కొత్త చెరువు వద్ద వీరుద్దరూ గంజాయి సేవిస్తుండగా ఫిలింనగర్ పోలీసులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. వీరి నుంచి 23 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకుని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. వీరితో పాటు గంజాయి సేవిస్తున్న సయ్యద్ తారిఖ్ హుస్సేన్ పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు. ఫిలింనగర్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ప్రభుత్వ స్థలంలోని నిర్మాణాలను కూల్చివేయండి

ఫిలింనగర్: జూబ్లీహిల్స్ డివిజన్ పరిధిలోని ఫిలింనగర్ వినాయకనగర్ బస్తీని ఆనుకుని డబుల్ బెడ్‌రూమ ఇళ్ల నిర్మాణం కోసం కేటాయించిన ప్రభుత్వ స్థలాన్ని కొంత మంది కబ్జా చేసి గేట్లు ఏర్పాటు చేశారని, వాటిని వెంటనే కూల్చివేయాలని స్థానిక కార్పొరేటర్ వెల్దండ వెంకటేష్ కోరారు. వినాయకనగర్ బస్తీని ఆనుకుని ఎకరం స్థలాన్ని గతంలోనే డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల నిర్మాణం కోసం కేటాయించడం జరిగిందని, ఈ స్థలాన్ని కొంతమంది ఆక్రమించి దిమ్మెలు ఏర్పాటు చేసి గేట్లు కూడా నిర్మించడం జరిగిందని ఆరోపించారు. వెంటనే వీటిని కూల్చివేసి ప్రభుత్వ స్థలాన్ని కాపాడాలని ఆయన కోరారు.

పుస్తకావిష్కరణ



పుస్తకావిష్కరణలో అవధాని గరికపాటి తదితరులు

ఖైరతాబాద్: శ్రీఅఖిల భారత అయ్యప్ప సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆదివారం విశ్వేశ్వరయ్య భవన్‌లో భూతనాథోపాఖ్యానం, శబరిమల సంపూర్ణ చరిత్ర మాల నియమాల నిష్ఠ పుస్తకాల ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పద్మశ్రీ గరికపాటి నరసింహారావు చెప్పిన ప్రవచనాలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో వ్యవస్థాపకులు కనపర్తి విఘ్నేష్, తెలు శ్రీనివాస్, మేనేజింగ్ కమిటీ ప్రెసిడెంట్ శంకర్‌వర్మ, శబరిమల గురుత్తి పూజ నిర్వాహకులు అజిత్ కుమార్, శివకుంటి ఉన్ని కృష్ణ, శబరిమల మాజీ మెయిల్ బ్రహ్మశ్రీ శాంతి సుధీర్ నంబూద్రి, మురళి నంబూద్రి, ఆధ్యాత్మిక ప్రసంగీకులు అరవింద సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ జీపీ ఉద్యోగుల జేఏసీ ఆవిర్భావం

హిమాయత్‌నగర్: తెలంగాణ రాష్ట్ర గ్రామ పంచాయతీ(జీపీ) ఉద్యోగుల సంఘ సమావేశం ఆదివారం జరిగింది. సమావేశంలో ఐదు సంఘాలు(తెలంగాణ గ్రామపంచాయతీ ఉద్యోగుల సంఘం, తెలంగాణ గ్రామపంచాయతీ కారోబర్ల సిబ్బంది యూనియన్, కారోబర్స్ అండ్ బిల్ కలెక్టర్ యూనియన్, తెలంగాణ గ్రామ పంచాయతీ ఎంప్లాయిస్ యునైటెడ్ అసోసియేషన్, బీఆర్‌టీయూ) అధ్యక్షతన జేఏసీ కమిటీ ఏర్పాటు చేశారు. ఈ కమిటీతో పాటు కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. జేఏసీ చైర్మన్‌గా మామిడాల నర్సింహులు, వైస్ చైర్మన్‌గా బింగి గణేష్, ప్రధాన కార్యదర్శిగా ఆర్‌కె.నాయుడు, కార్యదర్శిగా ఓరుగంటి రఘు, చాతల్ల సదానందం, గూని గంగారాం, కోశాధికారిగా సాదుల శ్రీకాంత్, పిల్లి రవి, ప్రచార కార్యదర్శిగా ఎండి. యాకూబ్ పాషా, సీహెచ్.మల్లాచారి, పి.బాలరాజు తదితరులు ఎన్నికయ్యారు.



సమావేశంలో అభివాదం చేస్తున్న జేఏసీ నాయకులు

ఒకవైపు కాంగ్రెస్ శ్రేణుల ఆందోళన.. మరోవైపు జాగృతిలో చేరికలు..



బంజారాహిల్స్‌లోని బీఆర్ఎస్ భవన్ వద్ద ఎన్ఎస్‌యూఐ కార్యకర్తలను అరెస్టు చేస్తున్న పోలీసులు

బంజారాహిల్స్: బీఆర్ఎస్ కార్యాలయంలో ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి విలేకరుల సమావేశం ఏర్పాటు చేస్తారన్న నేపథ్యంలో 200 మందితో కాంగ్రెస్ శ్రేణులు కార్యాలయాన్ని ముట్టడించేందుకు నిర్ణయం తీసుకున్నారు. ఈ క్రమంలో పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. అయినప్పటికీ బీఆర్ఎస్ భవన్‌కు పెద్ద ఎత్తున ఎన్ఎస్‌యూఐ కార్యకర్తలు భారీగా తరలి రావడంతో వారిని బంజారాహిల్స్ పోలీసులు అరెస్టు చేశారు. మరోవైపు జాగృతి కార్యాలయం వద్ద చేరికలతో సందడి నెలకొంది. దాదాపు 200 మంది ఆటోడ్రైవర్లు జాగృతి పార్టీలో చేరే క్రమంలో బంజారాహిల్స్ రహదారులు అటు కాంగ్రెస్ శ్రేణుల ఆందోళనతో, ఇటు ఆటోడ్రైవర్ల చేరికలతో హోరెత్తాయి.



బంజారాహిల్స్‌లోని తాజ్ కృష్ణా హోటల్‌లో ఆదివారం ఆకృతి ఎగ్జిబిషన్‌ను సంస్థ డైరెక్టర్ శశినాథ ప్రారంభించారు. జ్యువెలరీ, ఫ్యాషన్ వస్తువులు, దుస్తులు తదితర గృహోపకరణాలతో కూడిన ఈ ఎగ్జిబిషన్ ఈ నెల 24 వరకు కొనసాగుతుందని నిర్వాహకులు పేర్కొన్నారు. – బంజారాహిల్స్

ఆర్టీఐపై ప్రభుత్వానికి పారదర్శకత ఉండాలి



మాట్లాడుతున్న చంటి ముదిరాజ్

హిమాయత్‌నగర్: సమాచార హక్కు చట్టం అమలుపై ప్రభుత్వానికి పారదర్శకత, అధికారులు జవాబుదారిగా ఉండాలని సమాచార హక్కు చట్టం సాధన కమిటీ వ్యవస్థాపక జాతీయ అధ్యక్షుడు డాక్టర్ చంటి ముదిరాజ్ అన్నారు. బషీర్‌బాగ్ దేశోద్ధారక భవన్‌లో సమాచార హక్కు చట్టం సాధన కమిటీ రాష్ట్ర అధ్యక్షురాలు సూర స్రవంతి, ప్రధాన కార్యదర్శి మల్లం వెంకటేశం అధ్యక్షతన రాష్ట్ర కార్యవర్గ సమావేశం ఆదివారం జరిగింది. డా.చంటి ముదిరాజ్ మాట్లాడుతూ సమాచార హక్కు చట్టం పూర్తిస్థాయిలో అమలు కావడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వ కార్యాలయాల్లో అధికారుల నుంచి సహకారం లభించడం లేదన్నారు. అధికారుల్లో జవాబుదారితనం కొరవడిందన్నారు. కమిటీ రాష్ట్ర నాయకులు చింతల రాఘవేందర్ ముదిరాజ్, అలీ, ఎస్.దిలీప్ రావ్, గోపీనాథ్ కట్టికోల, చింతల క్రిష్ణ, వై.కార్తీక్ రెడ్డి, బి.లక్ష్మణ్, ఆర్.లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యమకారుల సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి



మాట్లాడుతున్న చంద్రన్న ప్రసాద్

హిమాయత్‌నగర్: తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ ఉద్యమకారుల జేఏసీ ఆధ్వర్యంలో 28వ తేదీన సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహిస్తున్నట్లు జేఏసీ కోశాధికారి చంద్రన్న ప్రసాద్ తెలిపారు. బషీర్‌బాగ్ దేశోద్ధారక భవన్‌లో ఆదివారం మీడియా సమావేశంలో ఆయన వివరాలను వెల్లడించారు. జేఏసీ నాయకులు గోధుమల కుమారస్వామి, కుసుమ సిద్ధారెడ్డి, సురుడు ప్రభాకర్, ఓవిరాల సుజ్జి, బట్టారి ఆంజనేయ స్వామి, మోహన్ బైరాగి, వేముల యాదగిరి, గడ్డం సదానందం, సర్గ మల్లయ్య పాల్గొన్నారు.

అటకెక్కిన పరిశోధన



ఉస్మానియా యూనివర్సిటీలో తగ్గిన పరిశోధనలు

- వేధిస్తున్న పర్మనెంట్ అధ్యాపకుల కొరత
- పడిపోయిన పీహెచ్‌డీ విద్యార్థుల సంఖ్య
- పట్టించుకోని వర్సిటీ అధికారులు

ఉస్మానియా యూనివర్సిటీ: పరిశోధనలు.. విద్యాభివృద్ధికి..సమాజాభివృద్ధికి దోహదపడే అంశాలు.. విశ్వవిద్యాలయాల్లో చేసే పరిశోధనలు పలు రంగాలను ప్రభావితం చేస్తాయి కూడా.. అందుకే వాటికి అంత ప్రాముఖ్యత.అయితే అంతటి ప్రాముఖ్యత కలిగిన పరిశోధనలను ఉస్మానియా యూనివర్సిటీ అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదు. అధ్యాపకులను నియమించకపోవడం వల్ల పీహెచ్‌డీ చేసే వారి సంఖ్య రోజురోజుకూ తగ్గిపోతోంది. పీహెచ్‌డీ పరిశోధకులకు గైడ్‌షిప్ ఇవ్వాలంటే పర్మనెంట్ అధ్యాపకుడై ఉండాలి.. వర్సిటీలో వారే అర్హులు. అయితే ప్రస్తుతం ఓయూలో కేవలం 367 మంది మాత్రమే పర్మనెంట్ అధ్యాపకులు ఉన్నారు. వీరిలో సగం మందికి మాత్రమే గైడ్‌షిప్ చేపట్టే అర్హత ఉంది.

కాంట్రాక్ట్ ఉద్యోగులతో సాగుతున్న చదువులు..

వర్సిటీ పరిధిలో పర్మనెంట్, కాంట్రాక్టు, పార్టుటైం అధ్యాపకులు కలిపి సుమారు 1230 మంది ఉంటారు. వీరు బోధన మాత్రమే చేస్తారు. గైడ్‌షిప్ చేసేందుకు వీరుఅర్హులు కాదు. 14 ఏండ్లుగా వర్సిటీలో అధ్యాపకుల పదవీ విరమణలే తప్ప నియామకాలు చేపట్టలేదు. వ్యాయామ విద్య కళాశాల, లా కాలేజీలో నలుగురు మాత్రమే ఉన్నారు. ఇంజినీరింగ్, సైన్స్ కాలేజీలలో అధ్యాపకుల సంఖ్య ఆశాజనకంగా ఉన్నా ఇతర కాలేజీలలో ప్రొఫెసర్ల సంఖ్య మరీ దారుణంగా ఉంది. రాష్ట్ర ప్రభుత్వం వర్సిటీల ప్రొఫెసర్ల ఉద్యోగ విరమణ వయస్సు 60 నుంచి 65 ఏండ్లకు పెంచడంతో ఓయూలో ఐదేళ్ల వరకు అధ్యాపకుల పదవీ విరమణలు ఆగిపోనున్నాయి. అయితే వారి సేవలను ఓయూ అధికారులు వినియోగించుకోనందున పీహెచ్‌డీ సీట్ల సంఖ్య పెరగలేదు. వచ్చే పీహెచ్‌డీ నోటిఫికేషన్‌లో సీట్ల సంఖ్యను పెంచిన అధ్యాపకుల వయోపరిమితి సేవలను వినియోగించనున్నట్లు అధికారులు తెలిపారు. దీంతో విద్యార్థులు నిరాశతో ఉన్నారు. ప్రస్తుతం ఓయూ పరిధిలో దాదాపు 250మంది పరిశోధక విద్యార్థులున్నారు.

కాలేజీల వారీగా పర్మనెంట్ అధ్యాపకులు

ఓయూ క్యాంపస్‌తో పాటు అనుబంధ, జిల్లా పీజీ సెంటర్లతో కలిపి మొత్తం 16 కాలేజీలు ఉన్నాయి. వీటిలో పర్మినెంట్ అధ్యాపకుల సంఖ్య మాత్రం ఇలా ఉన్నారు. ఆర్ట్స్ కాలేజీ-38, సైన్స్ కాలేజీ-106, ఇంజినీరింగ్ కాలేజీ-70, టెక్నాలజీ కాలేజీ-6, న్యాయకళాశాల-4, బీఈడీ కాలేజీ-5, ఎంబీఏ-8, కామర్స్ కాలేజీ-7, వ్యాయామ విద్య కళాశాల-4, బషీర్‌బాగ్ పీజీ కాలేజీ-3, నిజాం పీజీ కాలేజీ-13, సైఫాబాద్ పీజీ కాలేజీ-7, సికింద్రాబాద్ పీజీ కాలేజీ-9.

గతంలో 1257 మంది పర్మనెంట్ అధ్యాపకులు పని చేయగా సుమారు ఐదు వేలకు పైగా పీహెచ్‌డీ (ఫుల్‌టైం, పార్టుటైం) సీట్లు అందుబాటులో ఉండేవి. ప్రస్తుతం అధ్యాపకుల సంఖ్య 367 మంది మాత్రమే అందులో కేవలం సగం మందికి మాత్రమే పరిశోధనకు గైడ్‌షిప్‌కు అర్హత కలిగి ఉండటం వలన 650 పీహెచ్‌డీ సీట్లు మాత్రమే ఉన్నాయి. ఈ సీట్ల భర్తీకి ఇటీవల నిర్వహించిన ఎంట్రన్స్ టెస్ట్‌లో 4,500 మంది అర్హత సాధించారు. కానీ సీట్లు మాత్రం పరిమితంగా ఉండటంతో సీట్లను సంఖ్యను పెంచాలని విద్యార్థులు డిమాండ్ చేస్తున్నారు.

నగరంలో నేడు

- బంజారాహిల్స్ రోడ్ నెం.12లోని కళింగ కల్చరల్ సెంటర్‌లో నేషనల్ సిల్క్ ఎక్స్‌పో - ఉదయం 10 గంటల నుంచి రాత్రి 8.30 గంటల వరకు..
- మాదాపూర్‌లో హైదరాబాద్ కన్వెన్షన్ సెంటర్ నోవొటెల్‌లో ఉదయం 10 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు హై లైఫ్ ఎగ్జిబిషన్
- బంజారాహిల్స్ రోడ్ నెం.1లోని హోటల్ తాజ్ కృష్ణాలో ఆకృతి ఎలైట్ ఆధ్వర్యంలో లైఫ్ స్టైల్ ఎగ్జిబిషన్ ఉదయం 11 గంటల నుంచి రాత్రి 8.30గంటల వరకు
- శ్రీనగర్ కాలనీలోని శ్రీ సత్యసాయి నిగమగమంలో ఉదయం 10 గంటల నుంచి రాత్రి 8.30 గంటల వరకు న్యూ క్రాఫ్ట్స్ సిల్క్ ఇండియా ఎగ్జిబిషన్ ..
- మాదాపూర్‌లోని చిత్రమయి స్టేట్ ఆర్ట్ గ్యాలరీలో కావలి చంద్రకాంత్ తీసిన చిత్ర ప్రదర్శన ఉదయం 10.30 గంటల నుంచి రాత్రి 7 గంటల వరకు..
- మాదాపూర్ శిల్పారామం సమీపంలోని ఇందిరా మహిళా శక్తి బజార్‌లో చేనేత ఉత్పత్తుల ప్రదర్శన ఉదయం 11 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు..

గ్రేటర్ సిటీ నలుమూలలా ప్రతిరోజూ నిర్వహించే ఈవెంట్ల వివరాలను ఒక రోజు ముందే మాకు పంపండి. 'సాక్షి' ఎంగేజ్‌మెంట్ కాలం (నగరంలో నేడు)లో ప్రచురిస్తాం. మీ ఈవెంట్ల వివరాలను sakshiupdates123@gmail.comకు మెయిల్ చేయగలరు.

ఆకట్టుకున్న 'మిరాకిల్ బేబీ'



లక్డీకాపూల్ : సంయుక్త ఫెర్టిలిటీ సంతానోత్పత్తి సేవలతో ప్రయోజనం పొందిన వారితో నిర్వహించిన మిరాకిల్ బేబీ కార్యక్రమం ఆసాంతం ఆకట్టుకుంది. ఆదివారం సికింద్రబాద్ త్రిమూర్తి కాలనీలోని సంయుక్త ఫెర్టిలిటీ సొల్యూషన్స్‌లో జరిగిన కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో జంటలు పాల్గొన్నాయి. డాక్టర్ సంయుక్త రెడ్డి మాట్లాడారు. గర్భధారణ అవకాశాలను పెంచడానికి దోహదపడే సరికొత్త విధానాలను అందుబాటులోకి తీసుకువచ్చామన్నారు. ఈ క్రమంలో వినూత్నమైన మైల్డ్ ఐవీఎఫ్ ఎ హోప్ వంటి పరిశోధనా పత్రాలను ప్రచురించినట్లు తెలిపారు.

నేడు జాబ్‌మేళా


సాక్షి, సిటీ బ్యూరో: వృత్తి విద్య కోర్సులు పూర్తి చేసుకున్న విద్యార్థుల కోసం ఈ నెల 23న సికింద్రాబాద్ వెస్ట్ మారేడుపల్లిలో ఉన్న కస్తూర్బా గాంధీ బాలికల జూనియర్ కళాశాలలో అప్రెంటిషిప్, ఉద్యోగమేళా నిర్వహిస్తున్నట్లు హైదరాబాద్ జిల్లా ఇంటర్ విద్యాధికారి ఒడ్డన్న తెలిపారు. పారామెడికల్, నాన్ పారామెడికల్ సంబంధించి సుమారు 164 కంపెనీలు జాబ్‌మేళాలో పాల్గొంటాయన్నారు. 3,153 ఉదోయోగాల కోసం అభ్యర్థులను ఎంపిక చేయనున్నట్లు తెలిపారు.

ప్రభుత్వ పథకాల పట్ల అవగాహన ఉండాలి

చిక్కడపల్లి: బ్రాహ్మణులు ఐకమత్యంతో ముందుకు వెళ్లినప్పుడే సమాజం అభివృద్ధి సాధిస్తుందని పద్మశ్రీ అవార్డు గ్రహీత, ద్విసహస్రావధాని డాక్టర్ మాడుగుల నాగఫణిశర్మ అన్నారు. ఆదివారం త్యాగరాయ గానసభలో జరిగిన బ్రాహ్మణ ఐక్య వేదిక ఆధ్వర్యంలో ప్రభుత్వ పథకాలు అవగాహన సదస్సులో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బ్రాహ్మణుడు సమాజ శ్రేయస్సుకు పాటుపడాలని అన్నారు. ప్రముఖ ఆడిటర్ ధవళ మధుసూదన్ రావు మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అనేక పథకాలను ప్రవేశపెట్టాయని అన్నారు. కేంద్రరాష్ట్ర ప్రభుత్వాలు అందించే వివిధ పథకాల పట్ల అవగాహన కలిగి వుండాలన్నారు. బ్రాహ్మణ ఐక్యవేదిక అధ్యక్షులు డాక్టర్ ఏవీఆర్ మూర్తి అధ్యక్షతన జరిగిన సమావేశంలో బ్రాహ్మణ ఆర్గనైజేషన్ ఫర్ సోషల్ సర్వీస్ నాయకులు బసవరాజు శ్రీనివాస్, అన్నదానం సత్యనారాయణమూర్తి, బి.సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రాణం తీసిన ఫొటోల సరదా

క్వారీలో పడి విద్యార్థి మృతి



శంషాబాద్: ఫొటోల సరదా ఓ విద్యార్థి ప్రాణాన్ని బలిగొంది. ఈ విషాదకర సంఘటన ఆదివారం ఆర్‌జీఐఏ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ బాలరాజు తెలిపిన మేరకు.. బోరబండ ప్రాంతానికి చెందిన మిర్జా షోయబ్‌బేగ్ (17) ఇంటర్ చదువుతున్నాడు. అదే ప్రాంతానికి చెందిన మరో పదిమంది స్నేహితులతో కలిసి క్రికెట్ ఆడేందుకు వెళ్తున్నామని ఇంట్లో చెప్పి కొత్వాల్‌గూడ క్వారీ గుంతల వద్దకు వచ్చారు. క్వారీలో ఉన్న నీటి వద్ద ఫొటో షూట్ చేయడం మొదలుపెట్టారు. ఈ క్రమంలో షోయబ్‌బేగ్ అక్కడి నుంచి జారీ నీటి గుంతలో పడిపోయాడు. ఈత కూడా రాకపోవడంతో అందులో మునిగిపోయాడు. ఆర్‌జీఐఏ పోలీసులు గజ ఈతగాళ్ల సాయంతో మధ్యాహ్నం అతడి మృతదేహాన్ని బయటికి తీశారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

బీసీ, ఎస్సీ, ఎస్టీలు రాజ్యాధికారం దిశగా సాగాలి



అభివాదం చేస్తున్న జస్టిస్ ఈశ్వరయ్య, మందకృష్ణ మాదిగ, చిరంజీవులు, వకుళాభరణం తదితరులు

పంజగుట్ట: బీసీ, ఎస్సీ, ఎస్టీ నాయకులు అంతా ఏకమై ఒక రాజకీయ వేదిక ఏర్పాటు చేసుకుని ఐక్యంగా రాజ్యాధికారం దిశగా పోరాడాలని ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ ఈశ్వరయ్య అన్నారు. ఆదివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో 'జర్నలిస్టు ఫోరం ఫర్ సోషల్ జస్టిస్' ఆవిర్భావ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా హాజరైన ఈశ్వరయ్య మాట్లాడుతూ పదవులు, సంపద కొన్ని వర్గాల చేతిలో బందీ అయ్యాయని, అవి అణగారిన వర్గాలకు అందాల్సి ఉందన్నారు. బీసీలు అంటే కులాలుగా విడిపోకుండా, తామంతా ఒకే కులం...వెనకబడిన జాతులం అనే ఐక్యత రావాలని, అప్పుడే అధికారంలో భాగస్వాములు కావచ్చని పేర్కొన్నారు. సరైన సమయంలో జర్నలిస్టు సోషల్ ఫోరం ఏర్పాటు చేశారని, అందర్నీ ఏకం చేయడంలో ఫోరం ముందుండాలని పిలుపునిచ్చారు. మందకృష్ణ మాదిగ మాట్లాడుతూ జర్నలిస్టులు సామాజిక న్యాయ వేదిక ఏర్పాటు చేయడం సంతోషకరమన్నారు.

- ఎస్సీ, ఎస్టీ, బీసీల్లో ఎవ్వరు అణచివేతకు గురైనా వారిపక్షాన ఈ వేదిక ముందుండి పోరాడాలని, వేదికకు తన సహకారం ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో ఫోరం అధ్యక్షుడు నీలం వెంకన్న, రిటైర్డ్ ఐఏఎస్ టి.చిరంజీవులు, రాష్ట్ర బీసీ కమిషన్ మాజీ చైర్మన్ వకుళాభరణం కృష్ణమోహన్, వేదిక ప్రధాన కార్యదర్శి శ్రీధర్ కృష్ణాయాదవ్, వర్కింగ్ ప్రెసిడెంట్ గోర శ్రీనివాస్ గౌడ్, వేదిక ప్రతినిధులు గార శ్రీరామమూర్తి, కె.వేణుగోపాల్, అంబటి సురేంద్ర రాజు, దొమ్మాట వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

జవహర్ బాలభవన్‌లో అధ్యాపక పోస్టులను భర్తీ చేయాలి



నిరసన తెలుపుతున్న భూపతి వెంకటేశ్వర్లు

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: జవహర్ బాలభవన్‌లో అధ్యాపకులు కొరత ఉందని, బాలభవన్ అధ్వాన స్థితికి చేరుకోవడం బాధాకరమని టీపీఎస్‌కే అధ్యక్షుడు భూపతి వెంకటేశ్వర్లు అన్నారు. ఆదివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగిన సమావేశంలో మాట్లాడారు. 1966 జూన్ 23న పబ్లిక్ గార్డెన్‌లో జవహర్‌లాల్ నెహ్రూ జవహర్ బాలభవన్‌ను ప్రారంభించి నేటికి 60 సంవత్సరాలు అవుతోందని అన్నారు. తెలంగాణలో 10 బాలభవన్లు, 9 బాలకేంద్రాలు ఉన్నాయని ఇవన్నీ అధ్వాన స్థితిలో ఉండడం బాధాకరం అన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వ స్పందించి పిల్లల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని బాలభవన్ అభివృద్ధికి కృషి చేయాలన్నారు. చాచా మళ్లీ పుట్టాలి, బాలభవన్‌లు రక్షించాలంటూ ప్లకార్డులతో నిరసన తెలిపారు. కార్యక్రమంలో మురళీధర్, దేశ్ పాండే, పొన్న రాజయ్య, మహేష్ దుర్గే, జీవన్ ఆనంద్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాలతో భవిష్యత్తు నాశనం



మాదకద్రవ్య నిరోధక అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు, విద్యార్థులు

గన్‌ఫౌండ్రీ : మాదక ద్రవ్యాల వినియోగం విద్యార్థుల భవిష్యత్తును నాశనం చేస్తుందని హైదరాబాద్ మాదకద్రవ్య ఎన్‌ఫోర్స్‌మెంట్ వింగ్ జేఎస్ డ్యానియేల్ అన్నారు. ఆదివారం గన్‌ఫౌండ్రీలోని ఆలియా ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో హైదరాబాద్ మాదకద్రవ్య ఎన్‌ఫోర్స్‌మెంట్ వింగ్ ఆధ్వర్యంలో మాదకద్రవ్య నిరోధక అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. మాదకద్రవ్య వినియోగం విద్యార్థుల శారీరక, మానసిక ఆరోగ్యాన్ని ఎలా ప్రభావితం చేస్తుందో అనే విషయాలను వివరించారు. మాదకద్రవ్యాల సరఫరా, వినియోగం వంటి విషయాల పట్ల కఠినంగా వ్యవహరిస్తామన్నారు. మాదకద్రవ్యాలను ప్రోత్సహించే స్నేహితులను దూరంగా ఉంచాలని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో హైదరాబాద్ మాదక ద్రవ్య ఎన్‌ఫోర్స్‌మెంట్ వింగ్ అధికారులు సి.వెంకటరాములు, వీఆర్.సుబ్బారావు, స్కూల్ ప్రిన్సిపల్ విశ్వనాథంగుప్తా తదితరులు పాల్గొన్నారు.

విశ్వబ్రాహ్మణుల సమస్యలు పరిష్కరించాలి



ర్యాలీని ప్రారంభిస్తున్న ఎమ్మెల్సీ సిరికొండ మధుసూదనాచారి తదితరులు

కవాడిగూడ: రాష్ట్రంలో విశ్వబ్రాహ్మణులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి వెంటనే చర్యలు తీసుకోవాలని పలువురు వక్తలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం ట్యాంక్‌బండ్‌పై ఉన్న శ్రీ మద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి విగ్రహం నుంచి శ్రీశైలం వరకు విశ్వబ్రాహ్మణుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ నిర్వహించిన విశ్వకర్మ యువ యాత్రకు మద్దతుగా మాజీ స్పీకర్ ఎమ్మెల్సీ సిరికొండ మధుసూదనాచారి, ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస యాదవ్ తదితరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. విశ్వబ్రాహ్మణులకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేసి వెయ్యి కోట్ల నిధులు విడుదల చేయాలని, పాలకమండలిని నియమించాలని డిమాండ్ చేశారు. శ్రీశైలం వరకు వివిధ వాహనాలలో ర్యాలీ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో నిర్వాహకులు పుష్పగిరి, ప్రభాకరచారి, శివరాం తదితరులు పాల్గొన్నారు.

రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయాలి

ఉస్మానియా యూనివర్సిటీ: నాలుగేళ్లుగా పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను విడుదల చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగంగౌడ్ బహిరంగ లేఖ రాశారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ.. రెండు వేల కోట్లకు టోకెన్లు జారీ చేసి నిధులు విడుదల చేయకపోవడం సరికాదన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల కోసం గత నాలుగు సంవత్సరాలుగా వివిధ విద్యార్థి సంఘాలు, ప్రైవేటు కాలేజీల యాజమాన్యాలు ఆధ్వర్యంలో ఆందోళనలు చేసినా, చర్చలు జరిపినా నిధుల విడుదల చేయకపోడవం దారుణమన్నారు. కాలేజీలలో ఫీజులు చెల్లించనందున సర్టిఫికెట్లను జారీని నిలిపివేయడంతో విద్యార్థులు ఉన్నత చదువులతో పాటు ఉద్యోగ అవకాశాలు కోల్పోతున్నట్లు లేఖలో పేర్కొన్నట్లు లింగంగౌడ్ తెలిపారు.

ఆదివాసీలను అడవుల నుంచి దూరం చేసే కుట్ర

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: టైగర్ కన్జర్వేషన్ పేరుతో ఆదివాసీల భూముల నుంచి, వారు నివసిస్తున్న ప్రాంతాల నుంచి దూరం చేసి కార్పొరేట్ కంపెనీలకు అడవులను కట్టబెట్టేందుకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు జీవో 49ని తీసుకొచ్చాయని మాజీ ఎంపీ మీడియం బాబురావు డిమాండ్ చేశారు. ఆదివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రం వద్ద తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం ఆధ్వర్యంలో జీవో 49 పత్రాలను దహనం చేసి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా బాబురావు మాట్లాడుతూ... కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఆదివాసీలను అడవుల నుంచి దూరం చేసేందుకు కుట్రలు చేస్తున్నారని విమర్శించారు. 300లకు పైగా గ్రామాలను ఖాళీ చేయించి వారి భూములను లాక్కునేందుకు జీవో 49ను తీసుకువచ్చారని మండిపడ్డారు. కార్యక్రమంలో సంఘం ప్రధాన కార్యదర్శి కుశం నచిన్, నాయకులు రవికుమార్, కె.శ్రీనివాస్, అత్రం తనుష్, కుడుసం సంబు, పి. ఆశయ్య, అశోక్ పాల్గొన్నారు.

పార్కు చేసిన వాహనాలను ఢీకొట్టిన కారు

రాజేంద్రనగర్: బుద్వేల్ సాయికృష్ణ కాలనీ రోడ్డు నంబర్-6లో పార్కు చేసిన వాహనాలను వేగంగా దూసుకొచ్చిన ఓ కారు ఢీకొట్టి బీభత్సం సృష్టించింది. ఈ సంఘటనలో పార్కులు చేసిన రెండు కార్లతో పాటు రెండు ద్విచక్ర వాహనాలు ధ్వంసమయ్యాయి. అర్ధరాత్రి వేళ జరిగిన సంఘటనతో స్థానికులు భయభ్రాంతులకు గురయ్యారు. స్థానికులు, పోలీసులు తెలిపిన మేరకు... సాయికృష్ణ కాలనీ రోడ్డు నంబర్-6లోని ఖాళీ ప్లాట్‌లో స్థానికులు తమ కార్లను, ద్విచక్ర వాహనాలను పార్కు చేస్తున్నారు. శనివారం రాత్రి ఈ పార్కు చేసిన వాహనాలను వేగంగా దూసుకొచ్చిన ఓ తెల్ల రంగు కారు బలంగా ఢీకొట్టి క్షణాల్లోనే తిరిగి తన కారులో పరారయ్యాడు. పెద్ద శబ్దంతో ఈ సంఘటన జరగడంతో స్థానికులు భయాభ్రాంతులకు గురయ్యారు. బయటికి వచ్చి చూసేసరికి రెండు కార్లతో పాటు రెండు ద్విచక్ర వాహనాలు ధ్వంసమయ్యాయి. మద్యం మత్తులో వేగంగా దూసుకొచ్చి ఢీకొట్టినట్లు స్థానికులు తెలిపారు. రాజేంద్రనగర్ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

హామీల అమలుకు ఢిల్లీకి వెళ్తాం

తెలంగాణ ఉద్యమకారుల ఫోరం



మాట్లాడుతున్న తెలంగాణ ఉద్యమకారుల ఫోరం నాయకులు

కాప్రా: తెలంగాణ ఉద్యమకారులకు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలు నెరవేర్చకుంటే దేశ రాజధాని ఢిల్లీలో పెద్ద ఎత్తున ధర్నా చేపడతామని తెలంగాణ ఉద్యమకారుల ఫోరం ప్రతినిధులు పేర్కొన్నారు. తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు చీమ శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఆదివారం కాప్రా ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సీఎం రేవంత్ రెడ్డి ఉద్యమకారులను గుర్తించి ఇచ్చిన హామీలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో వేలాది ఎకరాల ప్రభుత్వ భూములున్నాయని, అందులో ఉద్యమకారులకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని కోరారు. తెలంగాణ ఉద్యమకారులకు ఒక్కొక్కరికి 250 గజాల ఇంటి స్థలం, రూ.25వేలు పెన్షన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాదిన్నర గడిచినా ఉద్యమకారులకు ఇచ్చిన హామీలు నెరవేర్చడంలేదన్నారు. తక్షణమే హామీలు నెరవేర్చాలని రాష్ట్ర ఫోరం ఆధ్వర్యంలో మండల, జిల్లా స్థాయిలో ధర్నాలు నిర్వహించి జిల్లా కలెక్టర్లకు వినతిపత్రాలు అందిస్తామని, ప్రతి నియోజకవర్గం ఎమ్మెల్యేలను కలిసి వినతిపత్రాలు అందిస్తామన్నారు. అనంతరం హైదరాబాద్ ఇందిరాపార్క్ వద్ద ధర్నాకు దిగుతామన్నారు. సెప్టెంబర్ 17న చలో ఢిల్లీ కార్యక్రమం చేపట్టి జంతర్ మంతర్ వద్ద మహాధర్నా చేపట్టి కాంగ్రెస్ పార్టీ అగ్రనాయకుడు రాహుల్ గాంధీని కలుస్తామని తెలిపారు కార్యక్రమంలో తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పటోళ్లసురేందర్‌రెడ్డి, సభ్యులు కొండ స్వామి, దయానంద్, గగన్‌కుమార్ పాల్గొన్నారు.

11 నుంచి లాల్‌దర్వాజ అమ్మవారి బోనాలు



మాట్లాడుతున్న చైర్మన్ బి.మారుతి యాదవ్

హిమాయత్‌నగర్: తెలంగాణ ప్రాంతంలో అత్యంత వైభవంగా, ప్రతిష్టాత్మకంగా జరుపుకునే పాత బస్తీ లాల్‌దర్వాజ శ్రీ మహంకాళి 117వ బోనాల జాతర ఉత్సవాలు జులై 11 నుండి ప్రారంభం కానున్నాయని సింహవాణి శ్రీ మహంకాళి లాల్‌దర్వాజా దేవాలయం చైర్మన్ బి.మారుతి యాదవ్ తెలిపారు. ఆదివారం బషీర్‌బాగ్ దేశోద్ధారక భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కన్వీనర్ జి.అరవింద్ గౌడ్‌తో కలసి ఆయన మాట్లాడారు. జులై 20న అమ్మవారికి బోనాలు సమర్పణ, రాత్రికి ప్రపంచ శాంతిని కోరుతూ శాంతి కళ్యాణం జరుగుతుందని తెలిపారు. జులై 21న పోతురాజుకు స్వాగతం, రంగం, అమ్మవారి ఊరేగింపుతో ఉత్సవాలు ముగుస్తాయన్నారు. అలాగే జూన్ 30, జులై 1, 2 తేదీలలో ఢిల్లీ తెలంగాణ భవన్‌లో బోనాల ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో విష్ణు గౌడ్, ఏ.చంద్రకుమార్, వినోద్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

విద్యాభివృద్ధికి అధిక ప్రాధాన్యం



కార్యక్రమంలో పాల్గొన్న కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, కార్పొరేటర్ చీర సుచిత్ర శ్రీకాంత్

బన్సీలాల్‌పేట్: విద్యాభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యతనిస్తోందని కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి అన్నారు. సికింద్రాబాద్ పాన్‌బజార్ జైన్‌భవన్‌లో ఆదివారం స్థానిక కార్పొరేటర్ చీర సుచిత్రశ్రీకాంత్ ఆధ్వర్యంలో 10వ తరగతి, ఇంటర్, డిగ్రీ విద్యార్థులకు స్కాలర్‌షిప్, పుస్తకాల పంపిణీ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కిషన్ రెడ్డి మాట్లాడుతూ.. మోదీ ప్రభుత్వం విద్యా రంగంలో అనేక మార్పులకు శ్రీకారం చుట్టిందన్నారు. పేద విద్యార్థులకు కార్పొరేటర్ చీర సుచిత్ర శ్రీకాంత్ స్కాలర్‌షిప్‌లను, పుస్తకాలను అందజేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షులు చీర శ్రీకాంత్, మహంకాళి జిల్లా అధ్యక్షులు భరత్ గౌడ్ పాల్గొన్నారు.

భక్తులు ఇబ్బంది పడకుండా చర్యలు తీసుకోండి

ఎమ్మెల్యే తలసాని



మగ్గంపై వస్త్రాల తయారీ పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే తలసాని

అమీర్‌పేట: బల్కంపేట ఎల్లమ్మ కల్యాణోత్సవాల్లో భక్తులు ఇబ్బంది పడకుండా చర్యలు తీసుకోవాలని సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. బల్కంపేట ఎల్లమ్మ కళ్యాణం సందర్భంగా అమ్మవారికి సమర్పించనున్న పోచంపల్లి పట్టు వస్త్రాల (మగ్గంపై) తయారీ పనులను తలసాని శ్రీనివాస్‌యాదవ్ ఆదివారం ప్రారంభించారు. ముందుగా అమ్మవారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. అనంతరం జులై 1వ తేదీన నిర్వహించనున్న ఎల్లమ్మ కళ్యాణ ఏర్పాట్లపై దేవాలయ అధికారులను అడిగి తెలుసుకున్నారు. దంపతులకు ఇచ్చే కల్యాణ టిక్కెట్లు, దాతలకు ఇచ్చే పాస్‌లను తగ్గిస్తున్నారనే విషయంపై అధికారులను ప్రశ్నించారు. కొత్త విధానాల వల్ల భక్తుల మనోభావాలు తెబ్బతినే అవకాశముందని, పాత పద్ధతులనే అవలంభించాలని స్పష్టం చేశారు. అమ్మవారిపై ఉన్న భక్తితో ఆలయ అభివృద్ధికిలో భాగస్వాములుగా ఉన్న దాతలను అవమానిస్తారా అని అసహనం వ్యక్తం చేశారు. అమ్మవారికి పాతబస్తీ ఉమ్మడి దేవాలయాల ఊరేగింపు కమిటీ ఆధ్వర్యంలో జులై 2న బంగారు బోనం సమర్పిస్తారని ఎమ్మెల్యే తెలిపారు. ఆలయ కార్యనిర్వాహణ అధికారి మహేందర్‌గౌడ్, ఛైర్మన్ సాయి బాబాగౌడ్ పాల్గొన్నారు.

నకిలీ కరెన్సీ పట్టివేత.. నిందితుడి అరెస్టు



వివరాలు వెల్లడిస్తున్న పోలీసులు

నిజాంపేట్: నకిలీ కరెన్సీ చలామణికి ప్రయత్నించిన వ్యక్తిని పోలీసులు అరెస్టు చేశారు. బాచుపల్లి పోలీసులు తెలిపిన మేరకు.. పశ్చిమగోదావరి జిల్లాకు చెందిన ప్రతిపత్తి ప్రేమ్‌చంద్‌కు మహారాష్ట్రలోని పూణెకు చెందిన రాకేష్‌తో పరిచయం ఏర్పడింది. నకిలీ కరెన్సీ నోట్లను పంపిణీ చేయడం ద్వారా సులభంగా డబ్బు సంపాదించవచ్చని ప్రేమ్‌చంద్‌కు చెప్పాడు. రాకేష్ సూచనల మేరకు ప్రేమ్‌చంద్ నకిలీ కరెన్సీని కమీషన్ కోసం హైదరాబాద్‌లోని వ్యక్తులకు సరఫరా చేయడానికి బయలుదేరాడు. శనివారం మధ్యాహ్నం నిజాంపేట్ గ్రామంలోని ఆర్చ్ సమీపంలో ప్రేమ్‌చంద్ నకిలీ కరెన్సీ నోట్లను డెలివరీ చేయడానికి సిద్ధమవుతుండగా బాచుపల్లి పోలీసులు దాడి చేసి నిందితుడిని పట్టుకున్నారు. అతని వద్ద నుండి 15లక్షల నకిలీ కరెన్సీ, ఒక ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు. బాచుపల్లి పోలీసులు సమయ స్ఫూర్తిగా వ్యవహరించి నకిలీ నోట్ల చలామణిని అడ్డుకొన్నందుకు బాలానగర్ డీసీపీ కె.సురేష్‌కుమార్ అభినందించారు. బాచుపల్లి ఇన్‌స్పెక్టర్ ఉపేందర్‌రావు, ఎస్సై కె.శ్రీనివాసు, అతని టీమ్‌ను ఈ సందర్భంగా అభినందించారు.

ఏటీఎఫ్ సౌత్ ఏషియా టెన్నిస్ పోటీలు ప్రారంభం

16 దేశాల నుంచి హాజరైన క్రీడాకారులు



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న మంత్రి వాకిటి శ్రీహరి...

బంజారాహిల్స్: ఏషియన్ టెన్నిస్ ఫెడరేషన్ (ఏటీఎఫ్) ఆధ్వర్యంలో ఏసియన్ గ్రేడ్ సౌత్ ఏషియా టెన్నిస్ పోటీలు ఆదివారం ప్రారంభమయ్యాయి. 14 ఏళ్లలోపు విభాగంలో నిర్వహించే ఈ ప్రతిష్టాత్మక టోర్నమెంట్ ఈనెల 29 వరకు జూబ్లీహిల్స్ ఇంటర్నేషనల్ సెంటర్లో జరుగుతాయి. దక్షిణాసియా మొత్తం మీద గ్రేడ్-ఏ టోర్నమెంట్ ఇదొక్కటే కావడం విశేషం. భారత్‌తోపాటు అమెరికా, థాయ్‌లాండ్, మలేషియా, ఇండోనేసియా, ఉజ్బెకిస్తాన్, న్యూజిలాండ్ సహా 16 దేశాల నుంచి యువ క్రీడాకారులు ఈ పోటీల్లో పాల్గొంటున్నారు. ఆసియా టాప్ 10 ర్యాంకుల్లో ఉన్న ఆటగాళ్లు కూడా ఈ పోటీలో తలపడనున్నారు. తెలంగాణా రాష్ట్రానికి ఈ టోర్నమెంట్ రావడం గర్వకారణమని, దేశీయ యువ టెన్నిస్ ఆటగాళ్లకు అంతర్జాతీయ స్థాయిలో తమ ప్రతిభను ప్రదర్శించేందుకు ఇదొక అద్భుతమైన వేదికగా నిలుస్తుందని నిర్వాహకులు తెలిపారు. ముఖ్యఅతిథిగా హాజరైన మంత్రి వాకిటి శ్రీహరి మాట్లాడుతూ.. తాను క్రికెట్ బాగా ఆడేవాడినని, ముంబయ్ వాంఖడే స్టేడియంలో క్రికెట్ ఆడిన రోజులను గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో ప్రభుత్వ క్రీడా సలహాదారుడు ఏపీ జితేందర్ రెడ్డి, స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనా రెడ్డి, జూబ్లీహిల్స్ ఇంటర్నేషనల్ సెంటర్ అధ్యక్షుడు సురేందర్ రెడ్డి పాల్గొన్నారు.

సాక్షి సిటీ ప్లస్
11
హైదరాబాద్, సోమవారం, 23, జూన్, 2025





'బైక్ స్టార్ట్ అవ్వగానే భయం కాదు, స్వేచ్ఛ, సాధికారత మొదలవ్వాలనే' ఆత్మవిశ్వాసాన్ని మహిళల్లో నింపేందుకు నగరం వేదికగా 'ఆర్ బీ ఫర్ ఉమెన్' అనే మోటార్ సైకిల్ ప్రత్యేక శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. వరల్డ్ మోటర్ సైకిల్ డే సందర్భంగా నగరంలోని హౌస్టెన్ గో కార్టింగ్ జోన్‌లో బైక్ రెంటల్ సంస్థ రాయల్ బ్రదర్స్ ఆదివారం నిర్వహించిన ఈ కార్యక్రమంలో పలువురు మహిళలు బైక్ రైడింగ్‌తో సందడి చేశారు. హైదరాబాద్ వేదికగా నిర్వహించిన ఈ 11వ ఎడిషన్‌లో 120 మందికి పైగా మహిళలు ప్రొఫెషనల్ శిక్షకుల అధ్వర్యంలో స్కూటర్లు, బైకులు నడిపారు. ఈ కార్యక్రమానికి యమహా మోటార్ కంపెనీ (జపాన్) అనుబంధ సంస్థ మోటో బిజినెస్ సర్వీస్ ఇండియా (ఎంబీఎస్ఐ) భాగస్వామిగా వ్యవహరించింది. - సాక్షి, సిటీబ్యూరో

సరికొత్త సవారీ..

రైడింగ్ స్కిల్స్‌తో అదరగొట్టిన ఉమెన్ రైడర్స్

- మోటార్ సైకిల్ డే నేపథ్యంలో సందడి
- ఆర్ బీ ఫర్ ఉమెన్ ఆధ్వర్యంలో నిర్వహణ
- మహిళా స్వేచ్ఛ సాధికారతలో భాగంగా శిక్షణ
- బైక్ నడపడం నేర్చుకున్న 120 మంది మహిళలు

సురక్షితమైన, నియంత్రిత ప్రాంగణంలో మహిళలకు బైక్ రైడింగ్‌పై శిక్షణ అందించారు. ఆర్ బీ ఫర్ ఉమెన్ పేరుతో నిర్వహించిన ఈ శిక్షణా శిబిరం మహిళలకు అవసరమైన అన్ని రకాల రైడింగ్ గేర్, బైకుల ఎంపికతో, వయసు, అనుభవంతో సంబంధం లేకుండా ప్రాథమిక స్థాయి నుంచి అభ్యాసం ఉన్న వారిని కూడా దృష్టిలో పెట్టుకుని డిజైన్ చేసి విజయవంతంగా పూర్తిచేశారు. పలువురు మహిళలు ఈ అవకాశాన్ని అందిపుచ్చుకున్నారు. బైక్ రైడింగ్‌కు సంబంధించిన మెళకువలు నేర్చుకున్నారు.

మహిళలు సైతం..!

'ఆర్ బీ ఫర్ ఉమెన్' ఇప్పటికే దేశవ్యాప్తంగా 570 మందికి పైగా మహిళలకు రైడింగ్‌లో శిక్షణ ఇచ్చింది. గృహిణుల నుంచి ప్రొఫెషనల్స్ వరకు, విద్యార్థుల నుంచి ఉద్యోగస్తుల వరకు ఈ శిక్షణలో పాల్గొనడం విశేషం. ప్రతి ఒక్కరికీ వ్యక్తిగత శిక్షణతో పాటు, బైక్ నడపడం మీద నమ్మకం కల్పించడమే ఈ కార్యక్రమం ప్రత్యేకత. బైక్ నడిపే ఈ చేతుల ద్వారా ఇప్పుడు మహిళలు తాము ఎంచుకునే దారిలో స్వతంత్రంగా ప్రయాణించగలుగుతున్నారు. మారుతున్న జీవనశైలికి అనుగుణంగా ఈ వినూత్న కార్యక్రమం మహిళల భవిష్యత్తు ప్రయాణానికి శుభారంభమని నిర్వాహకుల మాట.

ఆత్మవిశ్వాసానికి మొదటి అడుగు..

'మేము 500 మిలియన్ల భారతీయులకు బైక్ మౌలిక అంశాన్ని అందించాలనే లక్ష్యంతో ఉన్నాం. ఇందులో భాగంగా మహిళలకు స్కిల్ ఇవ్వడం అత్యంత కీలకమైన దశ. ఈ శిక్షణ కొత్త నైపుణ్యం మాత్రమే కాదు.. వారి స్వేచ్ఛకు, ఆత్మవిశ్వాసానికి మొదటి అడుగు!'

– అభిషేక్ చంద్రశేఖర్, రాయల్ బ్రదర్స్ సీఈఓ.



భవిష్యత్తు దిశ..

ఇకపై మరిన్ని నగరాల్లో ఈ శిక్షణ విస్తరించనుంది. ఒక సాధారణ శిక్షణ మాత్రమే కాదు, మహిళల జీవనశైలిని మార్చే ఒక శక్తివంతమైన ప్రయత్నంగా 'ఆర్ బీ ఫర్ ఉమెన్' నిలుస్తోంది. తలా తోకా లేకుండా ట్రాఫిక్‌లో చిక్కుకుపోయే నగర జీవితం మధ్య, ఒక చిన్న బైక్ స్వేచ్ఛను ఇచ్చే మార్గం కావడం ఎంతో గొప్ప విషయం కాదా..!?

నూతన యాత్రకు ఆహ్వానం..

ఈ శిక్షణ కేవలం రోడ్డుపై నడవడానికి కాదు. ఇది మహిళల స్వతంత్రతకు చిహ్నం. సొంతగా బయటకు, ఆఫీసులకు, ఇతర పనులకు వెళ్లే వారికి స్వేచ్ఛగా జీవించే అవకాశం ఈ శిక్షణ కల్పిస్తుంది. అంతేకాదు, సంప్రదాయ భావాలను వెనక్కి నెట్టే సాహసం కూడా మహిళల్లో పెరుగుతోంది. బైక్ నడిపే కళ మహిళల్లో సరికొత్త నైపుణ్యాన్ని మాత్రమే కాదు, సమానత్వం పట్ల స్ఫూర్తిని కూడా రేకెత్తిస్తోంది. ఈ కార్యక్రమం వారి ఆత్మవిశ్వాసాన్ని పెంచుతుంది. నగరంలో స్వేచ్ఛగా తిరగడానికి ఒక మార్గం చూపుతుంది.





ఎంబీఎస్ఐ దృష్టికోణం..

'మొబిలిటీ లోపం వల్ల మహిళలు ఎన్నో పనులకు ఇతరులపై ఆధారపడుతున్నారు. బైక్ నడపడం నేర్చుకోవడం ద్వారా వారి జీవన ప్రమాణం మెరుగవుతుంది. 'ఆర్ బీ ఫర్ ఉమెన్' ద్వారా మేము వారి జీవితాల్లో విలువను సృష్టించాలనే లక్ష్యంతో ముందుకు సాగుతున్నాం'.

– నకావో హిరోషి, ఎంబీఎస్ఐ సీఈఓ.



స్టేట్ షూటింగ్

ఛాంపియన్‌షిప్ ప్రారంభం

10మీ ఎయిర్ పిస్టల్ విభాగంలో 107 మంది పోటీ

378/400 స్కోర్‌తో ముందంజలో అర్ణవ్ క్షితిష్

సాక్షి సిటీ బ్యూరో: గచ్చిబౌలిలోని శాట్స్ షూటింగ్ రేంజ్‌లో 11వ తెలంగాణ రాష్ట్ర షూటింగ్ ఛాంపియన్‌షిప్–2025 ఉత్సాహభరితంగా ప్రారంభమైంది. ప్రారంభోత్సవం అనంతరం మొదటి రోజు జరిగిన 10మీ ఎయిర్ పిస్టల్, 25మీ పిస్టల్, 50మీ పిస్టల్ ఈవెంట్లలో పోటీదారుల ఉత్సాహం కనిపించింది. తెలంగాణ రైఫిల్ అసోసియేషన్ అధ్యక్షుడు అమిత్ సంఘీ అథ్లెట్లను కలుసుకుని వారికి శుభాకాంక్షలు తెలిపారు. ఇప్పటి వరకూ 10మీ ఎయిర్ పిస్టల్ విభాగంలో 107 మంది పోటీకి దిగగా, అర్ణవ్ క్షితిష్ బడియే 378/400 స్కోర్‌తో ముందున్నారు. ట్రాప్ షూటింగ్‌లో ముజాహిద్ అలీ ఖాన్ 40/50 స్కోర్‌తో టాప్ చేశారు. ఫలితాల పరిశీలన జరుగుతోంది. మరి కొద్ది రోజులు కొనసాగనున్న ఈవెంట్లలో మరిన్ని ఉత్కంఠభరిత పోటీలు జరగనున్నాయని నిర్వాహకులు, అధికారులు తెలిపారు.



డ్రగ్స్‌కు నో చెప్పండి..

ఫ్రీమేసన్ల ఆధ్వర్యంలో వాక్‌థాన్..

సాక్షి, సిటీ బ్యూరో: యూనివర్సల్ బ్రదర్‌హుడ్ డే (జూన్ 24) నేపథ్యంలో తెలంగాణ ఫ్రీమేసన్లు ఆదివారం 'డ్రగ్స్‌కు నో చెప్పండి' అనే నినాదంతో వాక్‌థాన్ నిర్వహించారు. మాజీ చెన్నారెడ్డి రాక్ గార్డెన్ వద్ద ప్రారంభమై రామకృష్ణ మఠం వరకూ జరిగిన ఈ వాక్‌థాన్‌కు తెలంగాణ యాంటీ నార్కోటిక్స్ బ్యూరో డైరెక్టర్ సందీప్ శాండిల్యా, రామకృష్ణ మఠం అధ్యక్షులు స్వామి బోధమయానంద మహరాజ్ శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా సందీప్ శాండిల్యా మాట్లాడుతూ, 'డ్రగ్స్ కలల్ని ధ్వంసం చేస్తాయి, జీవితాలను నాశనం చేస్తాయి' అన్నారు. 'ఆత్మబలం ఉన్నప్పుడు బయటి ఉత్సాహదాయక పదార్థాల అవసరం లేదు' అంటూ స్వామి బోధమయానంద మహరాజ్ ప్రజల్లో ఆధ్యాత్మిక మేల్కొలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో 200 మందికి పైగా పాల్గొన్నారు. డ్రగ్స్ వ్యతిరేక నినాదాలతో ప్లకార్డులు పట్టుకొని ఫ్రీమేసన్లు, వారి కుటుంబ సభ్యులు, ఎన్‌సీసీ వాలంటీర్లు, నార్కోటిక్స్ బ్యూరో సభ్యులు ఇనాదాలు చేశారు.



నా మొక్క నా శ్వాస 5కె రన్

ప్రతి ఒక్కరూ మూడు మొక్కలు నాటాలి : ఉమర్ అలీషా

ఖైరతాబాద్: పర్యావరణ పరిరక్షణ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఉమర్ అలీషా రూరల్ డెవలప్మెంట్ ట్రస్ట్ ఆధ్వర్యంలో 'నా మొక్క నా శ్వాస' అనే నినాదంతో 5కె రన్ నిర్వహించారు. ఆదివారం ఉదయం నెక్లెస్ రోడ్డులో నిర్వహించిన 5కె రన్‌ను ఉమర్ అలీషా రూరల్ డెవలప్‌మెంట్ ట్రస్ట్ చైర్మన్, శ్రీ విశ్వవిజ్ఞాన విద్యా ఆధ్యాత్మిక పీఠం పీఠాధిపతి ఉమర్ అలీషా జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఉమర్ అలీషా మాట్లాడుతూ నా మొక్క నా శ్వాస అనే నినాదంతో 5కె రన్ ను నిర్వహించామని, ట్రస్ట్ ఆధ్వర్యంలో ప్లాస్టిక్ ఫ్రీ జోన్‌గా మార్చేందుకు ప్రతి ఒక్కరూ కృషిచేయాలన్నారు. భూ గ్రహం మానవాళి అందరిదీ, ఇక్కడ ఉన్న ప్రాణకోటికి కూడా హాని కలిగించకుండా, ప్రకృతిలో సమతుల్యతను కాపాడేందుకు ప్రతి ఒక్కరూ మూడు మొక్కలు నాటాలన్నారు. మొక్కలేనిదే మనం జీవించలేం, ఒక్కో మొక్కను ఒక్కో ఆక్సిజన్ సిలిండర్‌గా భావించి మొక్కలు నాటాలని సూచించారు. ఇప్పటికే ట్రస్ట్ ద్వారా తెలుగు రాష్ట్రాల్లో 15లక్షల మొక్కలు నాటామని తెలిపారు. దేశం కోసం, పర్యావరణం కోసం పనిచేయాలనే గొప్ప సందేశంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారని కార్యక్రమానికి హాజరైన జేడీ లక్ష్మీనారాయణ తెలిపారు. రన్‌లో పాల్గొని విజేతలుగా నిలిచిన వారికి చెక్కులను, పాల్గొన్న వారికి మొక్కలను అందజేశారు. రన్‌లో పెద్ద ఎత్తున యువతీ, యువకులు పాల్గొన్నారు.



నీరు, ఆహారం.. అందానికి ఆధారం..

సాక్షి సిటీ బ్యూరో: ప్రతి వ్యక్తి అందానికీ దోహదం చేసేవాటిలో నీరు, ఆహారం ప్రధానమైనవని బ్యూటీ క్వీన్, నటి మనసా వారణాసి అన్నారు. కొత్తపేటలో నూతనంగా నెలకొల్పిన సికారా క్లినిక్స్‌లో సౌందర్య పోషణలో ఏఐ ఆధారిత ఉత్పత్తుల వినియోగం, తదితర అంశాలపై ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. మన సంప్రదాయ ఆహారం, సౌందర్య సాధనాల విలువ అమూల్యమైనదని, అయితే ఆధునిక పరిస్థితుల దృష్ట్యా కొన్ని ట్రీట్మెంట్లు తప్పవని అన్నారు. ఇటీవల కాలంలో అందుబాటులోకి వచ్చిన హైడ్రో ఫేషియల్ వంటి చికిత్సలు తనకు ఇష్టమని అన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు సౌదర్య చికిత్స నిపుణులు, సంస్థ నిర్వాహకులు రాఘవేందర్, శిరీష తదితరులు పాల్గొన్నారు.



దేవరకొండ - లైఫ్ ఇన్ ఏ సెంచరీ

కృత్రిమ మేధ సహకారంతో చారిత్రాత్మక డాక్యుమెంటరీ

ప్రముఖ క్లౌడ్ ఫొటోగ్రాఫర్ యూనస్ ఫర్హాన్

సాక్షి, సిటీబ్యూరో: వందల ఏళ్ల చరిత్రను ప్రస్తుతం కళ్లకు కట్టినట్లు చూపించడంలో ఏఐ (కృత్రిమ మేధ) వినూత్న సాంకేతికంగా మారడంతో పాటు గతకాలపు మధుర స్మృతులను ప్రస్తుత తరానికి చేరువచేస్తుంది. ఇందులో భాగంగానే నగరంలోని రవీంద్రభారతి పైడి జైరాజ్ ప్రివ్యూ థియేటర్లో ప్రదర్శితమైన 'దేవరకొండ – లైఫ్ ఇన్ ఏ సెంచరీ' డాక్యుమెంటరీ చిత్రం దేవరకొండ గ్రామం శతాబ్ద చరిత్రను అద్భుతంగా చూపించింది. తెలంగాణ ప్రభుత్వం భాషా, సాంస్కృతిక శాఖ సహకారంతో రూపొందిన ఈ చిత్రం ప్రేక్షకులను ఆకట్టుకుంటూ, వారసత్వాన్ని భవిష్యత్ తరాలకు అందించేదిగా నిలిచింది. ఈ డాక్యుమెంటరీకి రచయిత, దర్శకుడు యూనస్ ఫర్హాన్.. దేవరకొండలో గత 100 ఏళ్లలో చోటుచేసుకున్న మార్పులు, జీవనశైలి, ప్రజల భావజాలాన్ని ఏఐ ఆధారిత విజువల్ నెరేషన్‌గా తీర్చిదిద్దారు. ఇది తెలుగు భాషలో 100 సంవత్సరాల ఫొటోల ఆధారంగా రూపొందిన తొలి డాక్యుమెంటరీ కావడం విశేషం. సాంకేతికతను సంస్కృతి పరిరక్షణకు వినియోగించిన అరుదైన ఉదాహరణ ఈ డాక్యుమెంటరీ అని తెలంగాణ భాష సాంస్కృతిక శాఖ సంచాలకులు డా.మమిడి హరికృష్ణ ప్రశంసించారు. అధునాతన సాంకేతికను సామాజ హితం కోసం వినియోగించడంలో భాగంగా ఈ డాక్యుమెంటరీ తయారు చేశానని ఫర్హాన్ అన్నారు. మన చారిత్రక మూలాల ఆనవాళ్లను చేరుకోవచ్చని అప్పటి మధురస్మృతులను నెమరు వేసుకోవచ్చని అన్నారు. ముఖ్య అతిథులుగా డా.రియాజ్, రచయిత పొన్నం రవిచంద్ర, వెంకట్ రెడ్డి, కైవా, ఎమిలీ, వనమ్ చంద్రమౌళి, ముసిని అంజన్ తదితర ప్రముఖులు హాజరై డాక్యుమెంటరీని ఆవిష్కరించారు.



నేటి నుంచి సంగీతోత్సవాలు

న్యూ నల్లకుంట్లలో వాగ్గేయకార ఆరాధన ఉత్సవాలు

సాయంత్రం 7 గంటలకు డీవీ మోహన కృష్ణ గాత్ర కచేరి

నల్లకుంట : శ్రీరామగాన సభ ఆధ్వర్యంలో సోమవారం నుంచి వాగ్గేయకార ఆరాధన సంగీతోత్సవాలు ప్రారంభమవుతాయని గానసభ కార్యదర్శి కొణికి సాయి శ్రీనివాస శర్మ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. న్యూ నల్లకుంటలోని శ్రీ సీతారామాంజనేయ సరస్వతి (న్యూ రామాలయం) ప్రాంగణంలో సాయంత్రం 5.30 గంటలకు మంగళవాయిద్యం, రోహిణి అశోక్ రావు, టీఎం. వాసుకిల గాత్ర కచేరితో వేడుకలు ప్రారంభమవుతాయన్నారు. దీనికి ముఖ్య అతిథిగా యనమంద్ర సుబ్రహ్మణ్య శంకర్, ప్రత్యేక ఆహ్వానితులుగా యనమంద్ర బాల ఆదిత్యలు హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి వేడుకలు ప్రారంభించి ప్రసంగిస్తారని చెప్పారు. అనంతరం 7 గంటలకు బాల మురళీ కృష్ణ ప్రియ శిష్యుడు, ఆలిండియా రేడియో కళాకారుడు డీవీ. మోహన కృష్ణ గాత్ర కచేరి ఉంటుందన్నారు. సంగీతాభిమానులు అధిక సంఖ్యలో పాల్గొని వాగ్గేయకార ఆరాధన సంగీతోత్సవాలను విజయవంతం చేయాలని సాయి శ్రీనివాస శర్మ కోరారు.

సింగయ్య మృతి ప్రమాదం వక్రీకరణ

చంద్రబాబు ప్రభుత్వ కుతంత్రం

వైఎస్ జగన్ పర్యటనల్లో భద్రత ఏర్పాట్లలో కుట్రపూరిత నిర్లక్ష్యం
జడ్ ప్లస్ కేటగిరీ భద్రత ఉన్నా ఉద్దేశపూర్వక నిర్లక్ష్యం
ఆయన వాహనంపైకి దండెత్తుతున్న టీడీపీ అసాంఘిక శక్తులు
సింగయ్య మృతి ఉదంతాన్ని వక్రీకరిస్తూ కుతంత్రం

సాక్షి, అమరావతి : చంద్రబాబు ప్రభుత్వ రెడ్‌బుక్ కుట్ర పతాకస్థాయికి చేరుకుంది. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డిపై అక్రమ కేసు నమోదుకు తెగబడింది. ఓ వైపు తమ ప్రభుత్వ వైఫల్యాలపై ప్రజల్లో కట్టలు తెంచుకుంటున్న వ్యతిరేకత... మరోవైపు మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిపట్ల వెల్లువెత్తుతున్న ప్రజాదారణతో టీడీపీ కూటమి ప్రభుత్వం బెంబేలెత్తుతోంది. అందుకే యుద్ధప్రాతిపదికన డైవర్షన్ పాలిటిక్స్‌కు తెరతీసింది. వైఎస్ జగన్ ఇటీవల సత్తెనపల్లి పర్యటనలో ఉదంతాలకు వక్రభాష్యం చెబుతూ అక్రమ కేసుల నమోదుకు తెగబడింది. సింగయ్య అనే వ్యక్తి ఓ అనుమతిలేని ప్రైవేట్ వాహనం ఢీకొని మృతిచెందినట్టు స్వయంగా గుంటూరు జిల్లా ఎస్పీ సతీశ్ అధికారికంగా ప్రకటించిన తరువాత... మూడు రోజుల కుట్రపూరిత తర్జనభర్జనల అనంతరం ఆ రోడ్డు ప్రమాదాన్ని వక్రీకరించి ప్రభుత్వం తన నక్క జిత్తులను ప్రదర్శించింది. అందుకోసం యావత్ పోలీసు శాఖను కుట్రలో భాగస్వామిగా చేసుకుంది. ఏకంగా వైఎస్‌జగన్ మోహన్‌రెడ్డిపైనే అక్రమ కేసు నమోదు చేయడం ప్రభుత్వ కుట్రకు పరాకాష్ట. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వాహన డ్రైవర్‌గా ఉన్న ప్రభుత్వ ఉద్యోగి, ఆర్మ్‌డ్ రిజర్వ్(ఏఆర్) కానిస్టేబుల్ రమణారెడ్డిని ఏ1గానూ...ఆ వాహనంలో ప్రయాణిస్తున్న వైఎస్ జగన్, ఎంపీ వైవీ సుబ్బారెడ్డి, మాజీ మంత్రులు పేర్ని నాని, విడదల రజినీ, వైఎస్ జగన్ పీఏ కె. నాగేశ్వర రెడ్డిలను నిందితులుగా పేర్కొనడం ప్రభుత్వ కుట్రకు తాజా తార్కాణం. ఈమేరకు గతంలో నమోదు చేసిన ఎఫ్ఐఆర్‌కు భిన్నంగా తాజాగా బీఎన్ఎస్ 105, 49 కింద కేసు నమోదు చేస్తామని గుంటూరు ఎస్పీ సతీశ్ ఆదివారం చేసిన ప్రకటనే నిదర్శనం. ఈ మొత్తం వ్యవహారంలో చంద్రబాబు ప్రభుత్వం మొదటి నుంచి పక్కాగా పన్నాగాన్ని అమలు చేసింది. జడ్ ప్లస్ కేటగిరీ భద్రత ఉన్న వైఎస్‌జగన్ పర్యటనల్లో భద్రతా ఏర్పాట్లలో కుట్రపూరిత నిర్లక్ష్యం నుంచి ... తాజాగా అక్రమ కేసు నమోదు వరకు చంద్రబాబు కుతంత్రం ఇదిగో ఇలా సాగింది...

ఏ 1 ప్రభుత్వమే అవ్వాలి...

మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రయాణిస్తున్న వాహనం కింద సింగయ్య పడి మృతి చెందడం వాస్తవమే అయితే ఆ కేసులో మొదటి ముద్దాయి రాష్ట్ర ప్రభుత్వమే అవుతుంది. ఎందుకంటే జడ్ ప్లస్ కేటగిరీ భద్రత కలిగిన ఆయన పర్యటనలో ప్రభుత్వం, పోలీసులు ఉద్దేశపూర్వకంగా తగిన భద్రతా ఏర్పాట్లు చేయలేదన్నది స్పష్టమైంది. వైఎస్ జగన్ సత్తెనపల్లి పర్యటనలో అడుగడుగునా భద్రతా వైఫల్యం బయటపడింది. వైఎస్ జగన్ తన సత్తెనపల్లి పర్యటన గురించి పోలీసులకు ముందుగానే సమాచారం ఇచ్చారు. రూట్ మ్యాప్‌తో పాటు ఇతర వివరాలు అందించారు. ఆమేరకు పటిష్ట భద్రత కల్పించాల్సిన బాధ్యత పోలీసులదే. జడ్ ప్లస్ భద్రత ప్రకారం వైఎస్ జగన్ వాహం ముందు ఎస్కార్టు వాహనాలు ఉండాలి. ఆయన వాహనానికి ఇరువైపులా రోప్ పార్టీ పోలీసులు విధులు నిర్వహించాలి. ఆ రోప్ పార్టీ భద్రతా వలయాన్ని దాటుకుని ఎవరూ వాహనం సమీపానికి రాకుండా కట్టడి చేయాలి. కానీ వైఎస్ జగన్ సత్తెనపల్లి పర్యటనలో పోలీసులు ఈ భద్రతా ప్రమాణాలు ఏవీ పాటించనే లేదు. ఆయన వాహనానికి ముందున సమీపంలో ఎస్కార్టు వాహనం లేదు. ఇరువైపులా రోప్ పార్టీ పోలీసులు లేనే లేరు. దాంతో వైఎస్సార్‌సీపీ అభిమానులే కాదు... అభిమానుల ముసుగులో గుర్తు తెలియన వ్యక్తులు, ఆగంతకులు కూడా వైఎస్ జగన్ వాహనంపైకి ఎగబడ్డారు. ఓ యువకుడు ఏకంగా వాహనం బానెట్‌పైకి ఎక్కి మరీ హల్ చల్ చేశాడు. మరి జడ్ ప్లస్ భద్రత ఉన్న మాజీ ముఖ్యమంత్రి వాహనం బానెట్‌పైకి ఓ యువకుడు ఎక్కినా కూడా పోలీసులు పట్టించుకోకపోవడం విస్మయం కలిగించింది. అదేదో కాకతాళీయంగా జరిగింది కాదు పోలీసులు ఉద్దేశపూర్వకంగానే వైఎస్‌జగన్ భద్రత పట్ల నిర్లక్ష్యంగా ఉన్నారన్నది సుస్పష్టం. అందువల్లే సింగయ్య అనే వ్యక్తి ప్రమాదవశాత్తూ ఆ వాహనం కింద పడి ఉండొచ్చు. అందుకు బాధ్యత పోలీసులదీ... రాష్ట్ర ప్రభుత్వానిదే. అందుకే ఆ ప్రమాదంపై పోలీసులు కేసు నమోదు చేస్తే రాష్ట్ర ప్రభుత్వాన్నే ఏ1గా అంటే ప్రధాన ముద్దాయిగా చేర్చాలని నిపుణులు స్పష్టం చేస్తున్నారు. కానీ ఆ వాహనం డ్రైవర్ రమణారెడ్డి(ఏఆర్ కానిస్టేబుల్)తోపాటు ఆ వాహనంలో ప్రయాణిస్తున్న వైఎస్ జగన్, ఎంపీ వైవీ సుబ్బారెడ్డి, మాజీ మంత్రులు పేర్ని నాని, విడదల రజినీ, వైఎస్ జగన్ పీఏ కె. నాగేశ్వరరెడ్డిలను నిందితులుగా పేర్కొనడం విస్మయపరుస్తోంది.

జగన్‌ను భూస్థాపితం చేస్తానన్న చంద్రబాబు కుట్రే

మాజీ ముఖ్యమంత్రి వైఎస్‌జగన్‌ను భూస్థాపితం చేస్తానని చంద్రబాబు ఇటీవల మీడియా చానళ్ల ఇంటర్వ్యూల్లోనే తన కుట్ర లక్ష్యాన్ని ప్రకటించారు. ఆయన తన కుట్ర కార్యాచరణను చేపట్టారన్నది కూడా తాజా పరిణామాలు వెల్లడిస్తున్నాయి. వైఎస్‌జగన్ జిల్లాల పర్యటనల సందర్భంగా ఆయన భద్రత పట్ల పోలీసులు ఉద్దేశపూర్వకంగా నిర్లక్ష్యంగా వ్యవహరించిన తీరు చంద్రబాబు కుట్రను బట్టబయలు చేస్తోంది. అసలు పోలీసులు ఆయన పర్యటనలో భద్రతా ఏర్పాట్ల గురించి ఏమాత్రం పట్టించుకోవడం లేదు. నిబంధనల ప్రకారం మాజీ ముఖ్యమంత్రికి సరైన బుల్లెట్ ప్రూఫ్ వాహనం సమకూర్చాలి. కానీ చంద్రబాబు ప్రభుత్వం కుట్రపూరితంగా డొక్కు బుల్లెట్ ప్రూఫ్ వాహనాన్ని గతంలో సమకూర్చింది. ఆ వాహనం కొద్దిదూరం వెళ్లే సరికే మొరాయించింది. ప్రభుత్వ కుట్రను అర్థం చేసుకున్న వైఎస్సార్‌సీపీ హైకోర్టును ఆశ్రయించింది. హైకోర్టు అనుమతితో వైఎస్సార్‌సీపీ సొంత నిధులతో బుల్లెట్ ప్రూఫ్ వాహనం కొనుగోలు చేసింది. అయినా సరే చంద్రబాబు ప్రభుత్వం కక్షపూరితంగా తన కుట్రలకు పదును పెడుతూనే ఉంది.

జగన్‌కు జనాదారణతో బెంబేలెత్తే అక్రమ కేసులు...

ఇక వైఎస్ జగన్ జిల్లా పర్యటనలకు అన్నివర్గాల ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తుండటం చంద్రబాబు ప్రభుత్వం గుండెల్లో రైళ్లు పరిగెత్తిస్తోంది. రాష్ట్రంలో ఏ జిల్లా వెళ్లినా దారిపొడుగునా వేలాది మంది జనం తండోపతండాలుగా తరలిరావడంతో ప్రభుత్వ పెద్దలను కలవరపరుస్తోంది. దాంతోనే జగన్ పర్యటనలపై ఆంక్షలు విధించి అడ్డుకునేందుకు కుయుక్తులు పన్నుతోంది. ఆ కుట్రలను ఛేదిస్తూ మరీ భారీ సంఖ్యలో జనం ప్రభంజనంగా పోటెత్తుతుండటంతో చంద్రబాబుకు కంటగింపుగా మారింది. దాంతో వైఎస్ జగన్ పర్యటనలకు వచ్చే వారిపై, వైఎస్సార్‌సీపీ నేతలపై అక్రమ కేసులు పెట్టాలని ఆయన పోలీసులను ఆదేశించారు. కనీసం అక్రమ కేసుల భయంతోనైనా ఆయన పర్యటనలకు జనం రాకుండా అడ్డుకోవచ్చన్నది ప్రభుత్వ కుతంత్రం. తాజాగా వైఎస్ జగన్ ప్రయాణించిన వాహనం కింద పడి ఒకరు మరణించారని అదీ మూడు రోజుల తరువాత చెబుతూ కేసు నమోదు చేస్తున్నట్టు గుంటూరు జిల్లా ఎస్పీ ప్రకటించారు. ఇదీ అక్రమ కేసేనని నిపుణులు స్పష్టం చేస్తున్నారు.

డ్రైవర్ ప్రభుత్వ ఉద్యోగే..
అబద్ధపు వాంగ్మూలం కోసం డ్రైవర్‌పై ఒత్తిడి

వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిపై అక్రమ కేసు నమోదు కోసం చంద్రబాబు ప్రభుత్వం అధికార దుర్వినియోగానికి పాల్పడుతోంది. ఆయన వాహనం డ్రైవర్‌గా వ్యవహరించిన రమణా రెడ్డిని అబద్ధపు వాంగ్మూలం ఇవ్వాలని వేధిస్తోంది. ఆ డ్రైవర్ ప్రభుత్వ ఉద్యోగి. ఆర్మ్‌డ్ రిజర్వ్(ఏఆర్) విభాగంలో కానిస్టేబుల్‌గా ఉన్నారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్‌జగన్ వాహనానికి డ్రైవర్‌గా ఆయన్ను ప్రభుత్వమే కేటాయించింది. ప్రభుత్వ ఉద్యోగి అయిన రమణారెడ్డిపై పోలీసు ఉన్నతాధికారులు తీవ్ర ఒత్తిడి తెస్తున్నారు. వైఎస్‌జగన్ సత్తెనపల్లి పర్యటనలో ఉదంతాన్ని వక్రీకరిస్తూ తాము చెప్పినట్టుగా అబద్ధపు వాంగ్మూలం ఇవ్వాలని వేధిస్తున్నట్టుగా సమాచారం. తాము చెప్పినట్టుగా అబద్ధపు వాంగ్మూలం ఇస్తే ఆయన్ను ఈ కేసు నుంచి తప్పిస్తామని... అంతేకాదు పదోన్నతి, ఇంక్రిమెంట్లు ఇస్తామని ప్రలోభాలకు గురి చేస్తున్నారు.

సింగయ్య మృతిపై గుంటూరు ఎస్పీ ప్రకటనలు నాడు-నేడు

ప్రభుత్వ పెద్దల కుట్రకు అదే తార్కాణం...

సింగయ్య మృతిపై గుంటూరు జిల్లా ఎస్పీ సతీశ్ చేసిన వేర్వేరు అధికారిక ప్రకటనలు ఇలా ఉన్నాయి

జూన్ 18: వైఎస్ జగన్ పర్యటనలో అనుమతిలేని ఓ ప్రైవేటు వాహనం ఢీ కొని సింగయ్య మృతి చెందారు. అది కాన్వాయ్‌లోని వాహనం కాదు. గుర్తు తెలియని వాహనం ఢీకొని సింగయ్య మృతి చెందినట్లు కేసు నమోదు చేశాం.
(ఆ వాహనం వైఎస్సార్‌సీపీ నేత దేవినేని అవినాశ్ అనుచరుడు గొట్టిపాటి హరీశ్‌కు చెందినదిగా పోలీసులు గుర్తించినట్లు టీడీపీ అనుకూల పత్రికలు కూడా ప్రచురించాయి).

జూన్ 22: వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రయాణిస్తున్న వాహనం ఢీ కొనడంతోనే సింగయ్య మృతి చెందారు. ఆ వాహన డ్రైవర్ రమణారెడ్డితోపాటు అందులో ప్రయాణిస్తున్న వైఎస్ జగన్, ఎంపీ వైవీ సుబ్బారెడ్డి, మాజీ మంత్రులు పేర్నినాని, విడదల రజినీ, వైఎస్ జగన్ పీఏ కె.నాగేశ్వర రెడ్డిలపై కేసు నమోదు చేశాం.

ప్రభుత్వ పెద్దల ఒత్తిడికి లొంగిన ఎస్పీ సతీశ్...!

ఈ వ్యవహారంలో ప్రభుత్వ పెద్దల ఒత్తిడికి గుంటూరు ఎస్పీ సతీశ్ తలొగ్గినట్టు స్పష్టమవుతోంది. బాధ్యతాయుతమైన ఎస్పీ స్థానంలో ఉన్న ఆయన సరైన నిర్ధారణ లేకుండా అధికారిక ప్రకటన చేయరు. గుర్తు తెలియని ప్రైవేటు వాహనం ఢీ కొనే సింగయ్య మృతి చెందారని ఆయన ఈ నెల 18వ తేదీ మధ్యాహ్నం ప్రకటించారు. ఏపీ 26 సీఈ 0001 టాటా సఫారీ వాహనం ఢీకొనడంతో సింగయ్య మృతి చెందారని చెప్పారు.ఆ సమయంలో ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి కూడా ఆయన పక్కనే ఉన్నారు. ప్రభుత్వం నమోదు చేయాలని భావిస్తున్న అక్రమ కేసుకు ఎస్పీ ప్రకటన అడ్డంకిగా మారింది. అందుకే ఎస్పీ సతీశ్ ప్రకటపై ప్రభుత్వ పెద్దలు ఆగ్రహం వ్యక్తం చేసినట్టు తెలిసింది. దాంతో 18 రాత్రికే గుంటూరు పోలీసుల వైఖరిలో మార్పు కనిపించింది. కానీ ఆ ప్రకటనకు పూర్తి విరుద్ధంగా ఎస్పీ సతీశ్ ఆదివారం మాట్లాడారు. వైఎస్ జగన్ ప్రయాణిస్తున్న వాహనం ఢీ కొనడంతో సింగయ్య మృతి చెందారన్నారు. అంటే ప్రభుత్వ పెద్దలు ఆయనపై ఏ స్థాయిలో ఒత్తిడి తెచ్చారో అన్నది తేటతెల్లమైందని నిపుణులు చెబుతున్నారు.



అరక పట్టి.. దంతెకొట్టి

టేక్మాల్ (మెదక్): మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్‌రాజ్ ఆదివారం పొలం బాట పట్టారు. టేక్మాల్ మండలం ఎల్లంపల్లి తండాలో పత్తి పంటను పరిశీలించి రైతు విఠల్‌తో మాట్లాడారు. బాగున్నావా.. మీకు ఎంత పొలం ఉంది? పత్తి పంటను ఎప్పుడు వేశారు? విత్తనాలు ఎక్కడ కొన్నారు? ప్రస్తుతం పంట ఎలా ఉంది? అని ప్రశ్నించారు. పత్తిలో చీడపీడల నివారణకు తీసుకుంటున్న జాగ్రత్తలు, దిగుబడి వంటి వివరాలను అడిగి తెలుసుకున్నారు. జిల్లాలో సరిపడా విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉంచామని, ఎవరైనా నకిలీ విత్తనాలు అమ్మితే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. అనంతరం చేనులోకి వెళ్లిన కలెక్టర్ అరక పట్టి దంతె కొట్టారు.



సందడిగా బ్రిక్స్ చాలెంజ్ పోటీలు

ఉత్సాహంగా ఇటుకలు తయారుచేసిన ప్రజలు

సూపర్‌బజార్ (కొత్తగూడెం): కొత్తగూడెం జిల్లా కేంద్రంలోని ప్రగతి మైదానంలో ఆదివారం నిర్వహించిన సండే బ్రిక్స్ చాలెంజ్ పోటీలు ఆద్యంతం ఉల్లాసంగా సాగాయి. విద్యార్థులు, యువత మొదలు వృద్ధుల వరకు పోటీల్లో పాల్గొన్నారు. పర్యావరణహిత మట్టి ఇటుకలపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకే ఈ పోటీలు నిర్వహించినట్లు కలెక్టర్ జితేష్ వి.పాటిల్ తెలిపారు. బ్రిక్స్ చాలెంజ్ కార్యక్రమం పోటీ మాత్రమే కాదని సంప్రదాయ, దృఢ సంకల్పమని అన్నారు. ఎర్రమట్టి, సిమెంట్, ఇసుక, సున్నం కలిపి ఇటుకలు తయారు చేస్తే దృఢంగా, కాల్చిన ఇటుకలకు దీటుగా ఉంటాయని వివరించారు. బెంగళూరుకు చెందిన సీఎస్ఈవీ నిపుణుడు సుధాకర్‌రెడ్డి మట్టి ఇటుకల తయారీ విధానంపై అవగాహన కల్పించగా.. 60 శాతం మట్టి, 20 శాతం ఇసుక, 10 శాతం సిమెంట్, పది శాతం సున్నం కలిపిన మిశ్రమంతో యంత్రం ద్వారా ఇటుకలు తయారు చేశారు. ఇందులో స్థానికులతోపాటు పలు ప్రభుత్వ శాఖల ఉద్యోగులు సైతం పాలుపంచుకున్నారు.

జీపీ, అంగన్వాడీ శాశ్వత భవనాలు

స్థలాల గుర్తింపు పూర్తి.. త్వరలోనే శంకుస్థాపనలు: సీతక్క



సాక్షి, హైదరాబాద్: గ్రామ పంచాయతీలు, అంగన్వాడీ భవనాలకు శాశ్వత భవనాలు నిర్మించేందుకు ప్రభుత్వం కార్యాచరణ సిద్ధం చేసింది. స్థలాల లభ్యతపై కసరత్తు పూర్తి చేసి భూములను అప్పగించాలని ఆదేశాలు జారీ చేయగా, చాలాచోట్ల భూములను గుర్తించి నిర్మాణ పనులకు వీలుగా ఆయా జిల్లాల కలెక్టర్లు చర్యలు చేపట్టారు. 2025–26 ఆర్థిక సంవత్సరంలో 1,148 అంగన్వాడీ భవనాల నిర్మాణం పూర్తి చేయాలని మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ లక్ష్యాన్ని నిర్దేశించుకుంది. ఇందులో 813 అంగన్వాడీ భవనాల నిర్మాణం కోసం స్థలాలను గుర్తించారు. మరో 98 చోట్ల గుర్తింపు ప్రక్రియ దాదాపు పూర్తి కావచ్చింది. అదేవిధంగా 1,144 గ్రామ పంచాయతీ భవనాల నిర్మాణం పూర్తి చేయాలని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ లక్ష్యాన్ని నిర్దేశించుకుంది. ఇప్పటివరకు 549 గ్రామాల్లో స్థలాలను గుర్తించారు. మరో 84 చోట్ల గుర్తింపు త్వరలో కొలిక్కి రానుంది. స్థలాలను గుర్తించిన చోట భవనాలు నిర్మించేందుకు చర్యలు చేపట్టారు. నిర్మాణ పనులను అప్పగించేందుకు కాంట్రాక్టర్ల ఎంపిక ప్రక్రియ వేగవంతం చేశారు. అతి త్వరలోనే ఈ భవనాల నిర్మాణ పనులు ప్రారంభిస్తామని మంత్రి సీతక్క ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధుల ద్వారా ఒక్కో పంచాయతీ భవన నిర్మాణ కోసం రూ. 20 లక్షలు ఖర్చు చేయనున్నారు. అంగన్వాడీ భవనం కోసం ఉపాధి హామీ నిధుల ద్వారా రూ.8 లక్షలు, 15వ ఫైనాన్స్ కమిషన్ నిధులు రూ. 2 లక్షలు, మహిళా శిశు సంక్షేమం నుంచి రూ.2 లక్షల నిధులు మొత్తం కలిపి రూ.12 లక్షలు వెచ్చించనున్నారు. వచ్చే ఏడాది మార్చి చివరికల్లా 1,144 జీపీ భవనాలు, 1,148 అంగన్వాడీ భవనాలను నిర్మిస్తామని మంత్రి సీతక్క వెల్లడించారు.

పంచాయతీల్లో అభివృద్ధి నిలిచిపోయింది

ఆరు డిమాండ్‌లతో మంత్రి సీతక్కకు హరీశ్‌రావు లేఖ



సాక్షి, హైదరాబాద్ : రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత నిధులు లేక గ్రామ పంచాయతీల్లో అభివృద్ధి ఎక్కడిక్కడే నిలిచిపోయి పారిశుధ్యం పడకేసిందని మాజీ మంత్రి హరీశ్‌రావు ఆరోపించారు. వీధి దీపాల నిర్వహణ లేక పల్లెలు అంధకారంలో ఉంటున్నాయని, బీఆర్ఎస్ ప్రభుత్వం ఇచ్చిన ట్రాక్టర్లలో డీజిల్ పోయించలేక, ఆర్టీఏ ట్యాక్స్ కట్టలేక అధికారులకు తాళాలు అప్పగిస్తున్న దుస్థితి వచ్చిందన్నారు. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్కకు హరీశ్‌రావు ఆరు డిమాండ్లతో ఆదివారం లేఖ రాశారు.

ఇవే ఆ డిమాండ్లు

- గ్రామ పంచాయతీలకు సంబంధించిన నిధులను వెంటనే విడుదల చేయాలి.
- గ్రామపంచాయతీల్లో చేసిన పనులకుగాను మాజీ సర్పంచులు, పంచాయతీ కార్యదర్శుల పెండింగ్ బిల్లులు విడుదల చేయాలి.
- 'అభయహస్తం'మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ ప్రకారం.. ఔట్‌సోర్సింగ్ విధానంలో పనిచేస్తున్న పంచాయతీ కార్యదర్శులను జూనియర్ పంచాయతీ కార్యదర్శులుగా క్రమబద్ధీకరించాలి.
- వానాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా గ్రామాల్లో స్పెషల్ డ్రైవ్‌లు నిర్వహించి, పారిశుధ్యం మెరుగుపరచాలి.
- గత మూడు నెలలుగా పారిశుధ్య కార్మికులకు వేతనాలు రాక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వెంటనే వారికి వేతనాలు చెల్లించాలి.
- గతేదాది నవంబర్‌లో నిర్వహించిన ఇంటింటి కుటుంబ సర్వే డేటా ఎంట్రీ ఆపరేటర్లకు ఇప్పటి వరకు వేతనాలు చెల్లించకపోవడం శోచనీయం. వెంటనే వారి వేతనాలు విడుదల చేయాలి.

యువతకు బాసటగా మరో పోరాటం

వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో నేడు 'యువత పోరు'

సాక్షి, అమరావతి: ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయాలంటూ చంద్రబాబు నాయకత్వంలోని టీడీపీ కూటమి ప్రభుత్వంపై ప్రధాన ప్రతిపక్షమైన వైఎస్సార్‌సీపీ ఒత్తిడి పెంచుతోంది. మాట తప్పి.. వెన్నుపోటు పొడిచిన కూటమి ప్రభుత్వ తీరుకు నిరసనగా సోమవారం ఏపీవ్యాప్తంగా యువతకు బాసటగా జిల్లా కలెక్టరేట్‌ల వద్ద ఆందోళనలకు వైఎస్సార్‌సీపీ యువజన విభాగం పిలుపునిచ్చింది. అనంతరం యువతకు ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ కలెక్టర్‌లకు యువతీయువకులతో కలిసి వైఎస్సార్‌సీపీ యువజన విభాగం నేతలు వినతిపత్రాలు అందించనున్నారు.

శాంతి ప్రోత్సాహంలో బ్రహ్మకుమారీల పాత్ర భేష్

- గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ అభినందన
- రొమ్ము కేన్సర్‌పై అవగాహన కార్యక్రమం ప్రారంభం
- 18 ఏళ్లుగా డాక్టర్ పి. రఘురాం అందిస్తున్న సేవలకు కితాబు



కార్యక్రమంలో జ్యోతి ప్రజ్వలన చేస్తున్న గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ తదితరులు

రాయదుర్గం: సమాజంలో శాంతి, విలువలు, శ్రేయస్సును ప్రోత్సహించడంలో బ్రహ్మకుమారీలు గొప్ప సేవకులుగా పేరొందారని రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ప్రశంసించారు. హైదరాబాద్ గచ్చిబౌలిలోని శాంతి సరోవర్‌లో ఉన్న గ్లోబల్ పీస్ ఆడిటోరియంలో ఆదివారం ఆయన ఏబీసీస్ ఆఫ్ బ్రెస్ట్ కేన్సర్ అనే రొమ్ము కేన్సర్ అవగాహన కార్యక్రమాన్ని జ్యోతి వెలిగించి ఆయన ప్రారంభించారు. ప్రపంచ ప్రఖ్యాత రొమ్ము కేన్సర్ సర్జన్, రొమ్ము కేన్సర్‌ను తొలి దశలోనే గుర్తించడంపై 18 ఏళ్లుగా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్న కిమ్స్ ఉషాలక్ష్మీ బ్రెస్ట్ డిసీజ్ సెంటర్ వ్యవస్థాపక డైరెక్టర్, ఉషాలక్ష్మీ బ్రెస్ట్ క్యాన్సర్ ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ పి. రఘురాం సేవలను గవర్నర్ ఈ సందర్భంగా కొనియాడారు. రాజస్తాన్‌లోని మౌంట్ అబూలో ఉన్న బ్రహ్మకుమారీస్ ప్రధాన కేంద్రంలో ఇటీవల ఆన్‌సైట్, ఆన్‌లైన్ వేదికగా అత్యధిక అవగాహనా తరగతులు నిర్వహించినందుకు రెండు గిన్నిస్ రికార్డులు సాధించిన డాక్టర్ రఘురాంను శాంతిసరోవర్ డైరెక్టర్ బి.కె. కుల్‌దీప్ దీదీతో కలిసి ఆయన ఘనంగా సన్మానించారు. కోవిడ్ సమయంలోనూ అవగాహన కార్యక్రమాలు నిర్వహించిన ఘనత కూడా డాక్టర్ రఘురాంకు దక్కుతుందన్నారు. ఆయన చేపట్టిన వినూత్న కార్యక్రమాలు దేశంలో రొమ్ము కేన్సర్ నిర్వహణను కొత్త దిశలో నడిపించాయన్నారు.

4 నిమిషాలకో కేసు.. 8 నిమిషాలకో మరణం

డాక్టర్ రఘురాం మాట్లాడుతూ దేశంలో ప్రతి 4 నిమిషాలకు ఒక కొత్త రొమ్ము కేన్సర్ కేసు నమోదవుతోందని.. ప్రతి 8 నిమిషాలకు ఒక మరణం సంభవిస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. దేశంలో ఏటా 2 లక్షల కొత్త కేసులు, లక్ష మరణాలు నమోదవుతున్నాయన్నారు. బ్రెస్ట్ కేన్సర్‌పై అవగాహన లోపం, స్క్రీనింగ్ లేకపోవడం వల్ల 60 శాతం కేసులు చివరి దశల్లోనే బయటపడుతున్నాయని చెప్పారు. 40 ఏళ్లు దాటిన మహిళలంతా ఏటా మామోగ్రామ్ పరీక్ష చేయించుకోవాలని ఆయన సూచించారు.

తనిఖీలతో బోధనెలా?

▶ మొదటి పేజీ తరువాయి

ఉపాధ్యాయులకే ఈ బాధ్యతను అప్పగించడం వివాదానికి కారణమైంది.

సమస్య ఏమిటి?

రాష్ట్రంలో 1.06 లక్షల మంది ప్రభుత్వ టీచర్లున్నారు. కొన్ని స్కూళ్లల్లో టీచర్లు ఎక్కువ, విద్యార్థులు తక్కువ ఉన్నారు. ఈ లెక్కన దాదాపు 6 వేల మంది టీచర్లు మిగులు ఉన్నారనేది ప్రభుత్వం వాదన. కానీ విద్యార్థులు తక్కువ ఉన్నా అన్ని సబ్జెక్టులు బోధించాల్సి ఉంటుందని, ఈ లెక్కన ఇంకా టీచర్ల అవసరం ఉందని ఉపాధ్యాయ సంఘాలు అంటున్నాయి. ప్రభుత్వ తాజా ఉత్తర్వుల ప్రకారం పదేళ్ల బోధన అనుభవం ఉన్న ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం లేదా సెకండరీ గ్రేడ్ టీచర్ రోజూ రెండు స్కూళ్లను తనిఖీ చేస్తారు. ప్రాథమికోన్నత పాఠశాలల్లో పదేళ్ల సర్వీస్ ఉన్న స్కూల్ అసిస్టెంట్లు కూడా రోజూ రెండు స్కూళ్లు తనిఖీ చేయాలి. ఉన్నత పాఠశాలల్లో కూడా స్కూల్ అసిస్టెంట్లనే తీసుకుంటారు. వీళ్లు మూడు నెలల్లో50 స్కూళ్లు తనిఖీ చేసి నివేదిక ఇవ్వాలి. స్కూల్ హెచ్‌ఎం కేడర్ కంటే ఎస్ఏ, ఎస్జీటీ కేడర్ తక్కువ. ఇలాంటి వారిచేత స్కూళ్లను తనిఖీ చేయించడం ఏమిటని ప్రశ్నిస్తున్నారు. పైగా రాష్ట్రవ్యాప్తంగా 2 వేల మంది టీచర్లకు ఈ బాధ్య తలు అప్పగిస్తే బోధనకు టీచర్ల కొరత ఏర్పడే అవకాశం ఉందని చెబుతున్నారు.

పైరవీలకు దారులు

తనిఖీల కోసం టీచర్ల ఎంపిక ఎలా చేస్తారనే దానిపై విద్యాశాఖ ఎలాంటి స్పష్టత ఇవ్వలేదు. నియామకానికి ఏదైనా రాత పరీక్ష నిర్వహిస్తారా? కిందిస్థాయి అధికారుల సిఫార్సుల మేరకే ఎంపిక చేస్తారా? అనేది తెలియడం లేదని సంఘాల నేతలు అంటున్నారు. ఇప్పటికే డిప్యుటేషన్ల కోసం పెద్ద ఎత్తున పైరవీలు జరుగుతున్నాయి. పర్యవేక్షణ కోసం నియమించేవారు రోజూ స్కూల్‌కు వెళ్లాల్సిన అవసరం లేదు. కాబట్టి ఈ పేరుతో ఇతర సొంత పనులు చేసుకునే వీలుంది. ఈ అవకాశాన్ని వినియోగించుకునేందుకు పెద్ద ఎత్తున పైరవీలు జరిగే అవకాశం ఉందని పలువురు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు.

ఇదెక్కడి న్యాయం

హైస్కూళ్లలో గెజిటెడ్ హెచ్‌ఎంలు పని చేస్తారు. వీరికన్నా తక్కువ స్థాయి ఉన్న స్కూల్ అసిస్టెంట్లను పర్యవేక్షణకు నియమించడం ఎంతమాత్రం సమంజసం కాదు. ఇదెక్కడి న్యాయమో అధికారులే చెప్పాలి. పైగా బోధన కుంటుపడే వీలుంది. తక్షణమే ఈ ఆదేశాలను వెనక్కు తీసుకోవాలి.

– ఆర్ రాజగంగారెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ గెజిటెడ్ అధ్యాపకుల సంఘం అధ్యక్షుడు.

ప్రమాణాలు తగ్గుతాయి

పదేళ్ల అనుభవం ఉన్నవారిని ఏడాది పొడవునా తనిఖీలకే వినియోగిస్తే ప్రభుత్వ స్కూళ్లల్లో బోధకుల కొరత ఏర్పడుతుంది. ఫలితంగా విద్యా ప్రమాణాలు తగ్గిపోతాయి. ఇలాంటి అనాలోచిత నిర్ణయాలు తీసుకోవడం ఎంతమాత్రం సరికాదు.

– యం సోమయ్య, టి లింగారెడ్డి, డెమోక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు



తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ అభినందన కుమార్ షావలి

శ్రీవారి సేవలో న్యాయమూర్తులు

తిరుమల శ్రీవారిని ఏపీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ రవినాథ్ తిల్హరి, తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ అభినందన కుమార్‌షావలి, డీఆర్డీఏ చైర్మన్ సమీర్ కామత్, జాతీయ రక్షణశాఖ సలహాదారు అజిత్ ధోవల్ తదితరులు వేర్వేరుగా దర్శించుకున్నారు. అనంతరం ఆలయ రంగనాయకుల మండపంలో వేద పండితులు ఆశీర్వదించగా, అధికారులు లడ్డూ ప్రసాదాలు అందజేశారు. కాగా, ఏపీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ రవినాథ్ తిల్హరి శ్రీ పద్మావతి అమ్మవారిని కూడా దర్శించుకున్నారు.

– తిరుమల/చంద్రగిరి

ఆర్టీసీకి చుక్కలు చూపుతున్న ఐ-టిమ్స్!

- నెట్‌వర్క్, సర్వర్, సాంకేతికతలో లోపాలతో టికెట్ల జారీలో తీవ్ర అంతరాయం
- సిగ్నల్ అందక తరచూ సమస్యలు.. నిలిచిపోతున్న బస్సులు
- ఇటు ప్రయాణికులకు.. అటు కండక్టర్లు/టిమ్స్ డ్రైవర్లకు చికాకులు
- మళ్లీ ఆఫ్‌లైన్ పద్ధతిలో టికెట్ల జారీ చేసేలా వాటిల్లో మార్పులు?

నగరంలోని ఓ డిపోకు చెందిన సూపర్ లగ్జరీ బస్సు మధ్యాహ్నం 3 గంటల సమయంలో విజయవాడ నుంచి హైదరాబాద్‌కు బయలుదేరేందుకు సిద్ధమైంది. ఐ-టిమ్(ఇంటలిజెంట్ టికెట్ ఈష్యూయింగ్ మెషీన్) ద్వారా డ్రైవర్ టికెట్ జారీ చేయబోతే నెట్‌వర్క్ సమస్య ఎదురైంది. కాసేపు కిటికీలోంచి మెషీన్‌ను బయట ఉంచి అటూఇటూ కాసేపు జరిపినా సిగ్నల్ అందలేదు. దుర్గ గుడి ఫ్లైఓవర్ దిగిన తర్వాత బస్సును రోడ్డు పక్కన ఆపి మరోసారి ప్రయత్నించినా నెట్‌వర్క్ అందలేదు. చివరకు విజయవాడ దాటి ఇబ్రహీంపట్నం వద్దకు వెళ్లాకగానీ టికెట్ల జారీ సాధ్యం కాలేదు. ఇన్నిసార్లు బస్సు ఆపాల్సి రావటంతో ప్రయాణికులు విసుగుచెందారు.. టికెట్లు జారీ చేయకుండా వెళ్లినప్పుడు చెకింగ్ సిబ్బంది వస్తే తన ఉద్యోగం ఊడుతుందని డ్రైవర్ ఆవేదన వ్యక్తం చేశారు. ఇది గత గురువారం నాటి సంగతి.

సాక్షి, హైదరాబాద్: ఆర్టీసీలో కొత్తగా ప్రవేశపెట్టిన 'ఐ-టిమ్స్'చుక్కలు చూపుతున్నాయి. యూపీఐ చెల్లింపుల ద్వారా నగదు రహిత టికెట్ల జారీకి ఊతమిచ్చేలా ఆర్టీసీ ఇటీవల ఈ ఐ-టిమ్స్‌ను అందుబాటులోకి తెచ్చింది. ఇది ప్రయాణికులకు ఎంతో ఉపయోగపడేదే. చలో మొబిలిటీ అనే సంస్థకు దీని బాధ్యతను ఆర్టీసీ అప్పగించింది. ఇప్పుడు ఆన్‌లైన్ ట్రాకింగ్ వ్యవస్థలో లోపమా, కొత్తగా కొనుగోలు చేసిన ఐ-టిమ్ యంత్రాల్లో లోపమా, నెట్‌వర్క్ ప్రొవైడర్ లోపమా.. సమస్య ఎక్కడుందో సిబ్బందికే తెలియని పరిస్థితి. నిత్యం ఈ యంత్రాల ద్వారా టికెట్ల జారీ పెద్ద ప్రహసనంగా మారింది. దీనిపై డిపో సిబ్బంది ఫిర్యాదు చేస్తే సంబంధిత సంస్థ ఉద్యోగులు వచ్చి పరిశీలిస్తున్నారు. కొన్ని సందర్భాల్లో నెట్‌వర్క్ లోపమని, సర్వర్‌లో సమస్య అని, యంత్రాల్లో ఇబ్బందులని.. ఇలా రకరకాల సమాధానాలు వస్తున్నాయని కండక్టర్లు చెబుతున్నారు. చాలా బస్సుల్లో టికెట్ల జారీలో జాప్యం జరుగుతుండగా, కొన్ని సార్లు యూపీఐ పేమెంట్‌కు సాధ్యం కావటం లేదు. నగరంలోని సిటీ బస్సుల్లో సమస్య అంత తీవ్రంగా లేకున్నా, జిల్లాల మధ్య, ఆంధ్రప్రదేశ్, కర్ణాటకలకు తిరుగుతున్న బస్సుల్లో సమస్య ఎక్కువగా ఉంది.



ఒక యంత్రం రెండు సిమ్స్..

ప్రస్తుతం ఈ యంత్రాల్లో ఓ సర్వీసు ప్రొవైడర్‌కు చెందిన సిమ్ కార్డులు వాడుతున్నారు. ఇప్పుడు నెట్‌వర్క్ సమస్యలొస్తుండటంతో మరో సర్వీసు ప్రొవైడర్ సిమ్ కార్డులు కూడా ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్టు తెలిసింది. అంటే సెల్‌ఫోన్‌లో రెండు సిమ్‌కార్డులున్నట్టు వీటిల్లో కూడా రెండు వేర్వేరు ప్రొవైడర్ల సిమ్ కార్డులు ఏర్పాటు చేస్తారన్నమాట. ఒకదానితో నెట్‌వర్క్ సమస్య ఏర్పడినా రెండో సిమ్ నెట్‌వర్క్‌తో టికెట్లు జారీ చేసే వీలుంటుందన్నది అధికారుల ఆలోచన.

ఆఫ్‌లైన్ టికెట్‌ల జారీ చేసేలా..

కొన్నేళ్లుగా సాధారణ టిమ్స్‌తో ఆఫ్‌లైన్ పద్ధతిలో టికెట్ల జారీ కొనసాగుతోంది. ఆన్‌లైన్ సేవల కోసం వాటిని పక్కన పెట్టి దాదాపు 1,300కుపైగా ఐ-టిమ్స్ కొనుగోలు చేశారు. ఇప్పుడు రకరకాల సమస్యలతో ఆన్‌లైన్ టికెట్ జారీకి అంతరాయం కలుగుతోంది. దీంతో ఐ-టిమ్స్‌తోపాటు ఆఫ్‌లైన్ (పాత పద్ధతి)లో కూడా టికెట్లు జారీ చేసేలా వాటిల్లో సాంకేతికతను సవరించాలని అధికారులు నిర్ణయించారు. అప్పుడు యూపీఐ చెల్లింపులు సాధ్యం కాదు. ఆధునిక యంత్రాలు అందుబాటులోకి తెచ్చి ఆఫ్‌లైన్ టికెట్ల జారీ చేయాల్సి రానుండటం విశేషం.

సాక్షి ఫ్యామిలీ
హైదరాబాద్
సోమవారం ॥ 23-6-2025

సన్నిధి

మంచిమాట



పంట - కలుపు

పొలంలో ఏదైనా తనకి కావలసిన పంట పండించుకోవటానికి రైతు ఎంతగానో కృషి చేయ వలసి ఉంటుంది. పొలం దున్నాలి. పదును చెయ్యాలి. కావలసిన విత్తనాలు నాటాలి. నీరు పెట్టాలి. చీడ పీడలు రాకుండా మందులు వెయ్యాలి. పశువులు తినకుండా కాపాడాలి. నిరంతరం ఎటువంటి ఇబ్బంది రాకుండా పసిపిల్లలని చూసినట్టు కంటికి రెప్పలాగా చూసుకుంటూ ఉండాలి. అయినా ఏదో ఒక చిన్న సమస్య అనుకున్నంత ఫలసాయంరాకుండా అడ్డుపడుతూనే ఉంటుంది. కావాలనుకున్న దాని విషయంలో జరిగే తంతు ఇది. కాని, కలుపు మొక్కల సంగతి చూడండి. విత్తనాలు కూడా వెయ్యనవసరం లేదు. ఎక్కడి నుండి వస్తాయో తెలియదు. పంట కోసం చేసిన ఏర్పాటుని హాయిగా తాము అనుభవించి ఏపుగా పెరుగుతాయి. వాటిని ఏరి పారేసినా, పీకి పాకం పట్టినా ఎట్లా బతుకుతాయో అంతుపట్టదు. చక్కగా పుటకరించి ఎదుగుతాయి. ఏమి చెయ్యని చోట కూడా చక్కగా మొలకెత్తి పెరుగుతాయి.

సరిగ్గా ఇదే విధంగా మనలో మంచి ఆలోచనలు, చెడు ఆలోచనలు తలెత్తి నాటుకుపోవటం అనే క్రమం సాగుతుంది. అదేం చిత్రమో కాని చెడుకి ఆకర్షణ అధికం. బలం కూడా ఎక్కువే. అంతిమ విజయం మంచికే అంటాం కాని, ఈ లోపు జరగవలసిన హాని జరిగిపోతూ ఉంటుంది. ఆకర్షణ తాత్కాలికమైనా ప్రభావం గట్టిగానే ఉంటుంది. అందుకే ఈ రెండింటి విషయంలో రైతు పంటకోసం ఎంత జాగ్రత్త వహిస్తాడో అంత జాగ్రత్త పడవలసి ఉంటుంది.

మంచిభావాలు అనే విత్తనాలు మొలకెత్తటానికి అనువుగా మనసు అనే క్షేత్రాన్ని చదును చేయాలి. ఇదే క్రమశిక్షణ. శారీరక మానసిక శుద్ధి క్రమశిక్షణ వల్ల సిద్ధిస్తుంది. కలిగిన మంచి ఆలోచనలు మనస్సులో గాఢంగా నాటుకొని పెంపొందే విధంగా తగిన వాతావరణాన్ని కల్పించుకోవాలి. ఇదే పొలానికి నీరు పెట్టి ఎరువు వెయ్యటం వంటిది. ఏ మాత్రం అశ్రద్ధ చేసినా ఎండి పోయినట్టు, పంటకి తెగులు సోకినట్టు సదాలోచనలు కూడా పక్కదారి పట్టవచ్చు. అందుకని వచ్చిన మంచి ఆలోచనలని నిరంతరం మననం చెయ్యటం, వీలైనంత వరకు ఆచరణలో పెట్టటానికి ప్రయత్నం చెయ్యటం చేయాలి. ఆలోచన క్రియారూపాన్ని దాల్చితే స్థిరపడిపోతుంది.

పంట బాగా ఎదగాలని ప్రయత్నం చేస్తే, చేసిన శ్రమఫలాన్ని అంతా కలుపు మొక్కలే పొంది బలంగా ఎదుగుతాయి. అదేవిధంగా, మంచి భావాలనే నిరంతరం మనసులో నింపుకుని ఉండాలని ఎంత ప్రయత్నం చేసినా, దురాలోచనలు సందు చూసుకుని దూరి పోయి, ఎక్కువ ప్రాబల్యాన్ని సంతరించుకుంటాయి. కనుక వాటిని ఎప్పటికప్పుడు తొలగించుకుంటూ ఉండాలి. లేకపోతే పంటని మించి కలుపు మొక్కలే రాజ్యమేలినట్టు కూడని భావాలే విస్తరించి మంచిభావనలని అణచి వేయటం జరుగుతుంది. ప్రయత్నం లేకుండానే పెచ్చు పెరిగే ప్రతికూల భావజాలానికి అడ్డుకట్టవేసి, సానుకూల భావాలని ప్రయత్నపూర్వకంగా పెంపొందించుకుని పోషించుకుంటూ ఉండాలి. అవి వాటంతట అవి రావు.

ఉదాహరణకి కష్టాల్లో ఉన్న వారికి సహాయం చేద్దామనే ఆలోచన వచ్చిందనుకుందాం లేదా రోజూ కొద్ది సమయం యోగాభ్యాసమో, నడకో, ధ్యానమో చేద్దామనే భావన కలిగిందనుకుందాం. ఆ భావన మాయం కాకుండా ఆచరణ దాకా వచ్చేవరకు దానినే గుర్తు చేసుకుంటూ ఉండాలి. లేకపోతే ఆ నిర్ణయాన్ని బలహీనపరచే ఆలోచనలు విజృంభిస్తాయి. ఇంకేముంది? అంతా మామూలే! కాని, అదే ఏదైనా చెడు ఆలోచన వచ్చిందనుకుందాం. దానిని బలహీన పరచే ఊహలు రావు. వచ్చినా నిలవవు.

అందుకే మనస్సులో మెదిలిన సదాలోచనని వెంటనే అమలు చెయ్యమని, దురాలోచనని వీలైనంత ఆలస్యం చెయ్యమని చెపుతారు పెద్దలు. వ్యవసాయంలో కలుపుతీతకి ఉన్నంత ప్రాధాన్యం సాధనలో శారీరక... మానసిక శుద్ధికి ఉంది.

– డా.ఎన్. అనంతలక్ష్మి

వద్దనుకున్న కలుపు మొక్కలు ఎదిగినంత వేగంగా పంట ఎదగనట్టే చెడు ఆలోచనలు వచ్చినంత త్వరగా మంచి ఆలోచనలు రావు. మంచి చేయాలనే ఆలోచన కలగవచ్చు. కానీ, దానిని అమలు పరచటం గురించి మనస్సులో స్థిరంగా అనుకోవటం కాని, ఎక్కువసేపు ఆలోచించటం గాని సాగదు. దానికి కారణం కలుపు మొక్కల వంటి చెడు భావాలు దృఢంగా పాతుకుపోయి, బలంగా ఎదిగి, బాగా విస్తరించి, సదాలోచనలు అస్తిత్వం కోల్పోయేట్టు చేయటమే. అందుకే ప్రధానంగా చెయ్యవలసింది పనికిరాని భావాలని మనస్సులో నుండి తొలగి పోయేట్టు చేయటమే. అపుడు మనస్సులో మంచిభావాలు విస్తరించటానికి కావలసిన ఖాళీ ఏర్పడుతుంది.

కథానీతి

వృథా

ఒక స్వామీజీ వద్ద కొందరు శిష్యులు ఉండేవారు. ''వేటినీ దుర్వినియోగం చేయరాదు'' అని స్వామీజీ ఎప్పుడూ శిష్యులతో చెపుతూ ఉండేవారు. కానీ శిష్యులు ఆయన మాటలను పట్టించుకునే వారు కాదు. నీరు, ఆహారం వృథా చేస్తూ ఉండేవారు. దుస్తులను ఇక్కడ, అక్కడ నిర్లక్ష్యంగా పడేస్తూ ఉండేవారు.

ఒకసారి స్వామీజీ తన శిష్యులతో వేరే ఊరు ప్రయాణమై వెళ్తున్నారు. ఎండ బాగా ఉంది. శిష్యులకు దాహం అయింది. కానీ తాగడానికి నీరు ఎక్కడా దొరకలేదు. మరికాస్త ముందుకు ప్రయాణించాక శిష్యులకు ఆకలి వేసింది. కానీ తినటానికి ఏమీ లేదు. అక్కడ తినే ఫలాలు కూడా ఏమీ కనిపించలేదు. శిష్యుల బాధను చూసి స్వామీజీ పరిసరాలు అంతా గాలిస్తే – కొద్దిగా నీరు, రెండు పళ్ళు దొరికాయి. తలొక గుక్కెడు నీళ్ల తాగారు. ఆ పండ్లను కోసి తలా ఒక ముక్క తిన్నారు ''ఇప్పుడు మీకు ఏమనిపిస్తోంది?'' అని శిష్యులని అడిగాడు స్వామీజీ.



''చాలా కాసిని నీళ్ల, మరీ తక్కువ పళ్ళు దొరికాయి. మరికాసిని నీళ్ల, పళ్ళు దొరికితే బాగుండేది'' అన్నారు అందరూ. గోవిందుడు అనే శిష్యుడు మాత్రం ''ఆశ్రమంలో నీళ్ల, తిండి సమృద్ధిగా ఉండటం వల్ల వాటి విలువ తెలియలేదు. కానీ ఇక్కడ నీరు, తిండి దొరకపోయేసరికి వాటి విలువ ఏమిటో తెలిసింది. నేను ఇంకెప్పుడూ ఏదీ వృథా చేయను'' అన్నాడు

స్వామీజీ శిష్యులతో ప్రయాణం కొనసాగించారు. దారిలో ఒక సంత కనిపించింది. అమ్మకందారులు, కొనుగోలుదారులతో సంత చాలా రద్దీగా ఉంది. స్వామీజీ తన శిష్యులతో సంతలో ప్రవేశించారు. ఒక పంచె కొంటున్న వ్యక్తి వద్ద ఆగారు. అతనితో ''కొన్ని రోజులకు ఈ పంచె చిరిగి పోతుంది కదా అప్పుడు ఏం చేస్తావు?'' అన్నారు. ఆ వ్యక్తి ''దాన్ని రెండు ముక్కలుగా చేసి పిల్లలు కట్టుకోవడానికి వాడతాను'' అన్నాడు.

'' మరి అవి కూడా చిరిగిపోతే ఏం చేస్తావు?'' అడిగారు స్వామీజీ. ''వాటిని ముక్కలుగా చేసి మసిగుడ్డిగా, కాళ్ళు తుడుచుకొనే పట్టాగా, ఇంకా ఇల్లు తుడుచుకోవటానికి వాడతాను'' అన్నాడు ఆ వ్యక్తి.

''అవి కూడా చిరిగిపోతే అప్పుడు ఏం చేస్తావు?'' మళ్ళీ అడిగారు స్వామీజీ. ''ఆ ముక్కలను మట్టిలో పూడ్చిపెట్టి ఎరువు తయారు చేస్తాను. ఆ ఎరువుతో పంట పండించి. ఆ పంట అమ్మిన డబ్బుతో మళ్ళీ కొత్త పంచె కొంటాను'' అన్నాడు ఆ వ్యక్తి. తనకూ, ఆ వ్యక్తికీ మధ్య జరుగుతున్న సంభాషణను వింటున్న తన శిష్యుల వంక చూశారు గురువుగారు. వాళ్లు సిగ్గుతో తలవంచుకున్నారు. అప్పటి నుంచి ఆ శిష్యులు దేనినీ దుర్వినియోగం చేయలేదు.

– కళ్ళేపల్లి తిరుమలరావు

ఆత్మదర్శిని

అదే నీవు... అదే దైవం

దైవం ఈ క్షణంలోనే ఉంది. ఈ క్షణంలో నీవు ఎక్కడ ఉన్నా సరే, ఏమి చేస్తున్నాసరే ఆత్మస్థితిలోకి వెళ్ళగలవు. అదే దివ్యచైతన్యం. అదే నీవు, అదే దైవం. ఆ సమాధి స్థితి దైనందిన జీవితంలో నిరంతరం ఉండాలి. ఎల్లప్పుడూ ఆత్మదర్శనంలోనే ఉండాలి. చూసేవాడివే నీవు, శరీరానికి, మనస్సుకు ఏమి జరుగుతున్నా సరే సంపూర్ణంగా స్వీకరించు, వాటికి అంటకుండా దూరంనుంచి గమనిస్తూ ఉండు. విషయాలను తర్కించి, జరుగుతున్నది మంచేనా లేక చెడా అని రకరకాలుగా ఆలోచిస్తూ సంస్కారాలను పెంచుకోవద్దు. జరుగుతున్నది ఏదైనా సరే నీవు సాక్షిగా చూస్తున్నావా లేదా అన్నదే ముఖ్యం. అదే నిన్ను మనస్సుకు అతీతంగా తీసుకెళ్తుంది. శరీరము-మనస్సులకు జరుగుతున్న వాటితో కలిసిపోయావంటే వేదనలను అనుభవిస్తావు. జరుగుతున్న వాటిని సాక్షిగా గమనిస్తే ఆత్మలోని అనందమే నీవు అవుతావు. దుఃఖించేవాడివి నీవు కాదు, దుఃఖించేవాడిని గమనించేవాడివే నీవు. ఇలాంటి జీవనశైలిని అలవర్చుకుంటే నిత్యం సచ్చిదానందంలో ఉంటావు. అది నొప్పిఐనా, అవమానమైనా, సంతోషమైనా, విజయమైనా, ప్రశంసైనా.... ఏదైనాసరే నీకు అంటకూడదు. సమభావంతో స్వీకరించు, సాక్షిగా గమనించు. సత్యం నీలో ఉంది. దేన్ని వెంబడించినా ఆనందం రాదు గుర్తుంచుకో. అన్నింటిలోనూ జీవించు కానీ వేటితోనూ కలిసిపోవద్దు. ఆధ్యాత్మికంగా ఉండడమంటే కోరికల్ని అణిచివేయడమని, కొన్ని పనుల్ని చేయకూడదని, సంసారాన్ని త్యజించడమని, హిమాలయాలకు వెళ్ళడమని కొందరు చెప్పే అజ్ఞానపు పోకడలను అనుసరించవద్దు. అసలు జరుగుతున్నదేదీ సత్యం కానపుడు దాన్ని వదిలేయడం ఏమిటి? నీవే దైవమైనప్పుడు దేన్ని వదిలేయాలి? మనస్సుతో మాత్రం ఎప్పుడూ ఏకమవ్వద్దు. మనకున్న నమ్మకాలు, భయాలు, అపోహలు అన్నీ మనస్సు వల్లనే. సత్యాన్ని తెలుసుకోనీయకుండా చేసేది



మనస్సే. నీవు సాక్షివైనప్పుడే మనస్సు అంతమవుతుంది. ఆలోచనలు లేని శుద్ధ చైతన్యం అనుభవమౌతుంది.

బుద్ధుడు, మహా వీరుడు మొదలైన యోగులు కూడా దేవుడు భౌతికమని ఎన్నడూ చెప్పలేదు. సత్యమే దైవం. అదే నీ నిజస్థితి. దేవుడు అనేది నీ చివరి మజిలీ. దైవాన్ని నమ్మడం అనేది దైవాన్ని నీవు అనుభవపూర్వకంగా తెలుసుకోవడానికి ఏమాత్రం సహకరించదు. పైగా నమ్మకమే దైవాన్ని తెలుసుకోవడానికి అడ్డుపడుతుంది. నమ్మకాలనేవి నీ మనస్సులోని ఊహలే. సత్యాలు మాత్రం కావు. దైవాన్ని తెలుసుకోవడానికి ఏ క్రతువులు, భాషలు అవసరమే లేదు. కానీ ఈ రోజు ప్రతి మతంలోనూ మనస్సు తాలూకు నమ్మకాలు, అలవాట్లు అనేవే ఉన్నాయి కానీ నిన్ను నీవు తెలుసుకోవడం, సాక్షీభావనతో ఉండడం అనే అంశాలే ఉండటం లేదు. ఎన్ని శాస్త్రాలు చదివినా, గ్రంథాలు చదివినా అది మన అహంకారాన్ని పోషించి మనస్సును ఇంకా బలపరచి సత్యానికి అడ్డుగోడలు కడుతుందే కానీ సత్యాన్ని తెలుసుకోనివ్వదు. నిన్ను నీవు తెలుసుకోనివ్వకుండా అడ్డుపడేది మనస్సే. రోజాపువ్వు గురించి తెలుసుకున్నంత మాత్రాన నీవు ఆ రోజాపువ్వుని ఆస్వాదించలేవు. ఒక విషయం గురించిన జ్ఞానం ఆ విషయానుభవానికే అడ్డమవుతుంది.



మనస్సు నిన్ను సత్యాన్ని తెలుసుకోనివ్వదు. ఆనందాన్ని అనుభవించనీయదు. ఏదో ఒక కొత్త సమస్యను, కోరికను సృష్టిస్తూ, ప్రశ్నిస్తూ, ఈ క్షణాన్ని తిరస్కరిస్తూ ఉంటుంది. ఆనందం మనస్సుకు అతీతమైన స్థితి కనుక అక్కడికి నిన్ను వెళ్ళనివ్వకుండా అడ్డుపడుతూనే ఉంటుంది. దీని ఉచ్చునుండి బయటపడడానికి అనుక్షణం నీవు సాక్షీభావనతో నిన్ను నీవు గమనిస్తూ ఉండాలి. చేతనలో ఉండాలి.

చేతన అనేది మనస్సుకాదు కానీ మనస్సు ద్వారా ప్రవహిస్తుంది. ఇది అనుభవపూర్వకంగా మాత్రమే తెలుసుకోగలవు. నిత్యజీవితంలో ఈ సాక్షీభావన అనేది సాధన చేయటం చాలా ముఖ్యం.

– స్వామి మైత్రేయ, ఆధ్యాత్మిక బోధకులు

సాక్షి సినిమా



● విజయ్

సంక్రాంతికి జన నాయకుడు

తమిళ హీరో విజయ్ నటిస్తున్న చిత్రం 'జన నాయగన్ ('జన నాయకుడు')'. ఈ చిత్రంలో పూజా హెగ్డే హీరోయిన్‌గా నటిస్తుండగా, మమితా బైజు, ప్రియమణి, బాబీ డియోల్, ప్రకాశ్‌రాజ్, గౌతమ్ మీనన్ కీలక పాత్రల్లో నటిస్తున్నారు. హెచ్. వినోద్ దర్శకత్వంలో వెంకట్ కె. నారాయణ నిర్మిస్తున్న ఈ సినిమా వచ్చే జనవరి 9న తమిళ, తెలుగు, కన్నడ, హిందీ భాషల్లో విడుదల కానుంది. ఆదివారం (జూన్ 22) విజయ్ బర్త్ డే సందర్భంగా 'జన నాయగన్... ది ఫస్ట్ రోర్' అంటూ గ్లింప్స్‌ను విడుదల చేశారు. ఈ వీడియోలో విజయ్ పోలీసాఫీసర్‌గా కనిపించారు. అలాగే మరో ఫస్ట్ లుక్‌లో కుర్చీలో కూర్చొని, కత్తి పట్టుకుని పవర్‌ఫుల్‌గా కనిపిస్తున్నారు. ఇక ఈ 'జన నాయకుడు' హీరో విజయ్‌కి చివరి చిత్రం అనే ప్రచారం జరుగుతున్న సంగతి తెలిసిందే.

రామ రామ అంటూ...

''కుటుంబసమేతంగా చూసేలా 'యుఫోరియా'ను తెరకెక్కించాం. ఈ సినిమాలో ప్రేక్షకులందరూ కనెక్ట్ అయ్యేలా చక్కని సందేశం కూడా ఉంది. చాలా రోజుల తర్వాత భూమిక మా 'యుఫోరియా' సినిమాలోని మంచి పాత్రతో రీ ఎంట్రీ ఇచ్చారు'' అని అన్నారు దర్శకుడు గుణశేఖర్. విఘ్నేష్ గవిరెడ్డి హీరోగా, భూమిక, రోహిత్ కీలక పాత్రల్లో నటించిన చిత్రం 'యుఫోరియా'. గుణశేఖర్ దర్శకత్వంలో రాగిణి గుణ సమర్పణలో నీలిమ గుణ ఈ సినిమాను నిర్మించారు. సమకాలీన అంశాలతో లేట్ నైట్ కల్చర్, డ్రగ్స్ వంటి అంశాల మేళవింపుతో రూపొందిన ఈ సినిమా త్వరలో రిలీజ్ కానుంది. ఈ సినిమాలోని 'రామ రామ' సాంగ్ లాంచ్ ఈవెంట్ జరిగింది. 'రామ రామ రామ అంటూ రాగమందుకో... రామగాథ సారం తెలిసేలా... కృష్ణ కృష్ణ కృష్ణ అంటూ కీర్తనందుకో... గీతలోని భావం తెలిసేలా..' అంటూ సాగే ఈ పాటకు చైతన్య ప్రసాద్ సాహిత్యం అందించగా, వాసా పావని, ఆదిత్య అయ్యంగార్, హర్ష బీవీ, రిషిల్ పాడారు. ఈ వేడుకలో భూమిక మాట్లాడుతూ– ''తల్లిదండ్రులు తప్పకుండా చూడాల్సిన సినిమా ఇది. ఈ సినిమా మనపై ఎంతో కొంత ఇంపాక్ట్ చూపిస్తుందని నమ్ముతున్నాను'' అన్నారు భూమిక. ''ఈ చిత్రంలో భూమికగారి కొడుకు పాత్రలో కనిపించబోతున్నాను'' అని చెప్పారు విఘ్నేష్.



● గుణశేఖర్, భూమిక

కామెడీ... థ్రిల్

ప్రిన్స్, సుహానా ముద్వాన్ హీరో, హీరోయిన్‌గా కొత్త చిత్రం ఆరంభమైంది. సునైనా, నెల్లూరు సుదర్శన్, ప్రధాన పాత్రల్లో కుమార్ రవికంటి దర్శకత్వంలో ఈ చిత్రం రూపొందుతోంది. కుమార్ రవికంటి నిర్మాత. ఈ చిత్రం ముహూర్తపు సన్నివేశానికి సుమ రవికంటి కెమెరా స్విచ్చాన్ చేయగా, బేబీ దియా రవికంటి క్లాప్ ఇచ్చారు. బేబీ మాయ రవికంటి గౌరవ దర్శకత్వం వహించిన అనంతరం కుమార్ రవికంటి మాట్లాడుతూ – ''ఇన్వెస్టిగేటివ్ థ్రిల్లర్‌గా రూపొందిస్తున్న ఈ చిత్రంలో చక్కని హాస్యం, హృదయాన్ని హత్తుకునే భావోద్వేగాలు ఉన్నాయి'' అని తెలిపారు.



● సుహాస్, ప్రిన్స్

నాగ్ నిర్ణయం నాకు స్ఫూర్తినిచ్చింది

– చిరంజీవి



● రష్మికా మందన్నా, శేఖర్ కమ్ముల, ధనుష్, చిరంజీవి, నాగార్జున

''కుబేర' సినిమా ఎలా ఉంటుంది? అని నాగ్‌ని అడిగాను. డిఫరెంట్ క్యారెక్టర్ ఎటెమ్ట్ చేశానన్నాడు. ధనుష్ లీడ్ క్యారెక్టర్ అని చెప్పాడు. ఎలా ఒప్పుకున్నావ్ నాగ్ అన్నాను. రెగ్యులర్ హీరో పాత్రలు కాకుండా కొత్తగా చేయాలనిపిస్తోందన్నాడు. నేను 'కుబేర' చూశాను. నాగ్ తీసుకున్న ఈ నిర్ణయం నాక్కూడా స్ఫూర్తినిచ్చింది. ఈ సినిమా తర్వాత మరో 40 ఏళ్లు ఇండస్ట్రీలో తాను ఉంటానన్న నాగ్ మాటలు వాస్తవం'' అని హీరో చిరంజీవి అన్నారు. ధనుష్, నాగార్జున హీరోలుగా, రష్మికా మందన్నా, జిమ్ సర్భ్ ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'కుబేర'. శేఖర్ కమ్ముల దర్శకత్వంలో సునీల్ నారంగ్, పుస్కూర్ రామ్మోహన్ రావు నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 20న విడుదలైంది.

ఆదివారం రాత్రి హైదరాబాద్‌లో జరిగిన 'కుబేర' సినిమా సక్సెస్ మీట్‌కు ముఖ్య అతిథిగా హాజరైన **చిరంజీవి మాట్లాడుతూ–** ''దేవా క్యారెక్టర్ చేయగల ఏకైక హీరో ధనుష్. బెస్ట్ యాక్టర్ అవార్డు ధనుష్‌కు మామూలైపోయింది. మాకు ఎప్పుడన్నా వస్తే వావ్... నాకొచ్చిందోచ్... నేషనల్ బెస్ట్ యాక్టర్ అవార్డు అని నేననుకోవాలి. ఇక హ్యూమన్ ఎమోషన్స్‌ను టచ్ చేయగలిగి, కంటెంట్ కొత్తగా ఉంటే ఆడియన్స్ థియేటర్‌కు వస్తారనే భరోసా ఇచ్చావ్ (శేఖర్ కమ్ములను ఉద్దేశించి). 'చూడాలని ఉంది' సినిమాలో అప్పారావు వస్తాడని సౌందర్య అంటుంది. రష్మిక చేసిన క్యారెక్టర్‌లో నాకు సౌందర్య గుర్తుకు వచ్చింది. సునీల్... నాగార్జున ఎవరి కాళ్లకీ దండం పెట్టడు... ఒక్క మీ నాన్న (నారాయణ్‌దాస్ నారంగ్)గారికి తప్ప. ఆయనంటే నాకూ అంతే ఇష్టం. 'మీతో సినిమా చేయాలని ఉంది' అని అడిగావు. 'సార్.. మా నాన్నగారు మీ సినిమాలు డిస్ట్రిబ్యూట్ చేయడంతో నైజాంలో బాగా డబ్బులు గడించాం. మీ సినిమాలంటే నైజాం కింగ్ అనుకునేవాళ్లం. ఆ తర్వాత మా నాన్నగారి బాటలో మేం కూడా మీ సినిమాలను డిస్ట్రిబ్యూట్ చేశాం. మాకు కొంత డబ్బులు వచ్చాయ్ అన్నావు. కానీ అల్లు అరవింద్‌గారు గీతా ఆర్ట్స్ పెట్టిన తర్వాత మీకు సినిమాలు రాకుండా పోయాయి (నవ్వుతూ). అయితే మీ మూడో తరం నిర్మాత జాన్వీకి ఆల్ ది బెస్ట్. మీతో సినిమా చేస్తే మూడు జనరేషన్స్‌తో సినిమా చేసినట్లవుతుందని మీ (జాన్వీని ఉద్దేశించి) నాన్న (సునీల్ నారంగ్) అన్నారు. మనం చేస్తున్నాం'' అన్నారు.

నాగార్జున మాట్లాడుతూ – ''కుబేర' ఎందుకు చేశారని ఓ జర్నలిస్ట్ అడిగితే, దీపక్ (నాగార్జున పాత్ర పేరు) క్యారెక్టర్ చుట్టూ అన్ని పాత్రలు తిరుగుతున్నాయి. ఈ సినిమా నా సినిమా కదా? అనుకుని చేశానని చెప్పాను. దాన్ని సోషల్ మీడియా వాళ్లు సినిమాకు ముందు శేఖర్ కమ్ముల సినిమా అంటున్నాడు... సినిమా తర్వాత నా సినిమా అంటున్నాడని మీమ్స్ చేశారు. మళ్లీ చెబుతున్నాను... ఇది దేవా సినిమా. దీపక్ సినిమా. ఖుష్బూ సినిమా. అందరి సినిమా. మోస్ట్‌లీ శేఖర్ సినిమా. 'కుబేర'తో నాకు తెలియని యాక్టింగ్ ఏదో నేర్పించారు శేఖర్. ఇక నాకు డిఫరెంట్ క్యారెక్టర్స్ వస్తాయనుకుంటున్నా. మరో నలభైసంవత్సరాలు ఉంటాను. ధనుష్ యాక్టింగ్ గురించి ఏం చెప్పినా తక్కువే. రష్మికని చూడగానే నాకు 'క్షణం క్షణం' సినిమాలో శ్రీదేవిగారు గుర్తొచ్చారు'' అని చెప్పారు.

ధనుష్ మాట్లాడుతూ– ''ఛాపర్స్, బాంబ్ బ్లాస్ట్స్, బ్లడ్... ఇలాంటి అంశాలున్న సినిమాలే ఆడియన్స్‌ను ఇప్పుడు థియేటర్స్‌కు తీసుకు వచ్చే పరిస్థితులు ఉన్నాయి. కానీ... 'కుబేర'లాంటి సినిమాతో చాలామంది ఫిల్మ్ మేకర్స్‌కు శేఖర్‌గారు ఓ హోప్ ఇచ్చారు. హ్యూమన్ ఎమోషన్‌ను మించిన గ్రాండియర్ లేదు'' అని అన్నారు.

శేఖర్ కమ్ముల మాట్లాడుతూ– ''ఆనంద్, హ్యాపీడేస్, ఫిదా..' వంటి సినిమాలపై జడ్జిమెంట్ ఉంటుంది. కానీ 'కుబేర'ని ప్రేక్షకులు ఎలా రిసీవ్ చేసుకుంటారోననే భయం ఉండేది. ఫస్ట్ డే ఫస్ట్ షోకి నా భయాలను చెల్లాచెదురు చేసిన ప్రేక్షకులకు థ్యాంక్స్'' అన్నారు.

పెద్ద సైతాన్!



● వెంకట రాజేంద్ర, విజయేంద్రప్రసాద్

కొండా వెంకట రాజేంద్ర హీరోగా నటించి, దర్శకత్వం వహించడంతో పాటు కథ–స్క్రీన్ ప్లే అందించిన చిత్రం 'లోపలికి రా చెప్తా'. మనీషా జష్నాని, సుస్మిత అనాలా, సాంచి రాయ్ హీరోయిన్లుగా నటించారు. లక్ష్మీ గణేశ్, వెంకట రాజేంద్ర నిర్మించిన ఈ చిత్రం జూలై 5న విడుదల కానుంది. ఈ సినిమా ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌కు ప్రముఖ రచయిత విజయేంద్రప్రసాద్, దర్శకుడు కొండా విజయ్‌కుమార్ అతిథులుగా హాజరయ్యారు. ఈ సినిమా ట్రైలర్‌ను లాంచ్ చేశారు విజయేంద్రప్రసాద్. 'ఎక్కడికీ.. విల్లా నెంబరు 19కి డెలివరీ, హా... విల్లా నెంబరు 19నా, కానీ దాంట్లో ఉన్నది భూతం, దెయ్యం కాదురా... పెద్ద సైతాన్!' అనే డైలాగ్స్ ట్రైలర్‌లో ఉన్నాయి. ట్రైలర్ లాంచ్ అనంతరం విజయేంద్ర ప్రసాద్ మాట్లాడుతూ– ''లోపలికి రా చెప్తా' ప్రేక్షకులను భయపెట్టడమే కాదు... వారి నుంచి మంచి కలెక్షన్స్ కూడా రాబట్టాలని నా బెస్ట్ విషెస్‌ను యూనిట్‌కు తెలియజేస్తున్నాను'' అన్నారు. ''కామెడీ, హారర్‌తో పాటు యూత్‌కు కావాల్సిన అంశాలు ఈ మూవీలో ఉన్నాయి'' అని చెప్పారు వెంకట రాజేంద్ర.

కత్తందుకో జానకి..

'అరె మామ ఖాళీ ఉరుకు డాయరా... అయ్యలెమో వెనకబడి తరముదా యరా... అరె రామ పుల్లు గడబిడాయరా' అంటూ సాగుతుంది 'మిత్రమండలి'లోని 'కత్తందుకో జానకి..' పాట. ప్రియదర్శి, రాగ్ మయూర్, విష్ణు ఓయ్, ప్రసాద్ బెహరా, నిహారిక ఎన్.ఎం ప్రధాన పాత్రధారులుగా, 'వెన్నెల' కిశోర్, వీటీవీ గణేశ్ కీలక పాత్రల్లో నటించిన చిత్రం 'మిత్రమండలి'. బన్నీ వాసు నిర్మాణ సంస్థ బీవీ వర్క్స్ సమర్పణలో కల్యాణ్ మంతిన, భాను ప్రతాప, డా. విజయేందర్ రెడ్డి తీగల నిర్మించిన ఈ చిత్రం త్వరలో రిలీజ్ కానుంది. కాగా ప్రముఖ నటుడు కృష్ణంరాజు ఫేమస్ డైలాగ్ 'నాయాల్టి కత్తందుకో జానకి'పై ఓ పాటను ఈ 'మిత్రమండలి'లో పెట్టారు. ఆర్ఆర్ ధ్రువన్ సంగీత సారథ్యంలో కాసర్ల శ్యామ్ సాహిత్యం అందించిన ఈ పాటను ఆర్ఆర్ ధ్రువన్, రాహుల్ సిప్లిగంజ్ పాడారు.




● 'మిత్రమండలి' పోస్టర్

ఓటీటీ

ఇది చూడొచ్చు

ఓ సూపర్ థాట్

ఓటీటీలో ఇది చూడొచ్చు అనే ప్రాజెక్ట్స్ చాలా ఉంటాయి. ప్రస్తుతం స్ట్రీమ్ అవుతున్న వాటిలో హాలీవుడ్ చిత్రం స్ట్రా ఒకటి. ఈ చిత్రం గురించి తెలుసుకుందాం.



ఓ ఊహకు మంచి ఆలోచన తోడై దానికి క్రియేటివిటీ అనే మసాలాను జోడిస్తే అప్పుడు అవుతుంది ఓ అద్భుతమైన సినిమా. ఓ విషయాన్ని ఊహకు అందనట్టుగా అదే సమయంలో మనసుకు హత్తుకునేట్టుగా తీసే దర్శకులు ప్రపంచ స్థాయిలో చాలా మందే ఉన్నారు. బోలెడంత ఖర్చుతో, పెద్ద స్టార్ కాస్టింగ్‌తో ఓ కథను తీయడం పెద్ద కష్టమేమీ కాదు, కానీ ఓ చిన్న ఆలోచనను చిన్న స్టార్ కాస్ట్‌తో ప్రేక్షకుడిని ఆకట్టుకోవడం కత్తి మీద సామే. అలా తన ఆలోచనకు తానే నిర్మాతగా మారి, దర్శకత్వం వహించి ప్రేక్షకుల ముందుకు తీసుకొచ్చిన హాలీవుడ్ దర్శకుడు టైలర్ పెర్రీ పెద్ద సాహసమే చేశారు. ఆ సాహసం పేరే తాను తీసిన సినిమా 'స్ట్రా'. ప్రేక్షకుడిని కదలనివ్వకుండా చేసిన సినిమా ఈ 'స్ట్రా'. ఇది ఓ సైకలాజికల్ క్రైమ్ థ్రిల్లర్. ఈ సినిమా గురించి ఎంత చెప్పినా తక్కువే. అంతలా ఏముందీ సినిమాలో ఓసారి చూద్దాం... జనయా ఓ సింగిల్ మదర్. తన కూతురితో చిన్న పాటి ఇరుకు గదిలో అతి కష్టం మీద సర్దుకుంటూ ఉంటుంది. ఓ షాపింగ్ మాల్‌లో పని చేసే జనయాకు ఆనందం అన్న విషయమే తెలియదు. అంతగా ఆమె జీవితం కష్టాలమయం. కనీసం స్కూల్‌లో కూతురికి ఓ రోజు బ్రెడ్ కూడా పెట్టలేని పరిస్థితి. ఓ రోజు కూతురి బ్రెడ్ కోసం డబ్బులు లేక బ్యాంకుకు వెళ్ళి విత్ డ్రా చేయడానికి వెళితే, బ్యాంకు సిబ్బంది ఏదో కారణాల వల్ల డబ్బు ఇవ్వలేమని చెబితే వాళ్ళని ఎదిరించడానికి గన్ చూపిస్తుంది. బ్యాంకులో గన్ చూపించడంతో అక్కడ ఉన్న సిబ్బంది అవాక్కయి పోలీసులకు ఫోన్ చేస్తారు. ఇక అక్కడ నుండి అసలు కథ మొదలవుతుంది. జనయాకి బ్యాంకు వాళ్ళు డబ్బులు ఇస్తారా లేదా గన్ చూపించినదానికి జనయాను పోలీసులు అరెస్ట్ చేస్తారా? అన్నది మాత్రం సినిమాలోనే చూడాలి. చూడడానికి ఇది చిన్న కథే అయినా ఆఖర్లో వచ్చే ట్విస్ట్‌తో చూసే ప్రేక్షకుల మతి పోవడం ఖాయం. ఈ సినిమాలో ప్రధాన పాత్రధారిగా తరాజి పి. హెన్సన్ జీవించారని చెప్పవచ్చు. నిజానికి ఈ సినిమా ఆలోచనకే దర్శకుడికి హాట్సాఫ్ చెప్పవచ్చు. నెట్ ఫ్లిక్స్‌లో స్ట్రీమ్ అవుతున్న ఈ సినిమా పెద్దవాళ్ళకు మాత్రమే. అలాగే ఇది తెలుగులోనూ లభ్యమవుతోంది. ఈ సినిమాని తప్పనిసరిగా చూడండి. ఎందుకంటే ఎన్నో సినిమాలు వస్తుంటాయి... పోతుంటాయి. కానీ ఇలాంటి సినిమా మాత్రం చాలా అరుదు. మస్ట్ వాచ్.

– హరికృష్ణ ఇంటూరు



విజయంతో ముగించిన భారత్

అంతర్జాతీయ హాకీ సమాఖ్య 2024–2025 ప్రొ లీగ్‌ను భారత పురుషుల జట్టు విజయంతో ముగించింది. యూరోపియన్ చివరి అంచె లీగ్‌లో భాగంగా ఆదివారం ఆంట్‌వర్ప్‌లో ఆతిథ్య బెల్జియం జట్టుతో జరిగిన మ్యాచ్‌లో టీమిండియా 4–3 గోల్స్ తేడాతో గెలుపొందింది. యూరోపియన్ అంచెలో భారత్‌కు దక్కిన ఏకైక విజయం ఇదే కావడం గమనార్హం. యూరోపియన్ అంచెలో భారత్ వరుసగా ఏడు మ్యాచ్‌ల్లో ఓడిపోయి, చివరి మ్యాచ్‌లో నెగ్గి ఊపిరి పీల్చుకుంది. ఈ మ్యాచ్‌లో భారత్ తరఫున సుఖ్‌జీత్ సింగ్ (21వ, 35వ నిమిషంలో) రెండు గోల్స్ చేయగా... అమిత్ రోహిదాస్ (36వ నిమిషంలో), కెప్టెన్ హర్మన్‌ప్రీత్ సింగ్ (59వ నిమిషంలో) ఒక్కో గోల్ సాధించారు. బెల్జియం జట్టు తరఫున స్లూవర్ (8వ నిమిషంలో), స్టాక్‌బ్రోయెక్స్ (34వ నిమిషంలో), హూగో (41వ నిమిషంలో) ఒక్కో గోల్ చేశారు. మొత్తం తొమ్మిది జట్ల మధ్య జరుగుతున్న ప్రొ లీగ్‌లో భారత జట్టు తమ 16 మ్యాచ్‌లను పూర్తి చేసుకుంది. 6 మ్యాచ్‌ల్లో గెలిచి, 10 మ్యాచ్‌ల్లో ఓడిపోయిన భారత్ 18 పాయింట్లతో ఎనిమిదో స్థానంతో సరిపెట్టుకుంది. మరోవైపు భారత మహిళల జట్టు వరుసగా ఆరో పరాజయాన్ని చవిచూసింది. బెల్జియంతో ఆదివారం జరిగిన మ్యాచ్‌లో భారత్ 0–2తో ఓడిపోయింది.

అటూ...ఇటూ!

రసకందాయంలో భారత్, ఇంగ్లండ్ తొలి టెస్టు

96 పరుగుల ఆధిక్యంలో భారత్ | రెండో ఇన్నింగ్స్‌లో 90/2 | ఇంగ్లండ్ తొలి ఇన్నింగ్స్‌లో 465 ఆలౌట్ | బ్రూక్ 99 అవుట్ | బుమ్రాకు 5 వికెట్లు

ప్రధాన పేసర్ జస్‌ప్రీత్ బుమ్రా 5 వికెట్లతో అదరగొట్టినా... మిగిలిన వాళ్లు పెద్దగా ప్రభావం చూపకపోవడంతో... ఇంగ్లండ్ తొలి ఇన్నింగ్స్‌లో భారత జట్టు భారీ స్కోరుకు అతి చేరువగా వచ్చింది. బ్రూక్ బాదుడుకు లోయర్ ఆర్డర్ సహకారం తోడవడంతో కేవలం 6 పరుగుల వెనుకబడిన ఇంగ్లండ్ పోటీలోకి రాగా... రెండో ఇన్నింగ్స్‌లో కేఎల్ రాహుల్ రాణించడంతో టీమిండియా మెరుగైన స్థితిలో నిలిచింది. ప్రస్తుతానికి ఇరు జట్లు సమంగానే ఉన్నా... నాలుగో రోజు భారత బ్యాటర్లు ఎలాంటి ప్రదర్శన కనబరుస్తారన్నది కీలకంగా మారింది. సొంతగడ్డపై దంచికొట్టే అలవాటు ఉన్న ఇంగ్లండ్ ముందు ఎంత లక్ష్యం నిర్దేశించినా సురక్షితం కాదనే విశ్లేషణల మధ్య... టీమిండియా సోమవారం పూర్తిగా బ్యాటింగ్ చేయాల్సిన పరిస్థితి నెలకొంది!

లీడ్స్: భారత్, ఇంగ్లండ్ తొలి టెస్టు రసవత్తరంగా సాగుతోంది. ఆధిక్యం చేతులు మారుతూ సాగుతున్న పోరులో మూడో రోజు ఆట ముగిసే సమయానికి భారత్ రెండో ఇన్నింగ్స్‌లో 23.5 ఓవర్లలో 2 వికెట్ల నష్టానికి 90 పరుగులు చేసింది. తొలి ఇన్నింగ్స్ సెంచరీ హీరో యశస్వి జైస్వాల్ (4) త్వరగానే అవుటైనా... కేఎల్ రాహుల్ (75 బంతుల్లో 47 బ్యాటింగ్; 7 ఫోర్లు), సాయి సుదర్శన్ (48 బంతుల్లో 30; 4 ఫోర్లు) ఆకట్టుకున్నారు. చేతిలో 8 వికెట్లు ఉన్న టీమిండియా... ప్రస్తుతం తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం 6 పరుగులు కలుపుకొని ఓవరాల్‌గా 96 పరుగుల ముందంజలో ఉంది. రాహుల్‌తో పాటు కెప్టెన్ శుబ్‌మన్ గిల్ (6 బ్యాటింగ్) క్రీజులో ఉన్నాడు. అంతకుముందు ఓవర్‌నైట్ స్కోరు 209/3తో ఆదివారం తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన ఇంగ్లండ్... చివరకు 100.4 ఓవర్లలో 465 పరుగులకు ఆలౌటైంది. ఒలీ పోప్ (137 బంతుల్లో 106; 14 ఫోర్లు) ఎక్కువసేపు నిలవలేకపోగా... హ్యారీ బ్రూక్ (112 బంతుల్లో 99; 11 ఫోర్లు, 2 సిక్స్‌లు) ఒక్క పరుగు తేడాతో సెంచరీని చేజార్చుకున్నాడు. మిగతా బ్యాటర్లు తలా కొన్ని పరుగులు చేయడంతో ఇంగ్లండ్ జట్టు... టీమిండియా తొలి ఇన్నింగ్స్ స్కోరుకు 6 పరుగుల దూరంలో నిలిచింది. భారత బౌలర్లలో బుమ్రా 5 వికెట్లతో అదరగొట్టగా... ప్రసిధ్ కృష్ణ 3, మొహమ్మద్ సిరాజ్ 2 వికెట్లు తీశారు.

జైస్వాల్ 4 పరుగులకే...

తొలి ఇన్నింగ్స్‌లో చక్కటి సెంచరీ చేసిన జైస్వాల్... రెండో ఇన్నింగ్స్‌లో ఆకట్టుకోలేకపోయాడు. ఫీల్డింగ్‌లో మూడు క్యాచ్‌లు వదిలేయడంతో నెలకొన్న ఒత్తిడి అతడి ఆటతీరులో కనిపించింది. కార్స్ వేసిన నాలుగో ఓవర్‌లో కీపర్‌కు క్యాచ్ ఇచ్చి భారంగా పెవిలియన్‌కు వెనుదిరిగాడు. ఈ దశలో అరంగేట్ర ఆటగాడు సాయి సుదర్శన్‌తో కలిసి రాహుల్ క్లాస్ ఇన్నింగ్స్‌తో ఆకట్టుకున్నాడు. ఇంగ్లండ్ బ్యాటర్లు భారీ షాట్లతో రెచ్చిపోయిన పిచ్‌పై రాహుల్ సంయమనం పాటించాడు. రాహుల్‌తో కలిసి రెండో వికెట్‌కు 66 పరుగులు జోడించిన అనంతరం సుదర్శన్ వెనుదిరగగా... కెప్టెన్ గిల్‌తో కలిసి రాహుల్ మరో వికెట్ పడకుండా రోజును ముగించాడు. వర్షం కారణంగా ఆట నిర్ణీత సమయం కంటే ముందే ముగిసింది. ఇంగ్లండ్ బౌలర్లలో కార్స్, స్టోక్స్ చెరో వికెట్ పడగొట్టారు.



బుమ్రాకు సహచరుల అభినందన

బ్రూక్... పరుగు తేడాతో

బ్యాటింగ్‌కు అనుకూలిస్తున్న పిచ్‌పై మూడో రోజు ఇంగ్లండ్ సమష్టి ప్రదర్శనతో సత్తా చాటింది. 'సెంచరీ హీరో' ఓలీ పోప్ క్రితం రోజు స్కోరుకు మరో 6 పరుగులు మాత్రమే జత చేసి వెనుదిరగగా... కెప్టెన్ బెన్ స్టోక్స్ (52 బంతుల్లో 20; 3 ఫోర్లు)ను సిరాజ్ అవుట్ చేశాడు. ఇక ఇంగ్లండ్ ఇన్నింగ్స్ ముగిసేందుకు ఎక్కువ సమయం పట్టదు అనుకుంటే... లోయర్ ఆర్డర్‌తో కలిసి హ్యారీ బ్రూక్ చెలరేగిపోయాడు. ధనాధన్ షాట్లతో చకచకా పరుగులు రాబట్టాడు. వికెట్ కీపర్ జేమీ స్మిత్ (52 బంతుల్లో 40; 5 ఫోర్లు, 1 సిక్స్), క్రిస్ వోక్స్ (55 బంతుల్లో 38; 3 ఫోర్లు, 2 సిక్స్‌లు) ధాటిగా ఆడారు. తొలి సెషన్‌లో 28 ఓవర్లు ఆడిన ఇంగ్లండ్ 2 వికెట్లు కోల్పోయి 118 పరుగులు చేయగా... రెండో సెషన్‌లో 23.4 ఓవర్లలోనే 138 పరుగులు చేసి మిగిలిన ఐదు వికెట్లు కోల్పోయింది. రెండో రోజు ఆటలో బుమ్రా బౌలింగ్‌లో క్లీన్ బౌల్డ్ అయినా... ఆ బంతి నోబాల్ కావడంతో బతికిపోయిన బ్రూక్‌కు... మూడో రోజు మరో రెండు అవకాశాలు లభించాయి. వాటిని వినియోగించుకున్న అతడు భారత్ ఆధిక్యాన్ని తగ్గించగలిగాడు. శతకానికి ఒక పరుగు దూరంలో ప్రసిధ్ కృష్ణ వేసిన షార్ట్ పిచ్ బంతికి బ్రూక్ పెవిలియన్ చేరాడు. ఆ తర్వాత కార్స్ (23 బంతుల్లో 22; 4 ఫోర్లు), వోక్స్, టంగ్ (18 బంతుల్లో 11; 2 ఫోర్లు) విలువైన పరుగులు చేసి టీమిండియా ఆధిక్యాన్ని 6 పరుగులకు పరిమితం చేశారు.

మరిన్ని క్రీడా వార్తలు సాక్షి ప్లస్ స్పోర్ట్స్ ఈ-పేపర్‌లో

అదే తంతు..

ఈ మ్యాచ్‌లో భారత ఫీల్డింగ్ మరీ పేలవంగా సాగింది. రెండో రోజు బుమ్రా బౌలింగ్‌లోనే మన ఫీల్డర్లు మూడు క్యాచ్‌లు జారవిడవగా... మూడో రోజు మరో రెండు క్యాచ్‌లు నేల పాలయ్యాయి. 46 పరుగుల వ్యక్తిగత స్కోరు వద్ద జడేజా బౌలింగ్‌లో బ్రూక్ ఇచ్చిన క్యాచ్‌ను పంత్ అందుకోలేకపోగా... 82 పరుగుల వద్ద బుమ్రా బౌలింగ్‌లో బ్రూక్ ఇచ్చిన సులువైన క్యాచ్‌ను జైస్వాల్ జారవిడిచాడు. ఒక ఎండ్‌లో బుమ్రా ఒత్తిడి పెంచుతున్నా... మరో ఎండ్ నుంచి అతడికి సరైన సహకారం దక్కలేదు. దీనిపై మాజీ ఆటగాళ్లు కూడా మండిపడగా... షార్ట్ బాల్స్‌తో వికెట్లు తీసిన ప్రసిధ్ కృష్ణ పరుగుల నియంత్రణలో పూర్తిగా విఫలమయ్యాడు. 20 ఓవర్లు వేసిన అతడు 128 పరుగులు సమర్పించుకున్నాడు. దీంతో ఇంగ్లండ్ బ్యాటర్ల మీద ఒత్తిడి కొనసాగలేకపోయింది. దీనికి తోడు తొలి టెస్టులో కెప్టెన్సీ చేస్తున్న గిల్ కూడా కొన్ని తప్పుడు నిర్ణయాలతో ఇంగ్లండ్‌కు సాయపడ్డాడు. టెయిలెండర్లు బ్యాటింగ్ చేస్తున్న సమయంలో బుమ్రాను రంగంలోకి దింపి ఆధిక్యం పెంచుకోవాల్సింది పోయి... జడేజాకు బంతి అప్పగించి ఇంగ్లండ్ మరికొన్ని పరుగులు చేసే అవకాశం ఇచ్చాడు. ఎట్టకేలకు రెండో సెషన్ చివర్లో బంతి అందుకున్న బుమ్రా వరుస ఓవర్లలో వోక్స్, టంగ్‌ను క్లీన్ బౌల్డ్ చేసి ఆతిథ్య జట్టు ఇన్నింగ్స్‌కు తెరదింపాడు. ఈ క్రమంలో అతడు టెస్టుల్లో 14వసారి 5 వికెట్ల ప్రదర్శన నమోదు చేసుకున్నాడు.

స్కోరు వివరాలు

భారత్ తొలి ఇన్నింగ్స్: 471; **ఇంగ్లండ్ తొలి ఇన్నింగ్స్:** క్రాలీ (సి) నాయర్ (బి) బుమ్రా 4; డకెట్ (బి) బుమ్రా 62; పోప్ (సి) పంత్ (బి) ప్రసిధ్ 106; రూట్ (సి) నాయర్ (బి) బుమ్రా 28; బ్రూక్ (సి) శార్దుల్ (బి) ప్రసిధ్ 99; స్టోక్స్ (సి) పంత్ (బి) సిరాజ్ 20; జేమీ స్మిత్ (సి) సుదర్శన్ (బి) ప్రసిధ్ 40; వోక్స్ (బి) బుమ్రా 38; కార్స్ (బి) సిరాజ్ 22; టంగ్ (బి) బుమ్రా 11; బషీర్ (నాటౌట్) 1; ఎక్స్‌ట్రాలు 34; **మొత్తం (100.4 ఓవర్లలో ఆలౌట్) 465. వికెట్ల పతనం:** 1–4, 2–126, 3–206, 4–225, 5–276, 6–349, 7–398, 8–453, 9–460, 10–465. **బౌలింగ్:** బుమ్రా 24.4–5–83–5; సిరాజ్ 27–0–122–2; ప్రసిధ్ 20–0–128–3; జడేజా 23–4–68–0; శార్దుల్ 6–0–38–0. **భారత్ రెండో ఇన్నింగ్స్:** జైస్వాల్ (సి) స్మిత్ (బి) కార్స్ 4; రాహుల్ (బ్యాటింగ్) 47; సుదర్శన్ (సి) క్రాలీ (బి) స్టోక్స్ 30; గిల్ (బ్యాటింగ్) 6; ఎక్స్‌ట్రాలు 3; **మొత్తం (23.5 ఓవర్లలో 2 వికెట్లకు) 90. వికెట్ల పతనం:** 1–16, 2–82. **బౌలింగ్:** వోక్స్ 6–2–18–0; కార్స్ 5–0–27–1; టంగ్ 5–0–15–0; బషీర్ 2.5–1–11–0; స్టోక్స్ 5–1–18–1.



నిరాశలో బ్రూక్

భవిత
స్పర్ధయా వర్ధతే విద్య

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన
ఈ- మెయిల్ sakshieducation@gmail.com

నేటి భవిత ఈ పేపర్‌లో..
» సివిల్స్, గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం–ఇండియన్ పాలిటీ » టెట్/డీఎస్సీ ప్రత్యేకం–సోషల్ స్టడీస్
» గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం–జనరల్ స్టడీస్–జాగ్రఫీ » బ్యాంక్ ఎగ్జామ్స్ ప్రత్యేకం–ఇంగ్లిష్

విద్య, ఉద్యోగ సమాచారం

టీఎంసీ-హోమి బాబా క్యాన్సర్ హాస్పిటల్‌లో 22 పోస్టులు

టాటా మెమోరియల్ సెంటర్(టీఎంసీ) ఆధ్వర్యంలో వారణాసిలోని హోమి బాబా క్యాన్సర్ హాస్పిటల్‌లో ఒప్పంద ప్రాతిపదికన వివిధ విభాగాల్లో ఉద్యోగాల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 22.
» **పోస్టుల వివరాలు:** ఫెలో–10, సీనియర్ రెసిడెంట్–11, మెడికల్ ఆఫీసర్–01.
» **విభాగాలు:** డెంటల్ అండ్ ప్రోస్థెటిక్ సర్జరీ, ఆంకో పాథాలజీ, ప్రివెంటివ్ ఆంకాలజీ, సర్జికల్ ఆంకాలజీ, ఇమ్యునో హెమటాలజీ అండ్ బ్లడ్ ట్రాన్స్‌ఫ్యూజన్, హెడ్ అండ్ నెక్ సర్జరీ, న్యూక్లియర్ మెడిసిన్, రేడియేషన్ ఆంకాలజీ.
» **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో ఎంబీబీఎస్, ఎంఎస్/డీఎన్‌బీ, ఎండీఎస్, డిప్లొమాలో ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి. **వయసు:**45ఏళ్లలోపు ఉండాలి.
» **వేతనం:** నెలకు సీనియర్ రెసిడెంట్‌కు రూ.1,38,600 నుంచి రూ.1,27,260, మెడికల్ ఆఫీసర్‌కు రూ.1,05,840.
» ఎంపిక విధానం: రాతపరీక్ష,ఇంటర్వ్యూ ద్వారా.
» దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా.
» దరఖాస్తులకు చివరితేది: 30.06.2025.
» వెబ్‌సైట్: **https://tmc.gov.in**

ఈసీఐఎల్ హైదరాబాద్‌లో ట్రైనీ ఆఫీసర్ పోస్టులు

హైదరాబాద్‌లోని ఎలక్ట్రానిక్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్(ఈసీఐఎల్).. ట్రైనీ ఆఫీసర్(రేడియోలాజికల్ సేఫ్టీ) పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 01.
» **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో 60 శాతం మార్కులతో పీజీ(ఎంఎస్సీ) డిప్లొమా(రేడియోలాజికల్ ఫిజిక్స్)లో ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
» **వయసు:** గరిష్ఠ వయో పరిమితి 27 ఏళ్లు.
» **వేతనం:** నెలకు రూ.40,000 నుంచి 140,000.
» **ఎంపిక విధానం:** సీబీటీ, ఇంటర్వ్యూ ద్వారా.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 08.07.2025
» **వెబ్‌సైట్: https://www.ecil.co.in**

పీజీ కోర్సుల్లో ప్రవేశాలకు సీపీగెట్

తెలంగాణ రాష్ట్రంలోని పీజీ కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించే.. తెలంగాణ కామన్ పోస్ట్‌గ్రాడ్యుయేట్ ఎంట్రెన్స్ టెస్ట్(సీపీగెట్) 2025కు నోటిఫికేషన్ విడుదలైంది. దీనిద్వారా పీజీ, పీజీ డిప్లొమా, ఐదేళ్ల ఇంటిగ్రేటెడ్ కోర్సుల్లో ప్రవేశాలు కల్పిస్తారు. కంప్యూటర్ బేస్డ్ టెస్ట్ (సీబీటీ) విధానంలో ఎంట్రెన్స్ టెస్ట్ నిర్వహిస్తారు. ప్రస్తుతం సీపీగెట్- 2025 దరఖాస్తు ప్రక్రియ కొనసాగుతోంది. ఈ నేపథ్యంలో.. సీపీగెట్‌తో ప్రవేశం కల్పించే యూనివర్సిటీలు, కోర్సులు, అడ్మిషన్ విధానం తదితర వివరాలు..



» టీజీ సీపీగెట్ 2025 నోటిఫికేషన్ విడుదల
» పీజీ, పీజీ డిప్లొమా, ఇంటిగ్రేటెడ్ కోర్సులు
» ఆగస్టు మొదటి వారంలో ఎంట్రెన్స్ టెస్ట్

- **ప్రవేశ పరీక్ష:** తెలంగాణ కామన్ పోస్ట్‌గ్రాడ్యుయేట్ ఎంట్రెన్స్ టెస్ట్(సీపీగెట్) 2025

కోర్సులు అందించే యూనివర్సిటీలు

ఉస్మానియా యూనివర్సిటీ, కాకతీయ యూనివర్సిటీ,తెలంగాణ యూనివర్సిటీ,శాతవాహన యూనివర్సిటీ, మహాత్మాగాంధీ యూనివర్సిటీ, పాలమూరు యూనివర్సిటీ, వీరనారి చాకలి ఐలమ్మ మహిళా యూనివర్సిటీ, జేఎన్‌టీయూ హైదరాబాద్.

సీపీగెట్‌తో ప్రవేశం కల్పించే కోర్సులు

- **పీజీ కోర్సులు:** (ఫ్యాకల్టీ ఆఫ్ ఆర్ట్స్, ఫ్యాకల్టీ ఆఫ్ సోషల్ సైన్సెస్, ఫ్యాకల్టీ ఆఫ్ కామర్స్, ఫ్యాకల్టీ ఆఫ్ ఎడ్యుకేషన్, ఫ్యాకల్టీ ఆఫ్ సైన్స్) ఎంఏ, ఎంకామ్, ఎమ్మెస్సీ, ఎంఈడీ, ఎంపీఈడీ, ఎంబీఏ, మాస్టర్ ఆఫ్ లైబ్రరీ అండ్ ఇన్ఫర్మేషన్ సర్వీసెస్, మాస్టర్ ఆఫ్ సోషల్ వర్క్, మాస్టర్ ఆఫ్ హుమాన్ రిసోర్సెస్ మేనేజ్‌మెంట్, మాస్టర్ ఆఫ్ టూరిజం మేనేజ్‌మెంట్.
- **ఐదేళ్ల ఇంటిగ్రేటెడ్ కోర్సులు:** ఎమ్మెస్సీ బయోటెక్నాలజీ, ఎమ్మెస్సీ కెమిస్ట్రీ/ఫార్మాస్యూటికల్ కెమిస్ట్రీ, ఎంఏ అప్లయిడ్ ఎకనామిక్స్, ఎంబీఏ.
- **పీజీ డిప్లొమా కోర్సులు:** పీజీడీ ఇన్ చైల్డ్ సైకాలజీ, పీజీడీ ఇన్ ఫ్యామిలీ మ్యారేజ్ కౌన్సెలింగ్.

అర్హతలు

పీజీ కోర్సులకు కనీసం 40 శాతం మార్కులతో డిగ్రీ ఉత్తీర్ణత ఉండాలి. బీఈడీ, బీపీఈడీ కోర్సులకు డిగ్రీలో కనీసం 55 శాతం మార్కులు సాధించాలి. ఇంటిగ్రేటెడ్ కోర్సులకు 10+2/ఇంటర్మీడియెట్‌లో కనీసం 50 శాతం మార్కులు ఉండాలి.

ఎంపిక ప్రక్రియ

ప్రవేశ పరీక్ష సీపీగెట్ 2025, రూల్ ఆఫ్ రిజర్వేషన్ ఆధారంగా కౌన్సెలింగ్ నిర్వహించి ప్రవేశాలు కల్పిస్తారు. సంబంధిత సబ్జెక్టుపై నిర్వహించిన ప్రవేశ పరీక్షలో తప్పనిసరిగా అర్హత సాధించాలి.

పరీక్ష విధానం

- సీపీగెట్ పరీక్ష కంప్యూటర్ బేస్డ్ టెస్ట్ విధానంలో వంద ప్రశ్నలు–వంద మార్కులకు నిర్వహిస్తారు. ప్రశ్నలు ఆబ్జెక్టివ్ తరహాలో మల్టిపుల్ చాయిస్ విధానంలో ఉంటాయి. పరీక్ష వ్యవధి 90నిమిషాలు. నెగిటివ్ మార్కుల నిబంధన లేదు. ఈ పరీక్షలో ఓసీ/ఈడబ్ల్యూఎస్/ఓబీసీ అభ్యర్థులు కనీసం 25 శాతం మార్కులు పొందితేనే అర్హత సాధించినట్లు ప్రకటిస్తారు. ఎస్సీ/ఎస్టీలకు ఎలాంటి కనీస అర్హత మార్కుల నిబంధన లేదు.
- ఎమ్మెస్సీ బయో కెమిస్ట్రీ, ఎన్విరాన్‌మెంటల్ సైన్స్, ఫొరెన్సిక్‌సైన్స్, ఫెర్మెంటేషన్ టెక్నాలజీ, జెనెటిక్స్ అండ్ మైక్రోబయాలజీ కోర్సుల అభ్యర్థులు బీసీఈఎస్ఎఫ్ఎస్ టీజీ అండ్ ఎం టెస్టుకు హాజరవ్వాల్సి ఉంటుంది. ఈ పరీక్ష ప్రశ్న పత్రంలో పార్ట్ ఏలో కెమిస్ట్రీ నుంచి 40 ప్రశ్నలు, పార్ట్ బీలో బీఎస్సీ స్థాయిలో చదివిన ఫిజిక్స్, బాటనీ, జువాలజీ, బయోకెమిస్ట్రీ, జెనెటిక్స్ అండ్ బయోకెమిస్ట్రీల్లో అభ్యర్థి ఎంచుకున్న ఏదో ఒక సబ్జెక్ట్‌పై 60 ప్రశ్నలు అడుగుతారు.
- ఎమ్మెస్సీ బయో టెక్నాలజీకి సంబంధించిన ప్రశ్న పత్రంలో పార్ట్ ఏలో కెమిస్ట్రీ నుంచి 40 ప్రశ్నలు, పార్ట్ బీలో బయో టెక్నాలజీపై 60 ప్రశ్నలు అడుగుతారు.

ఆగస్టు మొదటి వారంలో పరీక్ష

ఆసక్తి, అర్హతలు ఉన్న అభ్యర్థులు జూలై 17వ తేదీ వరకూ ఎలాంటి ఆలస్య రుసుము లేకుండా టీజీ సీపీగెట్ 2025కు దరఖాస్తు చేసుకోవచ్చు. ఈ ప్రవేశ పరీక్షను ఆగస్టు మొదటి వారంలో నిర్వహించనున్నారు. ఈ సారి 15 శాతం స్థానికేతర కోటా కింద ఏపీ విద్యార్థులకు అవకాశం ఉండదు. అయితే నేషనల్ ఇంటిగ్రేషన్ కోటా(ఎన్ఐక్యూ) కింద 20 శాతం పీజీ కోర్సుల సీట్లలో ఇతర రాష్ట్రాల అభ్యర్థులు ప్రవేశం పొందొచ్చు.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
- **ఆలస్య రుసుము లేకుండా ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరి తేది:** 17.07.2025
- **రూ.500 ఆలస్య రుసుముతో చివరి తేది:** 24.07.2025
- **రూ.2000 ఆలస్య రుసుముతో చివరి తేది :** 28.07.2025
- **ఆన్‌లైన్ ప్రవేశ పరీక్ష తేది:** ఆగస్టు మొదటి వారంలో
- **వెబ్‌సైట్: https://cpget.tgche.ac.in**

స్కాలర్‌షిప్‌లకు ఆహ్వానం

నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్(ఎన్ఎంఎంఎస్) స్కీమ్ 2025-26కు దరఖాస్తు ప్రక్రియ ప్రారంభమైంది. ఇది కేంద్ర ప్రభుత్వం అందించే స్కాలర్‌షిప్ పథకం. ఆర్థికంగా బలహీనమైన వర్గాలకు చెందిన విద్యార్థులకు చేయూత ఇచ్చేందుకు ప్రభుత్వం ఈ స్కీమ్‌ను ప్రవేశపెట్టింది. ఈ ఉపకార వేతన పథకం ద్వారా పేద విద్యార్థులు పాఠశాల విద్యను కొనసాగించేలా చూడాలన్నది ప్రధాన లక్ష్యం. ఈ నేపథ్యంలో.. ఎన్ఎంఎంఎస్ స్కాలర్‌షిప్స్‌పై ప్రత్యేక కథనం..

» 2025-26కు ప్రారంభమైన దరఖాస్తు ప్రక్రియ
» 9వ తరగతి నుంచి ఇంటర్ వరకూ ఉపకార వేతనం
» ఎంపికైతే నెలకు రూ.1000 చొప్పున స్కాలర్‌షిప్
» దరఖాస్తులకు చివరి తేది: 31.08.2025

- **స్కాలర్‌షిప్ స్కీమ్:** నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్ 2025–26

ఏడాదికి రూ.12వేలు

దేశవ్యాప్తంగా ఈ పథకానికి ఎంపికైన లక్ష మంది విద్యార్థులకు నెలకు రూ.వెయ్యి చొప్పున సంవత్సరానికి రూ.12వేలు ఉపకార వేతనం అందిస్తారు. తొమ్మిదవ తరగతి నుంచి ఇంటర్మీడియెట్ పూర్తి చేసే వరకూ ఈ స్కాలర్‌షిప్ అందుతుంది.

అర్హతలు

- ప్రభుత్వ పాఠశాలలు/ప్రభుత్వ అనుబంధ స్కూల్స్ లేదా స్థానిక సంస్థల పాఠశాలల్లో 8వ తరగతి చదువుతూ ఉండాలి. వారి తల్లిదండ్రుల వార్షిక ఆదాయం రూ.3.5 లక్షలకు మించరాదు. దీంతోపాటు సదరు విద్యార్థి 7వ తరగతిలో కనీసం 55 శాతం మార్కులతో ఉత్తీర్ణత సాధించి ఉండాలి. ఎస్సీ/ఎస్టీ వర్గాలకు చెందిన విద్యార్థులకు 5 శాతం సడలింపు లభిస్తుంది.
- కేంద్రీయ విద్యాలయాలు, నవోదయ స్కూల్స్, రెసిడెన్షియల్ స్కూల్స్‌లో చదువుతున్న విద్యార్థులకు ఈ స్కాలర్‌షిప్ స్కీమ్ వర్తించదు.
- వయసు: 13–15 ఏళ్ల మధ్యలో ఉండాలి.

ఎంపిక ప్రక్రియ

- ఈ స్కాలర్‌షిప్‌కు విద్యార్థులను ఎంపిక చేసేందుకు రాష్ట్ర స్థాయిల్లో పరీక్ష నిర్వహిస్తారు. ఇందులో రెండు పేపర్లు ఉంటాయి. అవి.. మెంటల్ ఎబిలిటీ టెస్ట్(మ్యాట్), స్కాలాస్టిక్ అప్టిట్యూడ్ టెస్ట్(శ్యాట్).
- **మెంటల్ ఎబిలిటీ టెస్ట్(మ్యాట్):** ఇందులో 90 మల్టిపుల్ ఛాయిస్ ప్రశ్నలు ఉంటాయి. ప్రతి ప్రశ్నకు ఒక మార్కు చొప్పున 90 మార్కులు కేటాయించారు. పరీక్ష సమయం 90 నిమిషాలు. నెగిటివ్ మార్కుల నిబంధనలేదు. విద్యార్థి వెర్బల్, నాన్ వెర్బల్ సామర్థ్యాలు పరిశీలించేలా ప్రశ్నలు ఉంటాయి. రీజనింగ్, క్రిటికల్ థింకింగ్‌పై ప్రశ్నలు అడుగుతారు. ముఖ్యంగా అనాలజీ, క్లాసిఫికేషన్, న్యూమరికల్ సిరీస్, ప్యాట్రన్ పర్సెప్షన్, హిడెన్ ఫిగర్ తదితర అంశాల నుంచి ప్రశ్నలు ఉంటాయి.
- **స్కాలాస్టిక్ అప్టిట్యూడ్ టెస్ట్(శ్యాట్):** ఇందులో కూడా 90 మల్టిపుల్ ఛాయిస్ ప్రశ్నలు అడుగుతారు. ప్రతి ప్రశ్నకు ఒక మార్కు చొప్పున 90 మార్కులు కేటాయించారు. పరీక్ష సమయం 90 నిమిషాలు. నెగిటివ్ మార్కుల నిబంధన లేదు. ఇందులో ఏడు,ఎనిమిది తరగతుల మ్యాథ్స్, సైన్స్, సోషల్ స్టడీస్ నుంచి ప్రశ్నలు అడుగుతారు.
- మ్యాట్, శ్యాట్ రెండింటిలో సగటున కనీసం 40 శాతం మార్కులతో ఉత్తీర్ణత సాధించాల్సి ఉంటుంది. ఎంపిక సమయం నాటికి కనీసం 55 శాతం మార్కులతో 8వ తరగతి ఉత్తీర్ణులై ఉండాలి. ఎస్సీ/ఎస్టీ విద్యార్థులకు 5 శాతం మార్కుల సడలింపు లభిస్తుంది.

ముఖ్య నిబంధనలు

- కేంద్ర ప్రభుత్వ స్కాలర్‌షిప్ పథకాలకు సంబంధించి ఒక విద్యార్థికి ఒక ఉపకారవేతనం మాత్రమే లభిస్తుంది.
- ఈ స్కాలర్‌షిప్.. నాలుగేళ్లపాటు అంటే తొమ్మిదో తరగతి నుంచి పన్నెండో తరగతి వరకు అందుతుంది.
- ఉపకార వేతనం కొనసాగాలంటే విద్యార్థి పదో తరగతి బోర్డు పరీక్షల్లో కనీసం 60 శాతం మార్కులు(ఎస్సీ/ఎస్టీలు 55 శాతం) సాధించాలి.
- ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు మాత్రమే ఈ స్కాలర్‌షిప్ అందుతుంది.



- పూర్తిస్థాయి కోర్సుల్లో, ప్రభుత్వ గుర్తింపు ఉన్న కోర్సుల్లో చేరిన వారికే ఈ ఉపకార వేతనం లభిస్తుంది.

దరఖాస్తు విధానం

- నేషనల్ స్కాలర్‌షిప్ పోర్టల్ (**https://-scholarships.gov.in/AllScholarships**) ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తును స్కూల్, జిల్లా, రాష్ట్ర స్థాయిలో ధ్రువీకరిస్తారు. ఈ ధ్రువీకరణ అనంతరం విద్యార్థి బ్యాంక్ ఖాతాలో నేరుగా స్కాలర్‌షిప్ జమ చేస్తారు.
- దరఖాస్తులకు చివరి తేది: 31.08.2025

సాక్షి ప్రాఫిట్ ప్లస్
సోమవారం
23-6-2025

స్టాక్ మార్కెట్లు (శుక్రవారం ముగింపు)

దేశీ సూచీలు		
సెన్సెక్స్ ▲	1,046	82,408
నిఫ్టీ ▲	319	25,112

విదేశీ సూచీలు			
నాస్‌డాక్	19,447	▽	99
డోజోన్స్	42,207	△	35
ఎఫ్‌టీఎస్‌ఈ 100	8,775	▽	17
డాక్స్	23,351	△	293
షాంఘై	3,360	▽	2
నికాయ్	38,403	▽	85

అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్

ఫారెక్స్ రేట్లు (రూ. లలో)

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	86.20	87.22
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	115.60	118.50
€	యూరో	ఎస్‌బీఐ	98.55	101.30
¥	జపాన్ యెన్ (100)	ఎస్‌బీఐ	58.93	60.45
AU$	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	53.55	58.38
S$	సింగపూర్ డాలర్	థామస్‌కుక్	65.01	69.70
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	22.19	12.70
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	22.68	24.47
¥	చైనా యువాన్	థామస్‌కుక్	11.18	13.01

స్థిరమైన ఆదాయానికి.. ఎస్‌డబ్ల్యూపీ మంత్ర!



సంపాదనకు గుడ్‌బై చెప్పిన తర్వాత విశ్రాంత జీవనం సాఫీగా సాగిపోవాలంటే స్థిరమైన ఆదాయ వనరు తప్పనిసరి. అప్పటి వరకు చేసిన పెట్టుబడులు, రిటైరయ్యాక స్థిరమైన ఆదాయానికి దారి చూపాలి. ఎక్కువ మంది రిటైర్మెంట్ తర్వాత స్థిరమైన ఆదాయ ప్రణాళిక విషయంలోనే గందరగోళానికి గురవుతుంటారు. ఈక్విటీల్లో లేదా డెట్‌లో ఎక్కడ పెట్టుబడులు పెట్టాలన్నది అంత సులభంగా తేల్చుకోలేరు. అప్పటి వరకు పొదుపుతో సమకూర్చుకున్న విలువైన వనరులను వివేకంగా వినియోగించుకోవడం ఎలానో తెలియని వారే ఎక్కువ. రిటైర్మెంట్ తర్వాత ఒకట్రెండు దశాబ్దాల పాటు జీవిత అవసరాలను గట్టెక్కడం అంత సులువేమీ కాదు. 'కూర్చుని తింటే కొండలైనా కరుగును' అన్నట్టు.. కష్టార్జితంతో కూడబెట్టుకున్న నిధిని మిగిలిన జీవిత కాలం పాటు పొదుపుగా వాడేందుకు సమర్థవంతమైన ప్రణాళిక తప్పకుండా ఉండాలి.

– సాక్షి, బిజినెస్ డెస్క్

రిటైర్మెంట్ తర్వాత వేతనం మాదిరే ఆదాయం

- అదనపు ఆదాయానికి మెరుగైన మార్గం
- ఈక్విటీ, డెట్ కలయికతో పెట్టుబడులు
- వీటి నుంచి కోరుకున్నంత వచ్చేలా ఎస్‌డబ్ల్యూపీ

రిటైర్మెంట్ తర్వాత చాలా మంది చేసే తప్పు.. తమవద్దనున్న నిధులన్నింటినీ తీసుకెళ్లి బ్యాంక్ ఫిక్స్‌డ్ డిపాజిట్లలో, లేదా ఇతర డెట్ సాధనాల్లోనో ఇన్వెస్ట్ చేస్తుంటారు. స్థిరమైన రాబడి, భద్రత దృష్ట్యా ఇలా చేయడం గమనించొచ్చు. కానీ, వీటి నుంచి వచ్చే రాబడులు ద్రవ్యోల్బణాన్ని మించి ఏమంత గొప్పగా ఉండవు. దీర్ఘకాలంలో సగటు ద్రవ్యోల్బణం 6 శాతం అనుకుంటే, వీటిల్లో రాబడి 7 శాతం స్థాయిలో ఉంటుంది. కనుక ఇలాంటి సాధనాలను ఎంపిక చేసుకోవడం వల్ల.. అక్కడి నుంచి పదేళ్ల కాలంలో కరెన్సీ విలువ తగ్గిన మేర వారి పెట్టుబడి వృద్ధి చెందదు. అందుకే పెట్టుబడుల్లో ఈక్విటీలకూ చోటివ్వడం ఎంతో అవసరం. ఈక్విటీ ఫండ్స్‌లో నిర్ణీత కాలానికోసారి పెట్టుబడులకు సిస్టమ్యాటిక్ ఇన్వెస్ట్‌మెంట్ ప్లాన్ (సిప్) ఎలా అయితే ఉపకరిస్తుందో.. ఈక్విటీ పెట్టుబడుల నుంచి క్రమానుగతంగా కొద్ది మొత్తం చొప్పున ఉపసంహరించుకునేందుకు సిస్టమ్యాటిక్ విత్‌డ్రాయల్ ప్లాన్ (ఎస్‌డబ్ల్యూపీ) అనుకూలిస్తుంది. ద్రవ్యోల్బణాన్ని మించి మెరుగైన రాబడిని ఈ మార్గంలో అందుకోవచ్చు.

స్థిరమైన ఆదాయం

పింఛను సదుపాయం ఏర్పాటు చేసుకున్న వారిని మినహాయిస్తే రిటైర్మెంట్ తర్వాత చాలా మందికి స్థిరమైన ఆదాయం పెద్ద సవాలుగా మారుతుందన్నది నిపుణుల విశ్లేషణ. రిటైర్మెంట్ తర్వాత కొందరు ఇంటి అద్దె రూపంలో ఆదాయ మార్గంపై ఆధారపడుతుంటారు. కానీ ఇంటి అద్దె స్థిరమైనదని చెప్పలేం. కిరాయిదారు ఉన్నట్టుండి ఇల్లు ఖాళీ చేసి వెళ్లిపోవచ్చు. కొత్త వారు రావడానికి కొంత సమయం పడితే అప్పటి వరకు అద్దె ఆదాయం ఉండదు. ఇంటికి మరమ్మతులు, పన్నులు తదితర ఇతర నిర్వహణ వ్యయాల భారం మోయాల్సి ఉంటుంది. ఇల్లు పాతదవుతుంటే అద్దె పెరుగుదల ఆశించిన మేర ఉండదు. కరోనా సమయంలో చాలా మంది ఇంటి అద్దెలను సకాలంలో చెల్లించలేకపోయారు. ఉద్యోగాలు కోల్పోయిన సందర్భాల్లోనూ కిరాయిదారు అద్దెను సకాలంలో చెల్లించలేకపోవచ్చు. కొందరు వడ్డీ వ్యాపారం చేస్తుంటారు. కానీ, ఇందులో రిస్క్ ఎక్కువ. కనుక పెట్టుబడులపై స్థిరమైన ఆదాయానికి మార్గం చూడాలి.

పెట్టుబడి కరగకూడదు..

పెట్టుబడికి ఎంపిక చేసుకునే సాధనం.. కచ్చితంగా ద్రవ్యోల్బణాన్ని మించి వృద్ధి చెందేలా ఉండాలి. అలాంటప్పుడే నెలవారీ రాబడి మేర ఉపసంహరించుకున్నా కానీ, పెట్టుబడి విలువను స్థిరంగా కాపాడుకోవచ్చు. ఈక్విటీలు ఈ విషయంలో ఎంతో మెరుగైనవి. ఉదాహరణకు రూ.20 లక్షల మొత్తాన్ని 7 శాతం రాబడినిచ్చే డెట్ సాధనంలో ఇన్వెస్ట్ చేసి ప్రతి నెలా రూ.20,000 చొప్పున ఉపసంహరించుకున్నారనుకోండి. ఏడాది ముగిసిన తర్వాత రూ.18.92 లక్షల పెట్టుబడి మిగిలి ఉంటుంది. అంటే ఏడాదిలో రూ.3 లక్షలను ఉపసంహరించుకోవడంతో పెట్టుబడి సైతం రూ.1.08 లక్షలు తరిగింది. ఇలాగే ఉపసంహరించుకుంటూ వెళితే 12 ఏళ్లకు ఆ పెట్టుబడి కరిగిపోతుంది. అదే ఈక్విటీల్లో అయితే 12% వరకు సగటు వార్షిక రాబడి ఉంటుంది. రిస్క్ తక్కువగా ఉండే హైబ్రిడ్, సేవింగ్స్ ఫండ్స్‌లో అయితే 10% వరకు రాబడిని ఆశించొచ్చు. కనుక ఈ తరహా సాధనాలతో స్థిరమైన ఆదాయానికి తోడు పెట్టుబడినీ కాపాడుకోవచ్చు, వృద్ధి చేసుకోవచ్చు. ఇదే రూ.20 లక్షలను 12% రాబడినిచ్చే ఫండ్‌లో ఇన్వెస్ట్ చేసి ప్రతి నెలా రూ.20వేల చొప్పున ఉపసహరిస్తే 26 ఏళ్ల కాలానికి ఆ పెట్టుబడి స్థిర ఆదాయాన్నిస్తుంది. 10% రాబడి ప్రకారమైనా 17 ఏళ్ల పాటు ఆదాయాన్నిస్తుంది. వార్షిక రాబడి రేటు లో మైనస్ 3% చొప్పున ఉపసంహరణకు పరిమితం కావడం వల్ల.. మిగిలిన 3% పెట్టుబడి వృద్ధికి చాన్సుంటుంది. దీనివల్ల ద్రవ్యోల్బణం వల్ల పెరిగే జీవన వ్యయాలను సమర్థవంతంగా ఎదుర్కోవచ్చు.

సిప్



ఉద్యోగంలో చేరిన నాటి నుంచి పదవీ విరమణ వరకు ప్రతి నెలా నిర్ణీత మొత్తాన్ని సిప్ ద్వారా ఈక్విటీ ఫండ్స్‌లో ఇన్వెస్ట్ చేసుకోవడం ద్వారా రిటైర్మెంట్ నాటికి భారీ నిధిని సమకూర్చుకోవచ్చు. కాంపౌండింగ్ మహిమతో కొద్ది పెట్టుబడి దీర్ఘకాలంలో చెప్పుకోతగ్గంత నిధిగా సమకూరుతుంది. 25 ఏళ్ల వయసు నుంచి ప్రతి నెలా రూ.10,000 చొప్పున ఈక్విటీ ఫండ్‌లో సిప్ ప్రారంభించి, 60 ఏళ్లు వచ్చే వరకు 35 ఏళ్ల పాటు ఇన్వెస్ట్ చేస్తూ వెళితే.. 12% వార్షిక రాబడి అంచనా మేరకు చివర్లో సమకూరే మొత్తం రూ.5.51 కోట్లు. ఇందులో పెట్టుబడి రూ.42 లక్షలు కాగా, మిగిలినదంతా కాంపౌండింగ్‌తో వృద్ధి చెందిన సంపద. కొంచెం ఆలస్యంగా 30 ఏళ్ల నుంచి ప్రతి నెలా రూ.10వేల చొప్పున 30 ఏళ్లపాటు ఇన్వెస్ట్ చేసినా 60 ఏళ్లకు రూ.3.08 కోట్లకు సమకూరుతుంది.

ఎస్‌డబ్ల్యూపీ



సిప్ ద్వారా ఈక్విటీల్లో చేసిన పెట్టుబడి 60 ఏళ్లకు పెద్ద మొత్తమే సమకూరుతుంది. వృద్ధాప్యానికి వచ్చామని చెప్పి ఈక్విటీ పెట్టుబడులు పూర్తిగా ఉపసంహరించుకోనక్కర్లేదు. కనీసం 50–70 శాతం మేర ఈక్విటీల్లో అలాగే కొనసాగించి, ఎస్‌డబ్ల్యూపీ ద్వారా ప్రతి నెలా కావాల్సినంత ఉపసంహరించుకోవచ్చు. దీనివల్ల రెండు రకాల ప్రయోజనాలున్నాయి. ఈక్విటీల్లో పెట్టుబడి ఇతర సాధనాల కంటే మెరుగ్గా వృద్ధి చెందుతుంది. రిటైర్మెంట్ అనంతరం అదే ఫండ్ నుంచి ప్రతి నెలా కావాల్సినంత వెనక్కి తీసుకోవచ్చు. ఒకేసారి పెట్టుబడులు అన్నింటినీ విక్రయించడం వల్ల దీర్ఘకాల మూలధన లాభాలపై (రూ.1.25 లక్షలు దాటిన మొత్తంపై) 12.5% పన్ను చెల్లించాల్సి వస్తుంది. దీని బదులు 50–70% ఈక్విటీల్లోనే కొనసాగిస్తే పన్ను భారం తగ్గుతుంది.

పన్ను ప్రయోజనాలు



బ్యాంక్ ఫిక్స్‌డ్ డిపాజిట్లపై రాబడి పన్ను పరిధిలోకి వస్తుంది. అదే ఈక్విటీ ఎస్‌డబ్ల్యూపీ ద్వారా ఉపసంహరించుకునే ఆదాయం ఒక ఆర్థిక సంవత్సరంలో రూ.1.25 లక్షల మొత్తంపై పన్ను లేదు. డెట్ సాధనాలపై రాబడి వ్యక్తిగత వార్షిక ఆదాయానికి కలిపి, ఏ శ్లాబు పరిధిలో వస్తే ఆ మేరకు పన్ను రేటు చెల్లించాలి. అదే ఈక్విటీ రాబడులపై పన్ను విడిగా ఉంటుంది. రూ.1.25 లక్షలు మించిన దీర్ఘకాల రాబడిపై 12.5 శాతం పన్ను చెల్లిస్తే చాలు. కేవలం మొదటి ఏడాది ఉపసంహరణ మొత్తంలో రాబడిపై 20 శాతం పన్ను చెల్లిస్తే సరిపోతుంది. ఏడాది తర్వాత నుంచి రాబడి దీర్ఘకాల మూలధన లాభాల పరిధిలోకే వస్తుంది.

నగదు ప్రవాహాలపై సౌలభ్యత



ఎస్‌డబ్ల్యూపీతో నెలవారీ ఎంత అవసరమో అంతే వెనక్కి తీసుకోవచ్చు. తమ అవసరాలకు అనుగుణంగా ఈ మొత్తాన్ని పెంచుకోవచ్చు. నెలవారీ, త్రైమాసికానికి ఒకసారి చొప్పున వెనక్కి తీసుకోవచ్చు. ఈక్విటీ మార్కెట్ సంక్షోభాలను ఎదుర్కొంటుంటే..వాటి నుంచి ఉపసంహరణను గణనీయంగా తగ్గించుకోవడం లేదంటే తాత్కాలికంగా నిలిపివేసి.. డెట్ పెట్టుబడుల నుంచి ఉపసంహరణతో సర్దుబాటు చేసుకోవచ్చు. ఎస్‌డబ్ల్యూపీలోనూ రకాలున్నాయి. కోరుకున్నంత స్థిరంగా ఉపసంహరించుకోవడం ఇందులో ఒకటి. క్యాపిటల్ అప్రీసియేషన్ ఎస్‌డబ్ల్యూపీలో అయితే.. పెట్టుబడుల వృద్ధి వరకు (రాబడి) వెనక్కి తీసుకోవచ్చు. అసలు పెట్టుబడి అలాగే కొనసాగుతుంది.

అస్థిరతల్లో పరిష్కారం..




రాబడి ఒక్కటే కాదు పెట్టుబడిని కాపాడుకోవడం ఎంతో ముఖ్యం. ఈక్విటీలు దిద్దుబాటుకు గురైనప్పుడు అందులోని పెట్టుబడుల విలువ క్షీణిస్తుంటుంది. కనుక ఆ సమయంలో ఈక్విటీ పెట్టుబడుల నుంచి ఉపసంహరణ ఎప్పటి మాదిరిగా కొనసాగించకపోవడం మంచి నిర్ణయం అవుతుంది. ఈక్విటీల్లో దిద్దుబాటు ముగిసే వరకు గట్టెక్కేందుకు డెట్ పెట్టుబడులను వినియోగించుకోవాలి. దీనివల్ల తిరిగి ఈక్విటీలు ర్యాలీ చేసిన సమయంలో పెట్టుబడుల విలువ గణనీయంగా వృద్ధి చెందేందుకు వీలుంటుంది.

పొరపాట్లకు చోటివ్వొద్దు..

- ఎస్‌డబ్ల్యూపీ అన్నది చాలా శక్తివంతమైన సాధనం. అయితే, సరైన ప్రణాళిక లేకపోవడం లేదా నిపుణుల సూచన లేకుండా చేయడం వల్ల ప్రతికూల పరిణామాలు ఎదుర్కోవాల్సి రావచ్చు.
- అధిక రాబడుల కోసం రిస్క్ తీసుకోవద్దు. అతి రాబడుల అంచనాలు విశ్రాంత జీవనంలో బెడిసి కొడతాయి. ముఖ్యంగా మార్కెట్ ఆటుపోట్లలో మోస్తరు రాబడులకే పరిమితం కావాలి.
- నిపుణుల సూచనకు మించి అధిక మొత్తాన్ని వెనక్కి తీసుకోకపోవడమే మంచిది. ఎప్పుడో ఓసారి తప్పిస్తే.. అవసరాలకు చాలడం లేదని ప్రణాళికకు మించి ఉపసంహరణ బాట పడితే పెట్టుబడి వేగంగా క్షీణిస్తుంది.
- ద్రవ్యోల్బణం ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు పెట్టుబడి విలువ ఏటా ఎంతో కొంత వృద్ధి చెందడమే కాదు.. అదే ద్రవ్యోల్బణం కారణంగా పెరిగే జీవన అవసరాలకు వీలుగా నగదు ఉపసంహరణ కూడా పెంచుకోవాల్సి వస్తుంది. సరైన ప్రణాళికతోనే ఇది సాధ్యమని గుర్తుంచుకోవాలి.

ఎస్‌డబ్ల్యూపీ వ్యూహం

- ➤ రిటైర్మెంట్ ఫండ్‌ను మూడు భాగాలుగు చేసుకోవాలి.
- ➤ ఇందులో కోర్ భాగం ఒకటి. దీర్ఘకాలం పాటు ఇది మెరుగ్గా వృద్ధి చెందేందుకు ఇన్వెస్ట్ చేసుకోవాలి. ఇందుకు ఈక్విటీ ఫండ్స్, హైబ్రిడ్ ఫండ్స్ అనుకూలిస్తాయి.
- ➤ బఫర్ పేరుతో రెండో భాగంలో.. 3 నుంచి 5 ఏళ్ల పాటు ఆదాయ అవసరాలకు సరిపడా మొత్తాన్ని డెట్ ఫండ్స్‌లో ఇన్వెస్ట్ చేసుకోవాలి.
- ➤ లిక్విడ్ పేరుతో మరొక భాగాన్ని ఏర్పాటు చేసుకోవాలి. తక్షణ అవసరాల్లో వెనక్కి తీసుకునేందుకు వీలుగా లిక్విడ్ లేదా షార్ట్ డ్యురేషన్ ఫండ్స్‌లో ఈ మొత్తాన్ని ఇన్వెస్ట్ చేసుకోవచ్చు.
- ➤ తమ పెట్టుబడిని ఇలా వేర్వేరు భాగాలు చేసుకోవడం ద్వారా రిస్క్‌ను వైవిధ్యం చేసుకోవచ్చు.



డెట్ పెట్టుబడులూ అవసరమే



విశ్రాంత జీవనంలో అవసరాలకు పూర్తిగా ఈక్విటీలపై ఆధారపడడం రిస్క్ నిర్వహణ పరంగా మెరుగైన నిర్ణయం కాబోదు. ఈక్విటీ, డెట్ కలబోతగా ఉండాలి. ఎస్‌డబ్ల్యూపీ కోసం ఈక్విటీ, డెట్‌లో ఇన్వెస్ట్ చేసే హైబ్రిడ్ సాధనాలను ఎంపిక చేసుకున్నప్పటికీ అదే సమయంలో విడిగా డెట్ సాధనాలనూ పోర్ట్‌ఫోలియోలో చేర్చుకోవాల్సిన అవసరం ఎంతో ఉంటుంది. పైన చెప్పుకున్నట్టు ఈక్విటీ పతనాల్లో ఎస్‌డబ్ల్యూపీని తాత్కాలికంగా నిలిపివేయాల్సి రావచ్చు. ఈక్విటీ మార్కెట్లు దీర్ఘకాలంలో బేరిష్ దశలోకి వెళ్లినప్పుడు డెట్ పెట్టుబడులు ఆదుకుంటాయి. రిస్క్‌ను వైవిధ్యం చేసుకున్నట్టు అవుతుంది. ఇన్వెస్టర్ల వద్దనున్న మొత్తం పెట్టుబడి, ఆదాయ అవసరాలు, రాబడి అంచనాలకు అనుగుణంగా ఈక్విటీ, డెట్ కేటాయింపులు ఎంతన్నది నిర్ణయించుకోవాలి. ఈ విషయంలో ఇన్వెస్ట్‌మెంట్ అడ్వైజర్ సాయం తీసుకోవాలి.

ఎవరికి అనుకూలం..?



ఎస్‌డబ్ల్యూపీ రిటైర్మెంట్ తీసుకున్న వారికోసమే అనుకోవద్దు. పెట్టుబడిపై స్థిరమైన నగదు ప్రవాహాలు కోరుకునే ప్రతి ఒక్కరికీ ఈ ప్లాన్ మెరుగైనదన్నది నిపుణుల సూచన. రిటైర్మెంట్ తీసుకున్న వారు, రిటైర్మెంట్ సమీపంలో ఉన్న వారు, అదనపు ఆదాయం కోరుకునే వారికి ఇది అనుకూలమని బంధన్ అస్సెట్ మేనేజ్‌మెంట్ కంపెనీ (ఏఎంసీ) సేల్స్ హెడ్ గౌరబ్ పరిజ తెలిపారు. ''ఇప్పట్లో పదవీ విరమణ తీసుకోని వ్యక్తులు సైతం, జీవన అవసరాలకు వీలుగా అదనపు ఆదాయం కోసం ఎంపిక చేసుకోవచ్చు. జీవితంలోని వివిధ దశల్లో అదనపు ఆదాయం కోసం ఇదొక పరిష్కారం. కాకపోతే రిటైర్మెంట్ తీసుకున్న వారు ఎక్కువగా దీన్ని వినియోగిస్తుంటారు'' అని వివరించారు.

అక్మే సోలార్ | బ్రోకరేజ్: ప్రుడెంట్ కార్పొరేట్ అడ్వయిజరీ | కొనొచ్చు

సాక్షి స్టాక్స్

ప్రస్తుత ధర: రూ. 248 **టార్గెట్:** రూ. 354

ఎందుకంటే: అత్యంత వేగవంతంగా విస్తరిస్తున్న దేశీ పునరుత్పాదక ఇంధన(ఆర్‌ఈ) రంగంలో సరీ్వసులందిస్తోంది అక్మే సోలార్ హోల్డింగ్స్. శిలాజేతర(నాన్‌ఫాజిల్) ఇంధన రంగంలో 2030కల్లా 500 గిగావాట్ల విద్యుదుత్పత్తి సామర్థ్యాన్ని అందుకోవాలని భారత ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. పునరుత్పాదక ఇంధన వ్యూహాలలో ఇది కీలక లక్ష్యంకాగా.. 2047కల్లా స్వేచ్ఛా ఇంధన మార్కెట్‌గా అవతరించే టార్గెట్‌లో ఇది భాగం కానుంది. అంతేకాకుండా 2070కల్లా నికరంగా ఉద్గారరహిత దేశంగా ఆవిర్భవించే లక్ష్యంలోనూ సమ్మిళితంకానుంది. వెరసి పునరుత్పాదక ఇంధన రంగంలో కంపెనీ పలు అవకాశాలు అందిపుచ్చుకునే వీలుంటుంది. గత ఆర్థిక సంవత్సరం (2024–25)లో భారత్ 29.5 గిగావాట్ల పునరుత్పాదక ఇంధన సామర్థ్యాన్ని జత చేసుకుంది. వీటిలో 23.8 గిగావాట్లు సోలార్ విభాగంలోకాగా.. 4.2 గిగావాట్లు పవన విద్యుత్ ద్వారా జత కలిశాయి. మిగిలిన సామర్థ్యం బయోఎనర్జీ ద్వారా సమకూరుతోంది. దేశీయంగా 2030కల్లా 500 గిగావాట్ల సామర్థ్యాన్ని సాధించేందుకు ఇంతకంటే వేగంగా విద్యుదుత్పత్తి ప్లాంట్లను ఏర్పాటు చేయవలసి ఉంటుంది. రానున్న ఐదేళ్లలో ఏడాదికి సగటున 40–50 గిగావాట్లు చొప్పున పునరుత్పాదక యూనిట్లను నెలకొల్పవలసి ఉంటుంది. అత్యవసర సర్వీసులకు 24 గంటలూ కనీసం విద్యుత్ అందించవలసిన అవసరాన్ని(బేస్ లోడ్ డిమాండ్) ప్రభుత్వం ఇప్పటికే గుర్తించింది. దీంతో రానున్న అన్ని ఆర్‌ఈ ప్రాజెక్టులకూ 10 శాతం ఎనర్జీ స్టోరేజీ వ్యవస్థ(2 గంటల నిల్వ)ను తప్పనిసరి చేసింది. దీనిలో భాగంగా ఎఫ్‌డీఆర్‌ఈ, హైబ్రిడ్ టెండర్లకు తెరతీసింది. ఈ నేపథ్యంలో 2027కల్లా కంపెనీ రూ. 6,081 కోట్ల నిర్వహణ లాభం(ఇబిటా) సాధిస్తుందని అంచనా వేస్తున్నాం.



టీటీకే ప్రెస్టీజ్ | బ్రోకరేజ్: యస్ సెక్యూరిటీస్ | కొనొచ్చు

ప్రస్తుత ధర: రూ. 622 **టార్గెట్:** రూ. 745

ఎందుకంటే: గత ఆర్థిక సంవత్సరం(2024–25) చివరి త్రైమాసికంలో కిచెన్ అప్లయెన్సెస్ తయారీ దిగ్గజం టీటీకే ప్రెస్టీజ్ ఆదాయం అంచనాల(2 శాతం వృద్ధి)కంటే అధికంగా 4 శాతం పుంజుకుంది. ఇందుకు జనవరి–మార్చి(క్యూ4)లో దేశీ కిచెన్ అప్లయెన్సెస్‌కు తిరిగి డిమాండ్ బలపడటంతోపాటు.. జోరందుకున్న ఎగుమతులు తోడ్పాటునిచ్చాయి. అమ్మకాలకు సంబంధించి అన్ని రకాల చానళ్లు సానుకూల పనితీరు ప్రదర్శించాయి. ప్రధానంగా ఈకామర్స్, ఆధునిక రిటైల్ చానళ్లు ఉత్తమ పనితీరు చూపాయి. గ్రామీణ చానల్ మందగించినప్పటికీ అంతగా ప్రతికూల ప్రభావం పడలేదు. ఇందుకు గ్రామీణ అమ్మకాలపై అధికంగా ఆధారపడటాన్ని తగ్గించుకోవడం సహకరించింది. ఈ నేపథ్యంలో స్థూల మార్జిన్లు పటిష్టంగా 42.2 శాతం స్థాయిలో కొనసాగాయి. అయితే నిర్వహణ సంబంధ, తదితర వ్యయాలు పెరగడంతో నిర్వహణ లాభ(ఇబిటా) మార్జిన్లు ప్రభావితమయ్యాయి. వెరసి రానున్న 8 త్రైమాసికాల(రెండేళ్ల) పాటు మార్జిన్లు ప్రభావితంకావచ్చని భావిస్తున్నాం. అమ్మకాల్లో వృద్ధిని సాధించే లక్ష్యంలో భాగంగా నిర్వహణ, తదితర వ్యయాలు పెరగనుండటం దీనికి కారణంకానుంది. బిజినెస్‌లో వృద్ధికి దోహదపడే వ్యూహాలలో భాగంగా కొత్త ఆవిష్కరణలు, ఆధునిక ప్రొడక్టులను ప్రవేశపెట్టడంపై ప్రత్యేక దృష్టిని సారించింది. కంపెనీ 2017లో ప్రవేశపెట్టిన అందుబాటు ధరల విభాగపు బ్రాండ్ 'జడ్జ్'ను విస్తరించడంపై ఇటీవల మరింత దృష్టి పెట్టింది. తద్వారా ప్రజాబాహుళ్యం(మాస్ మార్కెట్)లో చొచ్చుకుపోవాలని చూస్తోంది. ఇందుకు అందుబాటు ధరల ద్వారా అమ్మకాలు పెంచుకునే వ్యూహాలు అమలు చేస్తోంది. కుకర్లు, కుక్‌వేర్ విభాగంలో కంపెనీ ఇటీవల తిరిగి మార్కెట్ వాటాను పెంచుకుంటోంది. జడ్జ్ ద్వారా అమ్మకాలు మరింత పెంచుకునే వీలుంది.



గమనిక: ఈ కాలమ్‌లో షేర్లపై ఇచ్చిన సలహాలు వివిధ బ్రోకరేజ్ సంస్థలు వ్యక్తం చేసిన అభిప్రాయాలు మాత్రమే

'సాక్షి ప్లస్' ఈ-పేపర్‌లో ..
మార్కెట్లలో ఈ వారం బ్రేకవుట్! | మెరుగైన రాబడులకు వేదిక!

టాటా ఏఐఏ 2 కొత్త ఫండ్స్



జీవిత బీమా సంస్థ టాటా ఏఐఏ లైఫ్ ఇన్సూరెన్స్ కొత్తగా రెండు ఫండ్స్‌ను ప్రవేశపెట్టింది. టాటా ఏఐఏ టాప్ 200 ఆల్ఫా 30 ఇండెక్స్ ఫండ్, టాప్ 200 ఆల్ఫా 30 ఇండెక్స్ పెన్షన్ ఫండ్ వీటిలో ఉన్నాయి. దీర్ఘకాలంలో సంపదను పెంచుకోవడానికి, రిటైర్మెంట్ ప్లానింగ్‌కి ఇవి ఉపయోగపడతాయని సంస్థ తెలిపింది. ఈ న్యూ ఫండ్ ఆఫర్లు జూన్ 23న ప్రారంభమై 30న ముగుస్తాయి. బెంచ్‌మార్క్‌లను మించిన రాబడులు అందించే నిఫ్టీ 200 ఆల్ఫా 30 ఇండెక్స్‌లోని స్టాక్స్‌లో ఈ ఫండ్స్ ఇన్వెస్ట్ చేస్తాయి. 80–100 శాతం మొత్తాన్ని ఈక్విటీ, ఈక్విటీ సంబంధ సాధనాల్లో పెట్టుబడి పెడతాయి.

ఏబీఎస్‌ఎల్‌ఐ సూపర్ టర్మ్ ప్లాన్



ఆదిత్య బిర్లా సన్‌లైఫ్ ఇన్సూరెన్స్ కంపెనీ 'ఏబీఎస్‌ఎల్‌ఐ సూపర్ టర్మ్ ప్లాన్'ను విడుదల చేసింది. లక్ష్యం ఆధారిత ఆర్థిక రక్షణలకు తోడు, హెల్త్ మేనేజ్‌మెంట్ సేవలతో ఈ టర్మ్ ప్లాన్ వస్తుందని సంస్థ ప్రకటించింది. హెల్త్ మేనేజ్‌మెంట్ సర్వీసెస్ ఫీచర్ కింద.. పాలసీదారుల ఆరోగ్యాన్ని చురుగ్గా పర్యవేక్షించడం జరుగుతుంది. స్థిరమైన రక్షణ, క్రమానుగతంగా రక్షణ పెంపు (ఏటా 5%), స్థిరమైన రక్షణతోపాటు చివర్లో చెల్లించిన ప్రీమియంలు వెనక్కి వచ్చే ఆప్షన్లలో పాలసీదారులు తమకు అనుకూలమైన దానిని ఎంపిక చేసుకోవచ్చు. క్రిటికల్ ఇల్‌నెస్ ప్రయోజనం కూడా ఉంది. జాబితాలోని ఏదైనా తీవ్ర వ్యాధుల బారిన పడినా లేక ప్రాణాంతక వ్యాధి నిర్ధారణ అయినా ముందస్తు చెల్లింపులను పొందొచ్చు.

ఎఫ్‌డీ కంటే మెరుగైన రాబడులకు మార్గం ఏది?

Q & A



ధీరేంద్ర కుమార్
సీఈవో, వ్యాల్యూ రీసెర్చ్



నా వయసు 74 ఏళ్లు. ఫిక్స్‌డ్ డిపాజిట్ త్వరలోనే గడువు తీరనుంది. దీని ద్వారా రూ.25 లక్షలు చేతికి రానున్నాయి. ఈ మొత్తాన్ని ఎక్కడ ఇన్వెస్ట్ చేసుకుంటే మెరుగైన రాబడులు వస్తాయి? ప్రభుత్వ పథకాలు అయిన సీనియర్ సిటిజన్ సేవింగ్స్ స్కీమ్ (ఎస్‌సీఎస్ఎస్), పోస్టాఫీసు మంత్లీ ఇన్‌కమ్ స్కీమ్ (ఎంఐఎస్)లో నాకు పెట్టుబడులు ఉన్నాయి.

– నదీమ్

మీరు మెరుగైన రాబడుల కోసం ఈక్విటీ సేవింగ్స్ ఫండ్స్‌ను పరిగణనలోకి తీసుకోవచ్చు. ఎఫ్‌డీలతో పోలిస్తే ఈక్విటీ ఫండ్స్ అస్థిరతలతో ఉంటాయి. కాకపోతే అచ్చమైన ఈక్విటీ ఫండ్స్ అంత అస్థిరతలు ఈక్విటీ సేవింగ్స్ ఫండ్స్‌లో ఉండవు. ఇవి 15–30 శాతం వరకు ఈక్విటీల్లో, మిగిలిన మొత్తాన్ని ఫిక్స్‌డ్ ఇన్‌కమ్, ఆర్బిట్రేజ్ అవకాశాల్లో ఇన్వెస్ట్ చేస్తుంటాయి. స్వల్పకాలంలో ఈ ఫండ్స్‌లోనూ రిస్క్ ఎక్కువే. కాకపోతే ఐదేళ్లు అంతకు మించిన కాలంలో రిస్క్ చాలా తక్కువే. షార్ట్ డ్యురేషన్ ఫండ్స్ మరోక ఆప్షన్. ఫిక్స్‌డ్ డిపాజిట్ మాదిరే షార్ట్ డ్యురేషన్ ఫండ్స్‌లోనూ రాబడులు ఉంటాయి. వీటిల్లో లిక్విడిటీ ఎక్కువ. పోస్టాఫీసు ఎంఐఎస్, ఎస్‌సీఎస్ఎస్ పథకాల్లో మీకు ఇప్పటికే పెట్టుబడులు ఉన్నాయి. వీటి నుంచి క్రమం తప్పకుండా ఆదాయం వస్తుంటుంది. ఈ పథకాల నుంచి రాబడిని ఎప్పటికప్పుడు తీసుకుంటూ ఉంటారు కనుక పెట్టుబడి విలువ పెరగదు. కనుక మీకు ఈక్విటీ సేవింగ్స్ ఫండ్స్ మెరుగైన ఆప్షన్ . ఈక్విటీ వద్దనుకుంటే షార్ట్ డ్యురేషన్ ఫండ్స్‌కు వెళ్లొచ్చు.

నేను ప్రతి నెలా ఇన్వెస్ట్ చేస్తున్న ఒక మ్యూచువల్ ఫండ్ పథకం స్టార్ రేటింగ్ 4 నుంచి 3కు తగ్గింది. ఈ పెట్టుబడులను విక్రయించి టాప్ స్టార్ పథకంలో ఇన్వెస్ట్ చేయాలని అనుకుంటున్నాను. ఏక మొత్తంలో ఇన్వెస్ట్ చేయాలా..? లేక ప్రస్తుత పథకం నుంచి సిస్టమ్యాటిక్ విత్ డ్రాయల్ (ఎస్‌డబ్ల్యూపీ) రూపంలో వెనక్కి తీసుకుని వేరొక పథకంలో ఇన్వెస్ట్ చేసుకోవాలా?

– రాజ్‌దీప్

మ్యూచువల్ ఫండ్స్‌లో 3 స్టార్ అంటే చెత్త పనితీరుకు నిదర్శనం కాదు. ఎందుకంటే 3 స్టార్ రేటింగ్ కలిగిన చాలా పథకాలు ఆయా విభాగాల్లోని సగటు పనితీరుకు మించి రాబడులను ఇస్తున్నాయి. ఒక పథకం నుంచి వైదొలిగేందుకు స్టార్ రేటింగ్ తగ్గడం ఒక్కదాన్నే ప్రామాణికంగా తీసుకోకూడదు. ఒక్కసారి ఒక పథకంలో పెట్టుబడులు కొనసాగించకూడదని, వైదొలగాలని నిర్ణయించుకున్న తర్వాత ఇక ఎస్‌డబ్ల్యూపీ ఆలోచనే అక్కర్లేదు. కాకపోతే ఎగ్జిట్‌లోడ్ చార్జీలు పడుతుంటే లేదా ప్రస్తుత పథకంలో పెట్టుబడులను ఏక మొత్తంలో ఇన్వెస్ట్ చేయడం కారణంగా మూలధన లాభాల పన్ను చెల్లించాల్సి వచ్చినట్టయితే అప్పుడు.. క్రమానుగతంగా (సిస్టమ్యాటిక్‌గా) వైదొలగాలా? లేదా? అన్నది నిర్ణయించుకోండి. రెండు మూడు విడతలుగా పెట్టుబడులను వెనక్కి తీసుకుని కొత్తగా ఎంపిక చేసుకున్న పథకంలో ఇన్వెస్ట్ చేయడం కూడా ఒక మార్గమే. ముందుగా ఎగ్జిట్ లోడ్ లేని, దీర్ఘకాల మూలధన లాభం పన్ను వర్తించని మొత్తాన్ని వెనక్కి తీసుకోవచ్చు. తద్వారా పన్ను భారం లేకుండా చూసుకోవచ్చు.

క్లుప్తంగా...

25 నుంచి 29 వరకు వైద్య కళాశాలల్లో తనిఖీలు

- 30న ప్రభుత్వానికి నివేదిక
- తనిఖీల కోసం 10 కమిటీలు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని వైద్య కళాశాలల్లో మౌలిక సదుపాయాల కల్పన, విద్యార్థులకు ప్రాక్టికల్స్‌కు అవసరమైన ఏర్పాట్లలో ఉన్న లోపాలను గుర్తించి, సౌకర్యాలు కల్పించేందుకు ఈ నెల 25 నుంచి 29వ తేదీ వరకు తనిఖీలు నిర్వహించాలని నిర్ణయించారు. 26 వైద్య కళాశాలల్లో లోపాలపై జాతీయ వైద్య కమిషన్ అసంతృప్తి వ్యక్తం చేయడంతో ఆరోగ్య శాఖ కార్యదర్శి క్రిస్టినా, డీఎంఈ నరేంద్ర కుమార్ ఢిల్లీకి వెళ్లి వివరణ ఇచ్చారు. అంతకుముందే సీఎం రేవంత్‌రెడ్డి ఆరోగ్య శాఖ అధికారులతో సమావేశమై ఆదేశాలు జారీ చేశారు. ప్రత్యేకంగా కమిటీలు ఏర్పాటు చేసి వైద్య కళాశాలల్లో తనిఖీలు నిర్వహించి నివేదిక అందజేయాలని ఆదేశించారు. దీంతో 10 కమిటీలను ఏర్పాటు చేశారు. ఈ కమిటీలు 25 నుంచి 29 వరకు 34 ప్రభుత్వ వైద్య కళాశాలల్లో సౌకర్యాలను పరిశీలించి క్షేత్రస్థాయి పరిస్థితులు, చేపట్టాల్సిన చర్యలపై 30న ప్రభుత్వానికి నివేదిక అందజేస్తాయి. తదనుగుణంగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుంది. ఇదే విషయాన్ని ఢిల్లీలో ఎన్ఎంసీ అధికారులకు సైతం రాష్ట్ర ప్రభుత్వ ప్రతినిధులు తెలియజేశారు.

కష్టపడి ఉద్యోగాలు సాధించాం.. పోస్టింగ్ ఇవ్వండి

- నియామక పత్రాలు ఇవ్వాలంటూ గ్రూప్–1 ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థుల డిమాండ్

సాక్షి, హైదరాబాద్: ఉద్యోగాలకు ఎంపికై నియామక పత్రాలు అందకపోవడంతో తీవ్ర ఆందోళన చెందుతున్నామని గ్రూప్–1 అభ్యర్థులు వాపోయారు. గ్రూప్–1 ఉద్యోగాలకు అర్హత సాధించిన పలువురు ఆదివారం ఉదయం సోమాజీగూడ ప్రెస్‌క్లబ్‌లో మీడియాతో మాట్లాడారు. ప్రత్యేక రాష్ట్రంలో తొలిసారిగా గ్రూప్–1 ఉద్యోగాల భర్తీ ప్రక్రియ చేపట్టారని, ఈ ఉద్యోగాల కోసం చాలామంది అభ్యర్థులు పదేళ్లుగా కష్టపడ్డారని, నియామకాల ప్రక్రియ చివరిదశ వచ్చేసరికి తీవ్ర జాప్యం జరుగుతుందన్నారు. ఉద్యోగాలకు ఎంపికైన వారిలో అత్యధికం గ్రామీణ నేపథ్యం, పేద, మధ్యతరగతి అభ్యర్థులే ఉన్నారని చెప్పారు. గ్రూప్–1 ఉద్యోగాలకు సంబంధించిన అర్హత పరీక్ష, ఎంపిక ప్రక్రియ పూర్తిగా పారదర్శకంగా జరిగిందని తాము విశ్వసిస్తున్నట్లు తెలిపారు. ఉద్యోగాలు సాధించినందుకు ఆనందంతో ఉండాల్సిన తాము, నియామక పత్రాలు అందలేదనే ఆందోళన బాధ కలిగిస్తోందన్నారు. గ్రూప్–1 నియామకాల ప్రక్రియ ఆలస్యం కావడంతో ఆ ప్రభావం గ్రూప్–2, గ్రూప్–3 నియామకాలపై పడిందని, ఫలితంగా ఆ ఉద్యోగాలకు ఎంపికై న వారు కూడా ఎదురు చూస్తున్నారన్నారు. గ్రూప్–1 నియామకాల ప్రక్రియలో నెలకొన్న వివాదాలను వేగంగా పరిష్కరించాలని కోరారు.

శ్రీవారి లడ్డూ విక్రయాల కౌంటర్లలో కియోస్కులు

తిరుమల: తిరుమల శ్రీవారి భక్తులు లడ్డూలు సులభంగా పొందేందుకు 5 కియోస్క్ మిషన్లను తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) ప్రారంభించింది. ఇవన్నీ ఆదివారం రాత్రి నుంచి అందుబాటులోకి వచ్చాయి. ఇకపై భక్తులు సులభంగా లడ్డూలు పొందవచ్చు.


ఆ విమానాలు నిలిపివేయడమే మంచిది



ఎయిర్ ఇండియా బోయింగ్ 787-8 విమానాలపై అత్యధికుల ఆందోళన

- సమస్యలు పరిష్కారమయ్యేవరకు నిలిపివేయాలని 56 శాతం మంది సూచన
- అహ్మదాబాద్ ప్రమాదం తర్వాత లోకల్ సర్కిల్స్ సర్వేలో వెల్లడి


సాక్షి, హైదరాబాద్: ఎయిర్ ఇండియా బోయింగ్ 787–8 రకం విమానాల్లో సమస్యలు పరిష్కారం అయ్యేవరకు వాటి సర్వీసులను నిలిపివేయడమే మంచిదని విమాన ప్రయాణాలు సాగించేవారిలో 56 శాతం మంది అభిప్రాయపడ్డారు. ఎయిర్ ఇండియా బోయింగ్ 787–8 రకం విమానం ఈ నెల 12న అహ్మదాబాద్‌లో కూలిపోవటంతో 270 దుర్మరణం చెందారు. ఈ ఘటన తర్వాత విమాన ప్రయాణికులు తమ ప్రయాణానికి సంబంధించి ఏయే అంశాలపై ఎలాంటి ఆలోచనలు కలిగి ఉన్నారన్నది తెలుసుకునేందుకు లోకల్ సర్కిల్స్ సంస్థ దేశవ్యాప్తంగా 40 వేల మంది నుంచి అభిప్రాయాలు సేకరించింది. ఆ సర్వేలో పలు ఆసక్తికర విషయాలు వెలుగులోకి వచ్చాయి. ఇందులో ప్రధానంగా తాము ప్రయాణించబోయేది ఏ రకం విమానం అన్నదానికి ప్రయాణికులు ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిసింది. 41 శాతం మంది తాము ఏ రకమైన విమానంలో ప్రయాణించబోతున్నాము.. అది ఏ కంపెనీది అన్నది కూడా చూస్తున్నారు. సర్వేలోని కొన్ని ప్రశ్నలకు వచ్చిన సమాధానాలు..



రానున్న నెలల్లో విమాన ప్రయాణం కోసం టికెట్ బుకింగ్ సమయంలో ఏ అంశాలకు మీరు ప్రాధాన్యత ఇస్తారు?

అంశం	శాతం
విమానం రకం	41
విమానయాన సంస్థ	59
విమాన టికెట్ ధర	73
ఫ్లైట్ టైమింగ్స్	64
ఫ్లైట్ కనెక్షన్స్, ప్రయాణ సమయం	41
ఇతర అంశాలు	14
చెప్పలేం	5

లైవ్ లొకేషన్ తరహాలో తపాలా డిజిపిన్



- ప్రతి 16 చదరపు మీటర్లకు ప్రత్యేక డిజిటల్ పిన్ నంబర్
- అత్యవసర సేవల్లో తక్షణ సాయం అందేందుకు దోహదం
- ప్రభుత్వ విభాగాల పోర్టళ్లతో అనుసంధానించేందుకు రాష్ట్ర ప్రభుత్వానికి తపాలా శాఖ విజ్ఞప్తి
- ఇక ఇంటి చిరునామా స్థానంలో డిజిపిన్.. సులభంగా అడ్రస్ గుర్తించేందుకు వీలు

సాక్షి, హైదరాబాద్ : డిజిటల్ పిన్ (డిజిపిన్) వ్యవస్థను రాష్ట్ర ప్రభుత్వ విభాగాలతో అనుసంధానించేందుకు రంగం సిద్ధమైంది. దేశవ్యాప్తంగా తపాలాశాఖ ప్రతి 16 చదరపు మీటర్ల ప్రాంతానికి ప్రత్యేకంగా ఓ పిన్ నంబర్‌ను కేటాయిస్తున్న విషయం తెలిసిందే. ఆ పిన్ నంబర్‌నే ఇప్పుడు రియల్‌టైమ్ లొకేషన్‌గా వాడుకునేలా తపాలాశాఖ గూగుల్ మ్యాప్ ద్వారా అనుసంధానించింది. దీనిని వైద్యారోగ్య, పోలీసు, అగ్నిమాపక, రెవెన్యూ, మత్స్య తదితర శాఖలతో అనుసంధానిస్తారు. ఇది అత్యవసర సందర్భాల్లో ప్రజలకు వీలైనంత తొందరలో సహాయం అందేందుకు ఉపయుక్తంగా ఉంటుంది. ఈ మేరకు ఆయా శాఖలతో అనుసంధానించాలంటూ తాజాగా తెలంగాణ తపాలాశాఖ రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరింది.

ఏంటీ వ్యవస్థ?

ఇప్పటి వరకు దేశవ్యాప్తంగా తపాలాశాఖ ఆధ్వర్యంలో పిన్‌కోడ్ నంబర్లు ఉన్న విషయం తెలిసిందే. ఓ గ్రామానికో, పట్టణాలు/నగరాల్లోని కొంతభాగానికో ఒకటి చొప్పున ఈ పిన్‌కోడ్ నంబర్లు ఉన్నాయి. అది చాలా పెద్ద పరిధితో కూడిన ప్రాంతానికి ఉంటుంది. ఇప్పుడు అలా కాకుండా చిన్నచిన్న ప్రాంతానికి ఒక ప్రత్యేక పిన్ నంబర్ ఉండేవిధంగా తపాలాశాఖ డిజిపిన్ వ్యవస్థను రూపొందించిన విషయం తెలిసిందే. ఐఐటీ హైదరాబాద్, నేషనల్ రిమోట్ సెన్సింగ్ ఏజెన్సీల సంయుక్తాధ్వర్యంలో దీనిని రూపొందించారు. దేశంలో ప్రతి 4 చదరపు మీటర్లు ఇంటూ 4 చదరపు మీటర్ల ప్రాంతానికి ప్రత్యేక డిజిటల్ పోస్టల్ ఇండెక్స్ నంబర్‌ను కేటాయించారు. దాన్ని అక్షాంశ రేఖాంశాల ఆధారంగా స్థిరీకరించి శాటిలైట్ ద్వారా అనుసంధానించారు. ఇప్పుడు గూగుల్‌తో దాన్ని అనుసంధానించారు. మనం ఎక్కడున్నా ఆ ప్రాంత డిజిపిన్‌ను గుర్తించొచ్చు. స్మార్ట్ ఫోన్‌లో గూగుల్ ఓపెన్ చేసి 'నో మై డిజిపిన్'అని టైప్ చేయగానే డిజిపిన్ యూఆర్ఎల్ ఓపెన్ అవుతుంది. దాన్ని క్లిక్ చేయగానే గూగుల్ మ్యాప్‌లో ఆ ప్రాంత డిజిపిన్ కనిపిస్తుంది. దాన్ని కంప్యూటర్/ల్యాప్‌టాప్ ద్వారా కూడా తెలుసుకోవచ్చు. ప్రస్తుతం గూగుల్ మ్యాప్‌లో మన లొకేషన్ ఎలా కనిపిస్తుందో, అలాగే మనం ఉన్న ప్రాంత డిజిపిన్ కూడా కనిపిస్తుంది.

- దేశం మొత్తాన్ని 16 గ్రిడ్లుగా విభజించారు. మళ్లీ ప్రతి గ్రిడ్‌ను 16 చిన్న గ్రిడ్లుగా విభజించారు. అలా పది లేయర్లుగా విభజిస్తూ చివరు 16 చదరపు మీటర్ల ప్రాంతం వరకు విభజించారు. ప్రతి గ్రిడ్‌కు ఓ నంబరు కేటాయిస్తూ.. చివరకు 16 చదరపు మీటర్ల ప్రాంతానికి పది డిజిట్లతో కూడిన ఫైనల్ నంబరు కేటాయించారు. అదే తుది డిజిపిన్ నంబరు.
- ఇది ఇంచుమించు ప్రతి ఇంటికి కాస్త అటూ ఇటుగా ఓ పిన్ నంబరుగా ఉంటుంది. పెద్ద అపార్ట్‌మెంట్లు, విశాలమైన ప్రాంగణం ఉన్న వాటికి నాలుగైదు నంబర్లు ఉంటాయి. వాటిల్లో ఏ నంబరును వినియోగించినా... మన కచ్చితమైన చిరునామాను గుర్తించొచ్చు.
- ఇక పార్శిల్స్, ఉత్తరాలను పోస్ట్/కొరియర్ చేసేప్పుడు నగరం, పట్టణం, కాలనీ, వీధి, ఇంటినంబరు... ఇలాంటివి ఏవీ లేకుండా వ్యక్తి పేరు, డిజిపిన్ రాస్తే ఎలాంటి వెతుకులాట లేకుండా కచ్చితంగా ఆ చిరునామాను గుర్తించొచ్చు.
- చిరునామాలో వ్యక్తిగత గోప్యత ఉండాలనుకునేవారు వారి వ్యక్తిగత చిరునామా ఇవ్వకుండా కేవలం డిజిపిన్ ద్వారా ఆ పార్శిల్‌ను ఇంటికి తెప్పించుకోవచ్చు.
- మనం వేరే ప్రాంతంలో ఉన్నా, ఎక్కడ ఉన్నామో.. అవతలి వారికి తెలిపేందుకు ఈ డిజిపిన్‌ను వాడుకోవచ్చు.
- భారీ వరదలు, అగ్ని, రోడ్డు ప్రమాదాలు, ఇతర ఉపద్రవాల్లో చిక్కుకున్నప్పుడు.. తాను ఉన్న ప్రాంతాన్ని అత్యవసర సేవలు అందించే వారికి ఈ డిజిపిన్ ద్వారా సులభంగా తెలపొచ్చు.
- ఈ–కామర్స్ కంపెనీలు, డిజిటల్ సర్వీసు ప్రొవైడర్లతో కూడా ఈ డిజిపిన్ వ్యవస్థను అనుసంధానించే కసరత్తు జరుగుతోంది. అప్పుడు క్యాబ్/ఆటో ప్రొవైడర్లు, ఆహార పదార్థాల సరఫరా సంస్థలు, కిరాణా, మందుల సరఫరా సంస్థలు కూడా వీటిని వినియోగించుకోవచ్చు.
- ఈ డిజిపిన్ ఏపీఐ, ఓపెన్ సోర్స్ రిపోజిటరీ జిట్‌హబ్‌లో అందుబాటులో ఉన్నాయని, తమ పోర్టళ్లతో అనుసంధానించుకోవచ్చని తపాలాశాఖ పేర్కొంటోంది.

ఆలస్యంగా బయలుదేరిన బ్రిటిష్ ఎయిర్‌వేస్ విమానం

శంషాబాద్ (హైదరాబాద్): మధ్య ప్రాచ్య దేశాల గగనతలంలో అనుమతి లభించకపోవడంతో బ్రిటిష్ ఎయిర్‌వేస్ విమానం హైదరాబాద్ నుంచి మూడున్నర గంటలు ఆలస్యంగా బయలుదేరింది. వివరాలివి. బ్రిటిష్ ఎయిర్‌వేస్ బీఏ–276 విమానం 263 మంది ప్రయాణికులతో ఆదివారం ఉదయం లండన్ హీత్రూ విమానాశ్రయానికి బయలుదేరేందుకు సిద్ధమైంది. ఇరాన్, ఇజ్రాయిల్ మధ్య జరుగుతున్న భీకర యుద్ధం నేపథ్యంలో.. గగనతలంలో అనుమతి లభించకపోవడంతో విమానం టేకాఫ్‌కు అనుమతి లభించలేదు. మూడున్నర గంటలపాటు ప్రయాణికులు విమానంలోనే కూర్చున్నారు. అనుమతి లభించిన అనంతరం 11.34 గంటలకు శంషాబాద్ ఎయిర్‌పోర్టు నుంచి లండన్ బయలుదేరింది.

ట్రిపుల్ ఐటీకి 20,258 దరఖాస్తులు

భైంసా: ఆర్జీయూకేటీ బాసర, మహబూబ్‌నగర్ కేంద్రాల్లో 2025–26 విద్యా సంవత్సరానికి ఇంటిగ్రేటెడ్ బీటెక్ కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తుల ప్రక్రియ ముగిసిందని వీసీ ప్రొఫెసర్ గోవర్ధన్ ప్రకటించారు. మొత్తం 20,258 దరఖాస్తులు అందాయని తెలిపారు. దరఖాస్తుల పరిశీలన అనంతరం జూలై 4న తుది జాబితా విడుదల చేస్తామని వెల్లడించారు. జూలై 7న మొదటి విడత కౌన్సెలింగ్ ప్రక్రియ ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. ప్రవేశాల ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించేందుకు చర్యలు చేపట్టామని తెలిపారు.

విజయ్ దేవరకొండపై అట్రాసిటీ కేసు

రెట్రో ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో చేసిన వ్యాఖ్యలపై ఫిర్యాదుతోనే..



గచ్చిబౌలి: టాలీవుడ్ హీరో విజయ్ దేవరకొండపై రాయదుర్గం పోలీస్ స్టేషన్‌లో అట్రాసిటీ కేసు నమోదైంది. ఏప్రిల్ 26న జరిగిన తమిళ హీరో సూర్య చిత్రం రెట్రో ప్రీ రిలీజ్ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న విజయ్ దేవరకొండ పహల్గామ్ ఉగ్ర దాడి అంశాన్ని ప్రస్తావించిన సందర్భంగా చేసిన వ్యాఖ్యలు వివాదాస్పదమయ్యాయి. 'కశ్మీర్ మనదే.. కశ్మీర్ ప్రజలు మనవాళ్లే.. 500 ఏళ్ల క్రితం ట్రైబల్ యుద్ధం చేసిన రీతిలో పాకిస్తాన్ భారత్‌పై యుద్ధం చేస్తోంది. కానీ పాకిస్తాన్‌పై భారత్ యుద్ధం చేయాల్సిన అవసరం లేదు. తిండి, నీళ్లు లేక వాళ్ల ప్రజలే పాకిస్తాన్‌పై యుద్ధం చేస్తారు'అని విజయ్ దేవరకొండ వ్యాఖ్యానించారు. అయితే '500 ఏళ్ల క్రితం ట్రైబల్స్ చేసినట్లుగా'అనే వ్యాఖ్యలు తమ మనోభావాలు గాయపరిచాయంటూ ట్రైబల్ కమ్యూనిటీస్ జాయింట్ యాక్షన్ కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు అశోక్‌కుమార్ నాయక్ అలియాస్ అశోక్ రాథోడ్ ఈ నెల 17న రాయదుర్గం పీఎస్‌లో ఫిర్యాదు చేయగా, న్యాయ సలహా తీసుకున్న పోలీసులు.. విజయ్ దేవరకొండపై శనివారం అట్రాసిటీ కింద కేసు నమోదు చేశారు.

అనుమానించడమే మంచిదైంది

- సైబర్ నేరగాళ్ల వలకు చిక్కకుండా తప్పించుకున్న నగరవాసి
- మీ కూతురు డ్రగ్స్ కేసులో ఉందంటూ హోం సెక్రెటరీ ఫొటో డీపీగా పెట్టి బెదిరింపులు
- సమయస్ఫూర్తితో వ్యవహరించి తప్పించుకున్న వైనం

సాక్షి, హైదరాబాద్: 'మీ కూతురు కెనడాలో డ్రగ్స్ కేసులో పట్టుబడింది. ఈ కేసు నుంచి మీ కూతుర్ని తప్పించాలంటే మేం చెప్పిన ఫోన్‌పే నంబర్‌కు రూ.50 వేలు వెంటనే పంపండి'అంటూ బురిడీ కొట్టించేందుకు సైబర్ నేరగాళ్లు విశ్వ ప్రయత్నం చేశారు. అయితే వారి వలకు చిక్కకుండా సమయస్ఫూర్తితో వ్యవహరించారు నగరవాసి శ్రీనివాస్‌రెడ్డి. కేసు వివరాల్లోకి వెళితే..సరూర్‌నగర్‌కు చెందిన ప్రైవేట్ సెక్యూరిటీ సంస్థను నడిపే శ్రీనివాస్‌రెడ్డికి ఈనెల 19న ఒక వాట్సప్ కాల్ వచ్చింది. అందులో పేరు సీబీఐ విక్రమ్‌గా..డీపీ హోం శాఖ ముఖ్య కార్యదర్శి రవిగుప్తా ఫొటో ఉంది. అవతలి నుంచి ఒక మహిళ ఇంగ్లిష్‌లో మాట్లాడుతూ..మీ కూతురు కెనడాలో డ్రగ్స్ కేసులో పట్టుబడింది అని చెప్పింది. వెంటనే డబ్బులు పంపితే ఆమెను ఈ కేసు నుంచి వదిలేస్తామని లేదంటే థర్డ్ డిగ్రీ తప్పదని బెదిరించడం ప్రారంభించింది. ఫోన్ పే చేయాలంటూ ఒక నంబర్ ఇచ్చింది. పదేపదే డబ్బుల కోసం ఒత్తిడి చేస్తుండడంతో అనుమానించిన శ్రీనివాస్‌రెడ్డి ఆ వాట్సప్ కాల్‌ను కట్ చేసి, కెనడాలో ఉన్న కూతురుకు ఫోన్ చేశారు. ఇంట్లోనే నిద్రపోతున్నానని..తాను క్షేమంగానే ఉన్నానని...ఎలాంటి సమస్య లేదని కూతురు చెప్పింది. దీంతో తన అనుమానం నిజమైందని గుర్తించిన శ్రీనివాస్‌రెడ్డి సైబర్ సెక్యూరిటీ బ్యూరో అధికారులకు ఫిర్యాదు చేశారు. సైబర్ నేరగాళ్లు చేసిన ఫోన్ నంబర్ పాకిస్తాన్ నుంచి వచ్చినట్టుగా గుర్తించారు. తనను మోసగించేందుకు ప్రయత్నించిన వారిపై చర్యలు తీసుకోవాలని శ్రీనివాస్‌రెడ్డి తన ఫిర్యాదులో కోరారు. టీజీ సీఎస్‌బీ డీఎస్పీ కేవీఎం ప్రసాద్ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు ప్రారంభించారు.

Published and Printed by Dhananjaya Reddy Rakkasi on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034, EDITOR: Dhananjaya Reddy Rakkasi, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.

ఆమెకు అనితర సాధ్యమే!

అమర్ సాహిత్యంపై అనితకు ఉస్మానియా పీహెచ్‌డీ

అరుణోదయ గాయని అరుదైన పరిశోధన ● అజ్ఞాత అక్షర యోధుడు.. అమర్

సాయుధ బాటలో సాహితీ సృజన ● అభినందించిన ప్రొఫెసర్ కాశీం

సిరిసిల్ల:

సినుకు సినుకు కురిసిన నేలన
చిత్రమైన వాసన..
అది మల్లెల గంధం అవునో కాదో..
మట్టిపెళ్ల వాసన..
ఈ మట్టి పెళ్ల వాసన..
గడ్డిపూలు సిగనిండా
తురిమి పంచుతున్న వాసనో..
ఆయేటిభూనంగా జీవరాసులు
ఎదకొచ్చే వాసనో..
.. అంటూ ప్రకృతిని పర్యావరణాన్ని
ఆవిష్కరించారు.

బిడ్డా నీకు దీవెన..
కన్నబిడ్డా నీకు దీవెన
బిడ్డా నీకు దీవెన..
కన్నబిడ్డా నీకు దీవెన
తొమ్మిది మాసాలు మోసినా..
ఒడినే ఉయ్యాలజేసినా..
నా ఇంటి కడపళ్ల మెరిసినా..
ఏ అయ్య చేతుల్లో బోసినా..
నన్నెత్తుకాబోంగ ఏడుస్తవనుకంటే..
నన్నెత్తుకాబోంగ ఏడుస్తవనుకంటే..
దినదినగండము నీకమ్మా..
కారడవి వార్తమి విందునమ్మా..
.. అంటూ అడవిబాట పట్టిన
బిడ్డ యాదిలో అమ్మ తలపోత



కూర దేవేందర్ అలియాస్ అమర్ అలియాస్ మిత్ర

రాజన్న సిరిసిల్ల జిల్లాలోని వేములవాడకు చెందిన కూర దేవేందర్ అలియాస్ అమర్ అలియాస్ మిత్ర.. మూడు దశాబ్దాల సాయుధ పోరాటంలో అజ్ఞాతవాసం చేస్తూ సాహితీ సృజన చేశారు. సీపీఐ (ఎంఎల్) జనశక్తి రాష్ట్ర కమిటీ కార్యదర్శిగా, కేంద్ర కమిటీ సభ్యుని హోదాలో 2004 అక్టోబర్‌లో నక్సలైట్లతో రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన శాంతిచర్చల్లో పాల్గొన్నారు. అమర్ తన సాహిత్యయాత్రను 'మిత్ర'కలం పేరుతో కొనసాగించారు. ఆయన సోదరుడు కూర రాజన్న అలియాస్ రాజేందర్ 'జనశక్తి' ఉద్యమ నిర్మాత. అన్నబాటలో అడవుల్లోకి వెళ్లిన అమర్ అద్భుతమైన సాహిత్యాన్ని అందించారు. గన్ను పట్టి ప్రజా సమస్యలపై పోరాడుతూనే.. పెన్ను పట్టి ప్రజల పాటలు రాశారు. ఆయన సాహిత్యంపై 'కైతల కవాతు'పుస్తకం ప్రచురితమైంది. తాజాగా అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య రాష్ట్ర ఉపాధ్యక్షురాలు, గాయని అనిత 'మిత్ర కవిత్వం-సమగ్ర పరిశీలన'అనే అంశంపై ప్రొఫెసర్ చింతకింది కాశీం పర్యవేక్షణలో పరిశోధన పూర్తి చేసి డాక్టరేట్ పొందారు.



ప్రొఫెసర్ కాశీంతో అనిత, విమలక్క, అమర్ దంపతులు

ఆరు అధ్యాయాలుగా అధ్యయనం

- మిత్ర సాహిత్యాన్ని ఆరు అధ్యాయాలుగా విభజించుకుని సమగ్రంగా పరిశీలించారు. మొదటి అధ్యాయంలో రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడలో పుట్టి పెరిగిన మిత్ర బాల్యం, విద్యాభ్యాసం, ఉద్యమజీవితం, అజ్ఞాత జీవితం, శాంతిచర్చలు, జైలు జీవితం వంటి అంశాలపై చర్చించారు.
- రెండో అధ్యాయంలో మిత్ర కవిత్వంలోని విప్లవ దృక్పథాన్ని వివరిస్తూ.. పాటల్లో విప్లవ భావజాలం, వచన కవిత్వంలో ఉన్న విప్లవ దృక్పథాన్ని ఎత్తి చూపారు.
- మూడో అధ్యాయంలో మిత్ర కవిత్వంలోని అస్తిత్వ దృక్పథంలో భాగంగా తెలంగాణ అస్తిత్వాన్ని, దళితవాదం, స్త్రీవాదం, ఇతర అస్తిత్వాల్లోని బీసీలు, మైనారిటీలు, ఆదివాసీలు, దివ్యాంగులకు సంబంధించిన కవిత్వాన్ని అంతటిని పరిశీలనాత్మకంగా వివరించారు.
- నాలుగో అధ్యాయంలో ప్రపంచీకరణ అనే అంశాన్ని ఎంచుకొని.. బహుళజాతి సంస్థల విధ్వంసకర నమూనాలను ప్రశ్నిస్తూ సాగిన మిత్ర కవిత్వంలోని కులవృత్తుల విధ్వంసం, మానవ సంబంధాల విచ్ఛిన్నం అనే అంశాలను స్పష్టం చేశారు.
- ఐదో అధ్యాయంగా మిత్ర స్మృతి కవిత్వంలో కమ్యూనిస్టు, సామాజిక ఉద్యమాల్లో అసువులు బాసిన ఎందరో వీరుల స్మృతి పాటలను పరిశీలించి వాటిని విప్లవ వీరుల సంస్మరణ, మేధావుల స్మృతిగా విభజించి విశ్లేషించారు.
- ఆరో అధ్యాయంగా మిత్ర కవిత్వంలోని శిల్ప నైపుణ్యాలను.. అందులోని భాష, ప్రతీకలు, భావుకత, వర్ణనాత్మకత తదితర అంశాలన్నిటికీ కవిత్వ లక్షణాలకు అన్వయించి వివరించారు. విప్లవ నాయకునిగా కొనసాగుతూ.. ఒక చేతిలో పెన్ను మరో చేతిలో గన్ను పట్టి మూడు దశాబ్దాల పాటు అజ్ఞాత జీవితం గడిపిన 'మిత్ర'కవిత్వాన్ని సమూలంగా విభజించి విశ్లేషిస్తూ ఆయనను 'విప్లవ కవిగా'తన పరిశోధనతో నిరూపించారు. సమగ్ర పరిశీలన ఉండడంతో ఉస్మానియా విశ్వవిద్యాలయం అనితకు డాక్టరేట్‌ను ప్రకటించింది.

పీహెచ్‌డీ చేసిన అనిత ప్రస్థానం

వికారాబాద్ జిల్లా కొడంగల్ ప్రాంతంలోని బొమ్రాసిపేట మండలం రేగడిమైలారం గ్రామానికి చెందిన అనితకుమారి పేదింటి బిడ్డ. ప్రాథమిక విద్యనభ్యసిస్తున్న రోజుల్లోనే తండ్రిని కోల్పోయారు. తల్లి కూలీనాలీ చేసి బిడ్డను చదివించుకుంది. తోబుట్టువుల అండతో అనిత చదువులో రాణించారు. తెలంగాణ ఉద్యమంలో అరుణోదయ సాంస్కృతిక సమాఖ్యలో చేరి గాయనిగా పేరు సంపాదించారు. అనిత పాడిన అనేక పాటలు ఇప్పటికీ ప్రజాబాహుళ్యంలో మారుమోగుతున్నాయి. అరుణోదయ ప్రోత్సాహంతో పీజీ చేశారు. ఉద్యమ పాటలు, సాహిత్యంపై మక్కువ పెంచుకొని మిత్ర కవిత్వంపై పరిశోధనకు పూనుకున్నారు. తెలంగాణ ఉద్యమంతోపాటు మరెన్నో సామాజిక ఉద్యమాల్లో అనిత పాలుపంచుకుంటూనే పీహెచ్‌డీ చేశారు. ఆమె పరిశోధనను ప్రొఫెసర్ చింతకింది కాశీం పర్యవేక్షించారు. ప్రగతిశీల భావాలున్న ఉస్మానియా న్యాయ కళాశాల విద్యార్థి, నల్లగొండ జిల్లా వాసి పురం వెంకటేశ్‌ను పెళ్లి చేసుకున్న అనిత.. మహాత్మాగాంధీ విశ్వవిద్యాలయం తెలుగు శాఖలో పార్ట్ టైం అధ్యాపకురాలిగా పని చేస్తున్నారు.

ఉద్యమ సాహిత్యానికి అరుదైన గౌరవం

ఉమ్మడి తెలుగు రాష్ట్రాల్లో ప్రజాసాహిత్యానికి, ఉద్యమ నేపథ్యానికి డాక్టరేట్ రావడం అరుదైన గౌరవంగా భావిస్తున్నారు. అంకితభావంతో మిత్ర సాహిత్యాన్ని సృజించి డాక్టరేట్ పట్టా పొందిన సందర్భంగా అనితను ప్రొఫెసర్ కాశీం అభినందించారు. అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య గౌరవ అధ్యక్షురాలు, ప్రజాయుద్ధభేరి విమలక్క, కూర దేవేందర్ (మిత్ర), అరుణోదయ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఏపూరి మల్సూర్, ప్రధాన కార్యదర్శి రమేశ్ పోతుల, ఉపాధ్యక్షుడు సురేష్, సహాయ కార్యదర్శి ప్రభాకర్, రాకేశ్, కోశాధికారి భాస్కర్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నూతన్, గంగ, లింగన్న, రామన్న, చిన్నన్న, స్వామి తదితరులు కూడా అభినందనలు తెలిపారు. వేములవాడకు చెందిన కూర దేవేందర్ దళిత, బహుజన, పీడిత ప్రజల సాహిత్యానికి డాక్టరేట్ రావడం విశేషం.



కేంద్ర మాజీ మంత్రి కావూరి సాంబశివరావు 60వ వివాహ వార్షికోత్సవం సందర్భంగా ఆదివారం ఆయన్ను కలిసి శుభాకాంక్షలు తెలియజేస్తున్న మంత్రులు పొన్నం ప్రభాకర్, తుమ్మల నాగేశ్వరరావు



కంటోన్మెంట్ ఇంపీరియల్ గార్డెన్‌లో మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్ ఆధ్వర్యంలో నిర్వహించిన వికసిత భారత్ సంకల్ప సభ కార్యక్రమంలో కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి



సభకు హాజరైన బీజేపీ నేతలు, కార్యకర్తలు



సభలో సన్నాయి వాయిస్తున్న కళాకారులు

ధాన్యం కుంభకోణంపై చర్యలేవి?

- కొనుగోలు టెండర్లలో రూ.1,100 కోట్ల అవకతవకలు
- ప్రతి కాంగ్రెస్ ఎమ్మెల్యేకు రూ.10 కోట్లు ఇచ్చారు..
- బీఆర్‌ఎస్ మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి

సాక్షి, హైదరాబాద్: ధాన్యం కొనుగోలు టెండర్లలో కుంభకోణంపై ప్రభుత్వం ఇప్పటి వరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదని బీఆర్‌ఎస్ మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి ఆరోపించారు. నలుగురు బిడ్డర్స్ మాత్రమే టెండర్లలో పాల్గొన్నారని, క్వింటాల్ వడ్లకు రూ.2,007 ధర నిర్ణయించారని అన్నారు. ఇప్పటి వరకు ధాన్యం లిఫ్ట్ చేయకుండా మిల్లర్ల నుంచి వసూళ్లకు పాల్పడ్డారని, మిల్లర్ల నుంచి బిడ్డర్ల అకౌంట్లలోకి నగదు బదిలీ అయిందని తెలిపారు. మొత్తంగా రూ.1,100 కోట్ల మేర కుంభకోణం జరిగిందని ఆయన ఆరోపించారు. ఆదివారం తెలంగాణ భవన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ, ధాన్యం కొనుగోళ్ల కుంభకోణంపై అసెంబ్లీలో మాజీ మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావు మాట్లాడినా ప్రభుత్వం స్పందించలేదన్నారు. 'క్వింటాల్‌కు రూ. 2,007 బదులు రూ. 2,230 వసూలు చేశారు. విజిలెన్స్ కమిషన్ కు, ఏసీబీకి ఫిర్యాదు చేసినా చర్యలు తీసుకోలేదు. మొత్తం 7,500 కోట్ల రూపాయలు ఈ టెండర్ల ద్వారా ప్రభుత్వ ఖజానాకు చేరాలి. కానీ సగం కూడా రాలేదు. ఈ అంశంపై హైకోర్టులో బీఆర్‌ఎస్ పిల్ వేసింది. సీఎం, రాష్ట్ర మంత్రికి హైకోర్టు నోటీసులు ఇచ్చింది. కౌంటర్ దాఖలు చేయడానికి 16 వాయిదాలు తీసుకున్నారు. మీరు అవినీతి చేయకపోతే కోర్టు వాయిదాలు ఎందుకు కోరుతున్నారు'అని ఆయన నిలదీశారు. 'కాంగ్రెస్ పార్టీకి బిడ్డర్లు రూ.1,100 కోట్లు ఇచ్చారు. అన్ని ఆధారాలు కోర్టుకు ఇచ్చాం. కాంగ్రెస్ పార్టీకి చెందిన ప్రతి ఎమ్మెల్యేకు రూ.10 కోట్లు డబ్బులు చేరాయి. అందుకే వారెవరు దీనిపై మాట్లాడడం లేదు'అని సుదర్శన్‌రెడ్డి విమర్శించారు. ఈ కుంభకోణంలో కాంగ్రెస్ పార్టీ ఢిల్లీ ప్రతినిధులు కూడా ఉన్నారని ఆయన ఆరోపించారు. త్వరలో దీనిపై బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో ధర్నా చేస్తామని తెలిపారు.

చితికిన బతుకు జట్కా బండి

టాంగాల ఉనికికి ఆధునికీకరణ దెబ్బ


రోడ్ల అభివృద్ధి.. పెరిగిన వాహనాలతో టాంగాల ఉనికికి దెబ్బ ● ఆదరణ లేక పూట గడవడమే కష్టం

పాతగుట్ట దారిలోనే టాంగాలు ● దయనీయంగా యాదగిరిగుట్ట టాంగా కార్మికులు

సాక్షి, యాదాద్రి: అభివృద్ధి అందరి జీవితాల్లో వెలుగులు తీసుకొస్తే.. యాదగిరిగుట్ట టాంగా కార్మికుల జీవితాల్లో మాత్రం చీకటి మిగుల్చుతోంది. సుప్రసిద్ధ పుణ్యక్షేత్రం యాదగిరిగుట్టకు బస్సు సౌకర్యం లేని రోజుల నుంచి.. ప్రధాన రవాణా వ్యవస్థగా ఉన్న టాంగాలు.. ఆధునిక వాహన ప్రపంచంలో క్రమంగా తగ్గుముఖం పడుతున్నాయి. ఈ వృత్తినే నమ్ముకున్న కార్మికులు ప్రస్తుతం పూట గడవని స్థితిలో ఉన్నారు. ఆహ్లాదం కోసం టాంగాలో ఎక్కి ఒక్కసారైనా ప్రయాణించాలని ఆశపడే కొందరు భక్తుల వల్లే.. కొద్దోగొప్ప ఉపాధిని పొందుతున్నారు.

పెరిగిన భక్తులు .. తగ్గిన ఆదాయం

ఆలయ పునర్నిర్మాణం తర్వాత యాదగిరిగుట్టకు రోజు రోజుకూ భక్తులు పెరుగుతున్నారు. రద్దీతో తమ రోజు వారి గిరాకీ పెరిగి.. ఆదాయం ఎక్కువ వస్తుందని భావించిన టాంగా కార్మికుల ఆశలు నీరుగారిపోయాయి. ఆటోలు, బస్సులు, సొంత వాహనాలు పెరిగాయి. ఫలితంగా తరతరాలుగా టాంగాల్నే నమ్ముకున్న వీరు మరో పనిచేయలేక.. కుటుంబాన్ని పోషించుకోవడానికి జవసత్వాలను తెచ్చుకుని బతుకు బండి లాగిస్తున్నారు. ఇంత స్పీడ్ యుగంలో కూడా గుర్రపు బండ్లను నమ్ముకుని యాదగిరిగుట్టలో టాంగాలపైనే ఆధారపడిన కుటుంబాల బతుకు చిత్రం దయనీయంగా ఉంది. తెలంగాణ తిరుపతిగా అభివృద్ధి చెందుతున్న యాదగిరిగుట్ట లక్ష్మీనర్సింహస్వామిని దర్శించుకోవడానికి వచ్చే భక్తులకు సుమారు 70 ఏళ్లుగా టాంగాలే ప్రధాన రవాణా సౌకర్యం. యాదగిరిగుట్ట ఆర్టీసీ డిపో లేని రోజుల్లో హైదరాబాద్, వరంగల్ మధ్యన గల రాయగిరి రైల్వే స్టేషన్‌లో దిగే వందలాది మంది భక్తులు.. స్వామి వారిని చేరుకోవాలంటే టాంగాలే దిక్కు. యాదగిరిగుట్ట బస్ డిపో ఏర్పాటు తర్వాత కూడా ప్రయాణికులు టాంగాల్లోనే ప్రయాణించేవారు. రాయగిరి, యాదగిరిపల్లి, గుండ్లపల్లి, యాదగిరిగుట్ట, సైదాపురం, మల్లాపురం.. ఇలా చుట్టు పక్కల గ్రామాలకు చెందిన టాంగా కార్మికులు సుమారు 100 మంది టాంగాలను నడుపుతూ జీవించేవారు. రాయగిరి రైల్వే స్టేషన్, వడాయిగూడెం, యాదగిరిగుట్ట ఇలా మూడు స్టేజీల్లో భక్తులు, స్థానిక ప్రజలు టాంగాలపై ప్రయాణించేవారు. ఈ కుటుంబాలకున్న ప్రధాన ఆదాయ వనరు టాంగాలే కావడంతో.. రెండో తరం కూడా వాటిపై ఆధారపడి చాలీచాలని కూలితో జీవితాలను వెళ్లదీస్తున్నారు.



యాదగిరిగుట్టలో టాంగాల వద్ద కార్మికులు

తగ్గిన గిరాకీ

యాదగిరిగుట్ట ఆర్టీసీ డిపో ఏర్పాటు కావడంతో ఎర్రబస్సులు వచ్చాయి. రోడ్లు వెడల్పు కావడంతో బస్సులకు తోడుగా ఆటోలు, ప్రయాణికులకు ద్విచక్ర, నాలుగు చక్రాల సొంత వాహనాలు వచ్చాయి. దీంతో టాంగాలకు గిరాకీ తగ్గింది. టాంగాల వృత్తిని వీడలేక.. ప్రత్యామ్నాయం కనుచూపు మేరలో కనిపించక.. చాలీచాలని కూలితో విధిలేని పరిస్థితిలో బతుకు బండి నడుపుతున్నారు.

ఒక్క రూటే దిక్కయింది

టాంగాల ద్వారా యాదగిరిగుట్ట నుంచి పాత గుట్ట శ్రీ లక్ష్మీనర్సింహ స్వామి వారి ఆలయం వరకు.. టాంగాల్లో తీసుకుపోయి తిరిగి యాదగిరిగుట్ట వరకు భక్తులను తీసుకుని వస్తున్నారు. ఒకప్పుడు గుట్ట నలుదిక్కులా గ్రామాలకు టాంగాలను నడిపిన కార్మికులు.. ప్రస్తుతం యాదగిరిగుట్ట నుంచి పాతగుట్ట వరకు మాత్రమే పరిమితమయ్యారు. రాయగిరి నుంచి బస్‌లు, ఆటోలు పెరగడంతో ఈ మార్గంలో టాంగాలు నడవడం లేదు. పాతగుట్ట రూట్లో నడిచే టాంగాలకు ఆటోల నుంచి పోటీ ఎదురు కావడంతో ఆందోళన నిర్వహించి.. ఆ ఒక్క రూట్లో ఆటోలు నడవకుండా కట్టడి చేసుకున్నారు. యాదగిరిగుట్ట, వడాయిగూడెం, రాయగిరి, గుండ్లపల్లి నుంచి ప్రస్తుతం 40 ఆటోలు నడుస్తున్నాయి. ఆదివారం, శనివారం, సెలవు రోజులు వస్తే అధికంగా వచ్చే భక్తుల వల్ల అన్ని టాంగాలకు పనిదొరికి రోజుకు రూ.300 నుంచి రూ.400 వరకు సంపాదిస్తారు. మిగతా రోజుల్లో రూ.100 సంపాదించడమే చాలా కష్టం. కొందరైతే టాంగాలను రోడ్డుపైకి తీసుకురారు. యాదాద్రి రోడ్డు విస్తరణ పేరుతో గ్రామపంచాయతీ ఎదురుగా ఉన్న టాంగాల స్టాండ్ తొలగించారు. దీంతో రోడ్డు పక్కన టాంగాలు ఆపితే ట్రాఫిక్ పోలీసులు పంపిస్తున్నారు.

ప్రభుత్వం సహకరించాలి



టాంగా తోలుకుని స్వశక్తితో బతుకుబండి లాగిస్తున్న మాకు ప్రభుత్వం సహకారం అందించాలి. టాంగాలు, గుర్రాల కొనుగోలుకు ప్రభుత్వం ఆర్థిక సహాయం చేయాలి. రోడ్డు బాగాలేక గుర్రాలు అవస్థలు పడుతున్నాయి. టాంగాలు పెట్టుకోవడానికి స్టాండ్ కూడా లేదు. రోడ్డుపక్కన పెడుతుంటే ప్రతి ఒక్కరూ బెదిరిస్తున్నారు. టాంగా స్టాండ్ ఏర్పాటు చేయాలి.

– అశోక్ గౌడ్, యాదగిరిగుట్ట

మా బతుకులు మారలేదు



పాతగుట్ట లక్ష్మీనర్సింహస్వామి దేవస్థానం వరకు 40 ఏళ్లుగా 50 పైసల కిరాయికి తోలుతున్నా. రోడ్డు సౌకర్యం సరిగా లేని రోజుల నుంచి టాంగా నడుపుతున్నా. ప్రస్తుతం కూడా పాత గుట్ట రోడ్డు ఏమీ బాగాలేదు. రోడ్డు వేయాలి. టాంగా తోలడం ద్వారా వస్తున్న కొద్దిపాటి ఆదాయంతోనే కుటుంబాన్ని పోషించుకుంటున్నాను. ప్రభుత్వాలు ఎన్ని మారినా మా జీవితాలు మాత్రం మారడం లేదు.

– చిన్న బాబు, టాంగా కార్మికుడు, రాయగిరి రైల్వే స్టేషన్

చదువుకు పిల్లలు దూరం



మా తాత రాయగిరి నుంచి యాదగిరిగుట్టకు ఎడ్ల బండిని నడిపేవాడు. మా నాన్న టాంగాలు తోలేవాడు. నేను 11 ఏళ్లుగా టాంగా తోలుతున్నా. వచ్చే డబ్బులతో పిల్లలను సరిగా చదివించలేకపోతున్నా. కుటుంబపోషణ భారంగా మారింది. టాంగా కార్మికులకు రుణాలు ఇవ్వాలి.

– శంకర్, రాయగిరి స్టేషన్

ఒకప్పుడు చంటిపిల్లలకు చందమామను చూపి గోరుముద్దలు తినిపించేవారు. ఆ తర్వాత తరం వారు వీధిలోకి వెళ్లి జంతువులు, ఇతర పిల్లలను చూపిస్తూ అన్నం పెట్టేవారు. గత తరం వారు టీవీలో కార్టూన్ బొమ్మలు చూపించి పిల్లలకు భోజనం పెట్టేవారు. కానీ నేటితరం మాత్రం మొబైల్ చేతికిచ్చి భోజనం తినిపిస్తున్నారు. అలవాటైన చిన్నారులు రాత్రింబవళ్లు మొబైల్ కావాలంటున్నారు. దీంతో వారికి మూడేళ్ల వయస్సు వచ్చినా మాటలు రాని పరిస్థితి నెలకొంటోందని, చిన్న పదాలు కూడా పలకడం లేదని వైద్యులు హెచ్చరిస్తున్నారు.

– కర్నూలు(హాస్పిటల్)

➤ కర్నూలు వెంకటరమణకాలనీకి చెందిన శివరాముడుకి ఒక కుమారుడు ఉన్నాడు. పాలుతాగాలన్నా, ఏదైనా తినాలన్నా మొబైల్ ఇవ్వాల్సిందే. ఇప్పుడు ఆ బాలునికి మూడేళ్ల వయస్సు. ఇప్పటికీ ఆ బాలుడికి మాటలు రావడం లేదు.

➤ కర్నూలుకు చెందిన లలితకుమారికి భర్త ఇటీవలే మృతి చెందాడు. ఒక్కగానొక్క కుమారున్ని అల్లారుముద్దుగా పెంచేందుకు ఆమె రెండేళ్ల వయస్సు నుంచే పిల్లాడిని గారాబం ఎక్కువ చేసింది. ఈ క్రమంలో ఆ బాలుడు సెల్‌ఫోన్‌కు ఎక్కువగా బానిసయ్యాడు. అర్ధరాత్రి 2 గంటలైనా సెల్‌ఫోన్ చూస్తూ గడిపేవాడు. ఈ క్రమంలో బాలుడు నాలుగేళ్ల వయస్సు వచ్చినా మాట్లాడటం లేదు.

మాటరాని మౌనమిది!

- మూడేళ్లయినా మాటలు రాని చిన్నారులు
- పదాలు పలికేందుకు ఇబ్బందులు
- సెల్‌ఫోన్ వాడకమే కారణమంటున్న వైద్యులు
- చిన్నపిల్లల వైద్యుల వద్దకు తల్లిదండ్రుల క్యూ



ఒకప్పుడు ప్రతి ఇంట్లో పిల్లలకు అమ్మానాన్నలతో పాటు తాతయ్య, నానమ్మ, చిన్నాన్న, చిన్నమ్మ, అత్తమ్మలు ఉండేవారు. వీరందరూ పిల్లలను ఆడిస్తూ పెంచేవారు. బయటకు తీసుకెళ్లి ప్రపంచాన్ని చూపించి పిల్లలను ఆనందింపజేసేవారు. ఇప్పుడు ఇంట్లో ఎంత మంది ఉంటే అందరూ బిజీగా మారారు. చిన్నకుటుంబాలు ఎక్కువ కావడంతో పిల్లలను ఆడించేవారు కరువయ్యారు. వారికి సెల్‌ఫోన్‌లో వచ్చే ఆటలే ఆటవస్తువులుగా మారాయి. అందులో వచ్చే కార్టూన్ బొమ్మలను, రంగులను చూసి పిల్లలు ఆకర్షితులు అవుతున్నారు. రెండేళ్ల వయస్సు కూడా రాకముందే పెద్దల కంటే మిన్నగా మొబైల్‌ను ఆపరేట్ చేసేస్తున్నారంటే అతిశయోక్తి కాదు. వారి ఉత్సాహం, చైతన్యం చూసి ఆ వయస్సులోని చిన్నారులను చూసి ఇంట్లో తల్లిదండ్రులతో పాటు పెద్దలు కూడా ఎంతో సంతోషిస్తున్నారు.

మాట ముచ్చట కురువై..

అతి చిన్న వయస్సులోనే సెల్‌ఫోన్‌లోని ఫీచర్లను వాడేయడం, యూట్యూబ్‌తో పాటు సోషల్ మీడియాను ఎలా వాడాలో పెద్దలకు చూపించడం వంటివి నేర్వడంతో సంతోషించడం పెద్దల వంతైంది. ఈ క్రమంలోనే వారికి మూడేళ్లు వచ్చినా మాటలు రాకపోవడం చాలా మంది గమనించలేకపోతున్నారు. ఒకప్పుడు ఏడాదిన్నరకే అమ్మానాన్నతో పాటు అవ్వా తాత, అత్తమ్మ, మామ అనే చిన్న చిన్న పదాలు పలికేవారు. రెండేళ్ల వయస్సుకు పొట్టిపదాలతో మాట్లాడేవారు. మూడేళ్లకు వచ్చీరానీ మాటలతో గలగలా మాట్లాడుతూ అల్లరి చేసేవారు. ఇప్పుడు ఏ ఇంట్లో చూసినా ఆ ముచ్చటే కరువైంది. పెద్దలతో పాటు పిల్లలు కూడా సెల్‌ఫోన్‌లకు బానిసలు కావడంతో ఒకరితో ఒకరు మాట్లాడుకోవడం మానేశారు.

చికిత్స కోసం ఆసుపత్రులకు

కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల ఆవరణలోని బాలల సత్వర చికిత్స కేంద్రంలో గత ఐదేళ్లలో పుట్టుకతో వచ్చిన లోపాలతో పాటు ఎదుగుదల లోపాలతో వచ్చే చిన్నారులు కూడా ఉన్నారు. వీరిలో అధిక శాతం చిన్నతనంలోనే మొబైల్ వాడకం వల్ల మాటలు రాకపోవడంతో పాటు దృష్టిలోపం, వినికిడిలోపం, నేర్చుకోలేకపోవడం, భాష తెలియకపోవడం వంటి లోపాలతో వస్తున్నారు. ఇక్కడే గాకుండా చిన్నపిల్లల విభాగంలోనూ ఇలాంటి చిన్నారులు చికిత్స కోసం వస్తున్నారు. ప్రైవేటు ఆసుపత్రులు, క్లినిక్‌లలోనూ ప్రతిరోజూ పదుల సంఖ్యలో ఇలాంటి చిన్నారులను చూస్తున్నట్లు వైద్యులు చెబుతున్నారు.

పిల్లల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం

చిన్నతనంలో ఎక్కువ సమయం డిజిటల్ తెరలను చూడటంతో వారిలో సమాజంలో ఇతరులను కలిసే తత్వం తగ్గుతుంది. పిల్లలు ఆటల పట్ల దృష్టి పెట్టే సమయాన్ని తగ్గిస్తాయి. ఎక్కువసేపు మొబైల్ చూసే పిల్లల్లో ఊబకాయం వస్తుంది. ఇది భవిష్యత్‌లో వారి ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతుంది. వారు నిద్రించే సమయాన్ని తగ్గిస్తుంది. డిజిటల్ తెరల నుంచి వెలువడే నీలికాంతి ఎండోజెనస్ మెలటోనిన్‌ను అణిచివేస్తుంది.

మొబైల్‌కు దూరంగా ఉంచడమే మేలు

పిల్లల భాషా నైపుణ్య అభివృద్ధికి మొబైల్ తెరలే అవరోధంగా నిలుస్తున్నాయి. అల్లరి మాన్పించేందుకు, ఆహారం తినిపించేందుకు అలవాటు పడిన ఈ మొబైల్ ఫోన్ వారిని బానసలుగా మార్చుకుంటోంది. ఈ క్రమంలో చిన్నారుల ఎదుగుదలపై అవి తీవ్రంగా ప్రభావాన్ని చూపిస్తోంది. భవిష్యత్ ప్రమాదాలను దృష్టిలో ఉంచుకుని ప్రతి ఇంట్లో తల్లిదండ్రులతో పాటు ఇంట్లోని పెద్దలు సైతం వారి ఇంట్లోని చిన్నారులను మొబైల్‌కు దూరంగా ఉంచే ప్రయత్నం చేయాలి. ఈ మేరకు ముందుగా పిల్లల ముందు పెద్దలు సైతం మొబైల్ ఎక్కువగా వాడకుండా ఉండటమే మేలు. పెద్దలు వాడకపోతే పిల్లలు అటువైపు దృష్టి సారించరు. ఈ సమయంలో పిల్లలు ఆడుకునేందుకు బొమ్మలను కొనివ్వడం, ఆటలు ఆడించడం, మైదానాలు, పార్కులకు తీసుకెళ్లి ఆడించడం, బంధువుల ఇళ్లకు తీసుకెళ్లి వారిని పరిచయడం చేయించడం, వారి పిల్లలతో స్నేహం చేయించడం వంటివి చేయాలి. అప్పుడే పిల్లల్లో శారీరక, మానసిక అభివృద్ధి చెందుతుంది.

క్లుప్తంగా...

టీచర్ల బదిలీల్లో సమస్యలను పరిష్కరించండి

యూటీఎఫ్ డిమాండ్

సాక్షి, అమరావతి: ఉపాధ్యాయుల బదిలీలు, హేతుబద్ధీకరణలో తలెత్తిన అసంబద్ధతలను పరిష్కరించి ఉపాధ్యాయులకు న్యాయం చేయాలని యునైటెడ్ టీచర్స్ ఫెడరేషన్ (యూటీఎఫ్) రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎన్.వెంకటేశ్వర్లు, కేఎస్ఎస్ ప్రసాద్ డిమాండ్ చేశారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో సమాంతరంగా తెలుగు మాధ్యమాన్ని కొనసాగించాలని విజ్ఞప్తి చేశారు. యూటీఎఫ్ రాష్ట్ర కార్యవర్గ సమావేశం ఆదివారం విజయవాడలో జరిగింది. అనంతరం విడుదలైన ఒక ప్రకటనలో బదిలీ చట్టానికి భిన్నంగా అధికారులు వ్యవహరించడంతో తీవ్ర నష్టం జరిగిందని అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పేర్కొన్నారు. ప్రధానంగా స్పౌజ్, ప్రిఫరెన్షియల్ కేటగిరీలో నిబంధనలను పూర్తిగా ఉల్లంఘించారని విమర్శించారు. క్లస్టర్ ఖాళీలు,డీఈవో పూల్ టీచర్ల అంశాల్లో అధికారులు మొండిగా వ్యవహరించారని ఆవేదన వ్యక్తం చేశారు.

శిక్షణతో టీచర్లను బడులకు దూరం చేయొద్దు

ఎస్సీ,ఎస్టీ ఎంప్లాయిస్ అసోసియేషన్ విజ్ఞప్తి

సాక్షి, అమరావతి: ప్రభుత్వ ఉపాధ్యాయులకు వృత్యంతర శిక్షణను స్కూల్ కాంప్లెక్సుల్లో ఒక రోజుకు పరిమితం చేయాలని, శిక్షణ పేరుతో వారాల కొద్దీ పాఠశాలలకు వారిని దూరం చేయడం సరికాదని ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు దేవరపల్లి సురేష్ బాబు ఓ ప్రకటనలో విమర్శించారు. ప్రభుత్వ పాఠశాలల్లో టీచర్లకు ఏడాది పొడవునా విడతల వారీగా రకరకాల శిక్షణలకు పంపడం ద్వారా పాఠశాలల్లో విలువైన బోధనా సమయం వృథా అవుతుందని పేర్కొన్నారు. ఇప్పటికే పాఠశాలల్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు చెందిన వివిధ రకాల యాప్‌లలో వివరాల నమోదుకు గంటల కొద్దీ సమయం కేటాయించాల్సి వస్తుందని పేర్కొన్నారు. ప్రభుత్వం క్షేత్రస్థాయిలో పరిస్థితులకు అనుగుణంగా టీచర్ల శిక్షణపై పునరాలోచించాలని విజ్ఞప్తి చేశారు.

నామినేటెడ్ పదవుల్లో కురుబలకు ప్రాధాన్యత ఇవ్వాలి


ఏపీ కురుబ సంఘం రాష్ట్ర అధ్యక్షులు జబ్బుల శ్రీనివాసులు

మదనపల్లె రూరల్: కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలు నామినేటెడ్ పదవుల్లో కురుబ కులానికి ప్రాధాన్యత ఇవ్వాలని ఏపీ కురుబ, కురుమ, కురువ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జబ్బుల శ్రీనివాసులు కోరారు. ఆదివారం అన్నమయ్య జిల్లా మదనపల్లె మండలం టిడ్కో గృహాల సమీపంలోని గాయత్రి పార్క్‌లో ఏపీ కురుబ సంఘం రాష్ట్ర కమిటీ సమావేశం జరిగింది. సమావేశంలో కురుబ కుల అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలు, ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాల్సిన సమస్యలు, కురుబసంఘం రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గ యువత, మహిళా, ఉద్యోగుల కమిటీ ఏర్పాటు, తిరుపతిలో కనకదాస విగ్రహం ఏర్పాటు, ఆవిష్కరణ, కమ్యూనిటీ భవనానికి స్థలం కేటాయింపు విషయమై ప్రభుత్వ పెద్దలను కలవడం తదితర అంశాలపై చర్చించారు.

క్వాంటమ్ టెక్నాలజీ సిలబస్‌పై నిపుణుల కమిటీ

సాక్షి, అమరావతి: ఉన్నత విద్యలో క్వాంటమ్ టెక్నాలజీ, ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) సిలబస్‌ను ప్రవేశపెట్టేందుకు నిపుణుల కమిటీని నియమించినట్టు ఉన్నత విద్యా మండలి కార్యదర్శి టి.వి.శ్రీకృష్ణమూర్తి ఓ ప్రకటనలో తెలిపారు. జాతీయ విద్యావిధానం–2020 అమలులో భాగంగా ఈ అంశాలపై పాఠ్య ప్రణాళిక రూపొందించేందుకు కేంద్ర సైన్స్ అండ్ టెక్నాలజీ మంత్రిత్వశాఖలోని డిపార్ట్‌మెంట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ హెడ్ చైర్మన్‌గా ఈ రంగంలో నిపుణులైన మరో 12 మందిని సభ్యులుగా నియమించినట్టు పేర్కొన్నారు. ఆదివారం ఆత్మకూరులోని ఉన్నత విద్యా మండలి ప్రధాన కార్యాలయంలో సంస్థ చైర్మన్ ప్రొఫెసర్ మధుమూర్తి అధ్యక్షతన కమిటీ సమావేశం నిర్వహించినట్టు తెలిపారు. ఈ సందర్భంగా పాఠ్య ప్రణాళిక, ల్యాబ్స్ ఏర్పాటు తదితర అంశాలపై చర్చించినట్టు పేర్కొన్నారు.

పట్టు తప్పుతోంది!





- రోజురోజుకూ పడిపోతున్న పట్టుగూళ్ల ధరలు
- హిందూపురం' మార్కెట్‌లో కిలో రూ.600 కూడా పలకని వైనం
- ధరల తగ్గుదలతో ఆందోళనలో రైతులు
- ప్రభుత్వమే ఆదుకోవాలని వేడుకోలు

దిగుబడి పెరిగిందని ఆనందంలో ఉన్న పట్టురైతుకు 'ధరాఘాతం' తగులుతోంది. బైవోల్టిన్ పట్టుగూళ్ల ధర రోజురోజుకూ దిగజారుతుండగా..రైతు పరిస్థితి బేజారవుతోంది. ప్రోత్సాహకం అందించి ఆదుకోవాల్సిన కూటమి సర్కార్ పట్టించుకోకపోవడంతో రైతులు నష్టాలు మూటగట్టుకుంటున్నారు.

మడకశిర/హిందూపురం: పట్టుగూళ్ల ధరలు నెలరోజులుగా తగ్గుముఖం పట్టాయి. పట్టుగూళ్ల విక్రయాలకు రాష్ట్రంలోనే పేరెన్నికగన్న సత్యసాయి జిల్లా హిందూపురం మార్కెట్‌లోనూ ఆశించిన ధర దక్కడం లేదు. నాణ్యత బాగానే ఉన్నప్పటికీ ధర లేకపోవడంతో రైతులు నిరాశ చెందుతున్నారు.

ధరలేక రైతు దిగాలు..

ప్రస్తుతం హిందూపురం మార్కెట్‌కు రోజూ 4 వేల నుంచి 5 వేల క్వింటాళ్ల వరకు బైవోల్టిన్ పట్టుగూళ్లు వస్తున్నాయి. హిందూపురం పరిసర ప్రాంతాల నుంచే కాకుండా వివిధ జిల్లాలతోపాటు కర్ణాటక ప్రాంతం నుంచి కూడా రైతులు పట్టుగూళ్లను ఇక్కడికి తెస్తున్నారు. అయితే నాణ్యమైన గూళ్లు తెచ్చినా రైతులు ఆశించిన ధర మాత్రం పలకడం లేదు. నెల క్రితం కేజీ బైవోల్టిన్ పట్టుగూళ్లు గరిష్టంగా రూ.750 వరకు పలికాయి. కనిష్ట ధర రూ.620 తగ్గకుండా ఉండేది. అయితే కొన్ని రోజుల నుంచి గరిష్ట ధర రూ.600 దాటడం లేదు. కనిష్ట ధర రూ.500 లోపే ఉంటోంది. దీంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. ఒక్కోసారి హిందూపురం వరకూ పట్టుగూళ్లు తెచ్చిన రవాణా ఖర్చులు కూడా రావడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

వేచిచూస్తే కొంతమేలు..

పట్టుగూళ్ల అమ్మకాలకు ఆన్‌లైన్ ద్వారా టెండర్ వేసే ప్రక్రియ సాగుతోంది. అయితే ప్రతిసారి 1, 2 టెండర్లలో తక్కువ ధర లభిస్తోంది. అందువల్ల మూడో టెండర్ వరకు వేచి చూస్తేనే ధర కాస్త పెరుగుతుందని రైతులు చెబుతున్నారు. కొన్నిసార్లు మూడో టెండర్‌లోనూ మంచి ధర దక్కడం లేదంటున్నారు. పట్టుగూళ్లు నిల్వచేసే అవకాశం లేకపోవడంతో రీలర్లు ఏకమై ధర తగ్గిస్తున్నారని రైతులు వాపోతున్నారు.

ఆదుకోని ప్రభుత్వం..

మార్కెట్‌లో పట్టుగూళ్ల ధరలు హెచ్చుతగ్గులు ఉన్నప్పుడు తగు చర్యలు తీసుకుని ప్రభుత్వం పట్టురైతులను ఆదుకోవాల్సి ఉన్నా.. ఆ మేరకు చర్యలు తీసుకోవడం లేదు. బైవోల్టిన్ రకం పట్టు గూళ్ల ఉత్పత్తికి కిలోపై అదనంగా ఇచ్చే రూ.50 ప్రోత్సాహకాన్ని కూటమి ప్రభుత్వం ఇప్పటి వరకూ అందించలేదు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి పట్టు రైతులకు అండగా నిలవాలని రైతులు కోరుతున్నారు.



హిందూపురం మార్కెట్‌లో అమ్మకానికి వచ్చిన పట్టుగూళ్లు

ఈ నెలలో బైవోల్టిన్ పట్టుగూళ్ల ధరలు ఇలా..

తేదీ	కనిష్ట ధర (కేజీ)	గరిష్ట ధర (కేజీ)
13.06.25	రూ. 430	రూ. 643
14.06.25	రూ.405	రూ.626
15.06.25	రూ.398	రూ.610
16.06.25	రూ.344	రూ.562
17.06.25	రూ.333	రూ.545
18.06.25	రూ.271	రూ.562
19.06.25	రూ.450	రూ.593
20.06.25	రూ.343	రూ.641

కేజీపై రూ.150 వరకు ధర తగ్గింది



వారంలోనే కేజీ బైవోల్టిన్ పట్టుగూళ్లపై దాదాపు రూ.150 వరకు ధర తగ్గింది. ఇంతకు మునుపు కేజీ పట్టుగూళ్లు రూ.750 వరకు పలికాయి. ప్రస్తుతం రూ.600 కూడా ధర రావడం లేదు. రాష్ట్ర ప్రభుత్వం గిట్టుబాటు ధర కల్పించడంతో పాటు పట్టు రైతులకు అండగా నిలవాలి.

– సోమ్‌కుమార్, మడకశిర

కనీస మద్దతు ధర ఇవ్వాలి



పట్టుగూళ్లకు ఆన్‌లైన్ ద్వారా ధర చాలా తక్కువగా నిర్ణయిస్తున్నారు. దీంతో మూడో టెండర్ వరకూ వేచి చూశాం. అయినా కేజీ బైవోల్టిన్ రూ.522 వరకే ధర పలికింది. నాణ్యమైన గూళ్లకు ఇంత తక్కువ రేటు నిర్ణయిస్తే రైతు ఏ విధంగా గట్టెక్కగలరు. కనీస మద్దతు ధర ఇవ్వాలి

– సత్యనారాయణ, సోమందేపల్లి

నాణ్యతబట్టే ధర



నాణ్యత ఆధారంగా పట్టు గూళ్లకు ధర ఉంటోంది. వాతావరణ పరిస్థితుల కారణంగా గూళ్ల నాణ్యత తగ్గి రేటుపై ప్రభావం చూపుతోంది. దిగుబడి పెరిగిన కారణంగా డిమాండ్ కొంత తగ్గింది. రీలర్లు ఎక్కువ మంది పాల్గొనేలా చేసి ధర పెంచేందుకు కృషి చేస్తాం.

– హంపయ్య, మార్కెట్ అధికారి, హిందూపురం

కోలుకోలేక..



దేవరపల్లి మండలం కురుకూరులో కొబ్బరిలో అంతర పంట కోకో సాగు

- కోకో సాగుకు ఎకరాకు రూ.2 లక్షల వ్యయం
- ఆదాయం రూ.1.30 లక్షలు
- నష్టం రూ.70 వేలు
- పెట్టుబడి రాక కోకో కౌలు రైతుల దిగాలు
- మద్దతు ధర ఇవ్వాలని డిమాండ్

దేవరపల్లి: కంపెనీలు సిండికేట్ కావడం.. గిట్టుబాటు ధర ఇవ్వకపోవడం.. ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో కోకో రైతులు ఈ ఏడాది కోలుకోలేని విధంగా దెబ్బ తిన్నారు. ముఖ్యంగా కౌలు రైతుల పరిస్థితి మరింత దారుణంగా ఉంది. గత పంట కాలంలో ఎకరాకు రూ.5 లక్షల నుంచి రూ.6 లక్షల వరకూ ఆదాయం రావడంతో మంచి లాభాలు కళ్లజూశారు. దీంతో, 2024–25 పంట కాలంలో అధిక ధరకు కోకో తోటలు కౌలుకు తీసుకున్నారు. 2022–23లో ఎకరం కౌలు రూ.20 వేల నుంచి రూ.25 వేలుండగా, 2023–24లో అది రూ.30 వేలకు పెరిగింది. అప్పట్లో కిలో గింజలకు మార్కెట్లో రూ.250 నుంచి రూ.275 వరకూ లభించేది. అటువంటిది 2023–24లో కిలో గింజలకు ఏకంగా రూ.1,050 పలకడంతో కోకో రైతుల పంట పండింది. ఈ నేపథ్యంలో 2024–25 పంట కాలానికి ఎకరం తోటను రూ.1.20 లక్షల నుంచి రూ.1.30 లక్షలకు కౌలుకు తీసుకుని సాగు చేశారు. దీనికి అదనంగా సుమారు రూ.50 వేల నుంచి రూ.60 వేల వరకూ పెట్టుబడి పెట్టారు.

పూతలు దెబ్బ తిని.. ధర పతనమై..

తూర్పు గోదావరి జిల్లాలోని రైతులు కొబ్బరి, ఆయిల్‌పామ్ తోటల్లో అంతర పంటగా కోకో సాగు చేస్తున్నారు. వీరిలో 80 శాతం మంది కౌలుదారులే ఉన్నారు. ఒక్కో రైతు 10 నుంచి 20 ఎకరాల కోకో తోటలు కౌలుకు తీసుకున్నారు. అయితే, తానొకటి తలిస్తే దైవమొకటి తలచినట్లు.. మంచు ధాటికి రెండు దఫాలు పూతలు దెబ్బ తిన్నాయి. మూడోసారి పూతలు నిలబడినప్పటికీ దిగుబడి తగ్గిపోయింది. ఎకరాకు రెండు మూడు క్వింటాళ్లు మాత్రమే వచ్చింది. ఫిబ్రవరిలో కిలో గింజలకు రూ.800 ధర లభించగా.. కొద్ది రోజుల్లోనే అది రూ.650 తగ్గింది. ఇదే ధర రెండు నెలలు కొనసాగింది. అనంతరం రూ.400 నుంచి రూ.450కి పడిపోయింది. ఇదే సమయంలో కంపెనీలు ముందుకు రాకపోవడంతో కోకో గింజలు రైతుల వద్ద పేరుకుపోయాయి. ఏటా జిల్లాలోని రైతుల నుంచి క్యాడ్‌బరీ సంస్థ ఎక్కువగా కోకో గింజలు కొనుగోలు చేస్తుంది. ఈ ఏడాది కొనుగోలు సంస్థలు సిండికేట్ అయి, ధర తగ్గించేయడంతో గత్యంతరం లేక రైతులు రాష్ట్రవ్యాప్తంగా రోడ్డెక్కారు. ప్రభుత్వ కార్యాలయాల వద్ద ఆందోళనలు చేశారు. కోకో గింజలను గిట్టుబాటు ధరకు కొనుగోలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ నేపథ్యంలో కోకో రైతు సంఘాలతో మంత్రి అచ్చెన్నాయుడు చర్చలు జరిపారు. కంపెనీలు ఇచ్చే ధరకు అదనంగా కిలోకు రూ.50 ఇవ్వడానికి అంగీకరించారు. రైతుల వద్ద ఉన్న ప్రతి కోకో గింజా కొనుగోలు చేస్తామని చెప్పారు. కోకో రైతుల నుంచి వినతులు స్వీకరించడానికి కొవ్వూరు ఆర్డీఓ కార్యాలయంలో ప్రత్యేక విభాగం ఏర్పాటు చేశారు. కానీ, కోకో గింజల ధర మాత్రం పెరగకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

కోకో రైతు సంఘ సమావేశం తీర్మానాలు

తూర్పుగోదావరి జిల్లా నిడదవోలు మండలం కోరుమామిడిలో కోకో రైతుల సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా పలు తీర్మానాలు చేశారు.

- అంతర్జాతీయ మార్కెట్‌కు అనుగుణంగా ధర ఇవ్వాలి.
- రాష్ట్రంలో కోకో బోర్డు ఏర్పాటు చేయాలి.
- వెంకటరామన్నగూడెంలో కోకో పరిశోధన కేంద్రం నెలకొల్పాలి.
- రైతుల వద్ద ఉన్న కోకో గింజలను పూర్తిగా కొనుగోలు చేయాలి.
- కంపెనీల సిండికేట్ విధానాన్ని, మోసాలను అరికట్టాలి.
- విదేశీ కోకో గింజల దిగుమతులు నిలుపు చేయాలి.
- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కోకో రైతులను ఆదుకోవాలి.

అంతర్జాతీయ మార్కెట్ ధర ఇవ్వాలి



అంతర్జాతీయ మార్కెట్లో కిలో కోకో గింజల ధర రూ.850 ఉంది. కంపెనీలు రూ.450 మాత్రమే చెల్లిస్తూ, రైతులను మోసం చేస్తున్నాయి. ఈ ఏడాది దిగుబడులు తగ్గడంతో పాటు కంపెనీలు సిండికేట్ కావడంతో పంటను అమ్ముకోవడానికి నానా అవస్థలూ పడ్డాం. కిలోకు రూ.650 ఇస్తేనే గిట్టుబాటు అవుతుంది.

– ఉప్పల కాశీ, ఉపాధ్యక్షుడు, రాష్ట్ర కోకో రైతు సంఘం, కోరుమామిడి

ప్రతి గింజా కొనుగోలు చేస్తాం



రైతు పండించిన ప్రతి కోకో గింజా కొనుగోలు చేస్తాం. క్షేత్ర స్థాయిలో 1,140 మంది రైతుల వద్ద 331 మెట్రిక్ టన్నుల కోకో గింజలున్నట్లు అధికారులు గుర్తించారు. ఈ నెలాఖరులోపే రైతుల నుంచి పంట పూర్తిగా సేకరిస్తాం. రైతులు తమ వినతులను నేరుగా లేదా ఫోన్ ద్వారా ప్రత్యేక సెల్‌కు తెలియజేయవచ్చు.

– పి.ప్రశాంతి, జిల్లా కలెక్టర్

ఆన్‌లైన్ బ్యాంకింగ్‌లో ఆంధ్రా టాప్

85.3 శాతంతో మూడో స్థానంలో ఏపీ యువత– కేంద్ర గణాంకాల శాఖ వెల్లడి

సాక్షి, అమరావతి: ఆన్‌లైన్ బ్యాంకింగ్ లావాదేవీలు నిర్వహించగల సామర్థ్యంలో రాష్ట్ర యువత టాప్‌లో ఉందని కేంద్ర గణాంకాల శాఖ వెల్లడించింది. దేశవ్యాప్తంగా 15 నుంచి 24 ఏళ్లలోపు వయసున్న యువతీ, యువకులపై సర్వే చేసి కంప్యూటర్, సెల్‌ఫోన్ ద్వారా బ్యాంకింగ్ లావాదేవీలు నిర్వహించే సామర్థ్యాన్ని తెలుసుకున్నట్లు పేర్కొంది. దేశ సగటు యువత ఆన్‌లైన్ బ్యాంకింగ్ లావాదేవీల సామర్థ్యం 68 శాతముండగా.. ఏపీలో 85.3 శాతంగా ఉందని తెలిపింది. కేరళ, తెలంగాణ తర్వాత ఏపీ మూడో స్థానంలో ఉంది. అలాగే ఏపీలోని గ్రామీణ ప్రాంత యువత ఆన్‌లైన్ బ్యాంకింగ్ సామర్థ్యం 83.6 శాతం కాగా.. దేశవ్యాప్తంగా 62.7 శాతమని పేర్కొంది. ఇక ఏపీలోని పట్టణ ప్రాంత యువతలో 88.6 శాతం మంది ఆన్‌లైన్ బ్యాంకింగ్‌ను ఉపయోగిస్తున్నట్లు వెల్లడించింది. 15 ఏళ్లు పైబడిన వారిలో జాతీయ స్థాయిలో పురుషులు 60.5 శాతం మంది, ఏపీలో 66.6 శాతం మంది, జాతీయ స్థాయిలో మహిళలు 37 శాతం, ఏపీ మహిళలు 43.2 శాతం మందికి ఆన్‌లైన్ బ్యాంకింగ్ సామర్థ్యముందని తెలిపింది.

రాష్ట్రం ఆన్‌లైన్ బ్యాంకింగ్ సామర్థ్యం(శాతాల్లో)

కేరళ	88.8
తెలంగాణ	88.4
ఆంధ్రప్రదేశ్	85.3



శ్రీవారి దర్శనానికి 24 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ అధికంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో కంపార్ట్‌మెంట్లు నిండాయి. క్యూలైన్ శిలాతోరణం వద్దకు చేరింది. శనివారం అర్ధరాత్రి వరకు 90,087 మంది స్వామివారిని దర్శించుకోగా 41,891 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు.

టీటీడీకి ఏసీ బస్సు విరాళం

తిరుమల: ప్రముఖ ఆటో మొబైల్ కంపెనీ, అశోక్ లేలాండ్ తిరుమల–తిరుపతి దేవస్థానానికి ఒక 41–సీటర్ ఏసీ బస్సును ఆదివారం విరాళంగా అందజేసింది. సుమారు రూ. 35 లక్షల విలువైన ఈ బస్సును అశోక్ లేలాండ్ ఎంఅండ్‌హెచ్‌సీవీ అధ్యక్షుడు సంజీవ్ కుమార్ శ్రీవారి ఆలయం ముందు అందజేశారు. సాధారణంగా ప్రతి ఏటా ఈ కంపెనీ యాజమాన్యం టీటీడీకి ఒక వాహనాన్ని విరాళంగా ఇవ్వడం పరిపాటి. ఈ కార్యక్రమంలో ఆలయ డిప్యూటీ ఈఓ లోకనాథం, తిరుమల డిపో డీఐ వెంకటాద్రి నాయుడు తదితరులు పాల్గొన్నారు.

కొల్లేటికోటలో భక్తుల రద్దీ



కైకలూరు: పెద్దింట్లమ్మ నామస్మరణతో ఏలూరు జిల్లా కొల్లేటికోట దేవస్థానం ఆదివారం మార్మోగింది. సమీప జిల్లాల నుంచి వేలాదిగా భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. పవిత్ర కోనేరులో స్నానాలు ఆచరించి అమ్మవారికి వేడి నైవేద్యాలు సమర్పించారు. ఆలయ ప్రధాన అర్చకులు పేటేటి పరమేశ్వరశర్మ పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ ఈఓ కూచిపూడి శ్రీనివాసు మాట్లాడుతూ ఒక్క ఆదివారం ప్రత్యేక, అంతరాలయ దర్శనాలు, పెద్ద, చిన్న తీర్థాలు, కేశఖండన, లడ్డు ప్రసాదం, గదుల అద్దెలు, అమ్మవారి చిత్రపటాలు, వాహన పూజలు, విరాళాల ద్వారా రూ.79,710 ఆదాయం వచ్చిందని చెప్పారు.



ఊటీలో తేయాకు తోటలున్నాయి. వందలాది గులాబీల తోట ఉంది. బొటానికల్ గార్డెన్‌లో శిలాజవృక్షం ఉంది. ఏడు వేల అడుగుల ఎత్తులో సరస్సు. ఎనిమిది వేల అడుగుల్లో పర్వత శిఖరం. ఊటీ అంటే... యాభై ఏళ్ల కిందట బాలీవుడ్ హీరో హీరోయిన్‌లు... యుగళగీతాలు పాడిన నేల.. టాలీవుడ్... పాటల తోట. రకరకాల టీల రుచిని ఆస్వాదిస్తూ ఊ... టీ తోటల్లో విహరిద్దాం.

ఊ...!'టీ'... తాగుదాం!!

1వ రోజు

మధ్యాహ్నం 12.20 గంటలకు సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ నుంచి ట్రైన్ నంబర్ 17230, శబరి ఎక్స్‌ప్రెస్ బయలుదేరుతుంది. ప్రయాణం రాత్రంతా సాగుతుంది.



2వ రోజు

ఉదయం (07.57గంటలకు) రైలు కోయంబత్తూరుకి చేరుతుంది. రైలు దిగి రోడ్డు మార్గాన ఊటీకి బయలుదేరాలి. హోటల్‌లో చెక్ ఇన్ అయ్యి, రిఫ్రెష్ అయిన తర్వాత బొటానికల్ గార్డెన్స్, ఊటీ లేక్‌లో విహరించి రాత్రికి హోటల్‌కి చేరడం. రాత్రి బస ఊటీలోనే.

బ్రిటిష్ కాలం నాటి ఉద్యానవనం



ఊటీకి ఎందుకెళ్లాలి? ఊటీలో టీ తోటలు తప్ప ఏమున్నాయ్ చూడడానికి? అనే పెదవి విరుపులు ఉంటాయి. కానీ ఊటీలో చూసి తెలుసుకోవాల్సినవి, ఆస్వాదించాల్సినవి చాలా ఉన్నాయి. ప్రపంచ ప్రసిద్ధి చెందిన బొటానికల్ గార్డెన్స్ ఉన్నాయి. దీనిని కలయ తిరిగి చూడడం ఆహ్లాదంతోపాటు బోనస్‌గా విజ్ఞానం కలుగుతుంది. ఇది 54 ఎకరాల గార్డెన్స్ సముదాయం. బ్రిటిష్ పాలన కాలం నాటిది. తమిళనాడు ప్రభుత్వం చక్కగా నిర్వహిస్తోంది. చెట్లలో ఆరు వందల రకాలున్నాయి. గార్డెన్స్ మధ్యలో ఫాజిల్డ్ ట్రీ ట్రంక్ (శిలాజ వృక్షం) ఉంది. రెండు కోట్ల సంవత్సరాల కిందట జీవించిన వృక్షం అది. ఔషధ వృక్షాలు కూడా పెద్ద సంఖ్యలోనే ఉన్నాయి. ఇటాలియన్ గార్డెన్, న్యూ గార్డెన్, లోయర్ గార్డెన్, ఫౌంటెయిన్ టెర్రస్ గార్డెన్ ఇలా రకరకాలుగా విభజించి ఉంటుంది. ఫాజిల్ ట్రీ ట్రంక్ లోయర్ గార్డెన్‌లో ఉంది.



గులాబీల తోట!

ఊటీ బొటానికల్ గార్డెన్స్ అనగానే ఎక్కువ మందికి రోజ్ గార్డెన్ గుర్తు వస్తుంది. ఇక్కడ వందల రకాల గులాబీ చెట్లు ఉంటాయి. ఇక్కడ ఏటా జరిగే నీలగిరి ఫ్లవర్ షోకి ప్రపంచ దేశాల నుంచి లక్షా యాభై వేల మంది సందర్శకులు వస్తారు. బొటానికల్ గార్డెన్స్‌లో మొక్కలతో ఏర్పాటు చేసిన భారత రాష్ట్రాల మ్యాప్‌ను నిశితంగా పరిశీలించి ఆస్వాదించాలి. అన్నట్లు బోన్‌సాయ్ వృక్షాలను చూడడం మరిచిపోవద్దు. ఈ గార్డెన్స్ పరిధిలో తోడా గిరిజన తెగ నివసించే చిన్న ప్రదేశం కూడా ఉంది. దానిని తోడా మండ్ అంటారు. వారి జీవనశైలి ప్రత్యేకం. తెలుపు, నలుపు, ఎరుపు రంగులతో ఎంబ్రాయిడరీ చేసిన వస్త్రాలు అందంగా ఉంటాయి.







బాలీవుడ్ డ్యూయెట్‌లు ఇక్కడే!

ఊటీలో మనం చూసే సరస్సు సహజసిద్ధమైనది కాదు. బ్రిటిష్ పాలన కాలం నాటిది. చల్లటి నీలగిరుల్లో ఉన్న ఊటీ బ్రిటిష్ వారి వేసవి విడిది. విహారం కోసం సరస్సును తవ్వించారు. యాభై ఎకరాల బొటానికల్ గార్డెన్స్‌కు దీటుగా ఏడు వేల అడుగుల ఎత్తులో తవ్విన 65 ఎకరాల సరస్సు ఇది. బ్రిటిష్ అధికారులు సరదాగా వేటాడడం కోసం చేపలను పెంచేవారు. ప్రస్తుతం చేపల వేట లేదు. పర్యాటకుల వినోదం కోసం బోట్ షికారు ఉంది. సరస్సు చుట్టూ విస్తరించిన ఎత్తైన చెట్లను చూస్తూ పెడల్ బోట్‌లో నిదానంగా విహరించడం అనిర్వచనీయమైన అనుభూతి. వేగంగా ప్రయాణించే మోటర్ బోట్‌లు కూడా ఉంటాయి. సరస్సు చుట్టూ రౌండ్ కొట్టాలంటే సైకిళ్లు అద్దెకిస్తారు. ఈ సరస్సు దగ్గర అమ్యూజ్‌మెంట్ పార్క్ ఉంది. అందులో పిల్లలను ఆకర్షించే టాయ్ ట్రెన్, హాంటెడ్ హౌజ్, హార్స్ రైడ్ ఉంటాయి. ఇక ఊటీ గొప్పదనాన్ని ఒక్కమాటలో చెప్పాలంటే ఇది సినిమా చిత్రీకరణ లొకేషన్. ఓ యాభై ఏళ్ల కిందట సినిమాల చిత్రీకరణ ఎక్కువ భాగం ఊటీ, కూనూరుల్లో జరిగేది. తెలుగు సినిమాలే కాదు, బాలీవుడ్ హీరోహీరోయిన్‌లు కూడా ఇక్కడే డ్యూయెట్‌లు పాడుకున్నారు.



3వ రోజు

బ్రేక్‌ఫాస్ట్ తరవాత దొడబెట్ట శిఖరం, టీ మ్యూజియం, పైకారా ఫాల్స్ సందర్శనం తర్వాత హోటల్‌కు చేరడం. ఆ రాత్రి బస కూడా ఊటీలోనే.



టెలిస్కోప్‌లో చూద్దాం!

ఊటీ పేరు ఉదకమండలం. ఇది తూర్పు కనుమలలోని నీలగిరుల్లో విస్తరించిన ప్రదేశం. నీలగిరుల్లో ఎత్తైన కొండను దొడబెట్ట అంటారు. దొడబెట్ట అనేది కన్నడ పదం. పెద్ద కొండ అని అర్థం. ఈ ప్రదేశం ఊటీ పట్టణానికి తొమ్మిది కిలోమీటర్ల దూరాన ఉంది. శిఖరం ఎత్తు ఎనిమిది వేల ఆరు వందల అడుగులు. శిఖరాన్ని చేరడానికి ట్రెకింగ్ చేయాల్సిన అవసరం లేదు. రోడ్డు ఉంది, వాహనాలు వెళ్తాయి. ఈ శిఖరం మీద టెలిస్కోప్ హౌస్ ఉంది. సముద్ర తీరాల్లో లైట్ హౌస్‌లను చూస్తుంటాం. ఈ శిఖరం మీద ఉన్న టెలిస్కోప్ నుంచి నీలగిరుల సౌందర్యాన్ని వీక్షించవచ్చు.

టీ కప్పు తెచ్చుకుందాం!





టీ మ్యూజియం ఊటీకి నాలుగు కిలోమీటర్ల దూరంలో విస్తారమైన టీ తోటల మధ్య ఉంది. దొడబెట్ట రూట్‌లో వస్తుంది. నిజానికి ఇది పెద్ద టీ ఫ్యాక్టరీ. ఇక్కడ తేయాకును కట్ చేయడంతో పాటు ఆకును స్టీల్ కంటెయినర్‌లలో వేసి వేడితో ఎండబెట్టడం, క్రష్ చేసి ప్రాసెస్ చేయడం అన్నింటినీ చూడవచ్చు. రకరకాల టీలను రుచి చూడవచ్చు. అలాగే పొడులు కొనుక్కోవచ్చు. ఈ ప్రదేశాన్ని సందర్శించిన గుర్తుగా టీ మ్యూజియం లోగో ముద్రించిన టీ కప్పులు, ప్లేట్‌లు, టీ షర్టులు కొనుక్కోవచ్చు. ఉదయం పది నుంచి సాయంత్రం ఆరు గంటల వరకు మాత్రమే అనుమతిస్తారు. టూర్ ప్యాకేజ్ నిర్వాహకుల ఐటినరీ ఈ సమయానికి అనుగుణంగానే ఉంటుంది.

బోట్‌హౌస్‌లో షికారు!

ఊటీకి 20 కిమీల దూరాన ఉంది పైకారా. ఇది తోడా గిరిజనుల ఆరాధ్య ప్రదేశం. నది పేరు, జలపాతం పేరు, జలపాతం ఉన్న ప్రదేశం పేరు అన్నీ పైకారానే. ఇక్కడ గిరిజనులు కొలిచే ఆలయంలో దేవతను కూడా పైకారా అమ్మ అని పిలుస్తారు. ఈ నది మీద డ్యామ్ ఉంది. రిజర్వాయర్‌లో బోట్ షికార్ చేయవచ్చు. ఇక్కడ మామూలు పడవలు కాదు, పైకప్పుతో బోట్ హౌస్‌లుంటాయి.

4వ రోజు

బ్రేక్‌ఫాస్ట్ తర్వాత కూనూరు సైట్ సీయింగ్‌కి వెళ్లాలి. తిరిగి ఊటీకి వచ్చి హోటల్‌కి చేరి విశ్రాంతి. షాపింగ్ చేసుకోవచ్చు.



తెలుగు పాటల తోట

కూనూరు పట్టణం ఊటీకి 20 కిలోమీటర్ల దూరంలో ఉంది. దీనిని ఒకప్పటి తెలుగు సినిమా పాటల చిత్రీకరణ కేంద్రం అనవచ్చు. సినిమా కథలో సన్నివేశాలు ఊటీలో చిత్రీకరించి, పాటలకు మాత్రం కూనూరుకు వచ్చేవాళ్లు తెలుగు దర్శకులు. అప్పట్లో ఊటీ, కూనూరు... ఈ రెండు ప్రదేశాలనూ ఊటీగానే పరిగణిస్తూ సినిమా పాటల చిత్రీకరణ కోసం ఊటీ వెళ్తున్నట్లు దర్శకులు చెప్పేవారు. ఈ ప్రదేశం బ్రిటిష్ కాలనీని తలపించేది. యూరోపియన్ శైలి ఫుడ్ రెస్టారెంట్లు ఇప్పటికీ ఉన్నాయి. వెయ్యి రకాల మొక్కలతో సిమ్స్ పార్క్ ఉంది. ఊటీ ప్రకృతి సౌందర్యానికి చిరునామా అయితే కూనూరు పాశ్చాత్య విలాసంగా కనిపిస్తుంది.

5వ రోజు

బ్రేక్‌ఫాస్ట్ తర్వాత కొంత సమయం ప్రకృతి సౌందర్యాన్ని ఆస్వాదిస్తూ విశ్రాంతిగా ఫొటో షూట్ చేసుకుంటూ గడిపిన తర్వాత మధ్యాహ్నం గది చెక్ అవుట్ చేసి కోయంబత్తూరుకు బయలుదేరాలి. ట్రైన్ నంబర్ 17229 శబరి ఎక్స్‌ప్రెస్ 15.55 గంటలకు కోయంబత్తూరు స్టేషన్ నుంచి బయలుదేరుతుంది. ఆ రైలు సికింద్రాబాద్‌కి ఆరవ రోజు మధ్యాహ్నం 12.45 గంటలకు చేరుతుంది.



ప్రశాంత పర్యటన

హైదరాబాద్‌లో మొదలై హైదరాబాద్ చేరడంతో పూర్తయ్యే ఈ టూర్ ప్యాకేజ్ పేరు... 'అల్టిమేట్ ఊటీ ఎక్స్ హైదరాబాద్ (ఎస్‌హెచ్‌ఆర్094)'. ఇది ఆరు రోజుల పర్యటన. గడియారంతో పరుగులు పెడుతూ ఎక్కువ ప్రదేశాలను చుట్టేసే పర్యటన కాదు. ప్రశాంతంగా ప్రకృతి సౌందర్యాన్ని, ఆహ్లాదకరమైన వాతావరణాన్ని ఆస్వాదిస్తూ సాగే చక్కటి విహారం. మూడు రోజులు ఊటీలో బస చేయవచ్చు. టూర్ కోడ్: ULTIMATE OOTY EX HYDERABAD (SHR094).

ప్యాకేజ్ ధరలివి

- కంఫర్ట్ కేటగిరీ (థర్డ్ ఏసీ) సింగిల్ షేరింగ్‌లో ఒకరికి సుమారుగా 30 వేలవుతుంది. ట్విన్ షేరింగ్‌లో ఒక్కొక్కరికి సుమారు 17 వేలవుతుంది. ట్రిపుల్ షేరింగ్‌లో ఒక్కొక్కరికి 16 వేలు, పిల్లలకు ఒక్కరికి పదివేలు సుమారుగా.
- స్టాండర్డ్ కేటగిరీ (స్లీపర్ క్లాస్) సింగిల్ షేరింగ్‌లో ఒకరికి 27 వేలకు పైగా, ట్విన్ షేరింగ్‌లో ఒక్కొక్కరికి 15 వేలు, ట్రిపుల్ షేరింగ్‌లో 13 వేలకు పైగా అవుతుంది.
- రోడ్డు ప్రయాణానికి ఏసీ వాహనాలు, బసకు నాన్ ఏసీ హోటళ్లు. ట్రావెల్ ఇన్సూరెన్స్ ఉంటుంది.
- హోటల్‌లో ఇచ్చే బ్రేక్‌ఫాస్ట్ మాత్రమే ప్యాకేజ్‌లో ఉంటుంది. మధ్యాహ్న భోజనం, రాత్రి భోజనాలు వర్తించవు.
- బోటింగ్, హార్స్ రైడింగ్, పర్యాటక ప్రదేశాల ఎంట్రన్స్ టికెట్లు కూడా ప్యాకేజ్ ధరలో వర్తించవు.


వాతావరణం: ఈ నెలలో ఉష్ణోగ్రతలు 25-17 డిగ్రీల మధ్య ఉంటాయి. ఉలెన్ దుస్తులు తీసుకెళ్లాలి. స్వల్ప వర్షపాతం ఉండవచ్చు. కాబట్టి పిల్లలతో వెళ్లేవాళ్లు గొడుగు దగ్గర ఉంచుకుంటే మంచిది. పెద్దవాళ్లకు చిరు తుంపరలో ఊటీ గార్డెన్స్‌లో విహరించడం బాగుంటుంది.

ఇదీ రూట్!

సికింద్రాబాద్ లో బయలుదేరిన తర్వాత నల్గొండ, మిర్యాల గూడ, నడికుడి, పిడుగురాళ్ల, సత్తెనపల్లి, గుంటూరు జంక్షన్, తెనాలి జంక్షన్, నిడుబ్రోలు, బాపట్ల, చీరాల, ఒంగోలు, సింగరాయకొండ, నెల్లూరు, గూడూరు జంక్షన్, రేణిగుంట జంక్షన్, తిరుపతి, చిత్తూరు మీదుగా ప్రయాణిస్తుంది. ఈ స్టేషన్‌లలో ఎవరికి సౌకర్యమైన స్టేషన్‌లో వాళ్లు రైలెక్కవచ్చు. అలాగే తిరుగు ప్రయాణంలో ఏ స్టేషన్‌లోనైనా దిగవచ్చు కూడా. తెలుగు రాష్ట్రాలు దాటిన తరవాత రైలు తమిళనాడులో ప్రవేశిస్తుంది. ఇది వీక్లీ ట్రిప్. వారానికి ఒక టూర్ మాత్రమే. ప్రతి మంగళవారం ఉంటుంది.

- వాకా మంజులారెడ్డి,
సాక్షి, ఫీచర్స్ ప్రతినిధి





మీ వ్యాపారాన్ని మెరుగుపరచుకోడానికి ముందు
జ్ఞాన సముపార్జనలో చేసిన పెట్టుబడికి అధిక
మిమ్మల్ని మీరు మెరుగుపరచుకోండి.
లాభం వస్తుంది
- ఇదోవు కొయెనికన్, ప్రఖ్యాత రచయిత
- పీటీ బర్నమ్, అమెరికా వ్యాపారవేత్త

బిజినెస్ రీల్

ఏప్రిల్‌లో ఈపీఎఫ్‌వో కిందకు 19.4 లక్షల మంది

8.49 లక్షల మందికి కొత్తగా ఉపాధి



న్యూఢిల్లీ: ఉద్యోగుల భవిష్యనిధి సంస్థ పరిధిలోకి ఏప్రిల్ నెలలో 19.14 లక్షల మంది చేరారు. ఈ ఏడాది మార్చి నెలలో చేరికతో పోల్చితే 31 శాతం, 2024 ఏప్రిల్ నెల గణాంకాలతో పోల్చి చూస్తే 1 శాతం వృద్ధి నమోదైంది. ఈ వివరాలను కేంద్ర కార్మిక శాఖ విడుదల చేసింది. ఏప్రిల్‌లో కొత్త సభ్యుల చేరిక 8.49 లక్షలుగా ఉంది. మార్చి నెలలో కొత్త సభ్యుల చేరిక కంటే 12.49 శాతం ఎక్కువ. అంటే వీరు మొదటిసారి సంఘటిత రంగంలో ఉపాధి పొందినట్టు తెలుస్తోంది. ఇందులో మహిళా సభ్యులు 2.45 లక్షల మంది ఉన్నారు. మార్చి నెలతో పోల్చి చూస్తే 17.63 శాతం పెరిగారు. కొత్త సభ్యుల్లో 57 శాతం మేర అంటే, 4.89 లక్షల మంది వయసు 18–25 ఏళ్ల మధ్య ఉంది. మహిళా సభ్యుల నికర చేరిక మాత్రం మార్చి నెలతో పోల్చి చూస్తే 35 శాతం అధికంగా 3.95 లక్షలుగా ఉంది. ఏప్రిల్‌లో సుమారుగా 15.77 లక్షల మంది సభ్యులు ఒక సంస్థలో ఉద్యోగం మానేసి, మరో సంస్థలో చేరారు. మార్చి నెలతో పోల్చి చూస్తే 19 శాతం పెరిగింది. నికర చేరికలో అత్యధికంగా 21 శాతం సభ్యులు మహారాష్ట్ర నుంచి ఉన్నారు.

రూ. 18 వేల కోట్ల సమీకరణలో ఎన్‌టీపీసీ



న్యూఢిల్లీ: ప్రభుత్వ రంగ ఎన్‌టీపీసీ రూ. 18,000 కోట్ల వరకు నిధులను సమీకరించనుంది. దేశీ మార్కెట్లో నాన్ కన్వర్టబుల్ డిబెంచర్లు లేదా బాండ్ల జారీ ద్వారా నిధులను సమీకరించే ప్రతిపాదనకు కంపెనీ బోర్డు ఆమోదముద్ర వేసింది.

అమెజాన్ డయాగ్నోస్టిక్స్ సేవలు



న్యూఢిల్లీ: అమెజాన్ ఇండియా డయాగ్నోస్టిక్స్ సేవలను ప్రారంభించింది. ఇంటి నుంచే కస్టమర్లు 'అమెజాన్ డయాగ్నోస్టిక్స్' ద్వారా తమకు కావాల్సిన ల్యాబ్ టెస్ట్‌లను బుక్ చేసుకోవచ్చని, డిజిటల్ రిపోర్ట్‌లను అమెజాన్ యాప్ నుంచి పొందొచ్చని ప్రకటించింది. ఆరంజ్ హెల్త్ ల్యాబ్స్ సహకారంతో ఈ సేవలను తొలుత హైదరాబాద్‌తోపాటు బెంగళూరు, ఢిల్లీ, గురుగ్రామ్, నోయిడా, ముంబై పరిధిలో 450 పిన్‌కోడ్‌ల వ్యాప్తంగా అందిస్తున్నట్టు తెలిపింది. 60 నిమిషాల్లోనే ఇంటి నుంచి నమూనాలను సేకరించనున్నట్టు, మొత్తం 800 వ్యాధి నిర్ధారణ పరీక్షలను ఆఫర్ చేస్తున్నట్టు అమెజాన్ ఇండియా ప్రకటించింది. దీంతో కలిపి ప్రస్తుత ఫార్మసీ, క్లినిక్ సేవలను అమెజాన్ మెడికల్‌తో అనుసంధానించింది.

మార్కెట్లలో ఈ వారం బ్రేకవుట్!

- కన్సాలిడేషన్ నుంచి బయటపడే చాన్స్
- ఇరాన్, ఇజ్రాయెల్ యుద్ధం ఎఫెక్ట్
- చమురు, డాలరుపై ఇన్వెస్టర్ల దృష్టి
- మార్కెట్ ట్రెండ్‌పై నిపుణుల విశ్లేషణ

సుమారు ఐదు వారాలుగా దేశీ స్టాక్ మార్కెట్లు పరిమిత శ్రేణి(కన్సాలిడేషన్ జోన్)లోనే కదులుతున్నాయి. అయితే ఈ వారం మార్కెట్లు కన్సాలిడేషన్ నుంచి బయటపడవచ్చని విశ్లేషకులు భావిస్తున్నారు. ఇందుకు దేశీయంగా లేదా అంతర్జాతీయంగా ప్రభావిత అంశాలు కొరవడినప్పటికీ సాంకేతికంగా అవకాశమున్నట్లు అంచనా వేస్తున్నారు. వివరాలు చూద్దాం..

-సాక్షి, బిజినెస్ డెస్క్



గత వారం చివర్లో ఉన్నట్టుండి దేశీ స్టాక్ మార్కెట్లు జోరందుకున్నాయి. ఇరాన్, ఇజ్రాయెల్ మధ్య యుద్ధం ముదురుతున్న పరిస్థితుల్లోనూ ప్రామాణిక ఇండెక్సులు సెన్సెక్స్, నిఫ్టీ స్పీడందుకున్నాయి. ఫలితంగా మార్కెట్లు కొద్ది వారాలుగా చిక్కుకున్న కన్సాలిడేషన్ పరిధిని ఛేదించే వీలున్నట్లు సాంకేతిక నిపుణులు భావిస్తున్నారు. ఎన్ఎస్ఈ ప్రధాన ఇండెక్స్ నిఫ్టీ గత వారాంతాన సాంకేతికంగా పరివర్తన స్థాయి(25,112)కి చేరుకున్నట్లు చెబుతున్నారు. ఫలితంగా 25,200 పాయింట్ల ఎగువకు చేరి నిలదొక్కుకుంటే సాంకేతికంగా బ్రేకవుట్‌కు వీలున్నట్లు అంచనా వేశారు. దీంతో సమీప కాలంలో 25,600–25,800 పాయింట్లను తాకవచ్చని విశ్లేషించారు. ఇలాకాకుండా బలహీనపడితే సైడ్‌వేస్‌లో కదలవచ్చని పేర్కొన్నారు. పశ్చిమాసియాలో యుద్ధం ముదిరితే మార్కెట్లు క్షీణించవచ్చని తెలియజేశారు. దీంతో గత వారం మాదిరే 24,700 పాయింట్ల వద్ద మద్దతు లభించవచ్చని భావిస్తున్నారు.

రుతుపవనాలకు ప్రాధాన్యత

దేశీయంగా నైరుతి రుతుపవన కదలికలు కీలకంగా మారనున్నాయి. మే నెలలోనే దేశంలోకి ప్రవేశించడం ద్వారా ఆశలు రేపినప్పటికీ తదుపరి మందగించిన సంగతి తెలిసిందే. అయితే రెండు, మూడు రోజుల్లో తిరిగి ఊపందుకుని పలు ఉత్తరాది రాష్ట్రాలలో విస్తరించనున్నట్లు వాతావరణ శాఖ ప్రకటించడంతో సెంటిమెంటు బలపడనున్నట్లు స్టాక్ నిపుణులు పేర్కొన్నారు. దీనికితోడు విదేశీ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్లు(ఎఫ్‌పీఐలు) ఇటీవల దేశీ స్టాక్స్‌లో కొనుగోళ్లకు ఆసక్తి చూపుతుండటం సానుకూల పరిణామమని తెలియజేశారు. ఈ నేపథ్యంలో ఆటుపోట్ల మధ్య కన్సాలిడేషన్ కొనసాగవచ్చని మోతీలాల్ ఓస్వాల్ ఫైనాన్షియల్ సర్వీసెస్ వెల్త్ మేనేజ్‌మెంట్ రీసెర్చ్ హెడ్ సిద్ధార్థ ఖేమ్కా, వాటర్‌ఫీల్డ్ అడ్వయిజర్స్ లిస్టెడ్ ఇన్వెస్ట్‌మెంట్స్ సీనియర్ డైరెక్టర్ విపుల్ భోవర్ అభిప్రాయపడ్డారు.

ఫెడ్‌పై చూపు

గత వారం పాలసీ సమీక్షలో ఫెడరల్ ఓపెన్ మార్కెట్‌కమిటీ(ఎఫ్‌వోఎంసీ) వడ్డీ రేట్లను యథాతథంగా అమలు చేసేందుకే ఓటేసింది. ఫెడరల్ రిజర్వ్ చైర్మన్ జెరోమీ పావెల్ అధ్యక్షతన సమావేశమైన ఎఫ్‌వోఎంసీ వరుసగా నాలుగోసారి ఫెడ్ ఫండ్స్ రేట్లను 4.25–4.5 శాతంగా కొనసాగించేందుకు నిర్ణయించింది. ఇంతక్రితం 2024 డిసెంబర్‌లో 0.25 శాతం వడ్డీ రేటును తగ్గించిన ఫెడ్ తదుపరి నిర్వహించిన సమావేశాలలో యథాతథ పాలసీ అమలుకే ఓటు వేస్తూ వస్తోంది. అయితే ఈ నిర్ణయాలతోపాటు.. ద్రవ్యోల్బణం, ఆర్థిక వ్యవస్థలపై ఫెడ్ అభిప్రాయాలను పావెల్ కాంగ్రెస్‌కు వివరించనున్నారు. మంగళవారం(24న) ఫైనాన్షియల్ సర్వీసెస్ కమిటీముందు, బుధవారం(25న) సెనేట్ బ్యాంకింగ్ కమిటీ ముందు ఫెడ్ అంచనాలను వెల్లడించనున్నారు. మరోపక్క యూఎస్ క్యూ1 జీడీపీ తుది గణాంకాలు గురువారం(26న) వెల్లడికానున్నాయి. 2025 జనవరి–మార్చిలో యూఎస్ జీడీపీ 0.2 శాతం క్షీణించిన సంగతి తెలిసిందే.

చమురు ధరలు కీలకం



ఇజ్రాయెల్‌తో యుద్ధం నేపథ్యంలో ఇరాన్ హర్ముజ్ జలసంధిని మూసివేసే వీలున్నట్లు హెచ్చరించింది. ఈ నేపథ్యంలో చమురు రవాణాకు కీలకమైన హర్ముజ్‌పై ప్రపంచ దేశాలు దృష్టి సారించాయి. ఇది జరిగితే చమురు ధరలకు రెక్కలురానున్నాయి. ఇరాన్, ఇజ్రాయెల్ మధ్య వివాదం తలెత్తిన వెంటనే బ్రెంట్ చమురు ధర ఒక్కో బ్యారల్‌కు 78 డాలర్ల గరిష్టానికి ఎగసిన విషయం విదితమే. ఫలితంగా యుద్ధ ప్రభావం ప్రధానంగా ముడి చమురు ధరలపై కనిపించనున్నట్లు నిపుణులు పేర్కొన్నారు. దేశీయంగా అధిక శాతం చమురు అవసరాలకు గల్ఫ్ దేశాలపై ఆధారపడుతున్న నేపథ్యంలో యుద్ధ సెగలు దేశీ మార్కెట్లను దెబ్బతీయవచ్చని రెలిగేర్ బ్రోకింగ్ రీసెర్చ్ ఎస్‌వీపీ అజిత్ మిశ్రా, జియోజిత్ ఇన్వెస్ట్‌మెంట్స్ రీసెర్చ్ హెడ్ వినోద్ నాయిర్ ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

గత వారమిలా..

గత వారం(16–20) ఆటుపోట్ల మధ్య దేశీ స్టాక్ మార్కెట్లు బలపడ్డాయి. తొలుత క్షీణపథంలో ట్రేడయినప్పటికీ వారం చివర్లో జోరందుకున్నాయి. దీంతో నికరంగా బీఎస్ఈ సెన్సెక్స్ గత వారం 1,290 పాయింట్లు(1.6 శాతం) ఎగసింది. 82,408 వద్ద ముగిసింది. ఎన్ఎస్ఈ నిఫ్టీ 394 పాయింట్లు(1.6 శాతం) పుంజుకుని 25,112 వద్ద నిలిచింది. అయితే చిన్న, మధ్యతరహా కౌంటర్లలో అమ్మకాలదే పైచేయి అయ్యింది. వెరసి బీఎస్ఈ మిడ్‌క్యాప్ ఇండెక్స్ 0.45 శాతం క్షీణించగా.. స్మాల్ క్యాప్ దాదాపు 2 శాతం పతనమైంది.

డిజిటల్ అక్రమాలకు అడ్డుకట్ట!

- ఆర్‌బీఐ అధ్యక్షతన పబ్లిక్, ప్రయివేట్ బ్యాంకుల జత
- డిజిటల్ పేమెంట్ ఇంటెలిజెన్స్ ప్లాట్‌ఫామ్ అభివృద్ధి

న్యూఢిల్లీ: డిజిటల్ చెల్లింపులలో పెరుగుతున్న అక్రమాలకు చెక్ పెట్టే లక్ష్యంతో రిజర్వ్ బ్యాంక్(ఆర్‌బీఐ) డిజిటల్ పేమెంట్ ఇంటెలిజెన్స్ ప్లాట్‌ఫామ్(డీపీఐపీ) అభివృద్ధికి శ్రీకారం చుట్టింది. ఇందుకు పబ్లిక్, ప్రయివేట్ బ్యాంకులను జత కలుపుతోంది. తద్వారా ఆర్‌బీఐ పర్యవేక్షణలో డిజిటల్ పబ్లిక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్(డీపీఐ)కు తెరతీస్తోంది. ప్రతిపాదిత ప్లాట్‌ఫామ్ ద్వారా ఫ్రాడ్ రిస్క్ మేనేజ్‌మెంట్‌ను పటిష్టం చేయనుంది. రియల్ టైమ్ ఇంటెలిజెన్స్‌ను షేర్ చేసుకోవడం ద్వారా అక్రమ డిజిటల్ లావాదేవీలకు అడ్డుకట్ట వేయనుంది. సంబంధిత వర్గాల సమాచారం ప్రకారం డిజిటల్ అక్రమాలకు చెక్ పెట్టడమే లక్ష్యంగా పబ్లిక్, ప్రయివేట్ బ్యాంకులను ఆర్‌బీఐ ఏకతాటిపైకి తీసుకురానుంది. తద్వారా డీపీఐను ఏర్పాటు చేయనుంది. దీంతో డీపీఐపీని పటిష్టరీతిలో అభివృద్ధి చేయనుంది. ఇందుకు సంబంధించి ఈ నెల మొదట్లో బ్యాంకింగ్ అత్యున్నత సీనియర్ అధికారులతో ఆర్‌బీఐ సమావేశాన్ని నిర్వహించింది. రానున్న కొద్ది నెలల్లో ప్లాట్‌ఫామ్ అందుబాటులోకి రానున్నట్లు తెలుస్తోంది.

రష్యా నుంచి పెరిగిన చమురు దిగుమతులు

- జూన్‌లో రోజువారీ 2.2 మిలియన్ బ్యారెళ్లు
- సౌదీ, ఇరాక్ కంటే అధికం
- అమెరికా నుంచి రెట్టింపు దిగుమతులు



న్యూఢిల్లీ: రష్యా, అమెరికా నుంచి చమురు దిగుమతులను భారత్ గణనీయంగా పెంచుకుంది. జూన్ నెలలో మధ్యప్రాచ్యం, గల్ఫ్ దేశాల కంటే రష్యా నుంచే అధిక చమురు దిగుమతి కావడం గమనార్హం. మొత్తం మీద ఈ నెలలో రోజువారీ 2–2.2 మిలియన్ బ్యారెళ్ల చమురును రష్యా నుంచి దిగుమతి చేసుకోవచ్చంటూ అంతర్జాతీయ వాణిజ్య విశ్లేషణ సంస్థ 'కెప్లెర్' వెల్లడించింది. గత రెండేళ్ల కాలంలో రష్యా నుంచి ఈ స్థాయి దిగుమతులు తిరిగి ఈ నెలలోనే అధికమయ్యాయని వివరించింది. ఇరాక్, సౌదీ అరేబియా, యూఏఈ, కువైట్‌కు మించి రష్యా నుంచి దిగుమతులే అధికంగా ఉన్నట్టు తెలిపింది. మే నెలలో రష్యా నుంచి చమురు దిగుమతులు రోజువారీగా 1.96 మిలియన్ బ్యారెల్స్‌గా ఉన్నాయి. మరోవైపు అమెరికా నుంచి ఈ నెలలో రోజువారీ 4,39,000 బ్యారెళ్ల చమురు దిగుమతి కాగా, గత నెలలో ఇది 2,80,000 బ్యారెల్స్‌గానే ఉండడం గమనార్హం. మధ్యప్రాచ్యం నుంచి భారత్‌కు ఈ నెల మొత్తం మీద చమురు దిగుమతులు సగటున రోజువారీ 2 మిలియన్ బ్యారెళ్లుగా ఉండొచ్చన్నది కెప్లెర్ నివేదిక అంచనా. చమురు దిగుమతుల్లో ప్రపంచంలో భారత్ మూడో స్థానంలో ఉంది. రోజువారీ 5.1 మిలియన్ బ్యారెళ్ల చమురును దిగుమతి చేసుకుంటోంది. సంప్రదాయంగా మధ్యప్రాచ్యం, గల్ఫ్ దేశాల నుంచే భారత్ అధికంగా చమురు దిగుమతి చేసుకునేది. 2022లో ఉక్రెయిన్‌పై రష్యా దాడి అనంతరం మారిన సమీకరణాల నేపథ్యంలో.. రష్యా నుంచి చమురు దిగుమతులను గణనీయంగా పెంచుకుంది. అంతకుముందు మొత్తం చమురు దిగుమతుల్లో రష్యా వాటా ఒక శాతమే ఉండగా, ఆ తర్వాత 40–44 శాతానికి పెరిగింది. అంతర్జాతీయ ధర కంటే తక్కువ రేటుకే చమురును భారత్‌కు రష్యా ఆఫర్ చేయడం గమనార్హం.

సరఫరాపై ప్రభావం పడొచ్చు..

ఇరాన్–ఇజ్రాయెల్ యుద్ధ ప్రభావం ఇప్పటి వరకు మధ్యప్రాచ్యం నుంచి చమురు సరఫరాలపై లేదని కెప్లెర్ నివేదిక స్పష్టం చేసింది. వెసెల్స్ కార్యకలాపాలను గమనిస్తే రానున్న రజుల్లో సరఫరా తగ్గే అవకాశం కనిపిస్తున్నట్టు కెప్లెర్ ముఖ్య పరిశోధన విశ్లేషకుడు సుమిత్ రితోలియా తెలిపారు. షిప్ యజమానులు గల్ఫ్ ప్రాంతానికి ఖాళీ ట్యాంకర్లు పంపేందుకు వెనుకాడుతున్నట్టు, దీంతో వెసెల్స్ సరఫరా 69 నుంచి 40కు తగ్గినట్టు తెలిపారు. దీంతో సమీప కాలంలో సరఫరాలు కఠినంగా మారొచ్చని.. ఇది భారత దిగుమతుల్లో సర్దుబాట్లకు దారితీయొచ్చని అంచనా వేశారు. హర్ముజ్ జలసంధిని మూసివేస్తామంటూ ఇరాన్ ఇప్పటికే హెచ్చరించడం తెలిసిందే. ప్రపంచ చమురు సరఫరాలో 20 శాతం ఈ జలసంధి ద్వారానే వస్తోంది. మన దేశ ముడి చమురు దిగుమతుల్లో 40 శాతం, ఎల్ఎన్‌జీ దిగుమతుల్లో సగం సరఫరా ఈ ప్రాంతం నుంచే ఉంటోంది. ఇరాన్‌పై దాడుల నేపథ్యంలో హర్ముజ్ జలసంధి మూసివేసే రిస్క్ ఉందని.. అదే సమయంలో పూర్తిస్థాయి దిగ్బంధనం అవకాశాలు తక్కువే ఉండొచ్చని కెప్లెర్ నివేదిక తెలిపింది. ఎందుకంటే ఇరాన్‌కు చైనా అతిపెద్ద కస్టమర్‌గా ఉందని, చైనా సముద్ర మార్గ చమురు దిగుమతుల్లో 47% ఇరాన్ నుంచే వస్తుండడాన్ని ప్రస్తావించింది. ఇరాన్ 96% చమురు ఎగుమతులు ఈ జలసంధి నుంచే ఉంటున్నందున పూర్తిస్థాయి దగ్బంధనం ఇరాన్‌కే నష్టం కలిగిస్తుందని పేర్కొంది.

నియామకాలపై భౌగోళిక ఉద్రిక్తతల ప్రభావం!

- నియామకాలు నిలిచిపోవచ్చని మెజారిటీ అంచనా
- జీనియస్ కన్సల్టెంట్స్ సర్వేలో వెల్లడి



ముంబై: భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు ఉద్యోగ నియామకాలపై ప్రభావం చూపించనున్నట్టు స్టాఫింగ్ సొల్యూషన్స్ అందించే జీనియస్ కన్సల్టెంట్స్ నివేదిక తెలిపింది. ఈ సంస్థ నిర్వహించిన సర్వేలో మెజారిటీ ఉద్యోగులు తమ కంపెనీలు నియామకాలు నిలిపివేయొచ్చని లేదా తగ్గించుకోవచ్చని చెప్పారు. 2006 మంది ఉద్యోగులను ఈ ఏడాది మే 12 నుంచి జూన్ 6 మధ్య సర్వే చేసి వివరాలు విడుదల చేసింది.

- సర్వేలో పాల్గొన్న వారిలో 63 శాతం మంది తమ కంపెనీలు మొత్తంగా నియామకాలను నిలిపివేయొచ్చని లేదా నియామకాలు తగ్గించుకోవచ్చని చెప్పారు.
- కాంట్రాక్టు ఉద్యోగులు, ఫ్రీలాన్సర్ల నియామకం దిశగా తమ కంపెనీలు అడుగులు వేస్తున్నట్టు 15 శాతం మంది చెప్పారు.
- తమ వేతనాల పెంపు, బోనస్‌లు, ప్రోత్సాహకాలపై భౌగోళిక అస్థిరతలు ప్రభావం చూపించొచ్చని 36 శాతం మంది అభిప్రాయపడ్డారు.
- 21 శాతం మంది పని భారం పెరగనుందని ఆందోళన చెందారు.
- అంతర్జాతీయ వ్యాపారం, పర్యటనలపై ప్రభావం పడుతుందని 22% మంది చెప్పారు.
- బృంద ధైర్యం, విశ్వాసంపై ప్రభావం పడుతుందని 21 శాతం అభిప్రాయపడ్డారు.
- భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతల పట్ల తాము ఎంతో ఆందోళన చెందుతున్నామని, దీని తాలూకూ ఆరంభ హెచ్చరిక సంకేతాలు కనిపిస్తున్నట్టు 30 శాతం మంది చెప్పారు.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

23-6-2025	
విశాఖ	565–00
చిత్తూరు	603–00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	530–00
విజయవాడ	550–00
రిటైల్ ధర (డజను)	72.00
హైదరాబాద్	530–00
వరంగల్	532–00
రిటైల్ ధర	5.90

రిటర్నులు .. ముందు జాగ్రత్తలు



రిటర్నులు దాఖలు చేసేందుకు సిద్ధం అవ్వండిక. ఇందుకోసం మీరు ఎటువంటి ముందు జాగ్రత్తలు తీసుకోవాలో ఈవారం తెలుసుకుందాం.

- ముందుగా కొత్త విధానమా, పాత విధానమా ఎంచుకోవాలి. మీరు చేయాల్సినది ఏమిటంటే, రెండు విధానాల్లోనూ ఆదాయాన్ని లెక్కించండి. ఆదాయపు పన్ను భారాన్ని లెక్కించండి. ఎందులో తక్కువగా భారం ఉంటుందో దాన్ని ఎంచుకోవడం ఒక పద్ధతి. సెక్షన్ 80సీ మొదలైన వాటి కింద సేవింగ్స్, ఇన్వెస్ట్‌మెంట్, ఖర్చులు కంపల్సరీగా ఉన్నా ఈ విధంగా చేయొచ్చు. ముందుగా మీకు క్లారిటీ ఉంటే వేరే చెప్పనవసరం లేదు.
- ఏఐఎస్, ఫారం 26 ఏఎస్.. ఈ రెండింటినీ డౌన్‌లోడ్ చేసుకోండి. వీటి ద్వారా టీడీఎస్, టీసీఎస్, మీరు చెల్లించిన ట్యాక్సులు అంటే అడ్వాన్స్ ట్యాక్స్, ఇవన్నీ కచ్చితంగా తెలుస్తాయి. ఏవైనా తేడాలు, హెచ్చుతగ్గులుంటే, మీ యజమానిని/డిడక్టర్లను/బ్యాంకులను వెంటనే సంప్రదించండి.
- అన్ని కాగితాలను సమకూర్చుకుని వాటిని పరిశీలించండి. ఫారం 16, ఫారం 16ఏ, బ్యాంకు స్టేట్‌మెంట్, పాస్‌బుక్‌లు, వడ్డీకి సంబంధించిన సర్టిఫికెట్లు, రసీదులు, గత వారం చెప్పిన విధంగా ప్రతి డిడక్షన్‌కి సంబంధిత కాగితాలు పూర్తి వివరాలతో ఉండాలి. వాటిని చదవండి. అర్థం చేసుకోండి. ఇది బ్రహ్మవిద్యేమీ కాదు.
- ప్రీ-ఫిల్డ్ ఫారంలలో సాధారణంగా తప్పులు ఉండవు. అయినా ఏదైనా అప్‌డేట్ చేయకపోయినా, చేర్చకపోయినా అవి అప్‌డేట్ కావు. ఉదాహరణకు ఇంటి అడ్రెస్‌లాంటివి. మీరు ఇల్లు మారొచ్చు. మీ బ్యాంకు ఖాతాలు మారి ఉండొచ్చు. అలాగే మీ సెల్ నంబర్లు. ఇలా ప్రతి అంశం కరెక్టేనా కాదా అనేది ఒకసారి చెక్ చేసుకోండి.
- ఇక ఏయే ఫారం వాడాలో తెలుసుకోండి. ఎంచుకోవడమనేది మీ ఇష్టం కాదు. 1,2,3,4,5,6,7.. ఇలా మొత్తం ఏడు ఫారంలు ఉన్నాయి. మీకు నచ్చినది.. మీకు ఇష్టమైనది ఎంచుకోవడానికి వీల్లేదు. మీ ఆదాయాన్ని బట్టి ఫారంలు వర్తిస్తాయి. గతంలో ఎన్నో సార్లు తెలియజేశాం. కావాలంటే వెబ్‌సైట్‌లో వివరాలు ఉంటాయి.
- సాధారణంగా ఏ ఫారానికీ ఎటువంటి కాగితమూ జతపర్చనక్కర్లేదు. డాక్యుమెంట్లలోని అంకెలను చెక్ చేసుకుని, వాటిని కరెక్టుగా ఎటువంటి తేడాలు రాకుండా/లేకుండా నింపాలి.
- గడువు తేదీ లోపల ఈ ఫైల్ చేయండి. 2025 జూలై 31 నుంచి 2025 సెప్టెంబర్ 15 వరకు గడువు తేదీని పొడిగించారు. తేదీ దాటితే లేటు ఫీజు పడుతుంది. నష్టాన్ని సర్దుబాటు చేయరు. ఇది చాలా పెద్ద నష్టం. అంతే కాకుండా డిడక్షన్లు, మినహాయింపులు ఇవ్వరు. గతంలో లేటుగా చేస్తే ఇన్ని నష్టాలు ఉండేవి కావు. అందుకని ఎలాంటి ఆలస్యం చేయొద్దు.
- ఈ-ఫైలింగ్ తర్వాత వెరిఫై చేయాలి. పాన్‌తో ఆధార్ అనుసంధానం చేసిన వారికి సులువుగా ఈ-వెరిఫై అయిపోతుంది. మాన్యువల్‌గా చేసేవారు అక్నాలెడ్జ్‌మెంట్ కాపీ తీసుకుని, సంతకం పెట్టి, ఈ ఫారం ఐటీఆర్–వి సకాలంలో బెంగళూరులోని సెంట్రల్ ప్రాసెసింగ్ సెంటర్‌కి స్పీడ్ పోస్టులో పంపాలి. అలా పంపకపోతే రిటర్ను వేయనట్లే. జాగ్రత్త వహించండి.
- ఏ ఫారం దాఖలు చేయాలన్న విషయాన్ని హెల్ప్‌డెస్క్ ద్వారా తెలుసుకోవచ్చు.
- 2024-25 అసెస్‌మెంట్ సంవత్సరానికి కొత్త విధానం కంపల్సరీ. అయితే, మీరు ప్రతి సంవత్సరం విధానాన్ని మార్చుకోవచ్చు.
- ఆన్‌లైన్‌లో నింపేటప్పుడు వర్తించే విషయాలకు ఉ అని, వర్తించని వాటికి ్ర్న అని రాయాలి.
- అన్ని ఫారంలలో కొత్త షెడ్యూల్స్‌ను పొందుపర్చారు. వీటి వల్ల అదనపు సమాచారం ఇవ్వాలి. అయితే, ఇది ఇవ్వటానికి సరైన కాగితాలు ఉండాలి. పెద్ద కష్టమేమీ కాదు. గతంలో అబద్ధం/తప్పు/ఎక్కువ/తక్కువ/పొరపాటుకి అవకాశం ఉండేది. ఇప్పుడు ఆ పప్పులేమీ ఉడకవు. అలాగని భయపడిపోవాల్సిన పని లేదు. తగినంత శ్రద్ధ పెడితే.. ఇదేమీ కష్టమైన పని కాదు.

పన్నుకు సంబంధించిన సందేహాలు ఏవైనా ఉంటే పాఠకులు business@sakshi.comకు ఈ-మెయిల్ పంపించగలరు.

మెరుగైన రాబడులకు వేదిక!

ఇన్వెస్కో ఇండియా కాంట్రా ఫండ్



ఇటీవలి కాలంలో మార్కెట్లలో దిద్దుబాటు నెలకొన్నప్పటికీ.. స్మాల్, మిడ్‌క్యాప్ విభాగంలో వ్యాల్యుయేషన్లు (కంపెనీల విలువలు) సౌకర్యంగా లేవని చాలా మంది నిపుణులు భావిస్తున్నారు. మరోవైపు అంతర్జాతీయంగా ఎన్నో అనిశ్చిత పరిస్థులను చూస్తున్నాం. ఇరాన్–ఇజ్రాయెల్, ఉక్రెయిన్–రష్యా మధ్య యుద్ధాలు.. మరోవైపు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ టారిఫ్‌ల పెంపు వంటి ఎన్నో ప్రతికూల పరిణామాలు కొనసాగుతున్నాయి. ఈ తరుణంలో కాంట్రేరియన్ ఇన్వెస్టింగ్ అనుకూలమన్నది నిపుణుల సూచన. మెజారిటీ ఇన్వెస్టర్లకు వ్యతిరేకమైన మార్గాన్ని ఎంపిక చేసుకోవడమే కాంట్రేరియన్ ఇన్వెస్టింగ్. ఎక్కువ మంది అమ్మేస్తుంటే ఈ ఒత్తిడికి కొన్ని స్టాక్స్ (ఆర్థిక మూలాలు బలంగానే ఉన్నా కానీ) ధరలు అధికంగా పడిపోతుంటాయి. అలాంటి వాటిల్లో ఇన్వెస్ట్ చేయడం ద్వారా దీర్ఘకాలానికి మెరుగైన రాబడులు ఇచ్చే విధంగా కాంట్రేరియన్ ఫండ్స్ పనిచేస్తుంటాయి. ఈ విభాగంలో ఇన్వెస్కో ఇండియా కాంట్రా ఫండ్ స్థిరమైన పనితీరు చూపిస్తోంది.

రాబడులు

ఈ పథకం రాబడుల పరంగా మెరుగైన పనితీరు చూపిస్తోంది. ఏడాది కాలంలో 17.3 శాతం రాబడులను ఇన్వెస్టర్లకు అందించింది. మూడేళ్ల పనితీరును గమనిస్తే వార్షిక రాబడి 25.4 శాతంగా ఉంది. ఐదేళ్లలో 28.4 శాతం, పదేళ్లలో 17.6 శాతం చొప్పున వార్షిక రాబడుల చరిత్ర ఈ పథకానికి ఉంది. 2013 నుంచి 2025 మధ్య ఐదేళ్ల కాల రోలింగ్ రాబడులు బీఎస్ఈ 500 టీఆర్ఐ కంటే అధికంగా ఉండడాన్ని గమనించొచ్చు. నెలవారీ సిప్ రాబడులు పదేళ్ల కాలంలో చూస్తే ఏటా 19.2 శాతంగా ఉన్నాయి.

పెట్టుబడుల విధానం..

ఈ పథకం కాంట్రేరియన్ విధానం ఒక్క దానినే పూర్తిగా అనుసరించదు. రంగాల వారీ కేటాయింపుల పరంగా వివేకంతో వ్యవహరిస్తుంటుంది. స్టాక్స్ ఎంపికకు మల్టీక్యాప్ విధానాన్ని అనుసరిస్తుంది. అంటే లార్జ్, మిడ్, స్మాల్‌క్యాప్‌లో ఎక్కడ అవకాశాలున్నా ఇన్వెస్ట్ చేస్తుంటుంది. కరోనా క్రాష్ తర్వాతి కాలంలో లార్జ్‌క్యాప్‌నకు 70 శాతం వరకు కేటాయింపులు చేసింది. ఆ తర్వాత ఈ కేటాయింపులను తగ్గించుకుంది. తన నిర్వహణలోని పెట్టుబడుల్లో 3–4 శాతం మించి నగదు నిల్వలను కలిగి ఉండదు. ఎప్పటికప్పుడు రంగాల వారీ వస్తున్న మార్పులను గమనించి, వేగంగా తన పెట్టుబడి వ్యూహాలను మార్చుకుంటుంది. దీంతో మెరుగైన రాబడులు ఇవ్వడం, రిస్క్ తగ్గించే విధంగా ఈ పథకం పనిచేస్తుంటుంది. కాంట్రేరియన్ విధానం మధ్యలో కొంత కాలం పాటు మెరుగైన రాబడులు ఇవ్వకపోవచ్చు. కనుక ఇన్వెస్టర్లు దీర్ఘకాలం కోసమే (5–7 ఏళ్లకు మించి) కాంట్రా ఫండ్స్‌ను ఎంపిక చేసుకోవడం సూచనీయం.



పోర్ట్‌ఫోలియో

ఈ పథకం నిర్వహణలో ప్రస్తుతం రూ.18,398 కోట్ల పెట్టుబడులు ఉన్నాయి. ఇందులో 99.45 శాతం మేర స్టాక్స్‌లో ఇన్వెస్ట్ చేసింది. 0.55 శాతం మేర నగదు నిల్వలు ఉన్నాయి. పెట్టుబడులను గమనిస్తే 69.36 శాతం మేర లార్జ్‌క్యాప్‌లోనే ఉన్నాయి. మిడ్‌క్యాప్ స్టాక్స్‌లో 26.90 శాతం ఇన్వెస్ట్ చేసింది. స్మాల్‌క్యాప్ పెట్టుబడులు 3.74 శాతానికి పరిమితమయ్యాయి. పోర్ట్‌ఫోలియోలో మొత్తం 81 స్టాక్స్ ఉన్నాయి. అత్యధికంగా 33 శాతం మేర పెట్టుబడులు బ్యాంకింగ్, ఫైనాన్షియల్ రంగ కంపెనీల్లోనే ఉన్నాయి. ఆ తర్వాత టెక్నాలజీ రంగ కంపెనీలకు ఎక్కువ ప్రాధాన్యం ఇస్తూ 16 శాతం మేర పెట్టుబడులు కేటాయించింది. హెల్త్ కేర్ కంపెనీల్లో 14 శాతం, కన్జ్యూమర్ డిస్క్రిషనరీ కంపెనీల్లో 13 శాతం చొప్పున ఇన్వెస్ట్ చేసింది.

టాప్ ఈక్విటీ హోల్డింగ్స్

కంపెనీ	పెట్టుబడుల శాతం
హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్	8.25
ఐసీఐసీఐ బ్యాంక్	7.76
ఇన్ఫోసిస్	5.53
ఎంఅండ్ఎం	3.47
యాక్సిస్ బ్యాంక్	3.37
ఎల్అండ్‌టీ	3.07
ఎటర్నల్	3.03
అపోలో హాస్పిటల్స్	2.66
ఎన్‌టీపీసీ	2.29
కోఫోర్జ్	2.19


అన్‌మోల్

ఆరు స్వర్ణాలకు 'పంచ్' దూరంలో...

మాహె (సీషెల్స్): సీషెల్స్ నేషనల్ డే అంతర్జాతీయ బాక్సింగ్ టోర్నమెంట్‌లో ఆరుగురు భారత బాక్సర్లు ఫైనల్లోకి దూసుకెళ్లారు. ఈ ఆరుగురూ మరో విజయం సాధిస్తే స్వర్ణ పతకాలను సొంతం చేసుకుంటారు. ఆదిత్య ప్రతాప్ (65 కేజీలు), నీరజ్ (75 కేజీలు), హిమాన్షు శర్మ (50 కేజీలు), ఆశిష్ ముద్గానియా (55 కేజీలు), అన్‌మోల్ (60 కేజలు), గౌరవ్ చౌహాన్ (ప్లస్ 90 కేజీలు) తుది పోరుకు అర్హత సాధించారు. జొవానీ బుజిన్ (సీషెల్స్)తో జరిగిన సెమీఫైనల్ బౌట్‌లో ఆదిత్య ప్రతాప్ వరుసగా పంచ్‌లతో విజృంభించాడు. దాంతో మూడో రౌండ్ మధ్యలోనే బుజిన్ బౌట్ కొనసాగించలేక ఓటమి అంగీకరించాడు. దరియో గాబెరియల్ (సీషెల్స్)తో జరిగిన బౌట్‌లో అన్‌మోల్ 4-1తో గెలుపొందాడు. హిమాన్షు శర్మ 4-1తో సుప్రాయెన్ (మారిషస్)ను ఓడించాడు. ఫ్రాన్సిస్ (మారిషస్)తో జరిగిన మరో సెమీఫైనల్లో ఆశిష్ కూడా 4-1తో నెగ్గాడు.

రాజకీయాలకు నో... కోచింగ్‌కు సై!

భారత క్రికెట్ జట్టు మాజీ కెప్టెన్ సౌరవ్ గంగూలీ మనోగతం


గంగూలీ

కోల్‌కతా: రాజకీయ రంగంలో అడుగుపెట్టే ఆసక్తి లేదని భారత మాజీ కెప్టెన్ సౌరవ్ గంగూలీ స్పష్టం చేశాడు. అంతర్జాతీయ క్రికెట్ నుంచి వీడ్కోలు పలికిన అనంతరం వివిధ రూపాల్లో ఆటతో మమేకమై ఉన్న 'దాదా'... భవిష్యత్తులో టీమిండియాకు కోచ్‌గా కనిపించే అవకాశాలు లేకపోలేదన్నాడు. వచ్చేనెలతో 53వ పడిలోకి అడుగు పెట్టనున్న గంగూలీ... తాజాగా ఓ పాడ్‌కాస్ట్‌లో వివిధ అంశాలపై వివరంగా మాట్లాడాడు. వచ్చే ఏడాది పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న వేళ... ఏదైనా రాజకీయ పార్టీలో చేరాలని అనుకుంటున్నారా అనే ప్రశ్నకు ఈ 'బెంగాల్ టైగర్' చిరునవ్వుతో 'ఆసక్తి లేదని' బదులిచ్చాడు. ముఖ్యమంత్రి పదవి ఇస్తామని హామీ ఇచ్చినా తాను రాజకీయాల్లోకి అడుగు పెట్టబోనని గంగూలీ వెల్లడించాడు.

2018-19, 2022-24 మధ్య ఐపీఎల్ ఫ్రాంచైజీ ఢిల్లీ క్యాపిటల్స్‌కు టీమ్ డైరెక్టర్‌గా పనిచేసిన గంగూలీ... భారత హెడ్ కోచ్‌గా బాధ్యతలు చేపట్టడంపై సుముఖత వ్యక్తం చేశాడు. '2013లో పోటీ క్రికెట్ నుంచి తప్పుకున్నా. ఆ తర్వాత బీసీసీఐ అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టా. ఆ తర్వాత కూడా వేర్వేరు పాత్రల్లో పనిచేస్తున్నందు వల్ల టీమిండియా కోచింగ్ గురించి ఎప్పుడూ ఆలోచించలేదు. నా వయసు ఎక్కువేం కాదు. ముున్ముందు ఏం జరుగుతుందో చూడాలి. నేను **దానికి సిద్ధంగానే ఉన్నాను. బోర్డు అధ్యక్షుడిగా మహిళా క్రికెట్‌కు వెన్నుదన్నుగా నిలవడం సంతృప్తిగా ఉంది. ప్రస్తుతం గంభీర్ తన బాధ్యతలు** సక్రమంగా నిర్వర్తిస్తున్నాడు. ఆస్ట్రేలియా, న్యూజిలాండ్‌తో టెస్టు సిరీస్‌లు ఓడినా... అతడి కోచింగ్‌లో టీమిండియా చాంపియన్స్ ట్రోఫీ అందుకుంది. ఇప్పుడు ఇంగ్లండ్ పర్యటనలోనూ టీమిండియా మంచి ప్రదర్శన చేస్తోంది. ఆట పట్ల అతడి నిబద్ధత చాలా గొప్పది. కోచ్‌గా అతడి వ్యవహార శైలిపై అవగాహన లేకపోయినా... ఆటగాడిగా అతడితో కలిసి ఆడాను. ముక్కుసూటి వ్యక్తి. ఆటగాళ్ల నుంచి తాను ఏం కోరుకుంటున్నాడో దాన్ని స్పష్టంగా అర్థమయ్యేలా చెప్పగలడు. చాలా పారదర్శకంగా వ్యవహరిస్తాడు. ఆటగాడిగా ఉన్న సమయంలో నాతో పాటు ఇతర సీనియర్ ఆటగాళ్ల పట్ల గంభీర్ చాలా గౌరవంగా ఉండేవాడు. కోచ్‌గా బాధ్యతలు చేపట్టి దాదాపు ఏడాదే అవుతోంది. నేర్చుకోవడానికి కొంత సమయం ఇవ్వాల్సిన అవసరముంది' అని గంగూలీ వివరించాడు.

రోహిత్, కోహ్లి...

2027 వన్డే వరల్డ్‌కప్ ఆడటం కష్టమే

గతేడాది టి20 ప్రపంచకప్ గెలిచిన అనంతరం టి20 ఫార్మాట్‌కు వీడ్కోలు పలికిన సీనియర్ **ఆటగాళ్లు రోహిత్ శర్మ, విరాట్ కోహ్లి... తాజాగా టెస్టు ఫార్మాట్ నుంచి కూడా తప్పుకున్నారు. ప్రస్తుతం వన్డేల్లో మాత్రమే కొనసాగుతున్న ఈ** ఇద్దరూ 2027 జరిగే 50 ఓవర్ల ప్రపంచకప్‌లో పాల్గొనడంపై గంగూలీ ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. దక్షిణాఫ్రికా వేదికగా జరగనున్న ఈ మెగా టోర్నీ సమయానికి రోహిత్ 40 ఏళ్లు, కోహ్లి 38 ఏళ్లలో ఉండనున్నారు. ఆలోపు భారత జట్టు 9 ద్వైపాక్షిక సిరీస్‌ల్లో కలుపుకొని మొత్తం 27 వన్డే మ్యాచ్‌లు ఆడనుంది. అంటే రోహిత్, కోహ్లి ఏడాదికి అటు ఇటుగా 15 మ్యాచ్‌ల చొప్పున ఆడనున్నారు. ఈ నేపథ్యంలో గంగూలీ మాట్లాడుతూ... 'మనం ఒక విషయం అర్థం చేసుకోవాలి. ఏడాదికి 15 మ్యాచ్‌లు ఆడటం అంత సులువు కాదు. అంతర్జాతీయ క్రికెట్‌లో అపార అనుభవం ఉన్న వాళ్లిద్దరికి ఎవరో చెప్పాల్సిన అవసరం లేదు. వారే నిర్ణయం తీసుకుంటారు. కోహ్లి వంటి కళాత్మక ఆటగాడి స్థానాన్ని భర్తీ చేయడం అంత సులువు కాదు. కాస్త సమయం పడుతుంది' అని అన్నాడు. ఇక భారత మాజీ ఆల్‌రౌండర్ యువరాజ్ సింగ్‌పై 'దాదా' ప్రశంసలు కురిపించాడు. పరిమిత ఓవర్ల క్రికెట్‌లో యువీ అత్యంత ప్రతిభావంతుడని కొనియాడాడు. 'దేశానికి రెండు ప్రపంచకప్‌లు అందించడంలో యువరాజ్ కీలక పాత్ర పోషించాడు. 2007 టి20 వరల్డ్‌కప్, 2011 వన్డే ప్రపంచకప్‌లో అతడు 'ప్లేయర్ ఆఫ్ ద సిరీస్'గా నిలిచాడు. బ్యాటింగ్, బౌలింగ్, ఫీల్డింగ్ ఇలా ఎందులో చూసుకున్నా అతడు అత్యుత్తమ ప్రదర్శన చేశాడు. అయితే టెస్టు క్రికెట్‌లో అతడికి తగినన్ని అవకాశాలు రాలేదు. ద్రవిడ్, సచిన్, గంగూలీ, వీవీఎస్ లక్ష్మణ్‌ల మధ్య నలిగిపోయాడు' అని చమత్కరించాడు.

వచ్చే ఏడాది చివర్లో 'దాదా' బయోపిక్

ఇక తన బయోపిక్ వచ్చే ఏడాది చివరి వరకు విడుదలయ్యే అవకాశాలున్నాయని గంగూలీ వెల్లడించాడు. 'స్క్రిప్ట్ వర్క్, ప్రి ప్రొడక్షన్‌కు ఎక్కువ సమయం పడుతుంది. వచ్చే ఏడాది జనవరిలో సెట్స్ మీదకు వెళ్లొచ్చు. అంతా సిద్ధమైతే షూటింగ్‌కు ఎక్కువ సమయం పట్టదు' అని సౌరవ్ వెల్లడించాడు. భారత క్రికెట్ గతిని మార్చిన 'దాదా' బయోపిక్‌లో బాలీవుడ్ నటుడు రాజ్ కుమార్ రావు నటిస్తున్నాడు.


నిఖిల్


జైదీప్

భారత్ 'పసిడి' పట్టు

ఆసియా అండర్-23 రెజ్లింగ్ చాంపియన్‌షిప్‌లో టీమ్ టైటిల్ సొంతం


సుజీత్ కల్కాల్

వుంగ్ తౌ (వియత్నాం): తమ అత్యుత్తమ ప్రదర్శన కనబరిచిన భారత పురుషుల ఫ్రీస్టయిల్ రెజ్లింగ్ జట్టు... ఆసియా అండర్-23 చాంపియన్‌షిప్‌లో టీమ్ టైటిల్‌ను సొంతం చేసుకుంది. ఆదివారం ముగిసిన ఈ టోర్నీలో భారత రెజ్లర్లు ఆరు స్వర్ణ పతకాలు, ఒక రజత పతకంతో కలిపి మొత్తం ఏడు పతకాలతో టాప్ ర్యాంక్‌లో నిలిచింది. భారత్ తరఫున నిఖిల్ (61 కేజీలు), సుజీత్ కల్కాల్ (65 కేజీలు), జైదీప్ (74 కేజీలు), చందర్ మోహన్ (79 కేజీలు), సచిన్ (92 కేజీలు), విక్కీ (97 కేజీలు) పసిడి పతకాలను గెల్చుకున్నారు. జస్‌పూరణ్ సింగ్ (125 కేజీలు) రజత పతకాన్ని సాధించాడు. ఫైనల్స్‌లో నిఖిల్ 7-2తో మెరీ బజర్‌బయేవ్ (కజకిస్తాన్)పై, సుజీత్ 10-0తో ఉమిద్‌జాన్ జలోలోవ్ (ఉజ్బెకిస్తాన్)పై, జైదీప్ 7-0తో జఫర్‌బెక్ (ఉజ్బెకిస్తాన్)పై, చందర్ మోహన్ 5-2తో బెజెన్‌జోవ్ (తుర్క్‌మెనిస్తాన్)పై, సచిన్ 5-2తో తుముర్ బాటర్ (మంగోలియా)పై, విక్కీ 9-6తో నూర్‌దౌలత్ బెకెనోవ్ (కజకిస్తాన్)పై నెగ్గారు. జస్‌పూరణ్ 3-4తో బత్‌బాయెర్ (మంగోలియా) చేతిలో ఓడిపోయాడు. ఇదే టోర్నీలో భారత మహిళల ఫ్రీస్టయిల్ జట్టు కూడా పోటీపడ్డ 10 వెయిట్ కేటగిరీల్లో పతకాలు గెలిచి టీమ్ టైటిల్‌ను సాధించింది.

రోహిత్... 'ప్రేమ కథా చిత్రం'

పిచ్‌పై భార్య రితికకు లవ్ ప్రపోజ్ చేశానన్న భారత వన్డే కెప్టెన్


రోహిత్, రితికా

ముంబై: మైదానంలో సహచరులతో సరదాగా ఉంటూ... ప్రత్యర్థి బౌలర్ల భరతం పట్టే భారత వన్డే కెప్టెన్ రోహిత్ శర్మ... తన వ్యక్తిగత జీవితానికి సంబంధించి అభిమానులకు తెలియని విషయాలు తాజాగా పంచుకున్నాడు. భార్య రితికా సజ్దేకు తొలిసారి తన ప్రేమను వ్యక్త పరిచిన విధానాన్ని వెల్లడించాడు. మాజీ క్రికెటర్ హర్భజన్ సింగ్, గీతా బస్రా దంపతుల యూట్యూబ్ చానల్‌లో నిర్వహించిన ఓ ప్రత్యేక కార్యక్రమంలో రోహిత్ తన ప్రేమకథను వివరించాడు. తాను చిన్నప్పుడు క్రికెట్ ఓనమాలు నేర్చుకున్న మైదానంలోని పిచ్‌పై మోకాళ్ల మీద కూర్చొని రితికాకు లవ్ ప్రపోజ్ చేసినట్లు తెలిపాడు. 'నా ప్రేమ వ్యక్తీకరణ రొమాంటిక్‌గా జరిగింది. నా కెరీర్ ప్రారంభమైన చోటే లవ్ ప్రపోజ్ చేయాలని నిర్ణయించుకున్నా. అందుకోసం ముందే అంతా సిద్ధం చేసుకున్నా. ఓ సాయంత్రం రితికా నా కోసం ఇంటి నుంచి భోజనం తీసుకొచ్చింది. ఇద్దరం కలిసి మెరీన్ డ్రైవ్‌లో కబుర్లు చెప్పుకుంటూ అది లాగించాం. ఆ తర్వాత ఐస్‌క్రీమ్ తిందామని చెప్పి తనను కారు ఎక్కించుకున్నా. మెరీన్ డ్రైవ్, హాజీ అలీ, వర్లీ ఇలా ముందుకు వెళ్తుంటే... ఐస్‌క్రీమ్ షాప్ ఇంకెక్కడుంది అని రితికా ఎదురు ప్రశ్నించింది. బాంద్రా తప్పించి తనకు ముంబై సిటీ ఎక్కువ తెలియదు. దీంతో బోరీవాలిలో మంచి ఐస్‌క్రీమ్ దొరుకుతుందని అబద్ధం చెప్పి తీసుకెళ్లా. కారు ఒక చోట పార్క్ చేసి ఆమెను మైదానంలోకి తీసుకెళ్లా. అప్పటికే నా స్నేహితులతో చెప్పి కొన్ని ప్రత్యేక ఏర్పాట్లు చేయించా. ఆ క్షణాలను ఎప్పటికీ గుర్తుండిపోయేలా ప్లాన్ చేశా. పిచ్ మధ్యకు వెళ్లిన తర్వాత మోకాళ్లపై కూర్చొని తనకు నా ప్రేమను వ్యక్త పరిచా' అని రోహిత్ తన ప్రేమ కథను వివరించాడు. గతేడాది టి20 ప్రపంచకప్ గెలిచిన అనంతరం ఆ ఫార్మాట్‌కు వీడ్కోలు పలికిన రోహిత్ శర్మ... ఇటీవల టెస్టు క్రికెట్ నుంచి సైతం తప్పుకున్నాడు. ప్రస్తుతం వన్డేల్లో మాత్రమే కొనసాగుతున్న హిట్‌మ్యాన్... ఐపీఎల్ అనంతరం కుటుంబంతో కలిసి గడుపుతున్నాడు.

'క్వీన్స్ క్లబ్' కింగ్ అల్‌కరాజ్



లండన్: ఈ ఏడాది తన అద్భుతమైన ఫామ్‌ను కొనసాగిస్తూ స్పెయిన్ టెన్నిస్ స్టార్ కార్లోస్ అల్‌కరాజ్ ఐదో సింగిల్స్ టైటిల్‌ను సొంతం చేసుకున్నాడు. ఆదివారం ముగిసిన క్వీన్స్ క్లబ్ ఏటీపీ-500 టోర్నీలో ప్రపంచ రెండో ర్యాంకర్ అల్‌కరాజ్ చాంపియన్‌గా నిలిచాడు. 2 గంటల 8 నిమిషాలపాటు జరిగిన పురుషుల సింగిల్స్ ఫైనల్లో టాప్ సీడ్ అల్‌కరాజ్ 7-5, 6-7 (5/7), 6-2తో జిరీ లెహెస్కా (చెక్ రిపబ్లిక్)పై గెలుపొందాడు. విజేత అల్‌కరాజ్‌కు 4,71,755 యూరోల (రూ. 4 కోట్ల 70 లక్షలు) ప్రైజ్‌మనీతోపాటు 500 ర్యాంకింగ్ పాయింట్లు... రన్నరప్ లెహెస్కాకు 2,53,790 యూరోల (రూ. 2 కోట్ల 53 లక్షలు) ప్రైజ్‌మనీతోపాటు 330 ర్యాంకింగ్ పాయింట్లు లభించాయి. ఫైనల్లో అల్‌కరాజ్ 18 ఏస్‌లు సంధించి, రెండు డబుల్ ఫాల్ట్‌లు చేశాడు. ప్రత్యర్థి సర్వీస్‌ను మూడుసార్లు బ్రేక్ చేసిన అల్‌కరాజ్ తన సర్వీస్‌ను ఒక్కసారి కూడా కోల్పోలేదు. ఓవరాల్‌గా అల్‌కరాజ్ కెరీర్‌లో ఇది 21వ సింగిల్స్ టైటిల్. ఈ ఏడాది అల్‌కరాజ్ రొటర్‌డామ్ ఓపెన్, మోంటెకార్లో మాస్టర్స్, రోమ్ మాస్టర్స్, ఫ్రెంచ్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్ టోర్నీల్లో విజేతగా నిలిచాడు.


వ్రిత్తి అగర్వాల్‌కు కాంస్య పతకం



భువనేశ్వర్: జాతీయ సీనియర్ అక్వాటిక్స్ చాంపియన్‌షిప్‌లో తెలంగాణ పతకాల బోణీ చేసింది. తెలంగాణకు చెందిన వ్రిత్తి అగర్వాల్ మహిళల 400 మీటర్ల ఫ్రీస్టయిల్ విభాగంలో కాంస్య పతకాన్ని సాధించింది. ఆదివారం జరిగిన 400 మీటర్ల ఫైనల్‌ను వ్రిత్తి 4 నిమిషాల 30.05 సెకన్లలో ముగించి మూడో స్థానాన్ని దక్కించుకుంది. భవ్య సచ్‌దేవ (ఢిల్లీ; 4ని:26.66 సెకన్లు) స్వర్ణ పతకం... అదితి సతీశ్ హెగ్డే (మహారాష్ట్ర; 4ని:29.48 సెకన్లు) రజత పతకం గెల్చుకున్నారు.

భళా... బుబ్లిక్

హాలె ఓపెన్ టైటిల్ సొంతం



హాలె (జర్మనీ): అంచనాలకు మించి రాణించిన కజకిస్తాన్ టెన్నిస్ స్టార్ అలెగ్జాండర్ బుబ్లిక్ తన కెరీర్‌లో ఐదో సింగిల్స్ టైటిల్‌ను సాధించాడు. ఆదివారం ముగిసిన హాలె ఓపెన్ ఏటీపీ-500 టోర్నీలో ప్రపంచ 45వ ర్యాంకర్ బుబ్లిక్ విజేతగా నిలిచాడు. హాలె ఓపెన్ టైటిల్‌ను బుబ్లిక్ సాధించడం ఇది రెండోసారి. 2023లోనూ అతను తొలిసారి చాంపియన్‌గా అవతరించాడు. ఫైనల్లో బుబ్లిక్ 6-3, 7-6 (7/4)తో ప్రపంచ మాజీ నంబర్‌వన్, యూఎస్ ఓపెన్ మాజీ విజేత, మూడో సీడ్ డానిల్ మెద్వెదెవ్ (రష్యా)పై గెలుపొందాడు. 6 అడుగుల 5 అంగుళాల ఎత్తు, 82 కేజీల బరువున్న బుబ్లిక్ ఫైనల్లో 11 ఏస్‌లు సంధించి, ఐదు డబుల్ ఫాల్ట్‌లు చేశాడు. తొలి సెట్‌లో ప్రత్యర్థి సర్వీస్‌ను ఒకసారి బ్రేక్ చేసిన బుబ్లిక్ రెండో సెట్‌ను టైబ్రేక్‌లో దక్కించుకున్నాడు. ఈ టైటిల్ గెలిచే క్రమంలో బుబ్లిక్ రెండో రౌండ్‌లో ప్రపంచ నంబర్‌వన్ యానిక్ సినెర్ (ఇటలీ)పై, క్వార్టర్ ఫైనల్లో ఏడో సీడ్ టామస్ మఖచ్ (చెక్ రిపబ్లిక్)పై, సెమీఫైనల్లో ఎనిమిదో సీడ్ ఖచనోవ్ (రష్యా)పై గెలుపొందడం విశేషం. విజేత బుబ్లిక్‌కు 4,71,755 యూరోల (రూ. 4 కోట్ల 70 లక్షలు) ప్రైజ్‌మనీతోపాటు 500 ర్యాంకింగ్ పాయింట్లు... రన్నరప్ మెద్వెదెవ్‌కు 2,53,790 యూరోల (రూ. 2 కోట్ల 53 లక్షలు) ప్రైజ్‌మనీతోపాటు 330 ర్యాంకింగ్ పాయింట్లు లభించాయి

దివిత్ రెడ్డికి కాంస్య పతకం



సాక్షి, హైదరాబాద్: జాతీయ అండర్-9 చెస్ చాంపియన్‌షిప్ ఓపెన్ విభాగంలో తెలంగాణకు చెందిన అదుళ్ల దివిత్ రెడ్డి కాంస్య పతకం సాధించాడు. హరియాణాలో జరిగిన ఈ టోర్నీలో నిర్ణీత 11 రౌండ్ల తర్వాత దివిత్‌తోపాటు మరో ఐదుగురు 8.5 పాయింట్లతో ఉమ్మడిగా మూడో స్థానంలో నిలిచారు. మెరుగైన టైబ్రేక్ స్కోరు ఆధారంగా ర్యాంకింగ్‌ను వర్గీకరించగా... దివిత్‌కు కాంస్య పతకం ఖరారైంది. 10 పాయింట్లతో సాత్విక్ స్వయిన్ (ఒడిశా) విజేతగా అవతరించగా... 9.5 పాయింట్లతో ఆద్విక్ అభినవ్ కృష్ణ (కర్ణాటక) రన్నరప్‌గా నిలిచాడు. 150 మంది ప్లేయర్ల మధ్య స్విస్ ఫార్మాట్‌లో జరిగిన ఈ టోర్నీలో దివిత్ ఏడు గేముల్లో గెలిచి, మూడు గేమ్‌లను 'డ్రా' చేసుకొని, ఒక గేమ్‌లో మాత్రమే ఓడిపోయాడు. గత ఏడాది నవంబర్‌లో ఇటలీలో జరిగిన ప్రపంచ క్యాడెట్ చెస్ చాంపియన్‌షిప్‌లో దివిత్ రెడ్డి అండర్-8 ఓపెన్ విభాగంలో... ఏప్రిల్‌లో అల్బేనియాలో జరిగిన ప్రపంచ క్యాడెట్ ర్యాపిడ్ చాంపియన్‌షిప్ అండర్-8 ఓపెన్ విభాగంలో స్వర్ణ పతకాలు సాధించడం విశేషం. మరోవైపు బాలికల విభాగంలో తెలంగాణకు చెందిన సాయి అన్విత 8.5 పాయింట్లతో నాలుగో స్థానంలో నిలిచి త్రుటిలో కాంస్యం చేజార్చుకుంది.

సహజ ఓటమి



సాక్షి, హైదరాబాద్: అంతర్జాతీయ టెన్నిస్ సమాఖ్య (ఐటీఎఫ్) డబ్ల్యూ35 మహిళల టోర్నీలో హైదరాబాద్ క్రీడాకారిణి సహజ యామలపల్లి పోరాటం ముగిసింది. అమెరికాలోని కన్సాస్ సిటీలో ఈ టోర్నీ జరిగింది. సింగిల్స్ సెమీఫైనల్లో సహజ 6-3, 6-7 (3/7), 2-6తో ఫియోనా క్రాలీ (అమెరికా) చేతిలో పోరాడి ఓడిపోయింది. 3 గంటల 3 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో సహజ మూడు డబుల్ ఫాల్ట్‌లు చేసింది. తన సర్వీస్‌ను ఏడుసార్లు కోల్పోయి, ప్రత్యర్థి సర్వీస్‌ను ఆరుసార్లు బ్రేక్ చేసింది. తొలి సర్వ్‌లో 30 పాయింట్లు నెగ్గిన సహజ రెండో సర్వ్‌లో మాత్రం కేవలం 18 పాయింట్లను సొంతం చేసుకుంది.

రెండేళ్ల తర్వాత...

టైటిల్ నెగ్గిన చెక్ రిపబ్లిక్ స్టార్ వొండ్రుసోవా



బెర్లిన్: హోరాహోరీ పోరులో పైచేయి సాధించిన చెక్ రిపబ్లిక్ టెన్నిస్ స్టార్ మర్కెటా వొండ్రుసోవా... రెండేళ్ల తర్వాత తన కెరీర్‌లో మరో సింగిల్స్ టైటిల్‌ను సొంతం చేసుకుంది. ఆదివారం జరిగిన బెర్లిన్ ఓపెన్ డబ్ల్యూటీఏ-500 టోర్నీలో 25 ఏళ్ల వొండ్రుసోవా విజేతగా అవతరించింది. 2 గంటల 16 నిమిషాలపాటు జరిగిన తుది పోరులో ప్రపంచ 164వ ర్యాంకర్ వొండ్రుసోవా 7-6 (12/10), 4-6, 6-2తో ప్రపంచ 49వ ర్యాంకర్ జిన్‌యు వాంగ్ (చైనా)పై విజయం సాధించింది. 2023లో వింబుల్డన్ గ్రాండ్‌స్లామ్ సింగిల్స్ టైటిల్ నెగ్గి సంచలనం సృష్టించిన వొండ్రుసోవా ఆ తర్వాత మరో టైటిల్‌ను అందుకోలేకపోయింది. జిన్‌యు వాంగ్‌తో జరిగిన ఫైనల్లో వొండ్రుసోవా ఆరు ఏస్‌లు సంధించి, ఏడు డబుల్ ఫాల్ట్‌లు చేసింది. తన సర్వీస్‌ను నాలుగుసార్లు కోల్పోయి, ప్రత్యర్థి సర్వీస్‌ను ఐదుసార్లు బ్రేక్ చేసింది. టైటిల్ గెలిచే క్రమంలో వొండ్రుసోవా సెమీఫైనల్లో ప్రపంచ నంబర్‌వన్ సబలెంకా (బెలారస్)పై, తొలి రౌండ్‌లో ఈ ఏడాది ఆస్ట్రేలియన్ ఓపెన్ చాంపియన్ మాడిసన్ కీస్ (అమెరికా)పై, క్వార్టర్ ఫైనల్లో ప్రపంచ మాజీ రెండో ర్యాంకర్ ఆన్స్ జబర్ (ట్యూనిషియా)పై నెగ్గడం విశేషం. విజేతగా నిలిచిన వొండ్రుసోవాకు 1,42,610 యూరోల (రూ. 1 కోటీ 42 లక్షలు) ప్రైజ్‌మనీతోపాటు 500 ర్యాంకింగ్ పాయింట్లు లభించాయి.



ఇటలీలోని సిసిలీలో 2024 ఆగస్ట్ 19వ తేదీ రాత్రి బెయేసియన్ అనే ఈ పడవ ప్రమాదవశాత్తు మునిగింది. దీనిని ఆదివారం బయటకు తీస్తున్న దృశ్యం. ఈ ప్రమాదంలో బ్రిటన్ కుబేరుడు మైక్ లించ్ మరణించారు.



గడ్డి మొక్కల అల్లికను తలపై ధరించిన ఈమె ఉక్రెయిన్ మహిళ. పోలండ్ రాజధాని వార్సాలో జరిగిన 'కుపాలా నైట్' వేడుకలో ఈమె అందరినీ ఆకర్షించింది.



ఈ నెల 12న అహ్మదాబాద్‌లో కుప్పకూలిన ఎయిరిండియా విమాన శకలమిది. ఆదివారం ట్రక్కుపై తరలిస్తున్న విమానం శకలాన్ని ఆసక్తిగా గమనిస్తున్న అహ్మదాబాద్ వాసులు

కలిసి పనిచేస్తేనే లాభం!

పొరుగు దేశాలకు జైశంకర్ సూచన

న్యూఢిల్లీ: పొరుగు దేశాలతో సంబంధాలు ఎల్లప్పుడూ సజావుగా సాగాలని ఆశించకూడదని విదేశాంగ మంత్రి ఎస్.జైశంకర్ అన్నారు. పాలకులతో సంబంధం లేకుండా సంబంధాల్లో స్థిరత్వాన్ని నిర్మించడానికి తమ ప్రభుత్వం ప్రయత్నించిందని నొక్కి చెప్పారు. అందుకు శ్రీలంక, మాల్దీవులను ఆయన ఉదహరించారు. అక్కడ నాయకత్వం మారినప్పటికీ ద్వైపాక్షిక సంబంధాలు స్థిరంగా ఉన్నాయన్నారు. ఏ దేశంతోనైనా పరిస్థితులు క్లిష్టంగా ఉన్నప్పుడు చేతులెత్తేయకూడదన్నారు. భారత్‌తో కలిసి పనిచేయడం ఇతర దేశాలకే లాభిస్తుందని, లేదంటే వారే నష్టపోతారని వ్యాఖ్యానించారు. అయితే ఈ విషయాన్ని గ్రహించడానికి కొన్ని దేశాలకు ఎక్కువ సమయం పడుతుందన్నారు. సైన్యం చేతుల్లో అధికారం, భారత్‌పై శత్రుత్వంతో ఉన్న పాకిస్తాన్ ఇందుకు మినహాయింపని, ఒక్క పాక్‌ను పక్కనపెడితే.. దౌత్యం అన్ని చోట్లా వర్తిస్తుందన్నారు. డీడీ ఇండియాకు ఇచ్చిన ఇంటర్వ్యూ లింక్‌ను తన ఎక్స్ హ్యాండిల్‌లో శనివారం రాత్రి ఆయన పోస్టు చేశారు. దాదాపు గంటసేపు జరిగిన సంభాషణలో దౌత్యసంబంధాలపై అనేక విషయాలను జైశంకర్ పంచుకున్నారు. చైనాతో చాలా సంక్లిష్ట పరిస్థితులు నెలకొన్నాయని, వాటిని ఎదుర్కోవడానికి మన సామర్థ్యాలను పెంచుకోవాల్సి వచ్చిందని తెలిపారు. జూన్ 2020లో గాల్వన్ లోయ ఘర్షణ తర్వాత రెండు దేశాల మధ్య సంబంధాలు గణనీయంగా దెబ్బతిన్నాయి. అయితే.. గత దశాబ్దాల్లో మన సరిహద్దు మౌలిక సదుపాయాలను పూర్తిగా విస్మరించడం వల్లే ఈ గందరగోళ పరిస్థితి వచ్చిందన్నారు. కానీ బీజేపీ ప్రభుత్వం సరిహద్దు మౌలిక సదుపాయాలపై నిర్మించడం వల్ల పరిస్థితి మారిపోయిందని, మన దేశ ప్రయోజనాలను కాపాడుకోగలుగుతున్నామని జైశంకర్ తెలిపారు. గత 11 ఏళ్లలో భారత్ పొరుగు దేశాలతో సంబంధాలను మరింతగా పెంచుకుందని, గల్ఫ్ దేశాలకు చేరువైందని, ఆసియాన్, ఇండో-పసిఫిక్ ప్రాంతాలతో సంబంధాలను మరింతగా బలోపేతం చేసుకుందని చెప్పారు. మోదీ ప్రభుత్వం హయాంలో పాకిస్తాన్ పట్ల భారతదేశ విధానం మారిపోయిందని, 2016 ఉరి సర్జికల్ స్ట్రైక్, 2019 బాలకోట్ వైమానిక దాడులను ఆయన ప్రస్తావించారు. ఆర్టికల్ 370 రద్దు, భారత్ ఉగ్రవాద నిరోధక కార్యకలాపాలను విస్తృత వ్యూహంలో భాగాలుగా చూడాలని జైశంకర్ చెప్పారు. ప్రధాని మోదీని 'మన కాలపు నాయకుడు'గా జైశంకర్ అభివర్ణించారు. ప్రజల మానసిక స్థితి మారిందని, ప్రజల ఆత్మవిశ్వాసానికి ప్రధాని మోదీ నిదర్శనమని మంత్రి నొక్కి చెప్పారు.

మావోయిస్టులను నిద్రపోనివ్వను

- వర్షాకాలంలోనూ కేంద్ర ఆపరేషన్ కొనసాగుతుంది
- హోంమంత్రి అమిత్ షా హెచ్చరిక

రాయ్‌పూర్: మావోయిస్టులు సాధారణగా వర్షాకాలంలో విశ్రాంతి తీసుకుంటారని, కానీ ఈ వర్షాకాలంలో కూడా మావోయిస్టులను నిద్రపోనివ్వనని కేంద్ర హోంమంత్రి అమిత్ షా అన్నారు. వర్షాకాలంలో కూడా ప్రభుత్వ ఆపరేషన్ కొనసాగుతుందని హెచ్చరించారు. చర్చల ప్రసక్తే లేదన్న మంత్రి.. అడవుల్లో ఉన్న మావోయిస్టులంతా ఆయుధాలు వదిలి జన జీవన స్రవంతిలో కలిసిపోవాలని, అభివృద్ధికి కలిసి రావాలని పిలుపునిచ్చారు. చత్తీస్‌గఢ్‌లోని నవా రాయ్‌పూర్ అటల్ నగర్‌లో నేషనల్ ఫోరెన్సిక్ సైన్స్ యూనివర్సిటీ(ఎన్ఎఫ్ఎస్‌యూ)కి ఆదివారం మంత్రి శంకుస్థాపన చేశారు. అలాగే సెజ్‌బహార్‌లోని ఎన్ఎఫ్ఎస్‌యూ ట్రాన్సిట్ క్యాంపస్‌ను, చత్తీస్‌గఢ్‌లోని ఐ-హబ్‌ను వర్చువల్‌గా ప్రారంభించారు. అనంతరం షా మాట్లాడుతూ వచ్చే ఏడాది మార్చి చివరికల్లా నక్సలిజాన్ని అంతం చేస్తామని పునరుద్ఘాటించారు. ఆయుధాలు వదిలి జనజీవన స్రవంతిలో కలిసిపోయిన వారికి రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలతో పాటు కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన వాగ్దానాలను కూడా అమలు చేస్తామన్నారు. అవసరమైతే అంతకన్న ఎక్కువ సహాయ, సహకారాలు అందిస్తామని తెలిపారు. భారతీయ న్యాయ సంహిత, భారతీయ నాగరిక్ సురక్ష సంహిత, భారతీయ సాక్ష్య అధినియంలను పూర్తిగా అమలుతో మన దేశ నేర న్యాయ వ్యవస్థ ప్రపంచంలోనే అత్యంత ఆధునిక, వేగవంతమైన, శాస్త్రీయ న్యాయ వ్యవస్థగా మారుతుందని షా అన్నారు. నవ రాయ్‌పూర్‌లోని ఎన్ఎఫ్ఎస్‌యూ క్యాంపస్‌కు రూ. 145 కోట్లు, సీఎఫ్ఎస్ఎల్‌కు రూ. 123 కోట్లు ఖర్చవుతుందని, ఇవి మూడు సంవత్సరాలలో అందుబాటులోకి వస్తాయన్నారు. 2047 నాటికి భారత దేశాన్ని అభివృద్ధి చెందిన దేశంగా మార్చాలనే ప్రధానమంత్రి నరేంద్ర మోదీ దార్శనికత ఆవిష్కరణ, మౌలిక సదుపాయాలు, పారిశ్రామిక, ఆర్థిక పురోగతిపైనే కాకుండా సకాలంలో న్యాయం అందించడంపైనా దృష్టి పెడుతుందని చెప్పారు. కార్యక్రమంలో ముఖ్యమంత్రి విష్ణు దేవ్ సాయి, ఉప ముఖ్యమంత్రులు అరుణ్ సావో, విజయ్ శర్మ, ఇతర అధికారులు పాల్గొన్నారు.

గాజాలో... ఆకలి కేకలు!

గాజా: 2023 అక్టోబర్ 7వ తేదీన ఇజ్రాయెల్ సరిహద్దు ప్రాంతంపై మెరుపుదాడి చేపట్టిన హమాస్ ఇతర జిహాదీలు 1,195 మందిని చంపేయడంతోపాటు 251 మందిని బందీలుగా పట్టుకుపోయారు. ఆ ఒక్క ఘటన..దశాబ్దాలుగా శరణార్థులుగా సొంత ప్రాంతంలోనే బతుకులీడుస్తున్న పాలస్తీనా ప్రజలను అత్యంత తీవ్రమైన కష్టాల్లోకి నెట్టివేసింది. శక్తివంతమైన ఇజ్రాయెల్ సైన్యం ఆ రోజు నుంచి గాజాపై యథేచ్ఛగా దాడులు సాగిస్తూ 50 వేల మందిని పొట్టనబెట్టుకోవడంతో పాటు సుమారు లక్షన్నర మందిని క్షతగాత్రులుగా మార్చేసింది. జిహాదీ గ్రూపులు బందీలను విడుదల చేయలేదనే సాకుతో గాజాను కొన్ని నెలలుగా పూర్తిగా దిగ్బంధంలో ఉంచింది. నీరు, ఆహారం, మందులు, ఇతర అత్యవసరాలను సైతం అందకుండా చేసింది. దీంతో ఈ ఆ ప్రాంతంలోని 22% మంది, 4.70 లక్షల మంది ప్రజలు ఆకలితో అలమటిస్తున్నారు. అత్యంత కీలకమైన ఆస్పత్రులు, నీటి సరఫరా వ్యవస్థలు దెబ్బతిన్నాయి. ఆస్పత్రుల్లో వసతులు, మందులు కరువై సరైన వైద్యం అందక, మహిళలు, చిన్నారులు మృత్యువాతపడుతున్నారు. మంచి నీరు, ఇంధన సరఫరాను సైతం నిలిపివేసింది. డీహైడ్రేషన్, డయేరియా, హెపటైటిస్ వంటి వాటితో జనం, ముఖ్యంగా చిన్నారులు ప్రాణాలు కోల్పోతున్నారు. గాజా ప్రాంతంలోని 90 శాతం నివాసాలను నేలమట్టం చేసి, నిలువ నీడ లేకుండా చేసింది. నేలమట్టమైన భవనాల శిథిలాలు, అపరిశుభ్రత మధ్యనే పాలస్తీనియన్లు భయంభయంగా బతుకుతున్నారు. ఐరాస సారథ్యంలో నడుస్తున్న ఆహార పంపిణీ కేంద్రాల నుంచి నిల్వలు హమాస్‌కు దారి మళ్లుతున్నాయని ఆరోపిస్తూ వాటిని ఇజ్రాయెల్ మూసివేయించింది. రెండు నెలలుగా అమెరికా, ఇజ్రాయెల్ సారథ్యంలో ఆహార పంపిణీ కేంద్రాలు పరిమితంగా ఏర్పాటయ్యాయి. ఇక్కడ సైతం అన్నార్తులు తుపాకీ కాల్పులకు గురికాక తప్పడం లేదు. రోజూ పదుల సంఖ్యలో జనం మృత్యువాత పడుతున్నారు. 'గాజాలో మానవీయ సంక్షోభం తీవ్ర రూపం దాల్చింది. తీవ్ర కరువు పరిస్థితులు తాండవిస్తున్నాయి. మరికొన్ని రోజులు పరిస్థితులు ఇలాగే కొనసాగితే లక్షలాది మంది ఆకలి చావులకు గురికాక తప్పదు'అని ఐరాస ఆందోళన వ్యక్తం చేస్తోంది. గాజా స్ట్రిప్‌లోని 20 లక్షల మంది ప్రజల ఆకలిని ఆయుధంగా చేసుకోవడం తగదని ఇజ్రాయెల్‌కు హితవు పలుకుతోంది.



ఆదివారం అల్ మవాసీలోని పంపిణీ కేంద్రం వద్ద ఆహారం కోసం ఎదురుచూస్తున్న ఓ చిన్నారి

భూమిపై నరకం గాజా

భూమిపై నరకం కంటే అధ్వానంగా గాజా ప్రాంతం తయారైందని ఇంటర్నేషనల్ కమిటీ ఆఫ్ ది రెడ్ క్రాస్ ప్రెసిడెంట్ మిర్జానా స్పోల్‌జరిక్ వ్యాఖ్యానించారు. గాజాలో యుద్ధాన్ని ఆపేందుకు, పాలస్తీనా ఖైదీలను విడుదల చేసేందుకు, బందీలను వదిలిపెట్టేందుకు ప్రపంచ దేశాలు అవసరమైన ప్రయత్నాలు చేయడం లేదని ఆరోపించారు. అంతర్జాతీయ మానవతా చట్టాలను పట్టించుకోవడం లేదు. పాలస్తీనియన్లకు కనీస మానవీయమైన గౌరవాన్ని కూడా ఇవ్వడం లేదు. గాజాలో చట్టపరమైన, నైతిక, మానవీయ ప్రమాణాల ఉల్లంఘన జరుగుతోందని ఆమె పేర్కొన్నారు.

గాజాలో మరో 26 మంది మృత్యువాత

టెల్ అవీవ్/గాజా: గాజాలో ఆదివారం ఇజ్రాయెల్ ఆర్మీ జరిపిన దాడుల్లో కనీసం 26 మంది ప్రాణాలు కోల్పోయారు. వీరిలో ఆహార పంపిణీ కేంద్రం జరిగిన కాల్పుల్లో అసువులు బాసిన 11 మంది ఉన్నారు. మరో 20 మంది గాయపడ్డారు. దక్షిణ గాజాలోని అల్-మవాసిలో శరణార్థులున్న టెంట్‌పై జరిగిన డ్రోన్ దాడిలో ముగ్గురు చనిపోగా పదుల సంఖ్యలో జనం గాయపడ్డారని వఫా వార్తా సంస్థ తెలిపింది. నుసెయిరత్‌లో జరిగిన వైమానిక దాడిలో నలుగురు చనిపోయారు. ఇజ్రాయెల్ ఆర్మీ ప్రకటించిన 'సేఫ్ జోన్'లోనే ఈ టెంట్ ఉందని పేర్కొంది. గడిచిన 48 గంటల వ్యవధిలో గాజాలో ఇజ్రాయెల్ ఆర్మీ యథేచ్ఛగా సాగించిన మారణకాండలో కనీసం 202 మంది చనిపోగా 1,037 మంది క్షతగాత్రులుగా మిగిలారు. కాగా, గాజాలో సోదాల సమయంలో హమాస్ ఎత్తుకుపోయిన వారిలో ముగ్గురి మృతదేహాలు బయటపడ్డాయని ఇజ్రాయెల్ ఆర్మీ ఆదివారం ప్రకటించింది. వీరిని యోనాటన్ సమెరనో(21), ఒఫ్రా కెయిడర్(70), షే లెవిన్సన్(19)గా గుర్తించింది. 2023 అక్టోబర్ 7న హమాస్, ఇతర జిహాదీ గ్రూపులు జరిపిన మెరుపుదాడిలో వీరు చనిపోయారని వివరించింది. హమాస్ చెరలో ఇప్పటికీ 50 మంది వరకు ఉన్నారని, వీరిలో సగం కంటే తక్కువమందే సజీవులుగా ఉన్నట్లు భావిస్తున్నామంది.

శాంతిభద్రతలను రెడ్‌లైట్ ఏరియాతో పోల్చినందుకు కేంద్ర మంత్రిపై కేసు

కోల్‌కతా: పశ్చిమ బెంగాల్‌లో శాంతి భద్రతల పరిస్థితిని కోల్‌కతాలోని ఓ వేశ్యా వాటికతో పోల్చినందుకు గాను కేంద్ర మంత్రి సుకాంత మజుందార్‌పై కేసు నమోదైంది. సోనాగచ్చి రెడ్‌లైట్ ఏరియాలోని సెక్స్ వర్కర్లను, వారి పరిస్థితిని రాష్ట్రంలోని శాంతిభద్రతల పరిస్థితితో పోల్చి కించపరిచారని ఓ సెక్స్ వర్కర్ చేసిన ఫిర్యాదు మేరకు బుర్టొల్లా పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. మంత్రి సుకాంత మజుందార్ ఈ మేరకు వ్యాఖ్యానిస్తున్న వీడియోను టీఎంసీ కార్యకర్త ఒకరు ఎక్స్‌లో పోస్ట్ చేయడంతో వైరల్‌గా మారింది. మజుందార్ దీనిపై స్పందించలేదు. కారులో ఉన్న మంత్రిని రాష్ట్రంలో శాంతిభద్రతలు ఎలా ఉన్నాయంటూ ఓ విలేకరి ప్రశ్నించగా ఆయన పైవిధంగా బదులిచ్చారు.

251 మంది బాధితుల డీఎన్ఏ గుర్తింపు

245 మృతదేహాలు కుటుంబాలకు అప్పగింత

అహ్మదాబాద్: ఎయిరిండియా విమాన ప్రమాదంలో ఇప్పటివరకు మొత్తం 251 మంది బాధితుల డీఎన్ఏలను గుర్తించామని, 245 మృతదేహాలను బంధువులకు అప్పగించామని అధికారులు ఆదివారం తెలిపారు. జూన్ 12న అహ్మదాబాద్ నుంచి లండన్ వెళ్తున్న విమానం హాస్టల్ కాంప్లెక్స్‌పై కూలి 270 మంది మరణించిన విషయం తెలిసిందే. విమానం మంటల్లో చిక్కుకోవడంతో చాలా మంది మృతదేహాలు గుర్తుపట్టలేనంతగా కాలిపోవడంతో బాధితుల గుర్తింపు కష్టమైంది. నిర్ధారించడానికి అధికారులు డీఎన్ఏ పరీక్షలు నిర్వహిస్తున్నారు. అయితే.. 251 మంది బాధితులను డీఎన్ఏ పరీక్షల ద్వారా గుర్తించారు. వారిలో 176 మంది భారతీయులు, 49 మంది బ్రిటిషర్లు, ఏడుగురు పోర్చుగీస్, ఒక కెనడియన్, 12 మంది హాస్టల్ కాంప్లెక్స్‌కు చెందినవారు ఉన్నారు. వీరిలో 245 మంది బాధితుల మృతదేహాలను బంధువులకు అప్పగించామని అహ్మదాబాద్ సివిల్ హాస్పిటల్ మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ రాకేష్ జోషి తెలిపారు. భారతీయుల్లో 70 మంది బాధితులు అహ్మదాబాద్‌కు, 24 మంది వడోదరకు, 26 మంది ఆనంద్‌కు, 11 మంది ఖేడాకు చెందినవారని వెల్లడించారు. డీఎన్ఏ నమూనా పోలిక ప్రక్రియ చాలా సున్నితమైనది, చట్టపరమైన ప్రోటోకాల్ ఉన్నందున కొంత ఆలస్యమవుతోందన్నారు. వేగంగా పూర్తి చేయడానికి ఫోరెన్సిక్, సైన్స్ విశ్వవిద్యాలయం, అనుబంధ సంస్థలు, రాష్ట్ర ప్రభుత్వంలోని ఇతర విభాగాలతోకలిసి అవిశ్రాంతంగా కృషి చేస్తున్నామని జోషీ తెలిపారు. అయితే.. మృతుల్లో ఎనిమిది మందికి సంబంధించిన కుటుంబ సభ్యులు సమర్పించిన మొదటి నమూనా సరిపోలకపోవడంతో మరొక కుటుంబ సభ్యుడి నమూనాను ఇవ్వాలని అధికారులు ఇప్పటికే కోరారు.

1న నేవీలోకి ఐఎన్ఎస్ తమాల్

- పలు ప్రత్యేకతలు ఈ యుద్ధ నౌక సొంతం
- రష్యాలోని కలినిన్‌గ్రాడ్‌లో జల ప్రవేశం

న్యూఢిల్లీ: రష్యా తయారీ గైడెడ్ మిస్సైల్ ఫ్రిగేట్ ఐఎన్ఎస్ తమాల్ జూలై ఒకటిన భారత నేవీలో చేరనుంది. రష్యా తీర ప్రాంత నగరం కలినిన్‌గ్రాడ్‌లోని యాంటార్ షిప్ యార్డ్ ఇందుకు వేదిక కానుంది. క్షిపణులు, నిఘా వ్యవస్థలు దీని ప్రత్యేకత. ఇందులో 26 శాతం ఉపకరణాలను దేశీయంగానే తయారు చేశారు. సముద్రంతోపాటు భూతలంపై లక్ష్యాలను ఛేదించే సత్తా కలిగిన సూపర్‌సోనిక్ బ్రహ్మోస్ దీర్ఘ శ్రేణి క్షిపణులను సైతం దీనికి అమర్చారు. గంటకు 30 నాటికల్ మైళ్లకు మించి ప్రయాణించగలదు. ఆధునీకరించిన 100 మిమీ గన్, హెవీ వెయిట్ టార్పెడోలు, అర్జంట్ అటాక్ యాంటీ సబ్‌మెరీన్ రాకెట్లు సైతం ఇందులో ఉన్నాయి. అత్యంత అననుకూల శీతల వాతావరణంలో సైతం ఇది విధులను నిర్వహించగలదు. ఇందులో 250 మంది వరకు సిబ్బంది సేవలందిస్తారు. రష్యా, భారత్‌ల అత్యంత ఆధునాతన సాంకేతికతలను వినియోగించిన ఈ యుద్ధ నౌక పొడవు 125 మీటర్లు కాగా, బరువు 3,900 టన్నులు. వెస్టర్న్ ఫ్లీట్‌లో ఇది సేవలందించనుంది. గత రెండు దశాబ్దాల కాలంలో రష్యా అందజేసిన ఎనిమిదో క్రివాక్ క్లాస్ ఫ్రిగేట్ తమాల్ కావడం గమనార్హం. అంతేకాదు, విదేశీ గడ్డపై నుంచి భారత నేవీలోకి చేరే చిట్టచివరి యుద్ధ నౌక ఇదేనని నేవీ ప్రతినిధి కమాండర్ వివేక్ మధ్వాల్ వివరించారు. తమాల్ చేరిక భారత నావికాదళం పెరుగుతున్న సామర్థ్యాలకు చిహ్నం మాత్రమే కాదు..భారత్- రష్యా భాగస్వామ్యం ఎంత బలీయమైనదో తెలిపే ఉదాహరణగా కూడా నిలుస్తుందన్నారు. పురాణాల్లోని ఇంద్రుడు ధరించిన కరవాలం పేరు తమాల్. ఆపేరునే ఈ యుద్ధ నౌకకు పెట్టారు.

14% పెరిగిన ఎరువుల వినియోగం

- ఖరీఫ్‌లో యూరియా, కాంప్లెక్స్ ఎరువులకు పెరిగిన డిమాండ్
- ముందస్తు రుతుపవనాల రాకతో పెరిగిన సాగు

సాక్షి, న్యూఢిల్లీ: దేశవ్యాప్తంగా ముందస్తు రుతుపవనాల కారణంగా విస్తారంగా వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ప్రస్తుత ఖరీఫ్‌లో ఎరువుల వినియోగం గణనీయంగా పెరిగిందని కేంద్రం వెల్లడించింది. గత ఏడాది సీజన్‌తో పోలిస్తే ఈ ఏడాది 14 శాతం మేర ఎరువుల వినియోగం పెరిగిందని పేర్కొంది. యూరియా, కాంప్లెక్స్ ఎరువుల వినియోగం అధికమైంది. దేశవ్యాప్తంగా ప్రస్తుత ఖరీఫ్‌లో మొత్తంగా 10.96 కోట్ల హెక్టార్లలో పంట సాగు ఉంటుందని కేంద్రం అంచనా వేసింది. జూన్ 18వ తేదీ నాటికి రైతులు 89.29 లక్షల హెక్టార్లలో సాగు చేపట్టారు. గత ఏడాది సేద్యభూమితో పోలిస్తే ఇది 1.48 శాతం ఎక్కువ. గత ఏడాది 87.81 లక్షల హెక్టార్లలో సాగుచేశారు. గత ఏడాది 52 లక్షల హెక్టార్లలో చెరకు సాగు చేయగా ఈసారి 55 లక్షల హెక్టార్లలో చేపట్టడం విశేషం. ఆ తర్వాత పత్తి, వరి సాగు విస్తీర్ణం సైతం పెరిగింది. దీనికి అనుగుణంగానే యూరియా, కాంప్లెక్స్ ఎరువుల వినియోగం అధికమైంది. గత ఏడాది ఇదే సమయానికి 51.29 లక్షల టన్నుల ఎరువులను వినియోగించారు. ఈసారి 14 శాతం ఎక్కువగా అంటే మొత్తంగా 58.32 లక్షల టన్నుల యూరియా, కాంప్లెక్స్ ఎరువులను వినియోగించారు. గత ఏడాది 31.81 లక్షల టన్నుల యూరియాను సాగుచేయగా ఈసారి వినియోగం 12.5 శాతం పెరిగింది. గత ఏడాది 35.79 లక్షల టన్నుల యూరియాను ఉపయోగించారు. కాంప్లెక్స్ వినియోగం 37.2 శాతం పెరిగి 8.92 లక్షల టన్నుల నుంచి 12.24 లక్షల టన్నులకు చేరుకుంది. డీఏపీ వినియోగం మాత్రం తగ్గింది. గత ఏడాది 8.84 లక్షల టన్నుల డీఏపీ ఉపయోగించారు. ఈసారి కాస్తంత తక్కువగా 7.89 లక్షల టన్నుల డీఏపీని వాడారు.



బిహార్‌లో గంగానదిపై నిర్మించిన కచ్చి దర్గా- బిదుపూర్ ఆరులైన్ల బ్రిడ్జి ప్రారంభానికి ముందు ఆదివారం ఇలా విద్యుత్‌కాంతుల్లో...

ఎయిరిండియా విమానానికి బాంబు బెదిరింపు

న్యూఢిల్లీ: అహ్మదాబాద్ ఘోర విషాదం అనంతరం ఎయిరిండియాకు అనుకోని ఇబ్బందులు ఎదురవుతున్నాయి. తాజాగా, బ్రిటన్‌లోని బర్మింగ్‌హామ్ నుంచి శనివారం టేకాఫ్ తీసుకున్న ఎయిరిండియా విమానానికి బాంబు బెదిరింపు అందింది. దీంతో, విమానాన్ని దారి మళ్లించి సౌదీ అరేబియాలోని రియాద్‌లో అత్యవసరంగా ల్యాండ్ చేశారు. అందులోని ప్రయాణికులందరినీ కిందికి దించేసి, పూర్తి స్థాయిలో తనిఖీలు చేపట్టారు. ప్రయాణికులకు వసతి కల్పించడంతోపాటు గమ్య స్థానాలకు చేర్చేందుకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేపట్టినట్లు ఎయిరిండియా ఆదివారం తెలిపింది. పశ్చిమాసియాలో పలు దేశాలు గగనతలాన్ని మూసి వేయడం, ఎయిర్‌పోర్టుల్లో రాత్రి వేళ కర్ఫ్యూలు విధించడం , అనుకోని అవాంతరాలు, సవాళ్ల నేపథ్యంలో తమ విమానాలు కొన్ని రద్దవడం , ఆలస్యమవడం వంటి పరిణామాలు చోటుచేసుకున్నాయని ఎయిరిండియా తెలిపింది. మరో ఘటన..లండన్ వెళ్లాల్సిన బ్రిటిష్ ఎయిర్ వేస్‌కు చెందిన బోయింగ్ విమానం ఆదివారం ఉదయం చెన్నై విమానాశ్రయం నుంచి టేకాఫ్ తీసుకుంది. కొద్ది సేపటికే తిరిగి అత్యవసరంగా ల్యాండయ్యింది. పశ్చిమాసియాలో యుద్ధం కారణంగా కొన్ని దేశాలు గగనతలాన్ని అకస్మాత్తుగా మూసివేయడమే ఇందుకు కారణమని అధికారులు తెలిపారు. దాదాపు నాలుగు గంటలు ఆలస్యంగా తిరిగి టేకాఫ్ తీసుకుంది. ఇందులో ప్రయాణికులు, సిబ్బంది కలిపి 262 మంది ఉన్నారు.

బిహార్‌లో త్వరలో ఓటరు జాబితా సవరణ

న్యూఢిల్లీ: బిహార్ అసెంబ్లీకి మరికొద్ది నెలల్లో ఎన్నికలు జరగనుండగా ఎన్నికల సంఘం(ఈసీ) ఏర్పాట్లను వేగవంతం చేసింది. ఓటరు జాబితాను పక్కాగా రూపొందించేందుకు గాను ఇంటింటికీ తిరిగి అవసరమైన సవరణలు చేపట్టాలని నిర్ణయించింది. ఓటరు జాబితా నుంచి పేర్ల తొలగింపు, కొత్తగా చేర్చడంపై రాజకీయ పార్టీలు, పౌర సంస్థలు, తదితరులు అనుమానాలు లేవనెత్తడంపై ఈసీ వర్గాలు విచారం వ్యక్తం చేశాయి. పూర్తి పారదర్శకతతో వ్యవహరిస్తున్నప్పటికీ ఓటరు జాబితాలోని వివరాలను ఈసీ బీజేపీకి అనుకూలంగా మారుస్తోందంటూ కాంగ్రెస్ సహా పలు ప్రతిపక్షపార్టీలు ఆరోపణలు చేస్తుండటం తగదన్నాయి. ఈ నేపథ్యంలోనే త్వరలో బిహార్‌లో ఓటరు జాబితాకు అవసరమైన సవరణల కోసం ఇంటింటికీ వెళ్లాలని నిర్ణయించామన్నారు. 2024లో నివాసం మారినట్లుగా 46.26 లక్షల మంది ఓటర్లు ప్రత్యేక దరఖాస్తులు సమర్పించారని గుర్తు చేశారు. అదేవిధంగా, మరో 2.32 కోట్ల మంది పొరపాట్లను సరిదిద్దాలని, 33.16 లక్షల మంది వేరే చోటుకు మార్చాలని ఈసీకి దరఖాస్తు చేసుకున్నారన్నారు. దేశవ్యాప్తంగా ఒక్క ఏడాదిలోనే ఓటరు జాబితాలో సుమారు 3.15 కోట్ల మార్పులు చేయాల్సి వచ్చిందన్నారు.

ఎన్నికల డేటాను భద్రపర్చడం అవసరం: అఖిలేశ్

లక్నో: ఎన్నికల ప్రక్రియ ముగిసిన 45 రోజుల తర్వాత వీడియో ఫుటేజీని ధ్వంసం చేయాలని ఎన్నికల కమిషన్ తీసుకున్న నిర్ణయాన్ని సమాజ్‌వాదీ పార్టీ చీఫ్ అఖిలేశ్ యాదవ్ తప్పుబట్టారు. కేంద్రంలోని బీజేపీ ఒత్తిడితోనే ఈసీ ఈ నిర్ణయం తీసుకున్నట్లు భావిస్తున్నామన్నారు. 'ఈసీ నిర్ణయాన్ని మేం వ్యతిరేకిస్తున్నాం. ఈసీకి ఇదే విషయాన్ని తెలుపుతాం. డేటాను ఎక్కడ భద్రపర్చాలనే విషయానికొస్తే.. ఇళ్లు, దుకాణాల్లోనూ ఇప్పుడు సీసీటీవీ కెమెరాలుంటున్నాయి. అంటే ఇళ్లు, దుకాణాల్లోనూ డేటా భద్రపర్చి ఉంది. మరలాంటప్పుడు ఈసీ వద్ద ఉంచడంలో అభ్యంతరమెందుకు?'అని ఆయన పేర్కొన్నారు. రాయితీలిచ్చి మరీ యూపీలో డేటా సెంటర్లను ఏర్పాటు చేస్తున్న ప్రభుత్వానికి ఈసీ ఎన్నికల డేటాను నిల్వ ఉంచేందుకు స్థలం దొరకట్లేదా అని నిలదీశారు. 'ఎన్నికల డేటాను నిల్వ ఉంచడం, భద్రంగా ఉంచం చాలా అవసరం. ఏదైనా ఫిర్యాదు వచ్చినప్పుడు తగు చర్య తీసుకునేందుకు ఇదెంతో ఉపయోగపడుతుంది. కానీ, ఈసీ మాత్రం కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం నుంచి వచ్చిన ఒత్తిడి వల్లే ఆ డేటాను నాశనం చేయాలనుకుంటోంది'అని అఖిలేశ్ మండిపడ్డారు.

పెరిగిన నూనె, పప్పుధాన్యాల ఉత్పత్తి

సాక్షి, న్యూఢిల్లీ: గత దశాబ్ద కాలంలో దేశంలో వంట నూనెలు, పప్పుధాన్యాల ఉత్పత్తి గణనీయంగా పెరిగిందని కేంద్ర ప్రభుత్వం వ్యవసాయ శాఖకు చెందిన పార్లమెంటరీ కమిటీకి తాజాగా వెల్లడించింది. 2004-14 మధ్య కాలంలో వంట నూనెలు, పప్పుధాన్యాల ఉత్పత్తిలో పెరుగుదల 13% కాగా, 2014-24 మధ్యలో ఉత్పత్తి ఏకంగా 55% వరకు పెరిగిందని తెలిపింది. పదేళ్ల క్రితం వంట నూనెల ఉత్పత్తి కేవలం 2కోట్ల మెట్రిక్ టన్నులుగా ఉండగా, అదిప్పుడు 4.26 కోట్ల టన్నులకు చేరిందని, వచ్చే ఐదేళ్లలో 7 కోట్ల మెట్రిక్ టన్నులకు పెంచడమే లక్ష్యమని వివరించింది. ప్రస్తుతం 15.66 మిలియన్ టన్నుల వంట నూనెల దిగుమతి కోసం రూ.80వేల కోట్ల వరకు ఖర్చవుతోందని తెలిపింది. 2004-14 కాలంలో పప్పుధాన్యాల ఉత్పత్తిలో పెరుగుదల 31% అయితే, గత దశాబ్ద కాలంలో అది 47%కి చేరిందని వివరించింది.

తుర్కియేలో జర్నలిస్టు అరెస్టు

అధ్యక్షుడిని హత్య చేస్తానని బెదిరించారని ఆరోపణలు

ఇస్తాంబుల్: అధ్యక్షుడు రెసెప్ తయ్యిప్ ఎర్డోగన్‌ను బెదిరించాడనే ఆరోపణలతో తుర్కియే అధికారులు ప్రముఖ జర్నలిస్టు ఫాతిహ్ అల్తాయ్‌లీని అరెస్టు చేశారు. తుర్కియేలో యూట్యూబ్ ఛానల్‌ను నిర్వహిస్తున్న ఫాతిహ్.. ఇటీవలి కాలంలో ఎర్డోగన్ జీవితకాల అధ్యక్ష పదవిపై పోల్‌నిర్వహించారు. అయితే.. రెండు దశాబ్దాలకు పైగా అధికారంలో ఉన్న ఎర్డోగన్ జీవితకాల అధ్యక్ష పదవిని 70శాతం కంటే ఎక్కువ మంది వ్యతిరేకించారని ఆయన ఇటీవల వ్యాఖ్యానించారు. అయితే ఈ ఫలితాలు తనకు ఆశ్చర్యం కలిగించలేదన్నారు. తుర్కియే ప్రజలు తమ పాలకులను ఎప్పుడూ పునఃసమీక్షిస్తారని, తమ సుల్తాన్‌ను ఇష్టపడనప్పుడు హత్య చేసిన లేదా ఆత్మహత్య చేసుకునేలా చేసిన చరిత్ర దేశ ప్రజలకు ఉందని ఫాతిహ్ వ్యాఖ్యానించారు. ఆయన వ్యాఖ్యలపై ఇస్తాంబుల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ల కార్యాలయం వెంటనే దర్యాప్తు ప్రారంభించింది. అతడిని అదుపులోకి తీసుకు విచారించింది. అధ్యక్షుడిని తాను బెదిరించలేదని, గత విషయాలను ఉదహరించానని చెప్పారు. అయితే తరువాత ఫాతిహ్ విడుదలయ్యారా? లేదా? అనేది తెలియరాలేదు.

సిరియా చర్చిలో ఆత్మాహుతి దాడి

డమాస్కస్: సిరియా రాజధాని డమాస్కస్ శివారులోని ఓ చర్చిలో ఆదివారం ఆత్మాహుతి దాడి జరిగింది. డ్వెయిల్ ప్రాంతంలోని మార్ ఎలియాస్ చర్చిలో పెద్ద సంఖ్యలో జనం ఉన్న సమయంలో ఓ వ్యక్తి తనను తాను పేల్చేసుకున్నాడని మీడియా తెలిపింది. కనీసం 13 మంది చనిపోగా 17 మంది గాయపడ్డారని సిరియన్ అబ్జర్వేటరీ ఫర్ హ్యూమన్ రైట్స్ సంస్థ తెలిపింది. బాధితుల్లో పలువురు చిన్నారులు సైతం ఉన్నారంది. చర్చిలో జనం మధ్యకు చేరుకున్న ఓ వ్యక్తి ముందుగా తుపాకీతో కాల్పులు జరిపి, అనంతరం పేల్చేసుకున్నాట్లు ఓ వీడియో వైరలవుతోంది. కాగా, మృతులు, క్షతగాత్రుల కచ్చితమైన వివరాలు తెలియాల్సి ఉంది. చర్చిల్లో దాడులు జరగడం సిరియాలో ఇటీవలి కాలంలో ఇదే మొదటిసారి కావడం గమనార్హం. సిరియాలో బషర్ అస్సద్ పాలన అంతమయ్యాక పగ్గాలు చేపట్టిన అహ్మద్ అల్ షరా యంత్రాంగంపై నియంత్రణ సాధించేందుకు ప్రయత్నాలు సాగిస్తున్న క్రమంలో ఘటన చోటుచేసుకుంది.

రేడియేషన్ ప్రమాదం పరిమితమే

నతాంజ్, ఫోర్డోల్లో అమెరికా దాడులపై ఐఏఈఏ

వాషింగ్టన్: ఇరాన్ అణు కేంద్రాలపై అమెరికా, ఇజ్రాయెల్ చేపట్టిన దాడుల ఫలితంగా వెలువడే రేడియో ధార్మికతతో ప్రమాదం పరిమితంగానే ఉంటుందని తెలుస్తోంది. తాము పరిశీలించిన సమయానికి నతాంజ్, ఫోర్డో చుట్టుపక్కల ప్రాంతాల్లో రేడియేషన్ స్థాయిల్లో ఎటువంటి పెరుగుదల నమోదు కాలేదని ఐరాసకు చెందిన అంతర్జాతీయ అణు శక్తి సంస్థ(ఐఏఈఏ) నిర్ధారించింది. మరింత సమాచారం అందుబాటులోకి వచ్చిన తర్వాత అక్కడి పరిస్థితులపై అంచనాలను వెలువరిస్తామని తెలిపింది. నతాంజ్‌లో 60 శాతం వరకు యురేనియంను శుద్ధి చేసేందుకు ఏర్పాట్లున్నాయి. అణ్వాయుధం తయారు చేసేందుకు మరో అడుగు దూరంలోనే ఉంది. ఆ సమయంలో ఈ కేంద్రం పైభాగంపై ఇజ్రాయెల్ బాంబు దాడి జరిపిందని ఐఏఈఏ తెలిపింది. అండర్ గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన మరో విభాగంలో సెంట్రిఫ్యూజులున్నాయి. వీటిలో కొన్నైనా దాడిలో ధ్వంసమై ఉంటాయని అంచనా వేసింది. అయితే, మరింత సురక్షితమైన ఫోర్డో కేంద్రంపై మాత్రం అమెరికా భారీ బాంబులను పడేసింది. అయినప్పటికీ, నతంజ్‌లో మాదిరిగానే ఇక్కడా రేడియో ధార్మికత ప్రభావం అంతగా ఉండదని ఐఏఈఏ అంటోంది. రసాయన దుష్ప్రభావాలు మాత్రం ఉంటాయంది.

భారత దేశాన్ని 'అర్ధ సమాఖ్య' అని వర్ణించింది ఎవరు?



గ్రూప్స్,
ఇతర పోటీ పరీక్షల
ప్రత్యేకం

జనరల్ స్టడీస్

ఇండియన్ పాలిటీ


భారత రాజ్యాంగ పరిషత్తు నిర్మాణం

1. భారతదేశంలోని రాజ్యాధికారానికి మూలం?
1) ప్రభుత్వం 2) ప్రజలు
3) సార్వభౌమాధికారం 4) భూభాగం
2. భారతీయులు స్వయంగా తమ రాజ్యాంగాన్ని తామే రూపొందించుకోవాలనే భావనను తొలిసారిగా 1934లో తన అభిప్రాయాన్ని తెలియజేసింది ఎవరు?
1) ఎం.ఎన్. రాయ్ 2) గాంధీజీ
3) అంబేద్కర్ 4) నెహ్రూ
3. కింది వాటిలో సరైంది ఏది?
ఎ) 1942లో క్రిప్స్ కమిషన్ రాజ్యాంగ పరిషత్‌ను ఏర్పాటు చేస్తామని తొలిసారిగా ప్రతిపాదించింది
బి) 1946లో కేబినెట్ కమిషన్ సిఫార్సు మేరకు రాజ్యాంగ పరిషత్తు ఏర్పాటైంది.
1) ఎ మాత్రమే 2) బి మాత్రమే
3) ఎ, బి 4) ఏదీకాదు
4. కింది వారిలో 1946లో కేబినెట్ కమిషన్ సభ్యులు కాని వారు ఎవరు?
1) పెథిక్ లారెన్స్ 2) స్టాఫర్డ్ క్రిప్స్
3) ఎ.వి. అలెగ్జాండర్ 4) లార్డ్ అట్లీ
5. రాజ్యాంగ పరిషత్ ఏర్పాటుకు సంబంధించి కింది మార్గదర్శక సూత్రాల్లో సరైంది ఏది?
ఎ) రాజ్యాంగ పరిషత్తులో సభ్యుల ఎన్నిక పరోక్ష ఎన్నిక
బి) ప్రతి పది లక్షల జనాభాకు ఒక రాజ్యాంగ పరిషత్తు సభ్యుడు ప్రాతినిధ్యం వహించాలి
1) ఎ సరైంది 2) బి సరైంది
3) ఎ, బి రెండూ సరైనవి కాదు
4) ఎ, బి రెండూ సరైనవే
6. కింది వాటిలో రాజ్యాంగ పరిషత్తు నిర్మాణానికి సంబంధించి సరైంది?
ఎ) రాజ్యాంగ పరిషత్తుకు ఎన్నికలు 1946 జూలై - ఆగస్టులో జరిగాయి
బి) రాజ్యాంగ పరిషత్తు ప్రారంభంలో సభ్యుల సంఖ్య 389
సి) 389 మందిలో బ్రిటిష్ పాలిత రాష్ట్రాల నుంచి 292 మంది
డి) స్వదేశీ సంస్థానాల నుంచి - 93
1) ఎ, బి 2) ఎ, బి, సి, డి
3) ఎ, బి, డి 4) ఎ, సి
7. స్వాతంత్ర్యానంతరం రాజ్యాంగ పరిషత్తులో సభ్యులకు సంబంధించి సరైంది ఏది?
1) స్వాతంత్ర్యానంతరం రాజ్యాంగ పరిషత్తులో సభ్యుల సంఖ్య - 299
2) బ్రిటిష్ పాలిత ప్రాంతాల నుంచి ఎన్నికైనవారు - 229
3) స్వదేశీ సంస్థానాల నుంచి ఎన్నికైనవారు-70
4) పైవన్నీ సరైనవే
8. కింది వాటిలో సరైనవి ఏవి?
ఎ) డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ రాజ్యాంగ పరిషత్‌కు బెంగాల్ నుంచి ఎంపికయ్యారు
బి) దేశ విభజన ఫలితం అంబేద్కర్ తన ప్రాతినిధ్యాన్ని కోల్పోయారు
సి) బాంబే రాష్ట్రం నుంచి రాజ్యాంగ పరిషత్‌కు అంబేద్కర్ నామినేట్ అయ్యారు
డి) అంబేద్కర్ రాజ్యాంగ రచన కమిటీకి చైర్మన్‌గా పనిచేశారు
1) ఎ 2) సి, డి
3) బి, డి 4) ఎ, బి, సి, డి
9. కింది వాటిలో సరైంది ఏది?
ఎ) గాంధీజీని 'బాపూజీ' అని తొలిసారిగా నెహ్రూ సంబోధించారు
బి) గాంధీజీని 'జాతిపిత' అని తొలిసారిగా సుభాష్ చంద్రబోస్ సంబోధించారు
సి) గాంధీజీని 'మహాత్మ' అని రవీంద్రనాథ్ ఠాగూర్ సంబోధించారు
డి) రవీంద్రనాథ్ ఠాగూర్‌ను గాంధీజీ 'గురుదేవ్' లేదా 'గురూజీ' అని పిలిచారు
1) ఎ, బి, సి, డి 2) ఎ, డి
3) బి, సి 4) ఎ, సి, డి
10. కింది వారిలో రాజ్యాంగ పరిషత్తులో ఉన్న ప్రముఖ మహిళలు ఎవరు?
1) శ్రీమతి సరోజినీ నాయుడు
2) విజయలక్ష్మి పండిట్
3) హంసా మెహతా 4) పైవారందరూ
11. రాజ్యాంగ పరిషత్తుకు ఎన్నికైన వివిధ వర్గాలకు ప్రాతినిధ్యం వహించిన వారిలో సరైన జత ఏది?
జాబితా-I
i) ఆంగ్లో ఇండియన్లు
ii) పార్శీలు iii) సిక్కులు
iv) అఖిల భారత షెడ్యూల్డ్ కులాలు
జాబితా-II
a) ఫ్రాంక్ ఆంథోని
b) హెచ్.పి. మోడీ c) బల్‌దేవ్ సింగ్
d) డాక్టర్. బి.ఆర్. అంబేద్కర్
1) i-a, ii-b, iii-c, iv-d
2) i-b, ii-c, iii-d, iv-a
3) i-d, ii-c, iii-b, iv-a
4) i-c, ii-b, iii-a, iv-d
12. రాజ్యాంగ పరిషత్తుకు సంబంధించి కింది వాటిలో సరైనవి ఏవి?
ఎ) రాజ్యాంగ పరిషత్ తొలి సమావేశం 1946 డిసెంబర్ 9న ఢిల్లీలోని పార్లమెంట్ సెంట్రల్ హాల్‌లో జరిగింది.
బి) మొదటి సమావేశానికి 211 మంది హాజరయ్యారు.
సి) రాజ్యాంగ పరిషత్ తాత్కాలిక అధ్యక్షుడిగా డాక్టర్ సచ్చిదానంద సిన్హాను ఎన్నుకున్నారు
డి) ఫ్రాంక్ ఆంథోని ఉపాధ్యక్షుడిగా ఎన్నికయ్యారు
1) ఎ, బి 2) ఎ, డి
3) బి, సి 4) ఎ, బి, సి, డి
13. 1946 డిసెంబర్ 11న డాక్టర్ రాజేంద్ర ప్రసాద్‌ను రాజ్యాంగ పరిషత్ శాశ్వత అధ్యక్షుడిగా ప్రతిపాదించిందెవరు?
1) హెచ్.సి. ముఖర్జీ 2) వి.టి.కృష్ణమాచారి
3) జె.బి. కృపలానీ 4) జవహర్‌లాల్ నెహ్రూ
14. రాజ్యాంగ పరిషత్ ముఖ్య సలహాదారు ఎవరు?
1) బెనగల్ నరసింగ రావు
2) డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్
3) మౌలానా అబ్దుల్ కలాం ఆజాద్
4) ఫ్రాంక్ ఆంథోని
15. రాజ్యాంగ పరిషత్‌లో వివిధ అంశాల పరిశీలనకు మొత్తం ఎన్ని కమిటీలను ఏర్పాటు చేశారు?
1) 11 2) 22 3) 33 4) 44
16. డ్రాఫ్టింగ్ కమిటీలో అధ్యక్షుడితో సహా మొత్తం సభ్యుల సంఖ్య ఎంత?
1) 5 + 1 = 6 2) 6 + 1 = 7
3) 1 + 7 = 8 4) 4 + 1 = 5
17. కింది వారిలో డ్రాఫ్టింగ్ కమిటీలో సభ్యులు కాని వారు ఎవరు?
1) కృష్ణస్వామి అయ్యంగార్
2) కె.ఎం.మున్షీ
3) గోపాలస్వామి అయ్యంగార్
4) గాంధీజీ
18. రాజ్యాంగ పరిషత్.. రాజ్యాంగ ముసాయిదాను ఎప్పుడు ఆమోదించింది?
1) 1948 నవంబర్ 26
2) 1949 నవంబర్ 26
3) 1947 నవంబర్ 26
4) 1950 నవంబర 26
19. రాజ్యాంగ రూపకల్పనకు పట్టిన సమయం?
1) 2 సంవత్సరాల 10 నెలల 11 రోజులు
2) 3 సంవత్సరాల 11 నెలల 18 రోజులు
3) 2 సంవత్సరాల 11 నెలల 18 రోజులు
4) 1 సంవత్సరం
20. భారత రాజ్యాంగ పరిషత్ 1950 జనవరి 24న జరిగిన చివరి సమావేశానికి సంబంధించి కింది వాటిలో సరైంది ఏది?
1) సమావేశానికి హాజరైన సభ్యుల సంఖ్య 284
2) భారత గణతంత్ర ప్రథమ అధ్యక్షుడిగా డాక్టర్ రాజేంద్రప్రసాద్‌ను పరిషత్ ఎన్నుకొంది
3) జాతీయ గీతాన్ని, గేయాన్ని ఆమోదించింది
4) పైవన్నీ సరైనవే
21. జతపరచండి.
కమిటీలు:
i) రాజ్యాంగ సారథ్య సంఘం
ii) రాజ్యాంగ ముసాయిదా కమిటీ
iii) రాజ్యాంగ సలహా సంఘం
iv) నిబంధనల కమిటీ
అధ్యక్షుడు:
a) డాక్టర్ బాబూ రాజేంద్రప్రసాద్
b) డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్
c) సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్
d) డాక్టర్ బాబూ రాజేంద్రప్రసాద్
1) i-b, ii-a, iii-c, iv-d
2) i-d, ii-c, iii-b, iv-a
3) i-a, ii-b, iii-c, iv-d
4) i-c, ii-a, iii-d, iv-b
22. రాజ్యాంగ పరిషత్‌లో సబ్‌కమిటీలను జతపరచండి.
జాబితా-I
i) ప్రాథమిక హక్కుల ఉపసంఘం
ii) ఈశాన్య రాష్ట్రాల హక్కుల కమిటీ
iii) మైనారిటీల సబ్ కమిటీలు
iv) ప్రత్యేక ప్రాంతాల కమిటీ
జాబితా-II
a) జె.బి కృపలానీ
b) గోపీనాథ్ బోర్డోలాయ్
c) హెచ్.సి. ముఖర్జీ d) ఎ.వి. టక్కర్
1) i-a, ii-b, iii-c, iv-d
2) i-d, ii-c, iii-b, iv-a
3) i-c, ii-a, iii-b, iv-d
4) i-b, ii-c, iii-a, iv-d
23. రాజ్యాంగ పరిషత్ చిహ్నం ఏది?
1) ఐరావతం 2) సింహం
3) పులి 4) నెమలి
24. ఏ వ్యక్తిని రాజ్యాంగ పరిషత్‌కు స్నేహితుడు, మార్గదర్శిగా, తత్వవేత్తగా పేర్కొంటారు?
1) డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్
2) డాక్టర్ బాబూ రాజేంద్రప్రసాద్
3) నెహ్రూ 4) డాక్టర్ బి.ఎన్. రావు
25. 'భారత రాజ్యాంగం ఇతర రాజ్యాంగాలన్నింటినీ కొల్లగొట్టి రూపొందించిందిగా వర్ణిస్తే నేను గర్వపడతాను. ఎందుకంటే మంచి ఎక్కడున్నా గ్రహించడం తప్పేమీ కాదు' అని పేర్కొంది ఎవరు?
1) డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్
2) బాబూ రాజేంద్రప్రసాద్
3) జవహర్‌లాల్ నెహ్రూ
4) కె. ఎం. మున్షీ
26. భారత రాజ్యాంగాన్ని 'న్యాయవాదుల స్వర్గం, సుదీర్ఘమైంది,దివ్యమైంది'అని వర్ణించిందెవరు?
1) సర్ ఐవర్ జెన్నింగ్
2) గ్రాన్‌విల్ ఆస్టిన్
3) విన్‌స్టన్ చర్చిల్ 4) ఎవరూ కాదు
27. రాజ్యాంగ రచనలో సమన్వయ పద్ధతి కంటే సర్దుబాటు పద్ధతికి ప్రాధాన్యం ఇచ్చారని పేర్కొన్నదెవరు?
1) ఒ.పి. గోయల్ 2) జవహర్‌లాల్ నెహ్రూ
3) రాజేంద్రప్రసాద్ 4) విన్‌స్టన్ చర్చిల్
28. భారత రాజ్యాంగానికి నకలుగా కింది ఏ చట్టాన్ని పేర్కొంటారు?
1) 1919 చట్టం
2) 1935 భారత ప్రభుత్వ చట్టం
3) 1947 భారత స్వాతంత్ర్య చట్టం
4) ఏదీకాదు
29. కింది వాటిలో భారత రాజ్యాంగంలో బ్రిటన్ రాజ్యాంగం నుంచి స్వీకరించని అంశం?
1) పార్లమెంటరీ ప్రభుత్వ విధానం
2) ఎన్నికల వ్యవస్థ, ఏక పౌరసత్వం
3) సమన్యాయ పాలన
4) రాష్ట్రపతి ఎన్నిక విధానం
30. అమెరికా రాజ్యాంగం నుంచి భారత రాజ్యాంగంలోకి స్వీకరించిన అంశాలకు సంబంధించి కింది వాటిలో సరైనవి?
ఎ) రాష్ట్రపతిని తొలగించే పద్ధతి మహాభియోగ తీర్మానం
బి) న్యాయ సమీక్షాధికారం,ప్రాథమిక హక్కులు
సి) రాజ్యాంగ ప్రవేశిక
డి) లిఖిత రాజ్యాంగం
1) ఎ, బి, సి, డి 2) బి, సి, డి
3) సి, డి 4) బి, సి
31. జతపరచండి.
జాబితా-I
i) ఉమ్మడి జాబితా
ii) రాజ్యాంగ సవరణ పద్ధతి
iii) ప్రాథమిక విధులు
iv) న్యాయ సమీక్ష
జాబితా-II
a) ఆస్ట్రేలియా b) దక్షిణాఫ్రికా
c) రష్యా d) అమెరికా
1) i-d, ii-c, iii-a, iv-b
2) i-a, ii-b, iii-c, iv-d
3) i-d, ii-c, iii-b, iv-a
4) i-a, ii-c, iii-d, iv-b
32. కింది వాటిలో సరైనవి ఏవి?
ఎ) భారత రాజ్యాంగంలోని ప్రారంభంలో 395 ఆర్టికల్స్, 8షెడ్యూళ్లు, 22 భాగాలు ఉన్నాయి
బి) ప్రస్తుతం 12 షెడ్యూళ్లు ఉన్నాయి
సి) ఐదో షెడ్యూల్‌లో షెడ్యూల్ ప్రాంతాల పరిపాలనా వివరాలు ఉన్నాయి
డి) ఏడో షెడ్యూల్‌లో కేంద్ర రాష్ట్రాల మధ్య అధికారాల విభజన ఉంది
1) ఎ మాత్రమే 2) డి మాత్రమే
3) ఎ, బి, సి, డి 4) ఎ, బి
33. 8వ షెడ్యూల్‌కు సంబంధించి సరైంది?
ఎ) గుర్తింపు పొందిన అధికార భాషల గురించి పేర్కొంటుంది
బి) రాజ్యాంగం అమలు నాటికి గుర్తింపు భాషలు - 14
సి) ప్రస్తుతం రాజ్యాంగం గుర్తించిన భాషలు- 22
డి) 92వ రాజ్యాంగ సవరణ చట్టం ద్వారా గుర్తించిన భాషలు బోడో,డోంగ్రి,సంతాలి, మైథిలీ
1) ఎ, బి, సి, డి 2) ఎ, డి
3) ఎ, సి 4) సి, డి
34. పార్టీ ఫిరాయింపుల నిరోధక చట్టానికి సంబంధించిన షెడ్యూల్ ఏది?
1) 1వ షెడ్యూల్ 2) 3వ షెడ్యూల్
3) 7వ షెడ్యూల్ 4) 10వ షెడ్యూల్
35. పార్టీ ఫిరాయింపుల నిరోధక చట్టం ఏ ప్రధానమంత్రి కాలంలో అమల్లోకి వచ్చింది?
1) జవహర్‌లాల్ నెహ్రూ
2) పి.వి. నరసింహారావు
3) రాజీవ్ గాంధీ 4) మన్మోహన్ సింగ్
36. భారత దేశాన్ని 'అర్ధ సమాఖ్య' అని వర్ణించింది ఎవరు?
1) పాల్ ఆప్ బీ 2) కె.సి. వేర్
3) డి.ఎన్. బెనర్జీ 4) మోరిస్ జోన్స్
37. భారత రాజ్యాంగాన్ని 'సహకార సమాఖ్య' అని అభివర్ణించింది ఎవరు?
1) గ్రాన్‌విల్ ఆస్టిన్, డి.ఎన్. బెనర్జీ
2) పాల్ ఆప్ బీ
3) కె.సి. వేర్ 4) ఐవర్ జెన్నింగ్స్

సమాధానాలు

1) 2	2) 1	3) 3	4) 4	5) 4
6) 2	7) 4	8) 4	9) 1	10) 4
11) 1	12) 4	13) 3	14) 1	15) 2
16) 2	17) 4	18) 2	19) 3	20) 4
21) 3	22) 1	23) 1	24) 4	25) 1
26) 1	27) 1	28) 2	29) 4	30) 1
31) 2	32) 3	33) 1	34) 4	35) 3
36) 2	37) 1			

కాశ్మీర్‌ను స్వతంత్ర భారత్‌లో విలీనం చేసింది ఎవరు?



టెట్/డీఎస్సీ- ప్రత్యేకం

సోషల్ స్టడీస్

మాదిరి ప్రశ్నలు

1. గాంధీ ఏ ఉద్యమం సందర్భంగా 'ఈ క్షణం నుంచి ప్రతి ఒక్కరు తమను తాము స్వతంత్రులుగా పరిగణించాలి. వ్యవహరించాలి' అని వ్యాఖ్యానించారు?
1) ఖిలాఫత్ ఉద్యమం
2) సహాయ నిరాకరణోద్యమం
3) శాసనోల్లంఘనోద్యమం
4) క్విట్ ఇండియా ఉద్యమం
2. హిందూ మహాసభను ఎప్పుడు ఏర్పాటు చేశారు?
1) 1915 2) 1917 3) 1919 4) 1922
3. కింది వాటిలో సరికాని జత ఏది?
1) కాదంబినీ గంగూలీ - ఐఎన్‌సీ మొదటి మహిళా గ్రాడ్యుయేట్ ప్రతినిధి (కలకత్తా)
2) దాదాభాయ్ నౌరోజీ-1866లో లండన్‌లో ఈస్టిండియా అసోసియేషన్ స్థాపన
3) జవహర్‌లాల్ నెహ్రూ- 1929 లాహోర్ ఐఎన్‌సీకి అధ్యక్షుడు
4) రవీంద్రనాథ్ ఠాగూర్-చౌరీచౌరా సంఘటనతో తన నైట్‌హుడ్ బిరుదు త్యజించాడు
4. విక్టోరియా మహారాణి ప్రకటనను లార్డ్ కానింగ్ ఎక్కడ నుంచి ప్రకటించాడు?
1) అహ్మదాబాద్ 2) ఢిల్లీ
3) అలహాబాద్ 4) లాహోర్
5. ఇల్బర్ట్ బిల్లు ఎప్పుడు రూపొందించారు?
1) 1881 2) 1882 3) 1883 4) 1884
6. 'భారత జాతీయోద్యమానికి బైబిల్'గా దేన్ని పేర్కొంటారు?
1) ఆనంద్ మఠ్ 2) గీతాంజలి
3) భవానీ మందిర్ 4) బంధీ జీవన్
7. ఎల్ఫిన్‌స్టన్ కళాశాల(1834)ను ఎక్కడ స్థాపించారు?
1) మద్రాస్ 2) కలకత్తా
3) బొంబాయి 4) కటక్
8. జతపరచండి.
జాబితా - I
i) 1916 ii) 1913
iii) 1922 iv) 1946
v) 1928
జాబితా - II
ఎ) నెహ్రూ నివేదిక రూపకల్పన
బి) రాయల్ ఇండియన్ నేవీ తిరుగుబాటు
సి) గదర్ పార్టీ స్థాపన
డి) లక్నో ఒప్పందం
ఇ) చౌరీచౌరా సంఘటన
1) i-ఇ, ii- డి, iii- సి, iv-బి,v-ఎ.
2) i- సి, ii- ఎ, iii- డి, iv-ఇ,v-బి.
3) i- డి, ii- సి, iii- ఇ, iv-బి,v-ఎ.
4) i- ఎ, ii- బి, iii- సి, iv-డి,v-ఇ.
9. ఇల్బర్ట్ బిల్లు వివాద సమయంలో బ్రిటన్ ప్రధాని ఎవరు?
1) పామర్‌స్టోన్ 2) గ్లాడ్‌స్టన్
3) నైవేలీ చాంబర్లీన్ 4) డేవిడ్ లాయిడ్ జార్జి
10. జలియన్ వాలాబాగ్ దురంతంపై విచారణకు నియమించిన కమిటీ ఏది?
1) సర్ మాక్ డొనాల్డ్ కమిటీ
2) హంటర్ కమిటీ 3) ఫ్రేజర్ కమిటీ
4) రిచర్డ్స్ స్ట్రాచీ కమిటీ
11. సహాయ నిరాకరణోద్యమాన్ని ఆమోదించిన నాగ్‌పూర్ జాతీయ కాంగ్రెస్ సమావేశానికి (1920) అధ్యక్షుడు ఎవరు?
1) లాలాలజపతిరాయ్
2) సి. విజయ రాఘవాచారి
3) మహాత్మా గాంధీ 4) చిత్తరంజన్ దాస్
12. సుభాష్ చంద్రబోస్ ప్రిన్సిపాల్‌గా పనిచేసిన కళాశాల ఏది?
1) బెంగాల్ నేషనల్ కాలేజ్
2) మదనపల్లి నేషనల్ కాలేజ్
3) మచిలీపట్నం నేషనల్ కాలేజ్
4) గుజరాత్ విద్యాపీఠ్
13. కింది వాటిలో సరైన జత ఏది?
1) 1922 ఫిబ్రవరి 12 - సహాయ నిరాకరణోద్యమం నిలుపుదల
2) 1911 డిసెంబర్ 11 - బ్రిటిష్ ఇండియా రాజధానిని కలకత్తా నుంచి ఢిల్లీకి మార్చడం
3) 1928 ఫిబ్రవరి 3 - సైమన్ కమిషన్ బొంబాయిలో అడుగు పెట్టింది
4) పైవన్నీ సరైనవే
14. జతపరచండి.
జాబితా - I
i) డా.బి.ఆర్. అంబేద్కర్
ii) ఇ.వి. రామస్వామి నాయకర్
iii) బాలగంగాధర తిలక్
iv) స్వామి వివేకానంద
v) కె.కె.మిత్రా
జాబితా - II
ఎ) ఉద్బోధన్ బి) సంజీవని
సి) మరాఠీ డి) మూక్ నాయక్
ఇ) కుడి అరసు
1) i- ఎ, ii- సి, iii- బి, iv-డి, v- ఇ
2) i- డి, ii- ఇ, iii- సి, iv-ఎ, v- బి
3) i- ఎ, ii- బి, iii- సి, iv-డి, v- ఇ
4) i- సి, ii- డి, iii- ఇ, iv-బి, v- ఎ
15. 'భారతదేశ బిస్మార్క్' అని ఎవరిని పిలుస్తారు?
1) దాదాభాయ్ నౌరోజీ
2) సర్దార్ వలభ్‌భాయ్ పటేల్
3) గోపాలకృష్ణ గోఖలే
4) లాలాలజపతి రాయ్
16. కాశ్మీర్‌ను స్వతంత్ర భారత్‌లో విలీనం చేసింది ఎవరు?
1) హరిసింగ్ 2) మార్తాండ వర్మ
3) రతన్‌సింగ్ 4) చైత్‌సింగ్
17. హైదరాబాద్‌లో జాయిన్ ఇండియా ఉద్యమం ఎప్పుడు ప్రారంభమైంది?
1) 1947 ఆగస్టు 7 2) 1946 సెప్టెంబర్ 6
3) 1948 సెప్టెంబర్ 13 4) 1947 ఆగస్టు 16
18. జతపరచండి.
జాబితా - I
i) బ్రహ్మర్షి ii) మహర్షి
iii) సరిహద్దు గాంధీ iv) రాజర్షి
v) దేశబంధు
జాబితా - II
ఎ) పురుషోత్తందాస్ టాండన్
బి) ఖాన్ అబ్దుల్ గఫార్ ఖాన్
సి) చిత్తరంజన్ దాస్
డి) రఘుపతి వెంకటరత్నం నాయుడు
ఇ) బులుసు సాంబమూర్తి
1) i- ఇ, ii- డి, iii- సి, iv-బి, v-ఎ.
2) i- డి, ii- ఇ, iii- బి, iv-ఎ, v-సి.
3) i- సి, ii- ఎ, iii- డి, iv-ఎ, v-బి.
4) i- ఎ, ii- బి, iii- సి, iv-డి, v-ఇ.
19. 1954 ఏప్రిల్ 29న పంచశీల ఒప్పందం భారత్ చైనాల మధ్య ఏ ప్రాంతంలో జరిగింది?
1) బీజింగ్ 2) పెకింగ్
3) షాంగై 4) షాన్సీ
20. భారత జాతీయ కాంగ్రెస్‌కు అధ్యక్షత వహించిన తొలి తెలుగువ్యక్తి?
1) భోగరాజు పట్టాభి సీతారామయ్య
2) దుగ్గిరాల గోపాలకృష్ణయ్య
3) పి. ఆనందాచార్యులు
4) ఆచార్య ఎన్.జి. రంగా
21. 1946 సెప్టెంబర్ 2న ఏర్పడిన నెహ్రూ తాత్కాలిక ప్రభుత్వంలో ఆర్థికమంత్రి ఎవరు?
1) లియాఖత్ అలీ 2) సయ్యద్ జహీర్
3) మహ్మద్ అలీ జిన్నా 4) రహ్మత్ అలీ చౌదరి
22. 'తీన్‌మూర్తి భవన్' ఎవరి నివాసం?
1) జవహర్‌లాల్ నెహ్రూ
2) నేతాజీ సుభాష్ చంద్రబోస్
3) చిత్తరంజన్ దాస్ 4) దాదాభాయ్ నౌరోజీ
23. మంత్రిత్రయ రాయబారం(1946) భారత్ లో పర్యటించిన కాలంలో అప్పటి వైస్రాయి ఎవరు?
1) లార్డ్ లిన్‌లిత్ గో 2) లార్డ్ వెవేల్
3) లార్డ్ విల్లింగ్‌టన్ 4) లార్డ్ మౌంట్ బాటెన్
24. భారత స్వాతంత్ర్య చట్టం ఎప్పుడు రాజ సమ్మతి పొందింది?
1) 1947 ఆగస్టు 14 2) 1947 ఆగస్టు 15
3) 1947 ఆగస్టు 6 4) 1947 జూలై 18
25. భారత్‌కు స్వాతంత్ర్యం లభించే బిల్లును బ్రిటిష్ పార్లమెంట్‌లో ఎప్పుడు ప్రవేశ పెట్టారు?
1) 1947 జూలై 4 2) 1947 జూలై 14
3) 1947 జూలై 16 4) 1947 జూలై 17
26. దీపావళి ప్రకటన చేసిన వైస్రాయ్?
1) లార్డ్ రీడింగ్ 2) లార్డ్ ఇర్విన్
3) లార్డ్ లిన్‌లిత్‌గో 4) లార్డ్ వెవేల్
27. గదర్ పార్టీ తొలి అధ్యక్షుడు ఎవరు?
1) కర్తార్ సింగ్ శరభా 2) గులాబ్ కౌర్
3) సోహాన్ సింగ్ భక్నా 4) రాస్ బిహారీ బోస్
28. 'స్టాలిన్‌గ్రాడ్ ఆఫ్ ఇండియా' అని ఏ ప్రాంతాన్ని పిలుస్తారు?
1) అహ్మదాబాద్ 2) బొంబాయి
3) కాన్పూర్ 4) కలకత్తా
29. లీడర్ పత్రిక స్థాపకుడు ఎవరు?
1) దర్శి చెంచయ్య 2) మదన్‌మోహన్ మాలవ్య
3) లాలా హరదయాళ్ 4) మోతీలాల్ నెహ్రూ
30. కింది వాటిలో సరికాని జత ఏది?
1) మధుశాల- హరివంశరాయ్ బచ్చన్
2) డిస్కవరీ ఆఫ్ ఇండియా- మోతీలాల్ నెహ్రూ
3) సావిత్రి - అరవింద ఘోష్
4) హింద్ స్వరాజ్ - ఎం.కె. గాంధీ
31. ఇండియన్ సివిల్ సర్వీస్‌కు ఎంపిక అయిన తొలి భారతీయుడు?
1) దేవేంద్రనాథ్ ఠాగూర్
2) సి. సుబ్రమణ్యం అయ్యర్
3) సత్యేంద్రనాథ్ ఠాగూర్ 4) వి.పి. మీనన్
32. బాలశాస్త్రి జంబేకర్ స్థాపించిన పత్రిక ఏది?
1) దర్పణ్ 2) అమృతబజార్
3) సంవాద కౌముది 4) కేసరి
33. రాజకీయ సంస్కరణలు కావాలని ఉద్యమించిన తొలి భారతీయుడు?
1) బంకించంద్ర ఛటర్జీ
2) రాజా రామ్మోహన్ రాయ్
3) ఆనందమోహన్ బోస్
4) ఫిరోజ్ షా మెహతా
34. లార్డ్‌రిప్పన్ విద్యాకమిషనర్‌గా విలియం హంటర్‌ను ఎప్పుడు నియమించారు?
1) 1880 2) 1881 3) 1882 4) 1883
35. 'స్టాటిస్టికల్ సర్వే ఆఫ్ ఇండియా'ను వ్యవస్థీకరించిన వైస్రాయి ఎవరు?
1) లార్డ్ మేయో 2) లార్డ్ డఫ్రిన్
3) లార్డ్ కానింగ్ 4) లార్డ్ వెవేల్
36. కింది వాటిలో సరైన జత ఏది?
1) జెన్మిలు-మోప్లా ప్రాంత జమీందారులు
2) పాబ్నా ఉద్యమం- తూర్పు బెంగాల్
3) జనతా వారపత్రిక - బి.ఆర్. అంబేద్కర్
4) పైవన్నీ సరైనవే
37. కేరళలో ప్రథమ ఆధునిక నవల 'ఇందులేఖ' రచయిత ఎవరు?
1) చందర్ మీనన్ 2) ఎమ్.పద్మనాభ పిళ్లై
3) కె.రామకృష్ణ పిళ్లై 4) సి.వి. రామన్ పిళ్లై
38. స్వరాజ్ అనే పదాన్ని తొలిసారి ఏ జాతీయ కాంగ్రెస్ సమావేశంలో ఉపయోగించారు?
1) 1885 - బొంబాయి 2) 1886 - కలకత్తా
3) 1906- కలకత్తా 4) 1907- సూరత్
39. జన్మభూమి (ఇంగ్లిష్) పత్రికాధినేత?
1) కాశీనాథుని నాగేశ్వరరావు
2) పి. ఆనందాచార్యులు
3) భోగరాజు పట్టాభి సీతారామయ్య
4) అయ్యదేవర కాళేశ్వరరావు
40. 1908 ఆలిండియా ముస్లిం లీగ్ మొదటి సమావేశానికి అధ్యక్షుడు ఎవరు?
1) మహమ్మద్ అలీ జిన్నా
2) సర్ సయ్యద్ అలీ ఇమాం
3) మౌలానా అబుల్ కలాం ఆజాద్
4) ఖాన్ అబ్దుల్ గఫార్ ఖాన్
41. కింది వారిలో రవీంద్రనాథ్ ఠాగూర్‌ను 'గురుదేవ్' అని తొలిసారి పిలిచిందెవరు?
1) గోపాలకృష్ణ గోఖలే 2) మహాత్మాగాంధీ
3) నేతాజీ బోస్ 4) జవహర్‌లాల్ నెహ్రూ
42. భారత జాతీయ కాంగ్రెస్ నాయకులు గాంధీజీని జాతి నాయకుడిగా ఏ సమావేశంలో గుర్తించారు?
1) 1916- లక్నో 2) 1920- నాగ్‌పూర్
3) 1925-కాన్పూర్ 4) 1929 -లాహోర్
43. జతపరచండి.
నినాదం
i) డివైడ్ అండ్ క్విట్ ii) జైహింద్
iii) బోధించు, సమీకరించు, పోరాడు
iv) స్వరాజ్యం నా జన్మహక్కు
v) జై జగత్
ప్రముఖుడు
ఎ) ఆచార్యా వినోభాబావే
బి) లోకమాన్య తిలక్
సి) మహమ్మద్ అలీ జిన్నా
డి) డా.బి.ఆర్. అంబేద్కర్
ఇ) నేతాజీ సుభాష్ చంద్రబోస్
1) i-ఎ, ii- బి, iii- సి, iv-డి,v-ఇ.
2) i- ఇ, ii- డి, iii- బి, iv-ఎ,v-సి.
3) i- సి, ii- ఇ, iii- డి, iv-బి,v-ఎ.
4) i- డి, ii- సి, iii- ఎ, iv-ఇ,v-బి.
44. కింది వాటిలో సరైన జత ఏది?
1) భారత కోకిల - సరోజినీ నాయుడు
2) క్విట్ ఇండియా ఉద్యమరాణి - అరుణా అసఫ్ అలీ
3) ఇండియన్ జోన్ ఆఫ్ ఆర్క్ - ఝాన్సీ లక్ష్మీబాయి
4) పైవన్నీ సరైనవే
45. మదన్ మోహన్ మాలవ్య ప్రపంచవ్యాప్తం చేసిన సూక్తి ఏది?
1) సత్యమేవ జయతే
2) సత్యం శివం సుందరం
3) శీలేన శోభతే విద్య 4) స్పర్ధయా వర్ధతే విద్య
46. భారత జాతీయ కాంగ్రెస్ తొలి సమావేశానికి హాజరైన హైదరాబాద్ ముస్లిం నాయకుడు?
1) సయ్యద్ బిల్‌గ్రామి 2) బద్రుద్దీన్ త్యాబ్జీ
3) ముల్లా అబ్దుల్ ఖయ్యూం
4) మౌల్వీ మహ్మద్ ముర్తజ్
47. 1948 ఆపరేషన్ పోలో కాలంలో నిజాం సైన్యాలకు ఎవరు నాయకత్వం వహించారు?
1) ఎల్‌డ్రూస్ 2) విలియం పామర్
3) లాయక్ అలీ 4) కాశీం రజ్వీ
48. 'జోడేఘాట్ జ్వాల' అని ఎవరిని పిలుస్తారు?
1) దొడ్డి కొమరయ్య
2) కొమురం భీం 3) రాంజీ గోండ్
4) సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్
49. హైదరాబాద్ స్టేట్ కాంగ్రెస్‌ను ఎప్పుడు స్థాపించారు?
1) 1936 2) 1938 3) 1941 4) 1943
50. కింది వాటిలో సరైంది ఏది?
1) సురవరం ప్రతాపరెడ్డి-గోల్కొండ పత్రిక
2) షోయబుల్లాఖాన్ - ఇమ్రోజ్ పత్రిక
3) ఆంధ్రపత్రిక-కాశీనాథుని నాగేశ్వరరావు
4) పైవన్నీ సరైనవే
51. 'నీల్ దర్పణ్' గ్రంథకర్త ఎవరు?
1) బంకించంద్ర ఛటర్జీ 2) దీనబంధు మిత్ర
3) ముల్కరాజ్ ఆనంద్ 4) మున్షీప్రేమ్ చంద్
52. భారత్‌లో తొలి వితంతు వివాహం చేసుకున్న బెంగాల్ వాసి?
1) శ్రీష్‌చంద్ర విద్యారత్న
2) గౌతంఘోష్ 3) కృష్ణకుమార్ మిత్ర
4) హరీష్ చంద్ర ముఖర్జీ
53. చివరి కాశ్మీర్ పాలకుడు హరిసింగ్ ఏ వంశానికి చెందినవారు?
1) కార్కోట 2) డోగ్రా 3) చౌహాన్ 4) సేన
54. మహా భారతాన్ని బెంగాలీలోకి అనువదించిందెవరు?
1) శంభునాథ్ పండిట్ 2) మోతీలాల్ రాయ్
3) కాళీ ప్రసన్న సింగ్ 4) శిశిర్ కుమార్ ఘోష్
55. భారతదేశపు ఛార్లెస్ డికెన్స్ అని కీర్తి పొందినవారు?
1) ముల్కరాజ్ ఆనంద్ 2) ఆర్.కె.నారాయణ్
3) మున్షీ ప్రేమ్‌చంద్ 4) దీనబంధు మిత్రా
56. 1893లో గాంధీజీ ఏ భారతీయ వ్యాపారవేత్తకు న్యాయసలహాదారుగా దక్షిణాఫ్రికా వెళ్లాడు?
1) జమ్నాలాల్ బజాజ్ 2) దాదా అబ్దుల్లా
3) రాజ్‌కుమార శుక్లా 4) ప్రమోద్ మిట్టర్
57. జె.ఎం.ఛటర్జీ స్థాపించిన సంస్థ ఏది?
1) ఫ్రీ ఇండియా సొసైటీ
2) భారత్ మాతా సొసైటీ
3) అఖిలభారత హోంరూల్ లీగ్
4) అనుశీలన్ సమితి

సమాధానాలు

1) 4	2) 1	3) 4	4) 3	5) 3
6) 1	7) 3	8) 3	9) 2	10) 2
11) 2	12) 1	13) 4	14) 2	15) 2
16) 1	17) 1	18) 2	19) 2	20) 3
21) 1	22) 1	23) 2	24) 4	25) 1
26) 2	27) 3	28) 1	29) 2	30) 2
31) 3	32) 1	33) 2	34) 3	35) 1
36) 4	37) 1	38) 3	39) 3	40) 2
41) 2	42) 2	43) 3	44) 4	45) 1
46) 3	47) 1	48) 2	49) 2	50) 4
51) 2	52) 1	53) 2	54) 3	55) 1
56) 2	57) 2			


'గేట్‌వే ఆఫ్ శ్రీనగర్' అని పిలిచే కనుమ ఏది?

మాదిరి ప్రశ్నలు

1. కింది వాటిని జతపరచండి?
   జాబితా-I / జాబితా-II
   i) మాక్‌డోక్ డింపెప్ లోయ — a) పశ్చిమ బెంగాల్
   ii) సుబ్రాలోయ — b) మేఘాలయ
   iii) కులులోయ — c) జమ్మూ కశ్మీర్
   iv) కాలింపాంగ్ — d) హిమాచల్ ప్రదేశ్
   1) i-c, ii-d, iii-b, iv-a
   2) i-d, ii-c, iii-b, iv-a
   3) i-b, ii-c, iii-d, iv-a
   4) i-d, ii-b, iii-a, iv-c
2. కింది వాటిని జతపరచండి.
   జాబితా-I
   i) కచార్ కొండలు
   ii) డాఫ్లా కొండలు
   iii) లుషాయి కొండలు
   iv) జయంతియా కొండలు
   జాబితా-II
   a) మేఘాలయ b) మిజోరాం
   c) అరుణాచల్ ప్రదేశ్
   d) అసోం
   1) i-a, ii-c, iii-d, iv-b
   2) i-a, ii-b, iii-c, iv-d
   3) i-c, ii-a, iii-d, iv-b
   4) i-d, ii-c, iii-b, iv-a
3. కింది వాటిలో సరైంది ఏది?
   ఎ) జస్కార్ పర్వత శ్రేణి, కారకోరం పర్వత శ్రేణికి ఉత్తరంగా విస్తరించి ఉంది.
   బి) లడఖ్, జస్కార్ శ్రేణుల మధ్య సింధూనది ప్రవహిస్తోంది.
   సి) కారకోరం పర్వతశ్రేణి ట్రాన్స్ హిమాలయాల్లో ఒక భాగం
   1) ఎ, బి 2) బి, సి
   3) ఎ, సి 4) ఎ, బి, సి
4. కింది వాటిలో సరికానిది ఏది?
   1) 'కనుమ' అంటే రెండు కొండల మధ్య ఏర్పడే సహజ రహదారి
   2) అంతర్వేది అంటే రెండు నదుల మధ్య ఉన్న సారవంతమైన ప్రాంతం
   3) అనేక నదులకు జన్మస్థానమైన 'మానస సరోవరం' హిమాలయ పర్వత శ్రేణిలో ఉంది.
   4) 'డూన్‌లు' అంటే హిమాచల్, శివాలిక్ పర్వత శ్రేణుల మధ్య ఉన్న సన్నని సమదైర్ఘ్య లోయలు
5. నేపాల్ హిమాలయాలు ఏ రెండు నదుల మధ్య విస్తరించి ఉన్నాయి?
   1) కాళీ , తీస్తా నదులు
   2) తీస్తా, సట్లెజ్ నదులు
   3) సట్లెజ్, కాళీ నదులు
   4) తీస్తా, బ్రహ్మపుత్ర నదులు
6. కింది వాటిలో సరికానిది ఏది?
   1) హిమాలయాలు అతితరుణ ముడత పర్వతాలు
   2) ఇవి కేంబ్రియన్ మహాయుగంలో ఏర్పడ్డాయి.
   3) ఇవి ప్రపంచంలో ఎత్తైన పర్వత శ్రేణులు
   4) ఇవి సుమారు 5లక్షల చ.కి.మీ.ల వైశాల్యం కలిగి ఉన్నాయి.
7. కింది వాటిలో సరికాని జత ఏది?
   1) నామ్చాబర్వా- అరుణాచల్ ప్రదేశ్
   2) అన్నపూర్ణ - ఉత్తరాఖండ్
   3) నంగప్రభాత్ - జమ్మూ కశ్మీర్
   4) మకాలు - నేపాల్
8. కిందివాటిలో సరైంది ఏది?
   ఎ) శివాలిక్ పర్వత శ్రేణులు గ్రేటర్ హిమాలయాలకు దక్షిణంగా విస్తరించి ఉన్నాయి.
   బి) లెస్సర్ హిమాలయాలు బాహ్య హిమాలయాలకు ఉత్తరంగా విస్తరించి ఉన్నాయి.
   సి) శివాలిక్ హిమాలయాలు మయోసిన్ యుగంలో ఏర్పడ్డాయి.
   1) ఎ మాత్రమే 2) బి మాత్రమే
   3) ఎ, బి 4) బి, సి
9. జతపరచండి.
   జాబితా-I
   i) కైలాస కొండలు
   ii) సులేమాన్ పర్వతాలు
   iii) కున్‌లున్ పర్వతాలు
   iv) హిందుకుష్ పర్వతాలు
   జాబితా-II
   a) ఆఫ్ఘనిస్తాన్ b) చైనా
   c) పాకిస్తాన్ d) టిబెట్
   1) i-c, ii-d, iii-a, iv-b
   2) i-d, ii-a, iii-b, iv-c
   3) i-d, ii-c, iii-b, iv-a
   4) i-b, ii-c, iii-d, iv-a
10. 'ఆసియా ఖండానికి వెన్నెముక' అని ఏ పర్వత శ్రేణిని పిలుస్తారు?
    1) లడఖ్ శ్రేణి 2) జస్కార్ శ్రేణి
    3) కైలాస కొండలు
    4) కారకోరం పర్వతశ్రేణి

గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం
ఇండియన్ జాగ్రఫీ
ఇండియన్ జాగ్రఫీ

11. కింది వాటిలో హిమాలయ పర్వత శ్రేణిలో లేని శిఖరం ఏది ?
    1) కాంచన గంగా 2) గాడ్విన్ ఆస్టిన్
    3) మకాలు 4) ధవళగిరి
12. కింది వాటిలో సరికానిది ఏది?
    1) 'గేట్ వే ఆఫ్ శ్రీనగర్' అని బనిహాల్ కనుమను పిలుస్తారు
    2) ప్రపంచంలోనే అత్యంత ఎత్తైన యుద్ధ క్షేత్రం 'సియాచిన్'
    3) ప్రపంచంలోనే అత్యంత ఎత్తైన రెండో శిఖరం కాంచనగంగ
    4) భారతదేశంలో ఎత్తైన కనుమ ఖార్దుంగ్లా కనుమ
13. జతపరచండి.
    జాబితా-I
    i) నిథులా కనుమ ii) షిప్కిలా కనుమ
    iii) జోజిలా iv) నాథులా
    జాబితా-II
    a) సిక్కిం
    b) ఉత్తరాఖండ్
    c) హిమాచల్ ప్రదేశ్
    d) జమ్మూకశ్మీర్
    1) i-c, ii-d, iii-b, iv-a
    2) i-b, ii-c, iii-d, iv-a
    3) i-a, ii-b, iii-c, iv-d
    4) i-d, ii-c, iii-b, iv-a
14. షిప్కిలా కనుమ ద్వారా భారతదేశంలో ప్రవేశించే నది ఏది?
    1) సింధూనది 2) జీలం
    3) బ్రహ్మపుత్ర 4) సట్లెజ్
15. శివాలిక్ పర్వత శ్రేణులకు సంబంధించి సరైంది ఏది?



    ఎ) ఇవి దిగువ ప్లిస్టోసీన్ యుగంలో ఏర్పడ్డాయి.
    బి) ఇవి ఇసుక, గ్రావెల్ కంగ్లా మరేట్ వంటి శిలలతో ఏర్పడ్డాయి.
    సి) ఈ పర్వత శ్రేణుల్లో శృంగాకారపు అడవులు విస్తరించి ఉన్నాయి.
    1) ఎ, బి 2) బి, సి
    3) ఎ, సి 4) ఎ, బి, సి
16. హిమాచల్ పర్వత శ్రేణులకు సంబంధించి కింది వాటిలో సరైనవి ఏవి?
    ఎ) ఇవి వేసవి విడిది కేంద్రాలకు ప్రసిద్ధి చెందాయి.
    బి) ఇవి గ్రానైట్, నీస్ వంటి శిలలతో ఏర్పడ్డాయి.
    సి) ఇవి సుమారు 14 మిలియన్ సంవత్సరాల కాలంలో ఏర్పడ్డాయి.
    డి) ఇవి హిమాద్రి శ్రేణులకు ఉత్తరంగా విస్తరించి ఉన్నాయి.
    1) ఎ, బి, సి 2) బి, సి, డి
    3) ఎ, సి, డి 4) ఎ, బి, సి, డి
17. గంగా - సింధు మైదానం ఏయే దేశాల్లో విస్తరించి ఉంది?
    1) భారత్, బంగ్లాదేశ్ , మయన్మార్
    2) భారత్, బంగ్లాదేశ్ , పాకిస్తాన్
    3) భారత్, నేపాల్ , పాకిస్తాన్
    4) భారత్, పాకిస్తాన్ , చైనా
18. చోస్ అంటే ఏమిటి?
    1) చిత్తడి ప్రదేశం 2) నీటి గుంటలు
    3) బురద దిబ్బలు 4) ఇసుక దిబ్బలు
19. జతపరచండి.
    జాబితా-I
    i) బారిదోబ్ ii) ఛాజ్
    iii) రేచన iv) బిస్త్
    జాబితా-II
    a) బియాస్- రావి నదుల మధ్య
    b) చీనాబ్- జీలం నదుల మధ్య
    c) రావి- చీనాబ్ నదుల మధ్య
    d) బియాస్- సట్లెజ్ నదుల మధ్య
    1) i-b, ii-c, iii-d, iv-a
    2) i-c, ii-d, iii-b, iv-a
    3) i-d, ii-c, iii-b, iv-a
    4) i-a, ii-b, iii-c, iv-d
20. కింది వాటిలో సరికానిది ఏది?
    1) ట్రియాన్ అంటే కదిలే ఇసుక దిబ్బలు
    2) రన్ అంటే ఉప్పునీటి కయ్యలు
    3) రోహి అంటే సారవంతంకాని భూములు
    4) కోల్స్ అంటే బురద దిబ్బలు
21. ప్రస్తుతం ఉన్న హిమాలయాలు ఏ ఫలకలు ఢీకొట్టడం వల్ల ఏర్పడ్డాయి?
    1) ఆస్ట్రేలియా ఫలక, ఉత్తర అమెరికా ఫలక
    2) యురేషియా ఫలక, ఆఫ్రికా ఫలక
    3) యురేషియా ఫలక, ద్వీపకల్ప ఫలక
    4) ఆస్ట్రేలియా ఫలక, ద్వీపకల్ప ఫలక
22. 'కాయల్స్' ప్రధానంగా ఏ తీరంలో కనిపిస్తాయి?
    1) మలబారు తీరం
    2) కోరమండల్ తీరం
    3) కొంకణ్ తీరం 4) వంగ తీరం
23. జతపరచండి.
    జాబితా-I
    i) చిల్కా సరస్సు
    ii) కొల్లేరు సరస్సు
    iii) అష్టముడి సరస్సు
    iv) వెంబనాడ్ సరస్సు
    జాబితా-II
    a) కేరళ మైదానం b) మలబార్ తీరం
    c) సర్కార్ తీరం d) ఉత్కళ తీరం
    1) i-c, ii-a, iii-d, iv-b
    2) i-d, ii-a, iii-b, iv-c
    3) i-b, ii-a, iii-d, iv-c
    4) i-d, ii-c, iii-b, iv-a
24. కిందివాటిలో పశ్చిమ కనుమలకు చెందనివి ఏవి?
    1) గాలి కొండలు
    2) ఫళని కొండలు
    3) కార్డమమ్ కొండలు
    4) ఇలైమలై కొండలు
25. కింది వాటిలో సరికాని జత ఏది?
    1) దూప్‌ఘర్ శిఖరం-సాత్పూరా పర్వతాలు
    2) అమరకంటక్ శిఖరం-వింధ్యాపర్వతాలు
    3) గురుశిఖర్- నీలగిరి పర్వతాలు
    4) అనైముడి - పశ్చిమ కనుమలు
26. కింది వాటిలో సరైంది ఏది?
    ఎ) ద్వీపకల్ప పీఠభూమి ప్రాక్- కేంబ్రియన్ కాలంలో ఏర్పడింది.
    బి) ఇది సుమారు 16లక్షల చ.కి.మీ విస్తరించి ఉంది.
    సి) ఇది భారతదేశంలో కెల్లా అతిపెద్ద భూస్వరూపం
    1) ఎ, బి 2) బి, సి
    3) ఎ, సి 4) ఎ, బి, సి
27. జతపరచండి.
    జాబితా-I
    i) భోరట్ పీఠభూమి
    ii) కథియవార్ పీఠభూమి
    iii) భాఘల్‌ఖండ్ పీఠభూమి
    iv) బస్తర్ పీఠభూమి
    జాబితా-II
    a) గుజరాత్ b) రాజస్తాన్
    c) ఛత్తీస్‌గఢ్ d) మధ్యప్రదేశ్
    1) i-c, ii-a, iii-d, iv-b
    2) i-b, ii-a, iii-c, iv-d
    3) i-d, ii-a, iii-c, iv-b
    4) i-b, ii-a, iii-d, iv-c
28. మాల్వా పీఠభూమిని, దక్కన్ పీఠభూమిని వేరుచేసే నది ఏది?
    1) మహానది 2) తపతి
    3) నర్మద 4) గోదావరి
29. కింది వాటిలో సరికానిది ఏది?
    1) మాల్వా పీఠభూమికి ఈశాన్యంగా రాజమహల్ కొండలు సరిహద్దుగా ఉన్నాయి.
    2) వింధ్యాపర్వతాలు, మాల్వా పీఠభూమికి దక్షిణ సరిహద్దుగా ఉన్నాయి.
    3) కర్బి అంగ్‌లాంగ్ పీఠభూమి మేఘాలయ లో ఉంది.
    4) పరుష్‌నాథ్ శిఖరం అండమాన్ దీవుల్లో విస్తరించి ఉంది.
30. లావా పీఠభూమికి ఒక ఉదహరణ?
    1) మహారాష్ట్ర పీఠభూమి
    2) చోటా నాగపూర్ పీఠభూమి
    3) షిల్లాంగ్ 4) బుందేల్‌ఖండ్
31. సాత్పూరా పర్వత శ్రేణులు ఏ నదుల మధ్య విస్తరించి ఉన్నాయి?
    1) సోన్, నర్మదా 2) నర్మదా, గోదావరి
    3) గోదావరి, తపతి 4) తపతి, నర్మదా

సమాధానాలు

1) 3	2) 4	3) 2	4) 3	5) 1
6) 2	7) 2	8) 2	9) 3	10) 4
11) 2	12) 3	13) 2	14) 4	15) 1
16) 1	17) 2	18) 2	19) 4	20) 3
21) 3	22) 1	23) 4	24) 1	25) 3
26) 4	27) 4	28) 3	29) 4	30) 1
31) 4				

No healthier than do people exercising

Model Questions

Directions (Q.No. 1-5): Read each sentence to find out whether there is any grammatical mistake/ error in it. The error, if any, will be in one part of the sentence. Mark the number of that part with error as your answer. If there is 'No error', mark (5) as your answer.

1. Halt an escalation of current tensions (1)/ and preventing mass atrocities from happening in Sudan again will require (2)/ cutting off the goods and services that combatants need (3)/ to perpetrate further violence. (4)/ No error (5)
2. Acquiring material wealth or rejecting its attractions (1)/ has often been (2)/ the base upon which writers (3)/ had developed interesting plots. (4)/ No error (5)
3. Science plays a significant role (1)/ in the origin of superhero stories precisely because (2)/ that stories are really an extension (3)/ of science fiction as a genre. (4)/ No error (5)
4. The article on the subject of Colombian drug lords (1)/ published in The Economist this morning neither alludes nor specifically describes (2)/ the methods that the police employ (3)/ in the fight against crime. (4)/ No error (5)
5. During the alumni meet, (1)/ the old students reflected (2)/ on the time (3)/ they have spent in college. (4)/ No error (5)

Directions (Q.No. 6- 8): Choose the set of words which are closest in meaning to the word provided.

6. Generic
   1) general, basic
   2) cheap, vital 3) fresh, pure
   4) elderly, cheaply
   5) standard, novice
7. Educe
   1) demand, stipulate
   2) elicit, extract
   3) ideal, idyllic
   4) unlawful, illicit
   5) prohibit, proscribe
8. Appall
   1) delirious, rambling
   2) covered, exposed
   3) dismay, consternation
   4) confuse, scandalize
   5) perplex, doubt

Directions (Q.No.9- 10): Choose the set of words which are opposite in meaning from the five options given in each question.

9. 1) rotund, plump
   2) brazen, defiant
   3) pique, soothe
   4) peaked, ruddy
   5) nadir, apex
10. 1) supercilious, meek
    2) approbate, sanction
    3) demur, hesitate
    4) fatuous, foolish
    5) quiescent, repose

Directions: (Q.No. 11 - 15) Which of the phrases (1), (2), (3), and (4) given below each sentence should replace the phrase underlined in the sentence to make it grammatically correct? If there is no error mark (5) No correction required as your answer.

11. Foods that are rich in salt, likes potato chip, cheese and sauces contain high level of sodium levels that may lead to heart attacks and stroke.
    1) liked potato chip, cheese and sauces
    2) like potato chips, cheese and sauce
    3) like potato chips, cheese and sauces
    4) like potato chip, cheeses and sauce
    5) No correction required
12. Poor reading skills among students of inner-city schools have not resulted from failures in teaching but insufficiently supportive home environments.
    1) resulted not from failures in teaching but from
    2) resulted from failures not in teaching but
    3) resulted from failures not in teaching but have stemmed from
    4) resulted not from failures in teaching but have stemmed from
    5) No correction required



BANK EXAMS
GENERAL ENGLISH

13. In a recent survey, *Physical Fitness Weekly* found that people exercising daily consider themselves no healthier than do people exercising three to five times a week.
    1) not any healthier than do people exercising
    2) not any healthier than do people who exercise
    3) no healthier than are people who are exercising
    4) not as healthy as are people who exercise
    5) No correction required
14. Many people discover a need for glasses in middle age, a consequence from sitting too close to the television screen for long periods of time.
    1) of sitting too close
    2) which resulted from sitting too close
    3) damaged from sitting too near
    4) damaged because they sat too close to
    5) No correction required
15. At one stage it appeared as if Indians will lost the match against Hongkong.
    1) will be losing the match
    2) will lost a match
    3) would lose the match
    4) would be losing the match
    5) No correction required

Directions (Q.No. 16-20): Rearrange the following six sentences (A), (B), (C), (D), (E) and (F) in a proper sequence to form a meaningful paragraph and then answer the questions given below.

A) Shortages of canned food in the British Army in 1917 led to the government issuing cigarettes and amphetamines to soldiers to suppress their appetites.

B) But by 1916, widespread boredom with cheap canned food amongst soldiers resulted in militaries purchasing better-quality food to improve morale and the complete meals in a can began to appear.

C) Demand for canned food skyrocketed during World War I, as military commanders sought vast quantities of cheap, high-calorie food to feed their millions of soldiers, which could be transported safely, survive trench conditions, and not spoil in transport.

D) After the war, companies that had supplied military canned food improved the quality of their goods for civilian sale.

E) Throughout the war, soldiers generally subsisted on low-quality canned foodstuffs, such as the British "Bully Beef" (cheap corned beef), pork and beans, canned sausages, and Maconochies Irish Stew.

F) In 1917, the French Army began issuing canned French cuisine, such as coq au vin, Beef Bourguignon and Vichyssoise while the Italian Army experimented with canned ravioli, spaghetti bolognese, Minestrone and Pasta e fagioli.

16. What is the FOURTH sentence after rearrangement?
    1) A 2) B 3) C 4) D 5) F
17. What is the THIRD sentence after rearrangement?
    1) A 2) B 3) D 4) F 5) E
18. What is the SECOND sentence after rearrangement?
    1) A 2) B 3) D 4) E 5) F
19. What is the FIRST sentence after rearrangement?
    1) B 2) A 3) C 4) D 5) E
20. What is the LAST sentence after rearrangement?
    1) A 2) B 3) C
    4) D 5) F

Directions (Q.No. 21-25): Each question below has a blank/ two blanks, each blank indicating that something has been omitted. Choose the word/ set of words from the five options for each blank that best fits the meaning of the sentence as a whole.

21. Residents can donate clothes, household items and other goods to the ____ store. The store then sells them and donates the amount to ____.
    1) Thrift, charities
    2) waft, aid 3) fluster, gifts
    4) heterogeneous, relievers
    5) assorted, donations
22. Everything about S. Russell Groves is just so, from his style of dress to his choice of words; nothing is ____.
    1) Lumber 2) superfluous
    3) garner 4) renovate
    5) encumber
23. The MLA was charged with criminal attempt to ____ a minor and criminal attempt to ____ the morals of a minor on Thursday.
    1) Entice, impair
    2) ambidextrous, blight
    3) ostentation, prejudice
    4) qualm, weaken
    5) worse, impeach
24. In order to consistently prevail you must be agreeable, amenable, and ____. These characteristics make it possible to gain trust, show compromise, and___deals.
    1) Contrite, reform
    2) malleable, restructure
    3) frenetic, simplify
    4) impugned, adjust
    5) remorseful, sort
25. There is a buzz about the sudden death of one of the artists, which cast a ____ on the opening ceremonies, ____, briefly.
    1) Attraction, though
    2) wither, although
    3) pall, albeit
    4) gloom, notwithstanding
    5) shadow, almost

Directions (Q.No. 26-28): In the following passage there are blanks, each of which has been numbered. These numbers are printed below the passage and against each, five words/phrases are suggested, one of which fits the blank appropriately. Find out the appropriate word/ phrase in each case and mark your answer.

Cloud seeding is a type of weather modification that ____ (26) to change the amount or type of precipitation that falls from clouds by dispersing substances ____(27) the air that serve as cloud condensation or ice nuclei, which alter the microphysical processes within the cloud. The usual intent is to increase precipitation (rain or snow), but hail and fog suppression ____ (28) also widely practiced in airports, where harsh weather conditions are experienced. Cloud seeding over Kosciuszko National Park-a biosphere reserve-is problematic in that several rapid changes of environmental legislation ____ (29) made to enable the trial. Environmentalists are concerned ____ (30) the uptake of elemental silver in a highly sensitive environment affecting the pygmy possum ____ (31) other species as well as recent high level algal blooms in ____ (32) pristine glacial lakes. Research 50 years ____ (33) and analysis by the former Snowy Mountains Authority led to the cessation of the cloud seeding program in the 1950s with non-definitive results. Formerly, cloud seeding was rejected in Australia on environmental grounds ____ (34) of concerns about the protected species, the pygmy possum. Since silver iodide and not elemental silver is the cloud seeding material, the claims of negative environmental impact are disputed ____ (35) peer-reviewed research as summarized by the international Weather Modification Association.

26. 1) aim 2) aimed
    3) aims 4) was aimed
    5) is aimed
27. 1) into 2) in 3) on
    4) along 5) among
28. 1) has 2) was 3) are
    4) is 5) had

KEY

1) 1	2) 4	3) 3	4) 2	5) 4
6) 1	7) 2	8) 3	9) 3	10) 1
11) 3	12) 2	13) 5	14) 1	15) 3
16) 5	17) 2	18) 4	19) 3	20) 4
21) 1	22) 2	23) 1	24) 2	25) 3
26) 3	27) 1	28) 3		